
'సంపద పంపిణీ సక్రమంగా జరిగితే అట్టడుగు వర్గాలకు చేరుతుంది. అప్పుడే వారి కొనుగోలు శక్తి పెరుగుతుంది'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 18 సంచిక: 121

మంగళవారం 22-7-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



సెమీస్‌లో దివ్య దేశ్‌ముఖ్

మహిళల ప్రపంచకప్ చెస్ టోర్నీ క్వార్టర్ ఫైనల్లో ద్రోణవల్లి హారికపై విజయం -14లో



సినీతారలకు ఈడీ పిలుపు

బెట్టింగ్ యాప్‌ల కేసులో విజయ్ దేవరకొండ, రానా సహా నలుగురికి నోటీసులు -16లో



జీవో నిలుపుదల

కవ్వాల్, తడోబా-అంధేరిని 'కొమురం భీమ్ కన్జర్వేషన్ రిజర్వ్'గా ప్రకటిస్తూ ఇచ్చిన జీవోను రాష్ట్ర ప్రభుత్వం నిలిపేసింది.

వివరాలు 3లో ▸



జస్టిస్ వర్మ అభిశంసన..

హైకోర్టు జడ్జి జస్టిస్ యశ్వంత్ వర్మను అభిశంసించాలంటూ ఎంపీలు లోక్‌సభ స్పీకర్,రాజ్యసభ చైర్మన్‌కు నోటీసులిచ్చారు.

వివరాలు 6లో ▸



నేరం చేశారంటే నమ్మలేం..

2006 నాటి ముంబై రైలు పేలుళ్ల కేసులో మొత్తం 12 మంది నిందితులనూ బాంబే హైకోర్టు నిర్దోషులుగా ప్రకటించింది.

వివరాలు 6లో ▸



స్కూల్‌పై కూలిన జెట్

బంగ్లాదేశ్ రాజధాని ఢాకాలో ఓ శిక్షణ యుద్ధవిమానం స్కూల్‌పై కుప్పకూలడంతో 20 మంది సజీవదహనమయ్యారు.

వివరాలు 6లో ▸

కలెక్టర్లు కదలాలి

జిల్లాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాల్సిందే • ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టీకరణ



- ఉదయం 7 గంటల నుంచే క్షేత్రస్థాయిలో పర్యటించాలి
- కలెక్టర్ల కార్యాచరణపై సీఎస్ రోజూ ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలి
- వర్షాకాలం సమస్యల పరిష్కారానికి రూ.కోటి చొప్పున కలెక్టర్ల ఖాతాలకు.. రైతులు, ప్రజలు ఇబ్బందులు పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి
- కావాల్సినంత యూరియా ఉంది.. రైతులు ఆందోళన చెందొద్దు
- 25 నుంచి ఆగస్టు 10 వరకు రేషన్‌కార్డులు పంపిణీ చేస్తామన్న సీఎం
- వర్షాలు, పంటల సాగు, వ్యాధులు, రేషన్‌కార్డుల పంపిణీపై సమీక్ష

సాక్షి, హైదరాబాద్

కలెక్టర్లు ఆయా జిల్లాల పరిధిలో ఆకస్మిక తనిఖీలు జరపాల్సిందేనని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రతిరోజు ఉదయం ఏడు గంటల నుంచే క్షేత్రస్థాయి పర్యటనలకు వెళ్లాలని చెప్పారు. తద్వారా మిగతా అధికారులు కూడా అప్రమత్తమవుతారని సూచించారు. కలెక్టర్లతో పాటు ఇతర ఐఏఎస్‌లు , అదనపు కలెక్టర్లు కూడా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి జిల్లా ఆసుపత్రుల వరకు, వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో ఆకస్మికంగా తనిఖీలు చేయాలని ఆదేశించారు. కలెక్టర్ల కార్యాచరణకు సంబంధించి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రతిరోజూ ప్రభుత్వానికి నివేదిక అందించాలని చెప్పారు. సీఎంఓలోని ఒక్కో అధికారికి రెండేసి ఉమ్మడి జిల్లాల బాధ్యతలు కేటాయించడం జరుగుతుందని తెలిపారు. వర్షాకాలంలో ఎదురయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు వీలుగా కలెక్టర్ల ఖాతాలో కోటి రూపాయలు చొప్పున అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలో కురుస్తున్న వర్షాలు, వానాకాలం పంటల సాగు, సీజనల్‌వ్యాధులపై అప్రమత్తత, రేషన్‌కార్డుల పంపిణీలో పురోగతి తదితర అంశాలపై సోమవారం ఆయన జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా

మిగతా 3వ పేజీలో ▶

సిందూర్‌తోపాటే బీసీ రిజర్వేషన్లు!

- లోక్‌సభలో చర్చకు కాంగ్రెస్ అధిష్ఠానాన్ని కోరనున్న రాష్ట్ర ముఖ్య నాయకత్వం
- బీసీ కోటాపై ఖర్గే, రాహుల్‌తో మరోసారి చర్చించే యోచన
- 24న పార్టీ ఎంపీలకు సీఎం రేవంత్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్

3లో

గిగ్ వర్కర్లకు చట్టబద్ధ గుర్తింపు!

ప్రత్యేక పాలసీ తెస్తున్నామన్న సీఎం రేవంత్‌రెడ్డి

- వివరాలు 3లో

సోమవారం ఉదయం వర్షాకాల సమావేశాల ప్రారంభం సందర్భంగా సభ్యులకు అభివాదం చేస్తున్న రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్



ఉపరాష్ట్రపతి పదవికి ధన్‌ఖడ్ గుడ్‌బై

పార్లమెంటు వర్షాకాల సమావేశాల వేళ అనూహ్య నిర్ణయం

అనారోగ్య కారణాలతో పదవిని వీడుతున్నట్లు ప్రకటన

రాజీనామా లేఖను రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు పంపిన ధన్‌ఖడ్

తదుపరి ఉపరాష్ట్రపతి ఎవరన్న దానిపై మొదలైన చర్చ

న్యూఢిల్లీ: ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ ఎవరూ ఊహించని రీతిలో తన పదవికి రాజీనామా చేశారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల వేళ అనూహ్య నిర్ణయం తీసుకున్నారు. ప్రధాన విపక్ష పార్టీలు మొదలు సర్వోన్నత న్యాయస్థానం దాకా దాదాపు అందరిపై పదునైన విమర్శనాస్త్రాలు సంధిస్తూ ప్రధాని మోదీ సారథ్యంలోని ఎన్‌డీఏ ప్రభుత్వానికి పూర్తి మద్దతునిస్తారన్న విమర్శలు ఎదుర్కొంటున్న ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్ ఆకస్మిక నిర్ణయం ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశమైంది. ఆయన ఎందుకు రాజీనామా చేశారన్న చర్చ మొదలైంది. అయితే అనారోగ్య కారణాలతో ఉపరాష్ట్రపతి పదవిని వీడుతున్నట్లు ఆయన సోమవారం సాయంత్రం పేర్కొన్నారు. ఈ మేరకు

మిగతా 2వ పేజీలో ▶

న్యూస్‌రీల్

అన్నవరం దేవేందర్‌కు దాశరథి పురస్కారం



కవి, కాలమిస్టు అన్నవరం దేవేందర్‌ను రాష్ట్ర ప్రభుత్వం దాశరథి కృష్ణమాచార్య పురస్కారానికి ఎంపిక చేసింది. దేవేందర్ సిద్దిపేట జిల్లా పోతారం గ్రామవాసి.

- వివరాలు 2లో▶

రింగురోడ్డు, రైలు.. భూ సర్దుబాటు ఎలా ?



ఔటర్ రింగురైలు భూసేకరణకు రైతులు ససేమిరా అనడంతో ట్రిపుల్‌ఆర్ కోసం సేకరించిన భూమిలోనే రైల్వే లైన్‌కు భూమి కేటాయింపును రైల్వేశాఖ ప్రతిపాదిస్తోంది.

- వివరాలు 5లో▶

రెక్కీ చేసి.. పక్కా స్కెచ్ గీసి..



సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఓ జ్యువెలరీ షాపులో ఆదివారం అర్ధరాత్రి భారీ దోపిడీ జరిగింది. 8 కిలోల బంగారం, ఆభరణాలతో పాటు రూ. 18 లక్షల నగదును దొంగలు అపహరించారు. వాటి విలువ రూ. 7 కోట్ల పైనే ఉంటుందని అంటున్నారు.

- వివరాలు 5లో▶

మెదడుకు కాస్త బ్రేక్ ఇవ్వండి




గంటల తరబడి కూర్చొని చేసే పని వల్ల కూడా అలసిపోతాం. దీన్నే వైద్య పరిభాషలో 'కాగ్నిటివ్ ఫెటీగ్' అంటారు. ఇలాంటి అలసట.. ప్రయోజనం లేని పనులను ఎంచుకునేలా మెదడును ప్రభావితం చేస్తుందని అధ్యయనంలో తేలింది.

- వివరాలు 2లో▶

ఇంతంజాఫర్



రాజకీయ యుద్ధాల్లో మిమ్మల్ని ఎందుకు వాడుతున్నారు?



- ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దుర్వినియోగమవుతోంది
- కర్ణాటక సీఎం సిద్ధరామయ్య భార్యకు సమన్ల అంశంలో హైకోర్టు నిర్ణయాన్ని సమర్థించిన సుప్రీం
- హైకోర్టు తీర్పును సవాల్‌చేసిన కేంద్రాన్ని తప్పుబట్టిన ధర్మాసనం
- ఈడీ పిటిషన్‌ను కొట్టేసిన సుప్రీంకోర్టు

సాక్షి బెంగళూరు: కర్ణాటకలో మైసూరు పట్టణాభివృద్ధి ప్రాధికార సంస్థ(ముడా) భూకేటాయింపుల కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌ని దురుద్దేశపూర్వకంగా రంగంలోకి దించారని సర్వోన్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది. రాజకీయ స్వప్రయోజనాల కోసం, ప్రత్యర్థి పార్టీలపై కక్ష సాధింపు కోసం ఈడీని ఎందుకు దుర్వినియోగం చేస్తున్నారని ఈడీ తరఫున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజుకు సుప్రీంకోర్టు సూటి ప్రశ్నవేసింది. ముడా భూకేటాయింపుల కేసులో కర్ణాటక ముఖ్యమంత్రి, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు సిద్ధరామయ్య భార్య బీఎం పార్వతికి వ్యతిరేకంగా ఈడీ గతంలో జారీచేసిన సమన్లు కొట్టేస్తూ కర్ణాటక హైకోర్టులోని ఏకసభ్య ధర్మాసనం ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు ధర్మాసనం సోమవారం సమర్థించింది. హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్‌చేస్తూ ఈడీ దాఖలుచేసిన స్పెషల్ లీవ్ పిటిషన్‌ను సోమవారం కొట్టేసింది. ఈ సందర్భంగానే సుప్రీంకోర్టు

మిగతా 2వ పేజీలో ▶

ఇది కాగితపు గుజ్జు ఆధారంగా గుడ్ల ట్రేలు తయారు చేసే చిన్న పరిశ్రమ. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపహాడ్ మండలం లక్ష్మీపురం గ్రామ సమీపంలో ఉంది. ఈ యూనిట్ ఏర్పాటు వ్యయం రూ.1,46,59,000. ఇందులో బ్యాంకు రుణం రూ.81,93,100 కాగా.. లబ్ధిదారు వాటా రూ.14,65,900. ట్రైకార్ రాయితీ కింద అందించింది రూ.50 లక్షలు. ఇంతకీ ఈ పరిశ్రమ ఎవరిదంటే.. గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని గిరిజన కార్పొరేషన్ ఉన్నతాధికారి కుమార్తెదిగా తేలింది. పేరు కుమార్తెదయినా.. పరిశ్రమ నిర్వహణ, ఇతరత్రా అంశాలను సదరు అధికారే స్వయంగా చూసుకుంటున్నట్లు సమాచారం.



పెద్దసార్లే పారిశ్రామికవేత్తలు!

సీఎంఎస్‌టీఈఐ పథకంలో అవకతవకలు జరుగుతున్నాయనే ఆరోపణలు

- గిరిజన యువతను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే లక్ష్యానికి గండి
- వార్షికాదాయం, అనుభవం నిబంధనలు పక్కకు..
- పథకం లబ్ధిదారుల్లో ఉన్నతాధికారుల కుటుంబసభ్యులు!
- రూ.50 లక్షల వరకు ట్రైకార్ రాయితీ పక్కదారి?
- గత ఐదేళ్లలో దాదాపు 250 మంది ఎంపిక.. దాదాపు రూ.121 కోట్లు రాయితీ రూపంలో అందజేత

16లో

లాల్ సలాం

కమ్యూనిస్టు దిగ్గజం వీఎస్ కన్నుమూత



- అనారోగ్యంతో మృతిచెందిన కేరళ మాజీ సీఎం అచ్యుతానందన్
- 8 దశాబ్దాలపాటు రాజకీయాల్లో కొనసాగిన గొప్ప ప్రజానాయకుడు
- ఏడుసార్లు ఎమ్మెల్యేగా గెలుపు.. 2006లో తొలిసారి సీఎం పగ్గాలు
- సీపీఐతో విభేదించి సీపీఎంను స్థాపించిన నేతల్లో ఆయన ఒకరు

వివరాలు 6లో▶

మెడికల్

3 లక్షల పైన ర్యాంక్ వచ్చినా...

కన్వీనర్ కోటాలో ఎంబీబీఎస్ సీటు



- గత ఏడాది నీట్ కటాఫ్ ర్యాంకుల ఆధారంగా నిపుణుల అంచనా
- బీసీ–ఏ కేటగిరీలో గత ఏడాది కటాఫ్ ర్యాంక్ 3,36,989.. జనరల్ కేటగిరీలో 2.12 లక్షల ర్యాంకు
- రాష్ట్రం నుంచి 43,400 మంది నీట్‌లో క్వాలిఫై..
- రాష్ట్ర ర్యాంకుల్లో 10 వేల ర్యాంకు కన్నా ఎక్కువ వచ్చినవారికీ కన్వీనర్ కోటాలో సీటుకు చాన్స్
- మొదలైన ఆలిండియా కౌన్సెలింగ్ ప్రక్రియ

వివరాలు 16లో▶



పూడిక.. ఏళ్లుగా తీయక

- ఏళ్ల తరబడి పూడిక తీయకపోవడంతో తగ్గుతున్న ప్రాజెక్టుల నీటి నిల్వ సామర్థ్యం
- అత్యధికంగా శ్రీశైలం, నాగార్జునసాగర్‌లో తగ్గుదల
- ఎస్సారెస్పీ, నిజాంసాగర్‌లోనూ పూడిక ఎక్కువే..
- చివరి ఆయకట్టుకు అందని సాగునీరు
- వర్షాల సమయంలో పెద్ద మొత్తంలో కడలి పాలవుతున్న నీరు

12లో

పూడిక తీయక పోవడంతో చెత్తతో నిండిపోయిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని కడెం ప్రాజెక్టు (ఫైల్)

తొలిరోజే దుమారం..

- విపక్షాల ఆరోపణలు, అధికారపక్ష ప్రతివిమర్శల మధ్య పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు షురూ
- ఆపరేషన్ సిందూర్‌పై లోక్‌సభలో చర్చకు విపక్ష సభ్యుల పట్టు.. ప్రధాని మోదీ వివరణకు డిమాండ్
- ప్రభుత్వ ఘోర వైఫల్యం వల్లే ఉగ్ర దాడి జరిగిందని ధ్వజం
- ప్రశ్నోత్తరాల తర్వాతే విపక్ష సభ్యులకు మాట్లాడే అవకాశం ఇస్తానన్న స్పీకర్.. నాలుగుసార్లు సభ వాయిదా
- పహల్గాం, ఆపరేషన్ సిందూర్‌పై ఎట్టకేలకు చర్చకు అంగీకరించిన కేంద్రం.. వచ్చేవారం చర్చించే అవకాశం



6లో

ఈ పార్లమెంటు సమావేశాలు..

విజయోత్సవాలు

- హింసపై రాజ్యాంగ విజయానికి ప్రతీక
- ప్రధాని నరేంద్ర మోదీ అభివర్ణన

ఇంజనీరింగ్

12 లక్షలు పెడితేనే..

ఓ మోస్తరు కాలేజీలో కంప్యూటర్ సీటు...

ఇంజనీరింగ్ బీ కేటగిరీ సీట్లకు పెరిగిన గిరాకీ



- మంచి కాలేజీలో, మంచి బ్రాంచీ కోసం విద్యార్థుల యత్నాలు.. టాప్ కాలేజీల్లో రూ.19 లక్షల వరకూ దండుకుంటున్నారనే ఆరోపణలు
- జేఈఈ, ఎప్‌సెట్ ర్యాంకుల ఆధారంగా ఇవ్వాల్సి ఉన్నా యాజమాన్యాల ఇష్టారాజ్యం
- ప్రభుత్వం దృష్టి పెట్టాలంటున్న విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రులు
- ఆగస్టు 10 నాటికి సీట్ల భర్తీ పూర్తి చేయాలన్న ఉన్నత విద్యా మండలి.. భర్తీ విధానానికి మార్గదర్శకాలు జారీ

వివరాలు 16లో▶

క్లుప్తంగా...

నేడు టెట్ ఫలితాల విడుదల



సాక్షి, హైదరాబాద్: ఉపాధ్యాయ అర్హత పరీక్ష ఫలితాలు మంగళవారం విడుదలవుతాయి. ఉదయం 11 గంటలకు విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా ఫలితాలను విడుదల చేస్తారని విద్యాశాఖ ఒక ప్రకటనలో తెలిపింది. టెట్ పరీక్ష జూన్ 18 నుంచి 30 వరకూ జరిగింది. పేపర్-1కు 63,261 మంది దరఖాస్తు చేయగా, 47,224 మంది పరీక్ష రాశారు. పేపర్-1లో మేథ్స్, సైన్స్‌కు 66,686 మంది దరఖాస్తు చేయగా, 48,998 మంది పరీక్షకు హాజరయ్యారు. సోషల్ స్టడీస్‌కు 53,706 మంది దరఖాస్తు చేయగా, 41,207 మంది పరీక్ష రాశారు.

అచ్యుతానందన్ మృతి పట్ల వైఎస్ జగన్ సంతాపం

సాక్షి, అమరావతి: ప్రముఖ కమ్యూనిస్టు నాయకుడు, కేరళ మాజీ ముఖ్యమంత్రి వీఎస్ అచ్యుతానందన్ మృతి పట్ల మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంతాపం తెలిపారు. అచ్యుతానందన్ మరణంతో కేరళ రాజకీయ రంగం ఒక గొప్ప నాయకుడిని కోల్పోయిందన్నారు. ఆయన ధైర్యం, నిబద్ధత, ప్రజల పట్ల ప్రేమ.. జనం మనసుల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని పేర్కొన్నారు. అచ్యుతానందన్ కుటుంబ సభ్యులకు, అభిమానులకు వైఎస్ జగన్ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు.

మచ్చలేని మహానేత అచ్యుతానందన్

రాఘవులు, మహేశ్‌గౌడ్, హరీశ్‌రావు సంతాపం

సాక్షి, హైదరాబాద్: దేశ రాజకీయాల్లో మచ్చలేని మహానేత వీఎస్ అచ్యుతానందన్ మరణం పార్టీకి తీరని లోటని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం సాయంత్రం హైదరాబాద్‌లోని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యాలయంలో అచ్యుతానందన్ చిత్రపటానికి బీవీ రాఘవులు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ మిడియం బాబూరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే, కేరళ మాజీ ముఖ్యమంత్రి, కమ్యూనిస్టు యోధుడు అచ్యుతానందన్ మృతిపై టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి.మహేశ్‌కుమార్‌గౌడ్ ఒక ప్రకటనలో ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నట్టు తెలిపారు. ప్రజాహితానికి పాటుపడిన అచ్యుతానంద్ సేవలు చిరస్మరణీయంగా నిలిచిపోతాయని మాజీ మంత్రి హరీశ్‌రావు, బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవిత వేర్వేరు ప్రకటనల్లో సంతాపం వ్యక్తం చేశారు.

మంచిరేవులలో చిరుత కలకలం!


సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన అటవీశాఖ



మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ, మంచిరేవుల శివారులో చిరుతపులి సంచారం కలకలం రేపింది. మంచిరేవులలోని పోలీస్ గ్రేహౌండ్స్ (వ్యాస్‌నగర్) వెనుక వైపు.. ఉదయం సమయంలో కనిపించినట్టు కొందరు వాకర్లు పోలీసులకు సమాచారం ఇచ్చినట్టు తెలిసింది. దాంతో నార్సింగి పోలీసులు ఆ విషయాన్ని సోమవారం అటవీశాఖ అధికారులకు తెలిపారు. ఈ మేరకు వారు చిరుతపులి కనిపించిన ప్రాంతంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. చిరుత కనిపించిందని చెబుతున్న గండిపేట నుంచి మొయినాబాద్ వెళ్లే దారిలో ఎక్కువగా వాహనాలు తిరుగుతాయని, అలాంటి చోట్ల పులులు తిరిగే అవకాశం తక్కువని అటవీ శాఖాధికారులు స్పష్టం చేస్తున్నారు. అయినా దాన్ని కనిపెట్టేందుకు తగు ఏర్పాట్లు చేశామని వెల్లడించారు.

మెదడుకు కాస్త... బ్రేక్ ఇవ్వండి

గంటల తరబడి కూర్చొని చేసే పని వల్ల కూడా అలసిపోతాం. ఈ అలసటనే వైద్య పరిభాషలో 'కాగ్నిటివ్ ఫెటీగ్' (మానసిక అలసట) అంటారు. ఇలాంటి అలసట.. ఉపయోగకరమైన పనులకన్నా.. అంతగా ప్రయోజనం లేని సులభమైన పనులను ఎంచుకునేలా మన మెదడును ప్రభావితం చేస్తుందని తాజా అధ్యయనంలో వెల్లడయ్యింది. దైనందిన నిర్ణయాలను నిష్ప్రయోజనమైన పనుల వైపు దారి మళ్లించే ఈ మానసిక అలసటను.. సుదీర్ఘమైన పనులు చేసేటప్పుడు విరామాలు తీసుకోవటం ద్వారా నివారించవచ్చని పరిశోధకులు చెబుతున్నారు.



ఆఫీసు నుంచో లేదా బయట పని పూర్తిచేసుకునో ఇంటికి వచ్చాక.. అందరూ చేసేది కుర్చీలోనో మంచం మీదనో కాసేపు అలా నడుం వాల్చడం. అలాంటప్పుడు మరో ముఖ్యమైన పని చేయాలన్నా ఆలోచిస్తాం. కానీ, ఫోన్‌లో ఏవైనా సరదా అంశాలు లేదా టీవీలో ఏదైనా ప్రోగ్రామో చూడటం మాత్రం మనకు కష్టంగా అనిపించదు. 'జర్నల్ ఆఫ్ న్యూరోసైన్స్'లో తాజాగా అచ్చయిన అధ్యయన వివరాలను బట్టి - తక్కువ ప్రయోజనాలను అందిస్తున్నవే అయినప్పటికీ, మనం ఇలా సులభమైన పనులనే ఎంచుకోవటానికి ప్రధాన కారణం.. 'మానసిక అలసట'.

అదేపనిగా పని చేస్తుంటే 'మానసిక అలసట'

అవసరాన్ని వదిలి, అనవసరం వైపు దృష్టి

'జర్నల్ ఆఫ్ న్యూరోసైన్స్'లో వెల్లడి

తక్కువ లాభం.. ఎక్కువ లాభం!

కష్టమైన పని, తేలికైన పని జట్లలోని వారిని.. వాళ్ల పని అనంతరం, ఎంపిక చేసుకోటానికి మళ్లీ రెండు రకాల పనులు ఇచ్చారు.

1. తక్కువ డబ్బు వచ్చే సులభమైన పని.
2. ఎక్కువ డబ్బు వచ్చే కష్టమైన పని.

- మానసికంగా అలసిపోయిన వారు.. తక్కువ డబ్బు వచ్చే సులభమైన పనిని ఎంచుకున్నారు.
- మానసికంగా అలసిపోని వారు.. ఎక్కువ డబ్బు వచ్చే కష్టమైన పనిని ఎంపిక చేసుకున్నారు.

ఫంక్షనల్ ఎమ్మారై పట్టేసింది

అధ్యయనంలో పాల్గొన్నవారు తమ పనులను ఎంపిక చేసుకుంటుండగా, పరిశోధకులు ఫంక్షనల్ మాగ్నెటిక్ రెజొనెన్స్ ఇమేజింగ్ (ఎఫ్-ఎంఆర్ఐ)ను ఉపయోగించి వారి మెదడులోని రసాయన చర్యల్ని నమోదు చేశారు. శరీరంలోకి పరికరాలను చొప్పించే అవసరం లేని ఈ 'నాన్-ఇన్వేసివ్ టెక్నిక్'తో.. వాళ్లు ఒక పని చేస్తున్న సమయంలో మెదడులో చురుగ్గా ఉన్న ప్రాంతాలను గుర్తించారు. మానసికంగా అలసిపోయిన వారిలో - నుదుటి వెనుక ఉండే 'డోర్సోలేటరల్ ప్రీఫ్రంటల్ కార్టెక్స్' ఏరియా క్రియాశీలం అవటాన్ని పరిశోధకులు కనుగొన్నారు. అలాగే, మానసిక అలసట తర్వాత పనులను, ఎంపికలను నిర్ణయించుకున్నప్పుడు మెదడులోని 'రైట్ యాంటీరియర్ ఇన్సులా' (ఇన్సులా) అనే ప్రదేశం క్రియాత్మకం అయి కనిపించింది. ఈ ప్రదేశం, ఒక పనిని 'అది ప్రతిఫలానికి తగిన పనేనా?' అనే దాన్ని నిర్ణయిస్తుంది.

- సాక్షి, స్పెషల్‌డెస్క్

పనితీరు సామర్థ్యం తగ్గలేదు..

ఈ అధ్యయనంలో పాల్గొన్నవారు ఒకదాని తర్వాత ఒకటి కష్టతరమైన పనులను చేస్తున్నప్పుడు తాము అలసిపోయినట్లు చెప్పినప్పటికీ వారి పనితీరు సామర్థ్యం కొంచెమైనా తగ్గలేదు. అంటే.. మానసిక అలసట అనేది పని అనంతరం విశ్రాంతినిచ్చే పనులను ఎంపిక చేసుకుంటున్నదే కానీ, అలసట కలిగిస్తున్న పనిని ఒళ్లు దాచుకోకుండా చేయటానికి మాత్రం అడ్డపడటం లేదన్నమాట.

విరామాలతోనే నివారణ

మన దైనందిన నిర్ణయాలను ప్రభావితం చేసే ఈ మానసిక అలసటనునివారించేందుకు ఒకే ఒక్క మార్గం.. కూర్చొని చేసే సుదీర్ఘమైన పనుల్లో తరచూ విరామాలు తీసుకుంటూ ఉండటమే అంటున్నారు డాక్టర్ చిబ్.

అనేక నాడీ సంబంధిత, మానసిక పరిస్థితులలో మానసిక అలసట అనేది ఒక సాధారణ లక్షణం అని పరిశోధకులు చెబుతున్నారు.

స్ట్రోక్ వచ్చినవారిలో, మల్టిపుల్ స్క్లెరోసిస్, క్రానిక్ ఫెటీగ్ సిండ్రోమ్, ఒత్తిడి, ఆందోళన, స్కిజోఫ్రెనియాతో బాధపడుతున్న వారిలో ఎక్కువ మానసిక అలసట ఉన్నట్లు కూడా తాజా అధ్యయనం కనుగొంది.

'ప్రయత్నించటం', 'నిర్ణయం తీసుకోవటం' అనే వాటిని మెదడు ఏ విధంగా ప్రభావితం చేస్తోందో అర్థం చేసుకోవటానికి ఈ అధ్యయనం ఉపయోగపడుతుందని అధ్యయనవేత్తలు భావిస్తున్నారు.

ఎవరికి తేలికైనవి వారు

ప్రతి ఒక్కరికీ పని చేయడానికి వేర్వేరు సామర్థ్యాలు ఉంటాయి. ఒకరికి సులభంగా ఉండేది, మరొకరికి కష్టంగా అనిపించవచ్చు. అయినప్పటికీ ఎవరికి వారు 'మానసిక అలసట' తర్వాత తమకు సులభంగా ఉండే పనులను మాత్రమే ఎంచుకుంటారని ఈ అధ్యయనంలో ప్రధాన పరిశోధకుడు, జాన్స్ హాప్కిన్స్ స్కూల్ ఆఫ్ మెడిసిన్‌కు చెందిన విక్రమ్ చిబ్ అంటున్నారు. మానసిక అలసట మన దైనందిన నిర్ణయాలను ఎలా ప్రభావితం చేస్తుందో అన్వేషించడానికి ఈ అధ్యయనం ఒక నమూనాను రూపొందించింది.

తేలికైన, కష్టమైన పనులు

అధ్యయనం కోసం పరిశోధకులు ఆరోగ్యవంతులైన కొందరిని ఎంపిక చేసి, వారిని నిరంతర జ్ఞాపకశక్తి అవసరమైన పనిలో నియమించారు. ఒక స్క్రీన్‌పైన ఒకటి తర్వాత ఒకటిగా మెరుస్తున్న వేర్వేరు అక్షరాలపై దృష్టి పెట్టమని కోరారు. ఆ పనిని పరిశోధకులు 'తేలికైన పని', 'కష్టమైన పని' అని విభజించారు. తేలికైన పనిలో భాగంగా స్క్రీన్‌పైన మారుతున్న అక్షరాలలో అప్పటికి కనిపిస్తున్న అక్షరం, ఆ ముందు వచ్చి వెళ్లిన అక్షరంతో సరిపోలి ఉందో లేదో గుర్తుంచుకోవాలి. ఇక కష్టమైన పనిలో.. అప్పటికి వారు చూస్తున్న అక్షరం, ఆ ముందు చూసిన రెండు నుండి ఆరు అక్షరాల మధ్య స్క్రీన్‌పైకి వచ్చి వెళ్లిన అక్షరాలతో సరిపోలి ఉందో లేదో గుర్తుంచుకోవాలి. ఈ ప్రయోగంలో - కష్టమైన రెండో పనిని వరుసగా చేసినవారు తాము మానసికంగా చాలా అలసిపోయినట్లు తెలిపారు. తేలికైన పని చేసినవారిలో అలసట కనిపించలేదు.



అన్నవరం దేవేందర్‌కు దాశరథి పురస్కారం

నేడు రవీంద్రభారతిలో సీఎం రేవంత్ చేతుల మీదుగా ప్రదానం

సాక్షి, హైదరాబాద్/కరీంనగర్‌కల్చరల్: దాశరథి కృష్ణమాచార్య పురస్కారానికి కవి, కాలమిస్టు అన్నవరం దేవేందర్ పేరును ప్రభుత్వం ఖరారు చేసింది. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం పోతారం గ్రామానికి చెందిన దేవేందర్ తెలంగాణ పదాలతో ఆకట్టుకునే రీతిలో రచనలు చేస్తారన్న గుర్తింపు ఉంది. పంచాయతీరాజ్ శాఖలో ఉద్యోగం చేస్తూనే రచనావ్యాసంగాన్ని కొనసాగించారు. తెలంగాణ సాహిత్యానికి ఆయన చేసిన సేవలకు గాను ప్రభుత్వం ఈ ఏడాది ప్రతిష్టాత్మక దాశరథి కృష్ణమాచార్య పురస్కారానికి ఎంపిక చేసింది. ఆయన్ను రూ.1,01,116 నగదు పురస్కారం, శాలువ, జ్ఞాపికతో సత్కరించనుంది. మంగళవారం రవీంద్రభారతిలో జరిగే కృష్ణమాచార్య జయంతి కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని దేవేందర్‌కు అందచేస్తారు.

నిఖార్సయిన తెలంగాణ కవి

తెలంగాణ యాస..పల్లెభాషలో దేవేందర్ రచనలు ఉంటాయి. ఆయన కవిత సంపుటాలకు తెలంగాణ పదాలతోనే పేర్లు ఉంటాయి. కేదారమ్మ-దశరథం దంపతులకు అక్టోబర్ 17, 1962లో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని హుస్నాబాద్ మండలం పోతారం(ఎస్)లో అన్నవరం దేవేందర్ జన్మించారు. ఎంఏ సామాజిక శాస్త్రం చదివిన ఆయన.. జిల్లా పరిషత్‌లో పంచాయతీరాజ్‌శాఖ సూపరింటెండెంట్‌గా పనిచేస్తూ 2020లో ఉద్యోగ విరమణ పొందారు. 'తెలంగాణ యాస, భాషలో కవిత్వం రాస్తున్న నన్ను ప్రభుత్వం గుర్తించి దాశరథి అవార్డు ఇవ్వడం ఆనందంగా ఉంది'అని దేవేందర్ చెప్పారు.

సాహిత్య ప్రస్థానం ఇలా...

1988లో శ్రీశ్రీ, శివసాగర్, సినారె, ఎన్.గోపి, నందిని సిధారెడ్డిల రచనలు చదివే క్రమంలో ఆయనకు సాహిత్యంపై మక్కువ ఏర్పడింది. ఇప్పటి వరకు 16 పుస్తకాలు వెలువరించారు. ఇందులో 12 కవిత్వాలు, 2 ఆంగ్ల అనువాద కవిత్వం, 2 వ్యాసాల సంపుటిలు ఉన్నాయి. 2001లో 'తొవ్వ'తో తన మొదటి కవితా సంపుటిని వెలువరించారు. 2003లో 'నడక' ద్వితీయ పుస్తకంగా అచ్చయ్యింది. 2005లో మంకమ్మతోట లేబర్ అడ్డా పుస్తకాన్ని ఆవిష్కరించారు. దీనిని డిగ్రీలో పాఠ్యాంశంగా చేర్చారు. 'బుడ్డపర్కలు'నానీలు 2006లో, బొడ్డు మల్లెచెట్టు 2008లో, పొద్దుపొడుపు కవితా సంకలాన్ని 2011లో ఆవిష్కరించారు. 2014లో పొక్కిలి వాకిళ్ల పులకరింత, 2016లో 'బువ్వ కుండ'దీర్ఘ కవితా సంపుటి, 2016లో ఇంటి దీపం, 2018లో వరిగొలుసులు, 2021లో గవాయి, 2022లో జీవన తాత్పర్యం పుస్తకాలను ఆవిష్కరించారు. 2022లో 'మరో కోణం'వ్యాస సంపుటిని, 'ఊరి దస్తూరి'వ్యాస సంపుటి, 2023లో సంచారయాత్ర వ్యాసాల సంకలనం, 2024లో అంతరంగం (వర్తమాన జీవిత చిత్రణ)ను పుస్తకాలను వెలువరించారు.

- 'పొక్కిలి వాకిళ్ల పులకరింత'కు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం సాహిత్య పురస్కారం లభించింది.'ఊరి దస్తూరి'పుస్తకానికి తెలంగాణ సారస్వత పరిషత్ సాహిత్య పురస్కారం ప్రకటించారు. ఇంకా ఎన్నో పురస్కారాలు ఆయన్ను వరించాయి.



అన్నవరం దేవేందర్ రచనలు

రాజకీయ యుద్ధాల్లో మిమ్మల్ని ఎందుకు వాడుతున్నారు?

▶ మొదటి పేజీ తరువాయి

తీవ్రంగా స్పందించింది. ''ఈ విషయంలో మేం నోరు విప్పితే బాగోదు. అచ్చం ఇలాగే మహారాష్ట్రలో జరిగిన ఉదంతం మొత్తం మాకు తెలుసు. రాజకీయ యుద్ధాల్లో ఈడీని ఎందుకు ఉపయోగిస్తున్నారు?. ఇలాంటి విపరీత పోకడ వైరస్‌ను దేశవ్యాప్తంగా వ్యాప్తిచేయకండి. ఈడీని ఉసిగొల్పే వికృత క్రీడను దేశమంతటా అమలుచేయకండి. ఎన్నికల వేదికలపై మాత్రమే రాజకీయ యుద్ధాలు చేసుకోండి. ఈ యుద్ధాల్లోకి ఈడీని ఎందుకు దుర్వినియోగం చేస్తున్నారు?. మీరు ఇదే ధోరణి కొనసాగిస్తే మేం కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. కేసుల విషయంలో ఈడీ అధికారులు అన్ని పరిధులు దాటి ప్రవర్తిస్తున్నారు'' అని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ వినోద్ చంద్రన్‌ల ధర్మాసనం తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది.

స్వాగతించిన కాంగ్రెస్.. విమర్శించిన బీజేపీ

ఈడీ వైఖరిని ఎండగడుతూ సుప్రీంకోర్టు వెలువర్చిన తీర్పును కాంగ్రెస్ పార్టీ స్వాగతించింది. ఈడీ-బీజేపీ సమష్టిగా చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని సుప్రీంకోర్టు బట్టబయలుచేసిందని కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ రణ్‌దీప్ సూర్జేవాలా అన్నారు. కోర్టు తీర్పు కేంద్రప్రభుత్వానికి చెంపదెబ్బలా తగిలిందని సీఎం సిద్దరామయ్య వ్యాఖ్యానించారు. ఈడీని రాజకీయలబ్ధి కోసం దుర్వినియోగం చేస్తున్న ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్‌షాలకు ఈ తీర్పు మేలుకొలుపు అని ఆయన అన్నారు. ముడా కేసులో తమ పోరాటం ఆగదని బీజేపీ స్పష్టంచేసింది. '' భూమికి బదులు ప్లాట్ల కేటాయింపులు అక్రమాలు జరగకపోతే వాటిని సీఎం కుటుంబం ఎందుకు మళ్లీ వెనక్కి ఇచ్చేసింది?. వాటిని వాళ్ల వద్దే ఉంచుకోవచ్చుగదా. ఈ అంశంలో మా పోరాటం కొనసాగుతుంది''అని కర్ణాటక అసెంబ్లీలో విపక్షనేత, బీజేపీ నాయకుడు ఆర్.అశోక్ సోమవారం బెంగళూరులో అన్నారు.

ఏమిటీ ముడా కేసు?: సిటీ ఇంప్రూవ్‌మెంట్ ట్రస్ట్ బోర్డ్‌గా 1904లో ఏర్పాటై తదనంతరకాలంలో మైసూర్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(ముడా)గా అవతరించిన సంస్థ ఇప్పుడు భూకేటాయింపుల వివాదంలో కేంద్రబిందువుగా నిలిచింది. కెసెరె గ్రామంలో సీఎం సిద్ధరామయ్య భార్య పార్వతికి 3 ఎకరాల 16 గుంటల భూమి ఉంది. ఈ గ్రామంలో దేవనార్ 3ఫేజ్ లేఅవుట్ కోసం ముడా ఈ భూమిని సేకరించింది. నష్టపరిహారంగా 2021లో మైసూర్‌లోని విజయనగర మూడో, నాలుగో ఫేజ్ లేఅవుట్లలో 38,284 చదరపు అడుగుల విస్తీర్ణంలో 14 ప్లాట్లను కేటాయించింది. అయితే పార్వతి నుంచి తీసుకున్న భూముల కంటే కేటాయించిన ప్లాట్ల విలువ రూ.45 కోట్లు ఎక్కువ అని ఆర్టీఐ కార్యకర్త అబ్రహాం లోకాయుక్త పోలీసులకు ఫిర్యాదుచేయడంతో కేటాయింపుల అంశం వార్తల్లోకెక్కింది. కెసెరె భూమిని పార్వతికి ఆమె సోదరుడు మల్లిఖార్జున స్వామి 2010 అక్టోబర్‌లో బహుమతిగా ఇచ్చాడు. ప్రభుత్వం సేకరించాక 2014 జూన్‌లో నష్టపరిహారం కోసం పార్వతి దరఖాస్తు చేసుకున్నారు. ప్లాట్ల కేటాయింపుపై సిద్ధూ గతంలోనే స్పష్టతనిచ్చారు. ''2014లో నేను సీఎంగా ఉన్నపుడు పరిహారం కోసం దరఖాస్తు చేసుకుంటే సీఎంగా ఉన్నంతకాలం ఆ పరిహారం ఇవ్వడం కష్టమని అధికారులు చెప్పా రు. బీజేపీ అధికారంలో ఉన్నపుడు 2021లో మళ్లీ దరఖాస్తు చేసుకుంటే ఈ ప్లాట్లను కేటాయించారు'' అని సిద్ధూ అ న్నారు. అయితే గతంలో ముడా 50: 50 పేరిట ఒక పథకాన్ని అమలుచేసింది. నిరుపయోగ భూమి తీసుకుంటే వేరే చోట 'అభివృద్ధి చేసిన' స్థలాన్ని కేటాయిస్తారు. ప్రతీ కేటాయింపు ముడా బోర్డు దృష్టికి తేవాలి. అయితే కొందరు ముడా అధికారులతో చేతులు కలిపి, బోర్డు దృష్టికి రాకుండా, పథకంలోని లోపాలను వాడుకుని సిద్ధరామయ్య కుటుంబం ఎక్కువ ప్లాట్లను రాయించుకుందని విపక్షాలు ఆరోపిస్తు న్నా యి. లోపాలున్న పథకాన్ని 2023 అక్టోబర్‌లో రద్దుచేశారు. అయితే తన భూమికి ఎక్కువ విలువ ఉంటుందని రూ.62 కోట్ల నష్టపరిహారం కావాలని సిద్ధరామయ్య ఈఏడాది జూలై నాలుగున డిమాండ్ చేయడం విశేషం. అయితే అసలు ఈ భూమి పార్వతి సోదరుడు మల్లికార్జున స్వామిది కాదని, అక్రమంగా ఫోర్జరీ పత్రాలు సృష్టించి 2004లో తన పేరిట రాయించుకున్నాడని ఆరోపణలున్నాయి.

..ధన్‌ఖడ్ గుడ్‌బై!

▶ మొదటి పేజీ తరువాయి

తన రాజీనామా లేఖను రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు అధికారికంగా పంపించారు. 'నా ఆరోగ్య సంరక్షణపై దృష్టి సారించాలనుకుంటున్నా. ఈ మేరకు వైద్యులు సూచించిన సలహాలను పాటించేందుకు అనువుగా ఉపరాష్ట్రపతి పదవికి రాజీనామా చేస్తున్నా. రాజ్యాంగంలోని 67(ఏ) అధికరణం ప్రకారం ఉపరాష్ట్రపతిగా నేను తీసుకున్న నా రాజీనామా నిర్ణయం తక్షణమే అమల్లోకి వస్తుంది. ఉపరాష్ట్రపతిగా పదవీబాధ్యతలు నెరవేర్చిన కాలంలో నాకు పూర్తి మద్దతుగా నిలిచిన రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు సహా పార్లమెంటు సభ్యులందరికీ నా కృతజ్ఞతలు. మీ అందరి నుంచి లభించిన అమూల్యమైన సహకారం, ఆప్యాయతలు ఎప్పటికీ మరువలేను. సదా నాకు గుర్తుండిపోతాయి. ఉపరాష్ట్రపతిగా ఇన్నాళ్లు ఎన్నో విలువైన విషయాలు నేర్చుకున్నాను. అనేక జీవితానుభవాలను మూటగట్టుకున్నా. ఇంతటి పరివర్తనాత్మక సమయంలో ఉపరాష్ట్రపతిగా దేశ ఆర్థిక పురోభివృద్ధి, దేశాభివృద్ధిని గమనించా. ఈ అవకాశం రావడాన్ని గౌరవంగా భావిస్తున్నా. ఇది నాకెంతో సంతృప్తినిచ్చింది. ప్రపంచవ్యాప్తంగా భారత్ సాధించిన విజయాలను చూసి ఎంతో గర్విస్తున్నా. మన భారతదేశ ఉజ్వల భవితవ్యంపై నాకు అచంచలమైన విశ్వాసం ఉంది'' అని ధన్‌ఖడ్ తన రాజీనామా లేఖలో పేర్కొన్నారు. 74 ఏళ్ల ధన్‌ఖడ్ ఉపరాష్ట్రపతిగా 2022 ఆగస్టులో బాధ్యతలు చేపట్టారు. ఈయన వాస్తవానికి మరోరెండేళ్ల పదవిలో కొనసాగాల్సి ఉంది. అనారోగ్యంతో ఇటీవల ఢిల్లీలోని ఎయిమ్స్‌లో ఆయన యాంజియోప్లాస్టీ చేయించుకున్న విషయం విదితమే.

అందరికీ ఎదురెళ్లి..: విపక్షాలపై అధికార పక్షంకంటే దీటుగా విమర్శలు సంధించారన్న పేరును ధన్‌ఖడ్ మూటగట్టుకున్నారు. స్వతంత్రభారతంలో తొలిసారిగా ఉపరాష్ట్రపతిని అభిశంసించాలన్న డిమాండ్ ఈయనపైనే రావడం యాదృచ్ఛికం అసలేకాదు. విపక్షాలు అభిశంసన కోసం ప్రయత్నించగా రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్ ఆ ప్రయత్నాన్ని అడ్డుకున్న విషయంతెల్సిందే. పదవిలో ఉండగానే రాజీనామా చేసిన మూడో ఉపరాష్ట్రపతిగా ధన్‌ఖడ్ రికార్డులకెక్కారు. గతంలో వీవీ గిరి, ఆర్.వెంకటరామన్‌లు ఇలాగే రాజీనామాలు సమర్పించారు. అయితే వీళ్లిద్దరూ రాష్ట్రపతి ఎన్నికల్లో పోటీకోసం రాజీనామాలుచేయగా ధన్‌ఖడ్ అనారోగ్య కారణాలతో రాజీనామా చేయడం గమనార్హం.

కొత్త ఉపరాష్ట్రపతి ఎవరు?: ఎన్‌డీఏ కూటమికి లోక్‌సభ, రాజ్యసభలో మెజారిటీ ఉండి కూడా ఉపరాష్ట్రపతి పదవిలోని వ్యక్తి రాజీనామాచేయడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది.అయినాసరే ప్రభుత్వా నికి ఇరుసభల్లో పూర్తి మెజార్టీ ఉన్న తరుణంలో మరో నేతను ఉపరాష్ట్రపతి పదవిలోకి తీసుకోవడం మోదీ సర్కార్‌కు తేలికైన పనేనని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఇప్పటికే రాజ్యసభ డిప్యూటీ చైర్మన్‌గా అపార అనుభవం గడించిన హరివంశ్‌ను ఉపరాష్ట్రపతి పదవి రేసు ముందంజలో ఉండొచ్చని బీజేపీ సీనియర్ నేత ఒకరు చెప్పారు. జనతాదళ్(యూ) ఎంపీ అయిన హరివంశ్ 2020 నుంచి ఆ పదవిలో కొనసాగుతూ ఇప్పటికే ప్రభుత్వ నమ్మకాన్ని సాధించారు.

రైతు బిడ్డ నుంచి ఉపరాష్ట్రపతి దాకా..

రాజస్తాన్‌లోని ఝున్‌ఝును జిల్లాలోని కిథానా గ్రామంలో 1951 మే 18వ తేదీన రైతు కుటుంబంలో ధన్‌ఖడ్ జన్మించారు. గతంలో జనతాదళ్‌లో తర్వాత కాంగ్రెస్‌తో సత్సంబంధాలుకొనసాగించారు. 2008లో బీజేపీలో చేరారు. ఎల్ఎల్‌బీ కోర్సు తర్వాత 1979 నవంబరులో రాజస్తాన్ బార్ అసోసియేషన్‌లో న్యాయవాదిగా పేరు నమోదు చేసుకున్నారు. తదనంతరకాలంలో 1990లో రాజస్థాన్ హైకోర్టులో సీనియర్ లాయర్‌గా స్థిరపడ్డారు. తర్వాత ఉక్కు, గనులు, అంతర్జాతీయ వాణిజ్య వివాదాలు తదితర రంగాల కేసులను విజయవంతంగా వాదించి సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదిగా మంచి పేరు తెచ్చుకున్నారు. రాజకీయాలకు కాస్త దూరంగా ఉన్నారు. అయితే 2019లో పశ్చిమబెంగాల్ గవర్నర్‌గా ఈయన పేరు ఎన్‌డీఏ సర్కార్ నామినేట్ చేశాక ఒక్కసారిగా అందరి దృష్టిలో పడ్డారు. మమతా బెనర్జీ సారథ్యంలోనే తృణమూల్ కాంగ్రెస్ సర్కార్‌పై నిత్యం విమర్శలు చేస్తూ రాష్ట్రప్రభుత్వానికి పెద్ద తలనొప్పిగా తయారయ్యారు. ఈ విషయాన్ని మమతాబెనర్జీ పదేపదే ప్రస్తావించేవారు. విపక్షాలుసహా న్యాయవ్యవస్థలోని లోపాలను తరచూ ఎత్తిచూపేవారు. జాతీయ న్యాయనియామకాల కమిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టేయడాన్ని ఆయన బహిరంగంగానే విమర్శించారు. దీంతో ఎన్‌డీఏ ప్రభుత్వ దృష్టిలో పడి ఏకంగా ఉపరాష్ట్రపతి పీఠంపై ఆసీనులయ్యారు. 2022లో ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో అధికార ఎన్డీయే కూటమి అభ్యర్థిగా రంగంలోకి దిగి విపక్షాల అభ్యర్థి మార్గరెట్ ఆళ్వాపై గెలిచారు.

రాజకీయాల్లోనూ..: 1989లో జనతాదళ్ తరఫున ఝున్‌ఝును లోక్‌సభ స్థానం నుంచి ధన్‌ఖడ్ పోటీచేసి విజయం సాధించారు. 1990లో అప్పటి ప్రధానమంత్రి చంద్రశేఖర్ మంత్రివర్గంలో పార్లమెంటరీ వ్యవహారాల సహాయ మంత్రిగా కొన్నాళ్లు పనిచేశారు. 1993-98 మధ్య కాలంలో ఎమ్మెల్యేగా సేవలందించారు. పి.వి.నరసింహారావు హయాంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. 1998 నుంచి క్రియాశీల రాజకీయాలకు దూరంగా ఉన్నారు. 2008 తర్వాత బీజేపీలో చేరారు.

పార్లమెంట్ సమావేశాలు

అక్రమ ఇసుక తవ్వకాల నియంత్రణ బాధ్యత రాష్ట్రాలదే

- వరంగల్ జిల్లా గోదావరి తీరంలో కేంద్రం ఎలాంటి అధ్యయనం జరపలేదు
- లోక్‌సభ వేదికగా స్పష్టం చేసిన కేంద్ర ప్రభుత్వం

సాక్షి, న్యూఢిల్లీ: అక్రమ ఇసుక తవ్వకాల నియంత్రణ బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలదేనని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇసుక మైనర్ మినరల్‌గా పరిగణించబడుతుందని, దానిపై నియంత్రణ, పర్యవేక్షణ, నియమాలు అమలుచేయడం రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యతగా పేర్కొంది. సెక్షన్ 15, 23ఈ ప్రకారం, మైనర్ ఖనిజాల అక్రమ తవ్వకాలను అరికట్టే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకే ఉందని కేంద్రం స్పష్టం చేసింది. అయితే పాత వరంగల్ జిల్లాలోని గోదావరి నది తీరంలో అక్రమ ఇసుక తవ్వకాలపై కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల శాఖ ఎలాంటి అధ్యయనం జరపలేదని స్పష్టం చేసింది. అంతేగాక తెలంగాణ పర్యావరణ నియంత్రణ మండలి ఇచ్చిన సమాచారం ప్రకారం, గోదావరి నది తీరం వద్ద అక్రమ తవ్వకాలపై ఎలాంటి ఫిర్యాదు తమకు అందలేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ విషయమై లోక్‌సభలో సోమవారం కాంగ్రెస్ ఎంపీ కడియం కావ్య అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి భూపేందర్ యాదవ్ లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.

గ్రీన్ ఇండియా మిషన్‌లో తెలంగాణ భాగస్వామ్యం కాలేదు

అదే సమయంలో గ్రీన్ ఇండియా మిషన్ కింద ఇప్పటి వరకు తెలంగాణ రాష్ట్రం నుంచి పర్‌స్పెక్టివ్ ప్లాన్ తమకు అందలేదని.... అందువల్ల రాష్ట్రం ప్రస్తుతం ఈ మిషన్‌లో పాల్గొనడం లేదని కేంద్రం వెల్లడించింది.

పాకాల సరస్సు రక్షణకు చర్యలు


- పాకాల సరస్సు, వన్యప్రాణుల సంరక్షణ ప్రాంతం చుట్టూ ఎకో-సెన్సిటివ్ జోన్‌గా కేంద్రం 2016లో ప్రకటించినట్టు కేంద్ర మంత్రి భూపేంద్ర యాదవ్ తెలిపారు. ఆక్రమణల నివారణ, ప్లాస్టిక్ నిషేధం, అవగాహన కార్యక్రమాలు, నియమిత తనిఖీలు, పునర్వనీకరణ నాట్లు, జల నమూనాలు సేకరణ వంటి చర్యలు రాష్ట్ర అటవీ శాఖ చేపడుతోందన్నారు. హరితనిధి ద్వారా పాకాల సరస్సు పరిసర అభివృద్ధికి హరిత నిధి కింద రూ.2.74 కోట్లు మంజూరయ్యాయని వెల్లడించారు.
- ఎస్సీ, ఎస్టీలతో పాటు మహిళలను ఆర్థికంగా స్వయం సమృద్ధిగా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన స్టాండ్ అప్ ఇండియా పథకాన్ని తెలంగాణలోనూ అమలు చేస్తున్నామని కేంద్రం తెలిపింది. ఈ పథకం అమలులో తెలంగాణలో 14,387 మంది ఎస్సీ, ఎస్టీలతో పాటు మహిళలకు రూ.3,352.61 కోట్ల విలువైన రుణాలు మంజూరు చేసినట్లు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి తెలిపారు. బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు.

పౌరుడిపై అప్పు పెరుగుదలపై కేంద్రం స్పష్టత

- గత రెండు సంవత్సరాల్లో భారత పౌరుడిపై సగటు అప్పు రూ.90 వేలకు పెరిగిందని వస్తున్న ఆరోపణలను కేంద్ర ప్రభుత్వం ఖండించింది. ఈ మేరకు లోక్‌సభలో కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి లిఖితపూర్వకంగా సమాధానమిచ్చారు. ఆర్బీఐ గణాంకాల ప్రకారం, మార్చి 2025 నాటికి భారత్‌లో దాదాపు 28 కోట్ల మంది వ్యక్తిగత రుణగ్రహీతలు ఉన్నారని తెలిపారు. పర్సనల్, బిజినెస్ రుణాల ద్వారా సగటు అప్పు రూ.3.9 లక్షల నుంచి రూ.4.8 లక్షలకు పెరిగిందన్నారు. అయితే ఇది మొత్తం భారత జనాభా కోసం కాదని.. కేవలం రుణం తీసుకున్నవారికే వర్తించేదని వివరించారు.
- ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన (పీఎంకేవీవై) అమలులో భాగంగా తెలంగాణలోని పెద్దపల్లి జిల్లాలో ఇప్పటివరకు మొత్తం 16 శిక్షణ కేంద్రాలను ఎంపానెల్ చేసినట్టు కేంద్ర నైపుణ్యాభివృద్ధి, ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ మంత్రిత్వ శాఖ పేర్కొంది. ప్రస్తుతం అమలులో ఉన్న పీఎంకేవీవై 4.0 కింద పెద్దపల్లి జిల్లాలో ఒక్క శిక్షణ కేంద్రం కూడా పనిచేయడం లేదని కాంగ్రెస్ ఎంపీ గడ్డం వంశీకృష్ణ అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి జయంత్‌చౌదరి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. 2025 జూన్ 30 నాటికి పెద్దపల్లి జిల్లాలో ఈ పథకం ప్రారంభమైన నాటి నుంచి రూ.1.81 కోట్లు ఖర్చు చేసినట్టు కేంద్రం వెల్లడించింది.

వాణిజ్య రంగంలో తెలంగాణ ముందుంది

- రాజ్యసభలో బీఆర్‌ఎస్ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర
- 'బిల్స్ ఆఫ్ లేడింగ్ బిల్- 2024'కు మద్దతు



సాక్షి, న్యూఢిల్లీ: తీర రహిత ప్రాంతమైనప్పటికీ తెలంగాణ వాణిజ్యంలో ముందుందని బీఆర్‌ఎస్ రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర పేర్కొన్నారు. ఐటీ, ఫార్మా, టెక్స్‌టైల్స్ తదితర రంగాల్లో ఎన్నో దేశాలకు తెలంగాణ ఎగుమతులు చేస్తున్న విషయాన్ని గుర్తుచేశారు. ఓడరేవులు, జలమార్గాలు, నౌకానిర్మాణం శాఖల మంత్రి సర్బానంద సోనోవాల్ సోమవారం రాజ్యసభలో ప్రవేశపెట్టిన 'బిల్స్ ఆఫ్ లేడింగ్ బిల్-2024'దేశానికి ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుందని ఆశిస్తూ తమ పార్టీ మద్దతు తెలుపుతున్నట్లు చెప్పారు. 'క్లాజ్ 2 ప్రకారం 'బిల్ ఆఫ్ లేడింగ్'లో పేరుండే వ్యక్తికి అన్ని హక్కులు, బాధ్యతలు వస్తాయని, వాణిజ్యం సూటిగా, నేరుగా జరుగనుంది'అని చెప్పారు. విశాఖపట్నం, చెన్నై పోర్టుల ద్వారా తెలంగాణ నుంచి సరుకులు త్వరగా వెళ్లేలా ఇది మరింత దోహదం చేస్తుందన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఈ-బిల్ (ఎలక్ట్రానిక్ బిల్స్ ఆఫ్ లేడింగ్) ఎక్కువగా వాడుతున్నారని, హైదరాబాద్ నగరంలో ఐటీ కంపెనీలు పెద్దసంఖ్యలో ఉన్నందున ఈ-బిల్‌కు ప్రాధాన్యత ఉండాలని రవిచంద్ర సూచించారు.

విదేశీ విద్య @రూ. 3,78,400 కోట్లు



2024లో భారతీయులు చేసిన ఖర్చు ఇదీ!

2030 నాటికి రూ.7,82,600 కోట్లకు చేరొచ్చు

అదనపు భారంగా విదేశీ మారకం చార్జీలు

గత సంవత్సరం రూ.1,700 కోట్ల వ్యయం

భారతీయ కుటుంబాలు తమ పిల్లల విదేశీ విద్య కోసం 2024లో రూ.3,78,400 కోట్లు ఖర్చు చేశాయి. 2030 నాటికి ఇది రెండింతలు దాటి రూ.7,82,600 కోట్లకు చేరుతుందని లండన్‌కు చెందిన పేమెంట్స్ కంపెనీ వైజ్, కన్సల్టింగ్ సంస్థ 'రెడ్‌సీర్ స్ట్రాటజీ కన్సల్టెంట్స్' నివేదిక వెల్లడించింది. భారతీయులు విదేశీ విద్య కోసం జరిపే చెల్లింపులపై బ్యాంకులు వసూలు చేసే మారకపు రేటు ఫీజు, రుసుములు గత ఏడాది రూ.1,700 కోట్లుగా నమోదయ్యాయి. ఏటా రూ.30 లక్షలు పంపే ఒక సాధారణ కుటుంబం ఈ చార్జీల కింద రూ.60,000–75,000 కోల్పోవాల్సి వస్తోంది.

– సాక్షి, స్పెషల్ డెస్క్

రూ.75 వేల వరకు...

భారతీయులు విదేశీ విద్య కోసం జరిపే చెల్లింపులపై బ్యాంకులు వసూలు చేసే మారకపు రేటు ఫీజు, రుసుములు గత ఏడాది రూ.1,700 కోట్లు నమోదయ్యాయి. ఆరేళ్లలో ఇది రూ.4,300 కోట్లకు చేరవచ్చని అంచనా. ఈ చెల్లింపులలో 95% పైగా సంప్రదాయ బ్యాంకింగ్ మార్గాల ద్వారా విదేశాలకు చేరుతున్నాయి. విదేశీ కరెన్సీలో చెల్లింపులు జరిపినందుకుగాను బ్యాంకింగ్ సంస్థలు విదేశీ మారకపు రేటుపై 3–3.5% చార్జీ వసూలు చేస్తున్నాయి. లావాదేవీ పూర్తి కావడానికి 2–5 రోజుల సమయం పడుతోంది. ఏటా తమ పిల్లల చదువుల కోసం రూ.30 లక్షలు పంపే ఒక సాధారణ కుటుంబం ఈ చార్జీల కింద రూ.60,000–75,000 కోల్పోవాల్సి వస్తోంది. ఈ మొత్తంతో కొన్ని రోజులపాటు విద్యార్థులు రోజువారీ ఖర్చులు వెళ్లదీయవచ్చు. లేదా అదనపు కోర్సులు చేసేందుకు వెచ్చించవచ్చు.

యూఎస్‌లో అనిశ్చితితో..

రిజర్వు బ్యాంకు లెక్కల ప్రకారం.. లిబరలైజ్డ్ రెమిటెన్స్ స్కీమ్ (ఎల్ఆర్ఎస్) కింద విదేశీ విద్య కోసం భారతీయులు విదేశాలకు పంపిన డబ్బు ఈ ఏప్రిల్‌లో రూ.1,410 కోట్లు. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 21% తక్కువ. 2025 మొదటి నాలుగు నెలల్లో విదేశీ విద్యకు ఎల్ఆర్ఎస్ కింద చేసిన ఖర్చు మొత్తంగా 21% తగ్గి రూ.7,516 కోట్లకు చేరుకుంది. గత ఆగస్టు నుంచి ఏప్రిల్ వరకు.. తొమ్మిది నెలలుగా ఈ పథకం కింద విదేశాలకు పంపిన డబ్బు తగ్గుతూ వస్తోంది. ఇందుకు ప్రధాన కారణం అమెరికాలో అనిశ్చితి. ఎల్ఆర్ఎస్ కింద ప్రతి ఆర్థిక సంవత్సరంలో ప్రయాణం, విద్య, వైద్య చికిత్స, విదేశీ స్టాక్స్‌లో పెట్టుబడులు వంటి లావాదేవీల కోసం రూ.2.15 కోట్ల వరకు విదేశాలకు పంపడానికి ఆర్‌బీఐ అనుమతి ఇస్తోంది.

ప్రపంచ సగటు 6.62%

ప్రపంచ బ్యాంకు లెక్కల ప్రకారం 2024 జూలై–సెప్టెంబర్‌లో విదేశాలకు పంపే మొత్తంపై ఈ చార్జీల ప్రపంచ సగటు 6.62% ఉంది. అంతర్జాతీయ చెల్లింపులు చేయడానికి అయ్యే ఖర్చు మధ్యవర్తులు లేదా కరస్పాండెంట్ బ్యాంకుల సంఖ్యను బట్టి పెరుగుతుంది. రుసుములు, కార్యాచరణ జాప్యాలు ప్రతి దశలోనూ ఉంటాయి. ఈ ఖర్చులు, జాప్యాల వల్లే కేంద్ర బ్యాంకులు విదేశాలకు నగదు బదిలీ చేయడానికి డిజిటల్ కరెన్సీలకు శ్రీకారం చుట్టాయి.

- విదేశాల్లో ఉన్న పిల్లలకు గత ఏడాది విదేశీ విద్యకు అయిన వ్యయంలో నాలుగింట ఒక వంతు.. అంటే రూ.94,600 కోట్లను భారత్‌లోని కుటుంబ సభ్యులు బదిలీ చేశారు. మిగిలిన మొత్తాన్ని పార్ట్ టైమ్ ఉద్యోగాల ద్వారా సంపాదించిన మొత్తం, అలాగే ఉపకార వేతనాల ద్వారా విద్యార్థులు సమకూర్చుకున్నారు.
- ప్రస్తుతం 18 లక్షల పైచిలుకు భారతీయ విద్యార్థులు వివిధ దేశాల్లో విద్యనభ్యసిస్తున్నారు. ఏడాది క్రితం ఈ సంఖ్య 13 లక్షలు మాత్రమే.
- విద్యార్థుల ప్రాధాన్యతలో యూఎస్, కెనడా, యూకే టాప్–3లో నిలిచాయి.
- వివిధ దేశాల్లో చదువుతున్న మొత్తం విద్యార్థుల్లో భారతీయుల వాటా 30–35% ఉంది. దశాబ్దం క్రితం ఈ సంఖ్య 11% మాత్రమే.
- విదేశాల్లో చదువుతున్న భారతీయ విద్యార్థుల సంఖ్య ఆరేళ్లలో 25 లక్షలు దాటొచ్చు.

క్లుప్తంగా...

మరికొంతమందికి 'చేయూత పింఛన్'

తాజా పెంపుదలతో 8,721కి చేరిన లబ్ధిదారుల సంఖ్య



సాక్షి, హైదరాబాద్ : డయాలసిస్ చికిత్స పొందుతున్న 681 మంది పేదలకు రాష్ట్ర ప్రభుత్వం చేయూత పింఛన్లు మంజూరు చేసింది. ఈ ఫైల్‌పై మంత్రి సీతక్క సంతకం చేశారు. గతంలో 4,011 మంది పేషెంట్లకు పింఛన్ అందగా, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 4,029 మందికి పింఛన్లు మంజూరు చేసింది. తాజాగా మరో 681 మందికి ఇవ్వడంలో లబ్ధిదారుల సంఖ్య ఇప్పుడు 8,721కి చేరింది. ఆరోగ్యశ్రీ హెల్త్‌కేర్ ట్రస్ట్ ద్వారా గుర్తింపు పొందిన వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న రోగుల వివరాల ఆధారంగా ఈ పింఛన్లు మంజూరు చేశారు. తాజా లబ్ధిదారుల్లో అత్యధికంగా హైదరాబాద్‌లో 629 మంది పేషెంట్లు వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో డయాలసిస్ చికిత్స పొందుతున్నారు. మిగిలిన 52 మంది పేషెంట్లు జిల్లాలకు చెందినవారు. కొత్తగా ఎంపికైన లబ్ధిదారులకు వచ్చే నెల నుంచి చేయూత పింఛను అందనుంది. ఈ పింఛన్ల పెంపుదల ఆరోగ్య భద్రతతోపాటు ఆర్థిక భరోసా కల్పించేలా నిర్ణయాలు తీసుకుంటున్న తమ ప్రభుత్వానికి ప్రత్యక్ష ఉదాహరణగా నిలిచిందని మంత్రి సీతక్క తెలిపారు.

పెన్షనర్లకు వైద్య సేవలు అందించాలి



సాక్షి, హైదరాబాద్: ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులకు నగదు రహిత వైద్య సేవలను తక్షణమే అందుబాటులోకి తేవాలని తెలంగాణ రాష్ట్ర రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు జి.దామోదర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వైద్య సేవలు అందిస్తామని జూన్ 5వ తేదీన మంత్రివర్గం నిర్ణయించినా, ఇంత వరకూ అమలు కాలేదని తెలిపారు. వయో వృద్ధులైన పెన్షనర్లు వైద్య సేవల కోసం రూ.లక్షలు వెచ్చించాల్సి వస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

సింగరేణి ఈడీగా వెంకన్న బాధ్యతల స్వీకారం



సాక్షి, హైదరాబాద్: సింగరేణి కాలరీస్‌లో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (కోల్ మూమెంట్)గా బి.వెంకన్న సోమవారంబాధ్యతలు స్వీకరించారు. 2010 భారతీయ రైల్వే ట్రాఫిక్ సర్వీస్ (ఐఆర్టీఎస్)కు చెందిన ఆయనను.. మూడేళ్ల పాటు సింగరేణికి డెప్యుటేషన్‌పై పంపించే ప్రతిపాదనకు క్యాబినెట్ అపాయింట్ మెంట్స్ కమిటీ ఇటీవలే ఆమోదం తెలిపింది. ఈ నేపథ్యంలో ఆయన సింగరేణి భవన్‌లో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు.

ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం కార్యవర్గం


సత్యనారాయణ

సాక్షి, హైదరాబాద్: ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం సోమవారం నూతన కార్య వర్గాన్ని ఎన్నుకుంది. సంఘం రాష్ట్ర అధ్యక్షునిగా తొంట సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా పెంట అంజయ్య, కోశాధికారిగా నాంది సుశీల్‌కుమార్, సలహాదారులుగా బడారు రవివర్ధన్, గౌరవాధ్యక్షులుగా పారునంది రామయ్య, మోతె సాయన్న, వర్కింగ్ కమిటీ అధ్యక్షులుగా సూర్యదేవర దానయ్య, చాగంటి ప్రభాకర్ ఎన్నికైనట్టు సంఘం ఒక ప్రకటనలో తెలిపింది. ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి రెండు సంఘాలు ఏకమైనట్టు సంఘ నేతలు తెలిపారు.


కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రులు పొన్నం, కోమటిరెడ్డి, ఉత్తమ్, వివేక్, రాజనర్సింహ, శ్రీధర్‌బాబు, సీతక్క, వాకిటి శ్రీహరి, పొంగులేటి

కలెక్టర్లు కదలాలి

▶ మొదటి పేజీ తరువాయి

పలు అంశాలపై అధికారులకు సీఎం దిశా నిర్దేశం చేశారు.

అజాగ్రత్తగా ఉంటే ఉపేక్షించేది లేదు..

'వర్షాల నేపథ్యంలో జిల్లాల పరిధిలో సాగునీటి ప్రాజెక్టులు, చెరువులు, కుంటల నీటిని జాగ్రత్తగా ఒడిసి పట్టుకోవాలి. జూలై, ఆగస్టు నెలల్లో కురిసే వర్షాలతో జిల్లా కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలి. రైతులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. వాతావరణ శాఖ అందించే వర్ష సూచనలపై కనీసం మూడు గంటల ముందే రైతులు, ప్రజలను అప్రమత్తం చేసే వీలుంది. ఈ విషయంలో కలెక్టర్లు బాధ్యత వహించాలి. వర్షాల కారణంగా ఎలాంటి ప్రాణ నష్టం, ఆస్తి నష్టం జరగకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలి. పిడుగు పాటు మరణాలను నమోదు చేస్తే భవిష్యత్తులో వారికి ప్రభుత్వ పరంగా సాయం అందించే వీలుంటుంది. వర్షాల సమయంలో జీహెచ్ఎంసీ పరిధిలో ట్రాఫిక్ ఇబ్బందులు తీవ్రంగా ఉన్నాయి. ఈ పరిస్థితిని అధిగమించేందుకు అన్ని విభాగాలు మరింత సమర్థంగా పని చేయాలి. ఎలాంటి విపత్కర పరిస్థితులు వచ్చినా ఎదుర్కొనేలా జీహెచ్ఎంసీతో పాటు పోలీస్, ట్రాఫిక్ విభాగాలు, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, హైడ్రా అధ్వర్యంలోని 150 టీమ్‌లు వెంటనే రంగంలోకి దిగాలి. అజాగ్రత్తగా ఉంటే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదు..' అని ముఖ్యమంత్రి హెచ్చరించారు.

అంటువ్యాధులపై అప్రమత్తత అవసరం

'వర్షాకాలంలో డెంగీతో పాటు సీజనల్ జ్వరాలు, అంటువ్యాధులు ప్రబలకుండా వైద్య ఆరోగ్య శాఖ జాగ్రత్తలు తీసుకోవాలి. గిరిజన ప్రాంతాలు, ఏజెన్సీ ఏరియాలు, మారుమూల ప్రాంతాల్లో ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలి. పీహెచ్‌సీలు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు ఎప్పుడూ అందుబాటులో ఉండాలి. పశువులకు సంబంధించి వెటర్నరీ విభాగం అప్రమత్తంగా ఉండాలి.

యూరియా పక్కదారి పడుతోంది..

కృష్ణా బేసిన్ పరిధిలో ఇప్పటికే కొన్ని ప్రాజెక్టుల కింద నీటి విడుదల మొదలైంది. త్వరలోనే నాగార్జునసాగర్ నీటిని కూడా విడుదల చేస్తాం. గోదావరి పరిధిలో వర్షాలు తక్కువగా ఉన్నందున కొంత ఆలస్యమవుతుంది. సబ్సిడీతో కూడిన యూరియా పూర్తిగా రైతులకు మాత్రమే చెందాలి. కానీ 20 నుంచి 25 శాతం యూరియా పక్కదారి పడుతున్నట్లు తెలిసింది. యూరియాను డీజిల్‌లో పొగను తగ్గించడానికి వాడుతున్నట్లు తెలిసింది. ఇతర వ్యాపార అవసరాలకు కూడా యూరియాను మళ్లిస్తున్నట్లు ఇటీవల కేంద్రమంత్రి హెచ్చరించారు. దీనిపై అధికారులు అప్రమత్తంగా ఉండాలి. ఈ సీజన్‌లో ఆగస్టు వరకు అవసరమైనంత యూరియా అందుబాటులో ఉంది. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. యూరియా నిల్వ వివరాలను డీలర్లు, షాపుల వద్ద బోర్డుపై ప్రదర్శించాలి. అధికారులు బ్లాక్‌మార్కెట్‌ను అరికట్టాలి. నిల్వల వివరాలు ఆన్‌లైన్‌లో ఉండేలా చర్యలు తీసుకోవాలి. అన్నిచోట్ల డీలర్ల వద్ద, షాపుల వద్ద ఇద్దరు అధికారులు, ఇద్దరు పోలీసులను అందుబాటులో ఉంచాలి. ఎరువులకు సంబంధించి టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేసి రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరించాలి..' అని సీఎం ఆదేశించారు.

కార్డుల పంపిణీలో మంత్రులు, కలెక్టర్లు పాల్గొనాలి

'కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం విజయవంతంగా ప్రారంభమైంది. రాష్ట్రంలో దాదాపు 7 లక్షల కొత్త కార్డుల పంపిణీకి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దీంతో దాదాపు 31 లక్షల కుటుంబ సభ్యులు లబ్ధి పొందుతారు. రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ. ప్రస్తుతం రాష్ట్రంలో 96.95 లక్షల కార్డులతో 3.10 కోట్ల మంది సన్న బియ్యం తీసుకుంటున్నారు. పేదలకు సన్న బియ్యం అందించే ఈ రేషన్ కార్డుల పంపిణీని రాష్ట్రమంతటా ఘనంగా నిర్వహించాలి. ఈ నెల 25వ తేదీ నుంచి ఆగస్టు 10వ తేదీ వరకు అన్ని మండల కేంద్రాల్లో అధికారికంగా రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం చేపట్టాలి. జిల్లా ఇన్‌చార్జి మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు ఈ కొత్త కార్డుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొనాలి. డిజిటల్ కార్డులు రావడానికి ఆలస్యం అవుతుంది కాబట్టి ప్రింటెడ్ కార్డుల ద్వారా ప్రతి మండలంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు కూడా పాల్గొనాలి. జిల్లాలో ఉన్న ప్రతి నియోజకవర్గంలో కనీసం ఒకచోట జిల్లా ఇన్‌చార్జి మంత్రి పాల్గొనాలి..' అని ముఖ్యమంత్రి ఆదేశించారు. మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, సీతక్క, వివేక్ వెంకటస్వామి, వాకిటి శ్రీహరి, సీఎస్ కె.రామకృష్ణారావు తదితరులు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. కొత్తగూడెం నుంచి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఖమ్మం నుంచి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కూడా పాల్గొన్నారు.

గిగ్ వర్కర్లకు చట్టబద్ధ గుర్తింపు!

- ప్రత్యేక పాలసీ తెస్తున్నామన్న సీఎం రేవంత్‌రెడ్డి
- ప్రమాదబీమా కల్పించేలా రూపకల్పన చేయాలని సూచన
- గిగ్ వర్కర్స్ పాలసీ, ఏటీసీలపై అధికారులతో సమీక్ష

సాక్షి, హైదరాబాద్: గిగ్ వర్కర్లకు చట్టబద్ధ గుర్తింపు ఇచ్చేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం గిగ్ వర్కర్స్ పాలసీని తీసుకువస్తోందని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. సోమవారం సచివాలయంలో గిగ్ వర్కర్స్ పాలసీ, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ)లపై కార్మిక శాఖ ఉన్నతాధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. గిగ్‌వర్కర్స్ పాలసీలో ప్రతిపాదించిన అంశాలను కార్మిక శాఖ అధికారు లు ఈ సందర్భంగా సీఎంకు వివరించారు. కాగా అధికారులకు ముఖ్యమంత్రి పలు సూచనలు చేశా రు. గిగ్ వర్కర్ల కోసం ప్రత్యేకంగా సంక్షేమ బోర్డు ఏర్పాటుతో పాటు సంక్షేమ నిధిని కూడా ఏర్పాటు చేసే అంశాన్ని ప్రస్తావించారు. గిగ్ వర్కర్లకు సంబంధించిన పూర్తి సమాచారం వెబ్‌సైట్‌లో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వారికి ప్రమా ద బీమా, ఆరోగ్య బీమా సౌకర్యాలను కల్పించేలా పాలసీకి రూపకల్పన చేయాలని సూచించారు.

మూడు దశల్లో 111 ఏటీసీల అభివృద్ధి

రాష్ట్రంలో మూడు విడతల్లో ఏటీసీలను అభివృద్ధి చేయనున్నట్లు సీఎం తెలిపారు. మొదటి విడతలో 25, రెండో విడతలో 40, మూడో విడతలో 46 ఏటీసీలను అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు. మొదటి, రెండో విడత ఏటీసీల అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని, అవి అతి త్వరలో అందుబాటులోకి వస్తాయని చెప్పారు. జీనోమ్ వ్యాలీలో ఒక మోడల్ ఏటీసీని ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఫార్మా, బయోటెక్నా లజీ, లైఫ్ సైన్సెస్ పరిశ్రమలకు అవసరమైన శిక్షణ అందించే కోర్సులు అక్కడ నిర్వహించేలా కార్యాచ రణ రూపొందించాలని చెప్పారు. కార్మిక శాఖ మంత్రి జి.వివేక్ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

బీసీల వ్యతిరేకులెవరో తేలిపోతుంది

మాజీ ఎంపీ వీహెచ్

సాక్షి, హైదరాబాద్: దేశంలో బీసీ పక్షపాతులు ఎవరో, వ్యతిరేకులెవరో ఈ పార్లమెంటు సమావేశాల్లో తేలిపోతుందని కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ వి.హనుమంతరావు వ్యాఖ్యానించారు. ఆయన సోమవారం గాంధీభవన్‌లో టీపీసీసీ నాయకుడు లక్ష్మణ్‌యాదవ్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఓబీసీనని చెప్పుకునే ప్రధాని మోదీ నాయకత్వంలోని లోక్‌సభ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పంపిన బీసీ రిజర్వేషన్ల పరిమితి పెంపు బిల్లును ఆమోదించాలని డిమాండ్ చేశారు. ఈ బిల్లుకు కాంగ్రెస్ అధిష్టానం సంపూర్ణ మద్దతు ఇస్తోందన్నారు. రాజ్యాంగంలోని షెడ్యూల్ 9కి చట్టసవరణ చేసి 50 శాతం రిజర్వేషన్ల సీలింగ్‌ను ఎత్తివేసేలా మోదీ సర్కారు చొరవ తీసుకోవాలని వీహెచ్ కోరారు.

'కొమురం భీమ్ కన్జర్వేషన్ రిజర్వ్' జీవో నిలుపుదల

ఆదివాసీ, గిరిజనుల్లో ఆందోళన నేపథ్యంలో సీఎం నిర్ణయం


ఆదిలాబాద్ ఆర్టీసీ బస్టాండ్ ఎదుట నిరసన తెలుపుతున్న గిరిజన, కార్మిక సంఘాల నాయకులు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలోని కవ్వాల్ టైగర్ రిజర్వ్‌ను మహారాష్ట్రలోని తడోబా–అంధేరి టైగర్ రిజర్వ్‌లను కలిపే టైగర్ కారిడార్ ఏరియాను 'కొమురం భీమ్ కన్జర్వేషన్ రిజర్వ్'గా ప్రకటిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం తాత్కాలికంగా నిలుపుదల (అబయెన్స్) చేసింది. ఈ మేరకు గతంలో జారీచేసిన జీవో 49ను నిలుపుదల చేస్తూ సోమవారం అటవీశాఖ ముఖ్యకార్యదర్శి అహ్మద్ నదీమ్ ఉత్తర్వులు జారీచేశారు. కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ ఇచ్చిన నివేదిక ఆధారంగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. ఈ ప్రాంతాన్ని టైగర్ కన్జర్వేషన్ రిజర్వ్‌గా ప్రకటిస్తూ ఇచ్చిన జీవో వల్ల తమకు నష్టం జరుగుతుందనే ఆందోళన ఆదివాసీలు, గిరిజనుల్లో వ్యక్తమైంది. ఈ జీవోపై స్థానిక ఆదివాసీల్లో అనుమానాలు, అభ్యంతరాలు వ్యక్తమైన నేపథ్యంలో... పలు దఫాలుగా అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ, ఆదిలాబాద్ ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క అటవీ శాఖ అధికారులతో భేటీ అయ్యి ఆయా అంశాలపై చర్చించారు. తదనంతరం దీనిపై స్థానిక కలెక్టర్ నుంచి నివేదిక తెప్పించుని సీఎం ఆదేశాల మేరకు జీవో 49ను నిలుపుదల చేశారు. ఆదివాసీల కోసం ఈ జీవోను నిలుపుదల చేసినందుకు మంత్రి సీతక్క, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, ఎమ్మెల్సీ దండే విఠల్, మాజీ ఎంపీ సోయం బాబురావు, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు తదితరులు సీఎంను కలిసి ధన్యవాదాలు తెలియజేశారు.

జీవో 49 రద్దు కోసం బంద్

కైలాస్‌నగర్/ఆసిఫాబాద్: జీవో 49 రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో సోమవారం ఉమ్మడి ఆదిలాబాద్‌లో నిర్వహించిన బంద్ ప్రశాంతంగా ముగిసింది. ఆదిలాబాద్‌లో తెల్లవారుజాము 4 గంటలకే ఆదిలాబాద్, ఉట్నూర్ ఆర్టీసీ డిపోల వద్దకు చేరుకున్న ఆదివాసీ, గిరిజన సంఘాల నాయకులు బస్సులను కదలనీయకుండా అడ్డుకున్నారు. కాగా, కాగజ్‌నగర్‌లో బీజేపీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించగా, సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు పాల్గొన్నారు. సీపీఎం నాయకులు రాజీవ్‌గాంధీ చౌరస్తాలో ప్లకార్డులతో నిరసన తెలిపారు.

'హరిహర వీరమల్లు' సినిమా టికెట్ ధరల పెంపు

హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవి గుప్తా ఉత్తర్వులు



సాక్షి, హైదరాబాద్: మేఘా సూర్యా ప్రొడక్షన్స్ నిర్మించిన 'హరిహర వీరమల్లు' సినిమా టికెట్ ధరల పెంపునకు ప్రభుత్వం అనుమతిచ్చింది. జూలై 23 రాత్రి 9 గంటలకు రూ.600 టికెట్‌తో ప్రీమియర్ షోకు (ఒక ప్రదర్శన) కూడా ఆమోదం తెలిపింది. ఈ మేరకు హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవి గుప్తా సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 24 నుంచి 27 వరకు మల్టీప్లెక్స్ టికెట్ ధరపై రూ.200 (జీఎస్టీ అదనం), సింగిల్ స్క్రీన్ థియేటర్లలో రూ.150 (జీఎస్టీ అదనం) పెంచుకోవచ్చని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. జూలై 28 నుంచి ఆగస్టు 2 వరకు మల్టీప్లెక్సులలో రూ.150 (జీఎస్టీ అదనం), సింగిల్ స్క్రీన్ థియేటర్లలో రూ.106 (జీఎస్టీ అదనం) పెంపు ఉండనుంది. రోజుకు 5 షోలు వేయనున్నారు. అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, లైసెన్సింగ్ అథారిటీలు (సినిమా హాస్‌లు, పోలీస్ కమిషనర్లు) ఈ ఆదేశాల ప్రకారం అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవి గుప్తా ఆదేశించారు.

సింధూర్‌తో పాటే బీసీ రిజర్వేషన్లు!

- లోక్‌సభలో చర్చకు కాంగ్రెస్ అధిష్టానాన్ని కోరనున్న రాష్ట్ర ముఖ్య నాయకత్వం
- బీసీ కోటాపై ఖర్గే, రాహుల్‌తో మరోసారి చర్చించే యోచన
- 24న పార్టీ ఎంపీలకు సీఎం రేవంత్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్



సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ వర్షాకాల సమావేశాల్లో ఆపరేషన్ సింధూర్ అంశంతో పాటు రాష్ట్ర అసెంబ్లీ ఆమోదించిన బీసీ రిజర్వేషన్ల బిల్లుకు ఆమోదంపై చర్చించేలా పట్టు పట్టాలని కాంగ్రెస్ అధిష్టానాన్ని తెలంగాణ ముఖ్య నాయకత్వం కోరనుంది. ఈ మేరకు లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడినట్టు తెలిసింది. హైకోర్టు ఆదేశాల మేరకు స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాల్సిన అనివార్యత, రిజర్వేషన్ల ఖరారుకు ఉన్న సమయం తదితర అంశాలపై హైకమాండ్‌తో మరోసారి మాట్లాడిన తర్వాత, బీసీ రిజర్వేషన్ల అంశంపై ఢిల్లీలో పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ (పీపీటీ) ఇవ్వాలనే నిర్ణయానికి రేవంత్ వచ్చారు. ఈ నెల 24న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో కలిసి వెళ్లి దేశంలోని కాంగ్రెస్ పార్టీ లోక్‌సభ, రాజ్యసభ సభ్యులందరికీ పీపీటీ ద్వారా బీసీ రిజర్వేషన్ల అంశాన్ని వివరించనున్నారు. అంతకంటే ముందు రాహుల్, ఖర్గేలతో ఇరువురు నేతలు ఈ అంశంపై చర్చించనున్నారు. రాహుల్‌గాంధీ ఆలోచనలకు, కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా ముందుకెళుతున్న తెలంగాణకు మద్దతివ్వాలని, ఉభయ సభల్లోనూ ఈ అంశాన్ని ప్రస్తావించడం ద్వారా బీసీ రిజర్వేషన్ల పెంపునకు కేంద్రంపై ఒత్తిడి తేవాలని పార్టీ ఎంపీలను సీఎం కోరనున్నారు.

పీపీటీ అంశాలపై భట్టి, ఉత్తమ్‌లతో చర్చ

ఈ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్‌లో పేర్కొనాల్సిన అంశాలపై చర్చించేందుకు ఆదివారం సీనియర్ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కలతో రేవంత్‌రెడ్డి విడివిడిగా భేటీ అయ్యారు. ఈ చర్చలు ఆదివారం అర్ధరాత్రి ఒంటిగంట వరకు సాగాయని తెలుస్తోంది. ముఖ్యంగా కుల గణన, అసెంబ్లీలో బిల్లు, కులగణనపై నిపుణుల నివేదిక తదితర పరిణామాలకు సంబంధించి పీపీటీలో పేర్కొనాల్సిన కీలకాంశాలపై వీరు చర్చించారని, ఈ నెల 24న ఇవ్వాల్సిన పీపీటీ మంగళవారం పూర్తిస్థాయిలో సిద్ధమవుతుందని సమాచారం.

ఇందిరా భవన్‌లో పీపీటీ: మల్లు రవి

సాక్షి, న్యూఢిల్లీ: కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే నేతృత్వంలో 100 మంది కాంగ్రెస్ ఎంపీలకు సీఎం రేవంత్‌రెడ్డి బీసీ రిజర్వేషన్లపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వనున్నట్లు కాంగ్రెస్ తెలంగాణ ఎంపీల ఫోరం కన్వీనర్ మల్లు రవి వెల్లడించారు. ఈ నెల 24 సాయంత్రం ఢిల్లీలోని ఇందిరా భవన్‌లో ఈ కార్యక్రమం ఉంటుదన్నారు. సోమవారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఎంపీలు రామసహాయం రఘురామి రెడ్డి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, గడ్డం వంశీకృష్ణలతో కలిసి విలేకరులతో మాట్లాడుతూ ఈ విషయం వెల్లడించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిచ్చోడిలా మాట్లాడుతున్నారని, సీఎం అనే కనీస మర్యాద లేకుండా రేవంత్ రెడ్డిపై స్థాయికి మించి విమర్శలు చేస్తున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి విషయంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను అధిష్టానం పరిశీలిస్తోందని చెప్పారు.



మంచి పుస్తకాలు చదవడానికి షరతు ఏమిటంటే, చెడ్డవి చదవకుండా ఉండటం: జీవితం చిన్నది!
- ఆర్థర్ షోపెన్‌హావర్

సాక్షి
మంగళవారం, 22 జూలై 2025

ఎన్నాళ్లీ జనహననం?

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌ను నోబెల్ శాంతి బహుమతికి సిఫార్సు చేసి ప్రపంచాన్ని నివ్వెరపరిచిన ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ గాజాలో కొనసాగిస్తున్న మారణకాండను ఆపదల్చుకోలేదని తాజా అమానుష ఉదంతం రుజువు చేస్తోంది. నిరాయుధ పౌరులనూ, మరీ ముఖ్యంగా స్త్రీలనూ, పిల్లలనూ హతమార్చటం ఇజ్రాయెల్ సైన్యానికి గత ఇరవైయ్యొక్క నెలలుగా రివాజుగా మారినా... ఆదివారం జరిగిన ఘోరం అత్యంత హేయమైనది. ఐక్యరాజ్యసమితి సంస్థ వరల్డ్ ఫుడ్ ప్రోగ్రాం (డబ్ల్యూఎఫ్‌పీ) ఆధ్వర్యాన ఆహార పంపిణీ మొదలుపెట్టబోతుండగా పౌరులను చుట్టుముట్టి శతఘ్నులతో, స్నైపర్లతో విరుచుకుపడి 90 మందికిపైగా పౌరుల్ని ఇజ్రాయెల్ సైన్యాలు పొట్టనబెట్టుకున్నాయి. 2023 అక్టోబర్ 7న తమ భూభాగంలోకి అడుగుపెట్టి 1,200 మంది పౌరులను కాల్చిచంపి, మరో 251 మందిని అపహరించిన మిలిటెంట్ సంస్థ హమాస్‌ను తుదముట్టించటానికి దాడులంటూ మొదట్లో చెప్పిన ఇజ్రాయెల్ ఆనాటినుంచి మారణకాండ కొనసాగిస్తూనే ఉంది. అధికారిక లెక్క ప్రకారం ఇప్పటికి 60,000 మంది పౌరులు మరణించారంటున్నా... అంతర్జాతీయ మేగజిన్ లాన్సెట్ నిరుడు జూన్‌లో ప్రకటించిన నివేదిక అది దాదాపు రెండు లక్షలంటోంది. మధ్యధరా సముద్ర తీరానవున్న గాజా స్ట్రిప్ అనే చిన్న ప్రాంతాన్ని వదిలి రావటానికి ససేమిరా అంటున్న స్థానికులను హతమార్చయినా ఖాళీ చేయాలని ఇజ్రాయెల్ ప్రయత్నిస్తోంది. ఆ ప్రాంతాన్ని సైతం తమ దేశంలో విలీనం చేసుకోవాలన్నది దాని ఆంతర్యం.

గతంలో పాలస్తీనాపై విరుచుకుపడినప్పుడల్లా ఐక్యరాజ్యసమితి చార్టర్‌లోని 51వ అధికరణాన్ని ఇజ్రాయెల్ ప్రస్తావించేది. సాయుధ మూకలు దాడులకు దిగితే ఆత్మరక్షణ చేసుకునే హక్కు దేశాలకుంటుందని ఆ అధికరణ చెబుతోంది. కానీ పాలస్తీనాలో తనదికాని భూభాగాన్ని ఆక్రమించుకుని, దాన్ని విస్తరించాలనుకున్నప్పుడల్లా ఇజ్రాయెల్ ఈ అధికరణను సాకుగా చూపుతోంది. హమాస్ సంస్థ దాడుల్ని ఎవరూ సమర్థించరు. ప్రజల కోసం పోరాటం చేస్తున్నామని చెబుతూ వారికే నష్టం కలిగించే ఆ సంస్థ చర్యల్ని మొదటినుంచీ అందరూ వ్యతిరేకిస్తున్నారు. కానీ గత 21 నెలలుగా ఇజ్రాయెల్ సాగిస్తున్న మారణకాండ మాటేమిటి? కేవలం 365 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంగల చిన్న ప్రాంతంపై యుద్ధ విమానాలతో, బాంబులతో, క్షిపణులతో దాడులు సాగించటం ఏ అంతర్జాతీయ న్యాయ సూత్రాల ప్రకారం సబబవుతుంది?

ఇజ్రాయెల్ మిత్ర దేశమన్న సాకుతో పెద్ద పెద్ద దేశాలే అది సాగిస్తున్న మారణకాండను విస్మరిస్తున్న తరుణంలో ఇటీవల 12 చిన్న దేశాలు కొలంబియాలోని బగోటాలో అత్యవసర శిఖరాగ్ర సదస్సు నిర్వహించి కార్యాచరణకు దిగబోతున్నట్టు ప్రకటించటం ఉన్నంతలో ఊరటనిచ్చే అంశం. బొలీవియా, కొలంబియా, క్యూబా, ఇండొనేసియా, ఇరాక్, లిబియా, మలేసియా, నమీబియా, నికరాగువా, ఒమన్, సెయింట్ విన్సెంట్, దక్షిణాఫ్రికాలు వీటిలో వున్నాయి. ఈ సమావేశానికి హాజరైనా, అది విడుదల చేసిన సంయుక్త ప్రకటనపై సంతకం చేయాలా వద్దా అన్న మీమాంసలో పడిన మరో 20 దేశాలు వచ్చే సెప్టెంబర్‌కల్లా ఏ సంగతీ తేల్చాలని సదస్సు గడువు విధించింది. ఇజ్రాయెల్‌పై దక్షిణాఫ్రికా ఇప్పటికే అంతర్జాతీయ నేర న్యాయస్థానంలో ఫిర్యాదు చేసింది. తనదికాని ఒక ప్రాంతంపై దండెత్తి, అక్కడి పౌరులు ఎటువైపు కదలాలో హుకుం జారీ చేసే ఇజ్రాయెల్ ఆగడం నాగరిక ప్రపంచ ఉనికికే పెను సవాలు. ఇజ్రాయెల్ ఇష్టారాజ్యంగా మానవ హననానికి పాల్పడుతుంటే చూస్తూ కూర్చున్న దేశాలకు కూడా రేపన్నరోజు ఇదే గతి పట్టదన్న గ్యారెంటీ ఏం లేదు. అందుకే అంతర్జాతీయ చట్టాలకూ, ఐక్యరాజ్యసమితి చార్టర్లకూ, మానవ హక్కులకూ ఇజ్రాయెల్ పెనుముప్పుగా మారిందని 12 దేశాల సదస్సు వ్యాఖ్యానించింది.

అయితే ఇజ్రాయెల్ ఏం చేసినా సమర్థించటం అలవాటైన అమెరికాను కాదని ఎన్ని దేశాలు ఈ సదస్సుతో గొంతు కలుపుతాయన్నది ప్రశ్నార్థకం. ఇప్పటికే 'ఇంకా' సంతకం చేయని దేశాలకు దూతల్ని పంపి 'దారికి తేవాలని' అమెరికా నిర్ణయించుకుంది. ఈ సదస్సుపై ట్రంప్ కారాలూ మిరియాలూ నూరుతున్నారు. రెండో ప్రపంచ యుద్ధానంతరం ఉనికిలోకొచ్చిన అంతర్జాతీయ సంస్థలు మొదటినుంచీ ద్వంద్వ ప్రమాణాలతో వ్యవహరిస్తున్నాయి. అందరికీ ఒకే న్యాయం భావన వదిలి సంపన్న దేశాలతో ఒక విధంగా, బడుగు దేశాలతో మరో రకంగా ప్రవర్తిస్తున్నాయి. అందువల్లే ఐక్యరాజ్యసమితి, భద్రతామండలి తదితర వేదికలపై ఇప్పుడెవరికీ పెద్దగా భ్రమలు లేవు. ఉన్నంతలో కొలంబియా సదస్సు ఒక ఆశాకిరణం.

ఆహార పంపిణీ కేంద్రాలు ఐక్యరాజ్యసమితి సంస్థల కనుసన్నల్లోనే వుంటున్నా అవి పాలస్తీనా ప్రజల పాలిట ఉచ్చుగా మారుతున్నాయి. ఆసుపత్రులు, శరణార్థ శిబిరాలు మాత్రమే కాదు.. చివరకు ఆహార పంపిణీ కేంద్రాలు సైతం ఇజ్రాయెల్ సైనికుల దాడులకు లక్ష్యమవుతున్నాయి. ఆకలితో నకనకలాడుతూ తిండికోసం జనం ఒకచోట గుమిగూడినప్పుడు కాల్చి చంపితే గాజాను ఖాళీ చేయించాలన్న తమ పథకం పారుతుందని ఇజ్రాయెల్ భావిస్తున్నట్టుంది. ఒకనాడు నాజీ జర్మనీ లక్షలాదిమంది యూదుల్ని చిత్రహింసల శిబిరాలకు చేర్చి అమానుషంగా అంతమొందించింది. ఆ తరహాలోనే పాలస్తీనాలో రఫా వంటి చోట్ల శిబిరాల నిర్మాణం మొదలైంది. మరో జనహననాన్ని నాగరిక ప్రపంచం సహిస్తుందా? ప్రపంచ ప్రజానీకం మేల్కొని తమ తమ దేశాల్లోని ప్రభుత్వాలపై ఒత్తిడి తెస్తే తప్ప ఇజ్రాయెల్ దురాగతాలు ఆగవు.

ఇథనాల్ ఎకానమీ మంచీ చెడూ!

విశ్లేషణ



అజిత్ రానాడే

ఇంధన వినియోగం పెరగకుండా ఇండియా ఆర్థిక పురోగతి సాధ్యపడదు. వచ్చే ఇరవై ఏళ్లలో జీడీపీ వృద్ధి రేటు ఎంత ఎగబాకుతుందో, ఇది కూడా అదే స్థాయిలో పెరుగుతుంది. ఇళ్లకు, ఫ్యాక్టరీలకు, ఆఫీసులకు విద్యుత్ సరఫరా పెంచాల్సి ఉంటుంది. రవాణా అవసరాలకు మరింత ఇంధనం సమకూర్చాలి. మూడొంతుల విద్యుదుత్పత్తికి బొగ్గే ఆధారం. మిగిలిన ఒక వంతు సోలార్, హైడ్రో, న్యూక్లియర్, బయోమాస్ మార్గాల ద్వారా ఉత్పత్తి అవుతోంది. ఈ ప్రత్యామ్నాయ ఇంధన వనరుల వ్యవస్థాపక సామర్థ్యం మొత్తం విద్యుత్ ఇన్‌స్టాల్డ్ కెపాసిటీలో 50 శాతానికి చేరినప్పటికీ, వాస్తవ ఉత్పత్తి 25 శాతం మించలేదు.

చేరుకున్న లక్ష్యం

బొగ్గు నిక్షేపాల్లో ఇండియా ప్రపంచంలోనే మూడో స్థానంలో ఉంది. అయినా 20 శాతం అవసరాలకు దిగుమతులపై ఆధారపడుతున్నాం. దీంతో విదేశీ బొగ్గు కోసం 20 బిలియన్ డాలర్లు (రూపాయల్లో దాదాపు 1.70 లక్షల కోట్లు) ఖర్చు పెట్టక తప్పడం లేదు. రవాణారంగం అవసరాలకు మరింత ఎక్కువగా దిగుమతులపై ఆధారపడాల్సి వస్తోంది. దేశవ్యాప్త ముడిచమురు వినియోగంలో 90 శాతం దిగుమతి అవుతోంది. గతేడాది 24.2కోట్ల టన్నుల క్రూడాయిల్ విదేశాల నుంచి వచ్చింది. అంతర్జాతీయ క్రూడ్ ధరలు బ్యారెల్ 65 నుంచి 85 డాలర్ల మధ్య ఉంటాయనుకుంటే, ఈ దిగుమతులపై 125 నుంచి 150 బిలియన్ డాలర్ల విదేశీ మారక ద్రవ్యం (రూ. 10 లక్షల కోట్ల నుంచి 13 లక్షల కోట్లు) వెచ్చించాల్సి వస్తుంది. శుభ వార్త ఏమిటంటే, పెట్రోలు, డీజిలు ఎగుమతులు ముడి చమురు దిగుమతుల కంటే వేగంగా పెరుగుతున్నాయి.

గడచిన ఏడాది, 6.5 కోట్ల టన్నుల పెట్రోలు, డీజిలు మంచి లాభాలతో ఎగుమతి అయ్యాయి. ఇండియా చమురు శుద్ధి సామర్థ్యం 20 శాతం పెరిగి 31 కోట్ల టన్నులకు చేరుకోబోతోంది. దేశీయ అవసరాల కంటే వేగంగా రిఫైనింగ్ కెపాసిటీ పెరుగుతోంది. పశ్చిమ మహారాష్ట్రలో నెలకొల్పాలని ప్రతిపాదించిన కొత్త రిఫైనరీ వల్ల ఉత్పత్తి, ఉపాధి, ఎగుమతులు ఇంకా ఊపందుకుంటాయి. భవిష్యత్తులో దేశీయ రిఫైనింగ్ కెపాసిటీలో నాలుగో వంతు ఎగుమతులకు అందుబాటులో ఉంటుంది. దీనివల్ల విదేశీ మారకద్రవ్యం ఆదా అవుతుంది. ఇది విశేషమే అయినప్పటికీ, మనం గుర్తు పెట్టుకోవలసిన విషయం ఒకటుంది. ప్రపంచం శిలాజ ఇంధనాల వినియోగాన్ని గణనీయంగా తగ్గించి వేస్తోంది. ఇండియా సైతం కర్బన ఉద్గారాల కాలుష్యాన్ని తగ్గించే ప్రధాన ధ్యేయంతో పెట్రోలు, డీజిలులో ఇథనాల్ బ్లెండింగ్‌ను పెంచేసింది. ఇండియాలో చెరకు నుంచి, మొక్కజొన్న, బియ్యం తదితర ఆహార ధాన్యాల నుంచి ఇథనాల్ ఉత్పత్తి చేస్తున్నారు. 2013లో 1.5 శాతంతో ప్రారంభించిన ఇథనాల్ బ్లెండింగ్ ఇప్పటికే 20 శాతం లక్ష్యాన్ని చేరుకుంది. ఈ వృద్ధి పెట్రోలు, డీజిలు వినియోగ వృద్ధి కంటే ఎక్కువగా ఉండటం సానుకూలాంశం.

ఇథనాల్ బ్లెండింగ్ ప్రోగ్రామ్ (ఈబీపీ) విజయవంతం అయ్యేందుకు వీలుగా ఇథనాల్ ఉత్పత్తిదారులకు ప్రత్యేక సబ్సిడీలు ఇస్తున్నారు. తక్కువ జీఎస్టీ రేట్ల వర్తింపు, రుణాలపై వడ్డీ రాయితీ వంటి పలు ప్రోత్సాహకాలు అమలు అవుతున్నాయి. ఇథనాల్ ఉత్పత్తి టెక్నాలజీలో ఇండియా ప్రపంచ అగ్రగామిగా అవతరించింది. ఇథనాల్ ఇంత శాతం కలపాలి అనే నిబంధన వల్ల ఆయిలు కంపెనీలు ఆ మేరకు ఉత్పత్తిదారుల నుంచి తప్పనిసరిగా దాన్ని కొనుగోలు చేసితీరాలి. కాబట్టి, ఇథనాల్‌కు మార్కెటింగ్ సమస్య లేదు. ప్రస్తుతం 1,810 కోట్ల లీటర్ల ఇన్‌స్టాల్డ్ కెపాసిటీ ఉండగా, ఇందులో చెరకు లేదా మొలాసిస్ ఆధారిత ప్లాంట్ల కెపాసిటీ 816 కోట్ల లీటర్లు. మిగిలిన దానిలో మొక్కజొన్నలు, బియ్యం సహా ధాన్యం నుండి ఇథనాల్ తయారు చేసే కెపాసిటీ 858 కోట్ల లీటర్లు. మరో 136 కోట్ల లీటర్ల కెపాసిటీ ప్లాంట్లు ఈ రెండు ముడి సరుకులనూ ఉపయోగించుకుని పనిచేస్తాయి.

నాలుగు ప్రయోజనాలు

నాలుగు ధ్యేయాలతో పదేళ్ల క్రితం ఈబీపీ అమలులోకి వచ్చింది. ప్రధానంగా ఒనగూరే ప్రయోజనం క్రూడాయిలు దిగుమతుల మీద ఆధారపడాల్సిన అవసరం తగ్గుతుంది. మరో మూడు ధ్యేయాలు ఉన్నాయి. అవి: విదేశీ మారక ద్రవ్యం ఆదా, కార్బన్ ఉద్గారాల తగ్గింపు, వ్యవసాయ ఉత్పత్తులకు గిరాకీ పెంపు. ఇప్పటికే 20 శాతం బ్లెండింగ్ లక్ష్యాన్ని చేరుకున్నందు వల్ల, ఈబీపీ తన ధ్యేయాల సాధనలో ఎంతవరకు సఫలీకృతమైందో పరిశీలిద్దాం.

ఈ కార్యక్రమం అమల్లోకి వచ్చి 2024 నాటికి పదేళ్లయ్యింది. 1. ఈ కాలంలో క్రూడాయిలు దిగుమతుల్లో 1.8 కోటి టన్నులు ఆదా చేయగలిగాం. కానీ ఇది మొత్తం దిగుమతిలో 0.8 శాతం మాత్రమే. 2. విదేశీమారక ద్రవ్యం పరంగా చూస్తే ఈ ఆదా విలువ దాదాపు రూ. 1.06 లక్షల కోట్లు. (రూపాయి సగటు మారకం రేటు ప్రకారం 10 బిలియన్ డాలర్లు). ఇది కూడా పదేళ్ల వ్యయంలో 0.5 శాతం కంటే తక్కువ. 3. ఇక కార్బన్ డై ఆక్సైడ్ ఉద్గారాలను ఈబీపీ 5.4 కోట్ల టన్నులు తగ్గించగలిగింది. శాతంలో చూస్తే 1 శాతం కంటే తక్కువ. 4. వ్యవసాయానికి సంబంధించినంత వరకు, ఈబీపీ ఫలితంగా రైతాంగం ఆదాయం పదేళ్లలో రూ. 1 లక్ష కోట్లు పెరిగింది.



◆ ఇథనాల్ బ్లెండింగ్ ప్రోగ్రామ్ (ఈజీపీ) ప్రారంభించి పదేళ్లు దాటింది. చమురు దిగుమతులపై ఆధారపడటం తగ్గించాలన్నది ఈ విధాన ప్రధాన ధ్యేయం. వ్యవసాయ పంటలకు గిరాకీ పెంచడం మరో ధ్యేయం. 2013లో 1.5 శాతంతో ప్రారంభించిన ఇథనాల్ బ్లెండింగ్ ఇప్పటికే 20 శాతం లక్ష్యాన్ని చేరుకుంది.

◆ బియ్యం, మొక్కజొన్న వంటి ధాన్యాలను ఈజీపీ కోసం తరలించడం వల్ల దేశంలో కోళ్ల దాణా పరిశ్రమ చిక్కుల్లో పడింది. మొక్కజొన్నల ఎగుమతిదారుగా ఉన్న ఇండియా దిగుమతిదారుగా మారింది.

అదే సమయంలో డిస్టిలరీలు మరో లక్ష కోట్లు అదనంగా గడించాయి.

శాతం ప్రకారం చూస్తే, చెరకు లేదా మొక్కజొన్న రైతుల వ్యవసాయ ఆదాయంలో వృద్ధి ఫర్వాలేదన్నట్లు ఉంది. ఈబీపీ వచ్చిన తర్వాత చెరకు మార్కెట్‌లో అస్థిరత తొలగిపోయింది. అప్పటి వరకు చెరకు అధికోత్పత్తి సమస్య ఉండేది. ధాన్యాల విషయానికి వస్తే, 50 లక్షల టన్నుల బియ్యాన్ని ఇథనాల్ తయారీకి మళ్లించాలని ఇటీవలే ప్రభుత్వం నిర్ణయించింది. ఇవి ప్రపంచ ఎగుమతుల్లో 9 శాతానికి, దేశీయ ఉత్పత్తిలో 4 శాతానికి, ప్రభుత్వ గోదాముల్లో మూలుగుతున్న నిల్వల్లో 10 శాతానికి సమానం.

దుష్పరిణామాలు

బియ్యం, మొక్కజొన్న వంటి ధాన్యాలను ఈబీపీ కోసం తరలించడం వల్ల ఉత్పన్నమైన దుష్పరిణామం ఏమిటంటే, దేశంలో కోళ్ల దాణా పరిశ్రమ చిక్కుల్లో పడింది. మొక్కజొన్నల నికర ఎగుమతిదారుగా ఉన్న ఇండియా నికర దిగుమతిదారుగా మారింది. ధాన్యంగా అమ్మేకంటే వాటితో ఇథనాల్ తయారు చేసి అమ్మడం డిస్టిలరీలకు లాభసాటిగా మారింది. ఈ ఇథనాల్ బ్లెండింగ్ కార్యక్రమం ఆహార ద్రవ్యోల్బణానికీ దారితీసింది. దీన్ని దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం దేశంలోని 81 కోట్ల మంది పేదలకు అయిదేసి కిలోల గోధుమలు లేదా బియ్యం ఉచితంగా సమకూరుస్తోంది. దీనికోసం, ప్రభుత్వం పెద్దఎత్తున ధాన్యం సేకరణ, పంపిణీలు చేపట్టవలసి వచ్చింది. ఇక ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు పెట్రోలు, డీజిలు అమ్మకాల మీద 50 శాతం పైనే ఎక్సయిజ్; ఇతర పన్నులు చెల్లిస్తున్నాయి. ఇథనాల్ మీద పన్నుల భారం నామమాత్రం కాబట్టి, ఇథనాల్ బ్లెండింగ్ వల్ల ఈ భారం వారికి గణనీయంగా తగ్గుతుంది. అందుకే పెట్రోలు, ఇథనాల్ సుంకాల మధ్య వ్యత్యాసాన్ని తగ్గించే అంశాన్ని పరిశీలించాలి. 20 శాతం బ్లెండింగు గొప్ప మైలురాయే. ఈ సందర్భంగా, ఆహార భద్రతపై దుష్ప్రభావాలు, ఆహార ద్రవ్యోల్బణం, రాయితీలు, ఆర్థిక భారం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈబీపీ విధానాన్ని పునఃసమీక్షించడం అవసరం.

వ్యాసకర్త ప్రముఖ ఆర్థికవేత్త

సోషల్ మీడియా

ఎందుకీ గొప్పలు?



2024లో యూఎస్ తలసరి జీడీపీ 85,000 డాలర్లు. దానిగురించి ఒక్క నాయకుడు గొప్పలు పోడు. అదే మన గొప్ప దేశంలో 95 శాతం మంది ఏడాదికి 1,100 డాలర్లతో బతుకుతారు. అయినా మనం మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ అని గొప్పలు చెబుతుంటారు.

– సబీర్ భాటియా, హాట్ మెయిల్ సృష్టికర్త

దారుణ వైఫల్యం



2006 నాటి ముంబయి రైలు బాంబు పేలుళ్లలో 209 మంది చనిపోయారు. 714 మంది వికలాంగులయ్యారు. ఇప్పుడు 19 ఏళ్ల తర్వాత, మొత్తం 12 మంది నిందితులకు వ్యతిరేకంగా కేసును నిరూపించడంలో ప్రాసిక్యూషన్ 'దారుణంగా విఫలమైంది' అని చెబుతూ బొంబాయి హైకోర్టు వారిని విడుదల చేసింది.

– దివ్య కుమార్ సోతి, కాలమిస్ట్

వాళ్లవి ప్రాణాలు కాదా?



డ్రూజు (సిరియాలోని ఒక మతశాఖ)లో కనీసం 2,000 మంది పౌరులు చనిపోయారు. అందులో అత్యధికులు వృద్ధులు, పిల్లలు. వారి సొంత ఇళ్లల్లోనే వారిని ఇస్లామిస్టులు చంపేశారు. అయినా 'నైతికత, మానవత్వపు సంరక్షకులం' అని చెప్పుకొనే వాళ్లనుంచి ఒక్క ఖండనా లేదు.

– హూస్సేన్ అబ్దుల్ హూస్సేన్, రిసెర్చ్ ఫెలో

ఇవీ ఎక్కువే!



రోజువారీ జీవన ఒత్తిళ్లలో, మనం ఏం వరంగా పొందామో మరిచిపోవడం సులభం. మనలో చాలామంది ఒక ఇల్లు, శుభ్రమైన నీళ్లు, కరెంట్, వేడి భోజనం, కుటుంబం, స్నేహితులు పంచే ప్రేమను కలిగివున్నాం. ఇంతకంటే ఎక్కువ ఆశించడంలో తప్పులేదు. కానీ మనకు ఇప్పటికే ఉన్నవి గుర్తించడం కూడా ముఖ్యమే.

– వెక్స్ కింగ్, రచయిత

టైగర్-పాండా అంటే?



అవమానకరంగా ఏనుగును ఇండియాకు సంకేతంగా వాడుతున్న చైనీస్ దుష్ప్రచారాన్నే పాశ్చాత్య మీడియా ప్రతిధ్వనిస్తోంది. ఇండియా జాతీయ జంతువు పులి. కావాలంటే దాన్ని టైగర్–డ్రాగన్ ట్యాంగో అనండి. టైగర్–పాండా డ్యాన్స్ అంటే మరీ మంచిది.

– సనా హాష్మీ, ఫెలో

ఇన్ బాక్స్

ఎరువులు అందించలేరా?

'రాష్ట్రంలో యూరియా కృత్రిమ కొరత సృష్టించినా, అధిక ధరలకు విక్రయించినా, ఇతర ఎరువులతో ముడిపెట్టి అమ్మేందుకు ప్రయత్నించినా డీలర్లపై కఠిన చర్యలు తీసుకోవాలి. రాష్ట్రంలో రైతుల అవసరాల మేరకు నిల్వలున్నాయి. ఏ డీలరైనా, సొసైటీ నిర్వాహకులైనా యూరియా బస్తాను నిర్ణీత ధరలకే ఇతర ఎరువులతో ఎలాంటి లింక్ లేకుండా విక్రయించేలా ఆదేశించాం' అని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చాలాసార్లు ప్రకటించారు.

కానీ, తెలంగాణలో యూరియా, డీఏపీలు సరిగా లభించటం లేదు. మార్కెట్‌లో లభించినా అధిక ధరలనూ, వేరే ఎరువులు కొనాలనే ఒత్తిడినీ రైతాంగం ఎదుర్కొంటున్నారు. అందుకే పలు జిల్లాల్లో రైతులు రోడ్డెక్కాల్సిన పరిస్థితి తలెత్తింది. రాష్ట్ర ప్రభుత్వమేమో ఒక సారి 'అవసరం మేరకు నిల్వలున్నాయ'నీ, మరోసారి 'కేంద్రం నెలవారీ కోటా ప్రకారం పంపడం లేద'నీ ప్రకటిస్తోంది. ఇలా రైతులను గందరగోళం చేయకుండా వాస్తవ పరిస్థితి చెప్పాలి. కేంద్రం నుండి రావాల్సిన కోటా ప్రకారం ఎరువులు అందటం లేదనేది నిజమే. ఇందుకు తెలంగాణ ప్రభుత్వానికి రైతుల్లో చెడ్డపేరు తేవడం, సబ్సిడీ భారం తగ్గించుకోవటం అనేవి కారణాలు కావచ్చు.

ఖరీఫ్ సీజన్‌లో మొత్తం ఎరువులు 16.70 లక్షల టన్నులు అవసరమని తెలంగాణ వ్యవసాయ శాఖ అంచనా వేసింది. వీటిని కేంద్రం అందించటంలో నెలవారీగా తీవ్రమైన జాప్యం చేస్తున్నది. ఇదే అదునుగా ప్రైవేట్ వ్యాపారులు 45 కిలోల సబ్సిడీ యూరియా ఎరువు బస్తా రూ. 268 నుండి రూ. 268.50 వరకు ఉండగా, రూ. 300 నుండి 325 వరకు అమ్మి లాభపడుతున్నారు. ఈ పరిస్థితి సన్న రైతు తీవ్రంగా నష్టపోవడానికి కారణమవుతోంది. ఎరువుల కొరత వల్ల పంట దిగుబడిపై ప్రతికూలత ఉంటుంది. ఇది ఆహార భద్రతా సమస్యకూ, సంక్షోభానికీ దారితీస్తుంది. అందుకే రైతులు సమస్యల పరిష్కారానికి రాష్ట్రవ్యాప్త ఆందోళనకు దిగుతున్నారు.

– కెచ్చెల రంగారెడ్డి
అఖిల భారత ఐక్య రైతు సంఘం తెలంగాణ అధ్యక్షుడు

ఈ ఆర్డినెన్స్ రాజ్యాంగబద్ధమేనా?

అభిప్రాయం



మాడభూషి శ్రీధర్

ప్రభుత్వ పెద్దలూ, ప్రభుత్వాలను నడిపే రాజకీయ పార్టీలూ ఒక నిర్ణయం తీసుకున్నాయంటే దాని వెనుక ఏదో మతలబు ఉంటుంది అనే అనుమానం వ్యక్తం చేయ వలసిన పరిస్థితుల్లో మనం ఉన్నాం. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు పంచాయితీ ఎన్నికల్లో 42 శాతం సీట్లు కేటాయించే ఆర్డినెన్స్‌ను జారీ చేయడాన్ని అందుకే అనుమానించాల్సి వస్తోంది. బీసీలకు రాజకీయ రిజర్వేషన్లపై ఇప్పటి దాకా మౌనం పాటించిన ప్రభుత్వం హఠాత్తుగా పంచాయితీ ఎన్నికలకు ముందు, ఆర్డినెన్స్ జారీ చేయడం పలు అనుమానాలకు దారి తీస్తోంది.

అసలు ఇది రాజ్యాంగ విరుద్ధమనే విషయాన్ని ముందు ప్రజలు తెలుసుకోవాలి. ఈ ఆర్డినెన్స్ జారీ చేయడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం సామాజిక న్యాయానికి ప్రయత్నిస్తున్నదని అర్థం చేసుకోవాలా? కావాలనే రాజకీయ చాణక్యంతో చేసిన వ్యూహ రచనా? సుప్రీంకోర్టు మొత్తం రిజర్వేషన్ల కోటా 50% మించి ఉండరాదనే పరిమితీ, పలు రాజ్యాంగ నిబంధనలు ఇటువంటి ఆర్డినెన్స్‌ల జారీ సరికాదనీ సూచిస్తున్నా ప్రభుత్వం ఈ నిర్ణయం ఎందుకు తీసుకున్నట్లు? ప్రజలు అమాయకులని ప్రభుత్వం భావిస్తున్నదా?

కె. కృష్ణమూర్తి అండ్ అదర్స్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా అండ్ అనదర్ (2010) తీర్పులో ట్రిపుల్ టెస్ట్ ప్రిన్సిపుల్ చెప్పిన సుప్రీంకోర్టు... వికాస్ కిశన్‌రావు గవాలి వర్సెస్ మహారాష్ట్ర ప్రభుత్వం (2021) కేసులో ముఖ్యమైన ప్రమాణాలను నిర్దేశించింది.

ట్రిపుల్ టెస్ట్ ప్రిన్సిపుల్ స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్‌కు సంబంధించినది. మరీ ముఖ్యంగా ఇతర వెనుకబడిన తరగతుల (ఓబీసీ) రిజర్వేషన్‌కు సంబంధించినది. ఇందులో మూడు అంశాలు ఉన్నాయి. ఒక నిర్ధారిత స్థానిక సంస్థ పరిధిలో ఉన్న ఓబీసీల వెనుకబాటు తనాన్ని శాస్త్రీయంగా అధ్యయనం చేయడానికి ఒక కమిషన్‌ను నియమించాలి. కమిషన్ రికమండేషన్లను పరిగణనలోకి తీసుకుని అవసరమైన రిజర్వేషన్ నిష్పత్తిని నిర్ణయించడం రెండోది. రిజర్వేషన్ల మొత్తం పరిమితి 50 శాతానికి మించకుండా చూడటం మూడోది. అయితే అత్యవసర పరిస్థితులలో మాత్రమే, స్పష్టమైన ఆధారాలు, సంఖ్యా పరమైన డేటా ఉంటే మినహాయింపు ఇవ్వవచ్చు.

తెలంగాణ ప్రభుత్వం 2024లో నిర్వహించిన కులగణనలో బీసీ జనాభా 56% అని తెలిపినా, అధ్యయన నివేదికను గోప్యంగా ఉంచడం అనుమానాలకు కారణమైంది. రెండు ముఖ్యమైన బిల్లులు (విద్య, ఉద్యోగాల్లో బీసీ రిజర్వేషన్లు) రాష్ట్ర



◆ తెలంగాణ ప్రభుత్వం డేటా గోప్యంగా ఉంచడం, అత్యవసర పరిస్థితి ఆధారాలు చూపక పోవడం వల్ల ఈ నిర్ణయం న్యాయ పరంగా బలహీనం అయిపోతున్నది. బీసీ సాధికారత తప్పనిసరి అయినా, రాజ్యాంగ పరిమితులు, పారదర్శకతను విస్మరించి తీసుకున్న ఈ నిర్ణయం సమస్యాత్మకం.

శాసనసభ ఆమోదించింది. వాటిని రాష్ట్రపతికి ఆమోదం కోసం పంపించారు కూడా. కానీ రాష్ట్రపతి ఏం చేస్తారో చెప్పలేం. ఎందుకంటే తమిళనాడు చట్టాలు చేసిన బిల్లులను, ఆర్డినెన్సులను ధర్మాసనాలు విని, నిర్ణయించి ఈ విధంగా వేధించకండి అని స్పష్టం చేశాయి. అయినా రాష్ట్రపతికి సలహా కోసం మళ్లీ సుప్రీంకోర్టు పెద్దలకు పంపించడం మరో చాణక్యమే.

మధ్యాహ్నం 3 గంటలకు శాసనసభను ప్రోరోగ్ చేసి, సాయంత్రం గవర్నర్‌కు ఆర్డినెన్స్ పంపించడం అనేది రాజ్యాంగానికి వ్యతిరేకంగా చేసే ప్రయత్నంగా చూడాలి. రాజ్యాంగంలోని ఆర్టికల్ 213(1)(ఏ) ప్రకారం, రాష్ట్రపతి అనుమతి అవసరమైన అంశంపై గవర్నర్ ఆర్డినెన్స్ జారీ చేయలేరు. కాబట్టి, ఈ ఆర్డినెన్స్ రాజ్యాంగ విరుద్ధమయ్యే అవకాశాలు బోలెడు.

ఇంద్రా సహానీ కేసు (1992)లో సుప్రీంకోర్టు 50% రిజర్వేషన్ పరిమితి విధించింది. ఇదే చరిత్రలో మండల్ కమిషన్ కేసుగా ప్రసిద్ధం. కృష్ణమూర్తి, గవాలి కేసుల్లో ఇదే నియమాన్ని పునరుద్ఘాటించింది. మరాఠా రిజర్వేషన్ కేసు (2021)లో కోర్టు ఇలా చెప్పింది: '50 శాతానికి మించటం అనేది నియమం కాదు. అతీ తమైన పరిస్థితుల్లో మాత్రమే మినహాయింపు.' దీన్ని ముఖ్యమంత్రి, మంత్రులు, రాజకీయ నాయకులు అర్థం చేసుకోవాలి.

సర్వే వివరాలు దాయడం ఎందుకు?

తెలంగాణ ప్రభుత్వం డేటా గోప్యంగా ఉంచడం, అత్యవసర పరిస్థితి ఆధారాలు చూపకపోవడం వల్ల ఈ నిర్ణయం న్యాయపరంగా బలహీనం అయిపోతున్నది. ఇప్పుడు ఈ నిర్ణయం తీసుకోవడానికి రానున్న పంచాయితీ ఎన్నికలు కారణం కావచ్చు. బీసీ ఓటుబ్యాంక్‌ను ఆకట్టుకోవడానికి ఇదొక ఎత్తుగడై ఉంటుందనే అను మానం. బీసీ సాధికారత తప్పనిసరి అయినా, రాజ్యాంగ పరిమితులు, పారదర్శకతను విస్మరించి తీసుకున్న ఈ నిర్ణయం సమస్యాత్మకం.

ఆర్టికల్స్ 243డి (6), 243టి (6) అనేవి స్థానిక సంస్థల రిజర్వేషన్ విధానాన్ని స్పష్టంగా నిర్ధారించాయి. అయితే విద్యా, ఉద్యోగ రంగాల్లో వెనుకబాటు వేరు, రాజకీయ వెనుకబాటు వేరు అని ఇవి స్పష్టం చేశాయి. కాబట్టి వీటిని ఉటంకించి సుప్రీం కోర్టు న్యాయవాదులు ఈ కేసు సుప్రీంకోర్టు ముందుకు వెళితే ఓ ఆట ఆడుకుంటారు. కావాలని కోర్టులో ఓడిపోయే విధంగా చట్టాలు, ఆర్డినెన్సులు చేయడం అంటే కాల క్షేపం చేయడమే తప్ప మరేమీ కాదు.

చివరకు మిగిలేది, తగిలేది ఒకే ప్రశ్న: సామాజిక న్యాయం పేరుతో రాజ్యాంగ నియమాలను అతిక్రమించవచ్చా? సమాధానం కోర్టుల తీర్పులో తెలుస్తుంది. రాజ్యాంగం పట్ల గౌరవం కోల్పోతే, ప్రజాస్వామ్య విశ్వసనీయత దెబ్బ తింటుంది.

వ్యాసకర్త మహేంద్ర యూనివర్సిటీ 'స్కూల్ ఆఫ్ లా' ప్రొఫెసర్

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి.
ఈ-మెయిల్: editpage@sakshi.com ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

ప్రశాంతంగా...



అప్పటివరకూ సింహంలా ఉన్న మనిషి సమస్య అనగానే తెగ కలవరపడి పోతాడు. ఆ సమయంలో ఎలుకై పోతాడు. ఎలుక సాధారణంగా తిరుగాడు తున్నప్పుడు, చెక్క వస్తువులను కొరికి రంధ్రాలు చేసి నాశనం చేస్తుంది. కానీ అదే ఎలుక దాని కోసం ఏర్పాటు చేసిన చెక్క ఉచ్చులో చిక్కు కున్నప్పుడు, అందులో నుంచి ఎలా తప్పించుకోవాలో అనే భయంతో ఆ బోనులోనే అటూ ఇటూ తిరుగుతుంది. కానీ తానున్నది చెక్క బోనే కనుక దానికి రంధ్రం చేసి బయట పడదామనే ఆలోచనే ఎలుకకి రాదు. అసలు బోనులో పడటంతోనే దాని స్వభావం మర్చిపోయి బిక్కుబిక్కుమంటూ ప్రవర్తిస్తుంది.

మనిషికి కూడా అనుకోని ఉపద్రవం ఎదురైనప్పుడు ఎలుక లాగానే ఆలోచనా శక్తి కోల్పోతాడు. అప్పటి వరకూ ఇతరులకు సలహాలు సూచనలు చేసిన మనిషే తనకంటూ ఆపద వచ్చినప్పుడు అనూహ్యంగా నలిగిపోతాడు. సవ్యంగా ఆలోచించలేడు. తత్తరపాటుతో తప్పులు చేసి సమస్యను మరింత క్లిష్టతరం చేసుకుంటాడు. ఎవరూ తనను రక్షించలేరా అని కుమిలిపోతాడు. స్థిమితంగా ఆలోచించి ఆచితూచి అడుగేస్తే బయటపడిపోవచ్చనే ధ్యాసే రాదు. అప్పుడు మనిషికి కుడితిలో పడిన ఎలుకలా ప్రవర్తిస్తాడు.

మనిషి మెదడైనా, ఎలుక మెదడైనా ఆందోళనలో ఉన్నప్పుడు పనిచేయదు. చాలాసార్లు అనేక సమస్యల నుండి ఎలా బయటపడాలో తెలిసినప్పటికీ, ఆందోళన వల్ల ఒక వ్యక్తి తన ప్రాణాలను కూడా కోల్పోతాడు. కానీ ఈ ఆపత్కాలంలోనే నిలకడగా ఉండటాన్ని అలవరచుకుంటే సమస్యకు పరిష్కార మార్గం తప్పకుండా కనిపిస్తుంది. ముఖ్యంగా భగవన్నామ స్మరణ ద్వారా మనసును ప్రశాంతంగా ఉంచుకుని విచక్షణతో సమస్యకు తగిన పరిష్కారం ఆలోచిస్తే... తప్పకుండా మనిషి విపత్తుల నుంచి బయటపడతాడు.

– యామిజాల జగదీశ్

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, గ్రీష్మ ఋతువు, ఆషాఢ మాసం, **తిథి:** బ.ద్వాదశి ఉ.6.18 వరకు, తదుపరి త్రయోదశి తె.4.09 వరకు (తెల్లవారితే బుధవారం), **నక్షత్రం:** మృగశిర రా.7.42 వరకు, తదుపరి ఆరుద్ర, **వర్జ్యం:** రా.3.43 నుండి 5.15 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.12 నుండి 9.04 వరకు, తదుపరి రా.10.59 నుండి 11.43 వరకు, **అమృతఘడియలు:** ప.11.20 నుండి 12.56 వరకు; **రాహుకాలం:** ప.3.00 నుండి 4.30 వరకు, **యమగండం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **సూర్యోదయం:** 5.39, **సూర్యాస్తమయం:** 6.33.

క్లుప్తంగా...

స్పృహ తప్పిన డ్రైవర్.. అదుపు తప్పిన ఆర్టీసీ బస్సు

- చాకచక్యంగా వ్యవహరించి పెద్ద ప్రమాదం తప్పించిన కండక్టర్



ద్విచక్రవాహనాలను ఢీకొన్న బస్సు

బాన్సువాడ రూరల్: ఆర్టీసీ బస్సు నడుపుతూ డ్రైవర్ స్పృహ తప్పి పడిపోవడంతో కండక్టర్ చాకచక్యంగా వ్యవహరించి బ్రేక్ వేసి పెద్ద ప్రమాదం తప్పించాడు. సోమవారం ఉదయం సంగారెడ్డి నుంచి నిజామాబాద్ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు కామారెడ్డి జిల్లా బాన్సువాడలో అదుపుతప్పింది. డ్రైవర్ నిఖిల్ కళ్లు తిరిగి స్పృహతప్పడంతో ఒక్కసారిగా బ్యానెట్‌పై పడిపోయాడు. బస్సు అదుపు తప్పడాన్ని గమనించిన కండక్టర్ గౌస్ అప్రమత్తమై గేర్ న్యూట్రల్ లోకి మార్చి బ్రేక్ వేశాడు. బస్సు ఎదురుగా ఉన్న 8 ద్విచక్ర వాహనాలు దెబ్బతిన్నాయి. బస్సులో 30 మంది ప్రయాణికులు ఉన్నారు. పెను ప్రమాదం తప్పడంతో వారంతా ఊపిరి పీల్చుకున్నారు.

కల్తీ మద్యం పట్టివేత



నిందితులతో ఎక్సైజ్, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది

హుజూర్‌నగర్: సూర్యాపేట జిల్లా మేళ్లచెరువు మండలం రామాపురం గ్రామంలో కల్తీ మద్యం నిల్వ ఉంచిన షెడ్‌పై సోమవారం మధ్యాహ్నం స్టేట్ ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది, హుజూర్‌నగర్ ఎక్సైజ్ పోలీసులు సంయుక్తంగా దాడి చేసి ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. స్టేట్ ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సూపరింటెండెంట్ నంద్యాల అంజిరెడ్డి, స్థానిక ఎక్సైజ్ సీఐ నాగార్జునరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. రామాపురం గ్రామానికి చెందిన తోట శివశంకర్, అదే గ్రామానికి చెందిన సూర్యప్రకాశ్ కలిసి గ్రామ శివారులోని షెడ్‌లో 600 లీటర్ల స్పిరిట్‌ను నిల్వ చేశారు. దానిని ఖాళీ బాటిళ్లలో నింపి నకిలీ లేబుళ్లు అంటించి విక్రయిస్తున్నారు. స్టేట్ ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది, స్థానిక ఎక్సైజ్ సిబ్బంది సంయుక్తంగా దాడులు చేసి 600 లీటర్ల స్పిరిట్, బాటిళ్లలో నింపిన 240 లీటర్ల కల్తీ మద్యం, నకిలీ లేబుళ్లు, కారు స్వాధీనం చేసుకున్నారు. శివశంకర్, సూర్యప్రకాశ్, ఏపీలోని పల్నాడు జిల్లా దుర్గికి చెందిన శ్రీరాం మహేశ్‌తో పాటు వీరికి లేబుళ్లు, క్యాప్స్ సప్లై చేసిన హైదరాబాద్‌కు చెందిన రూతుల శ్రీనివాస్, శ్రీకృష్ణా ఫార్మాకు చెందిన శివచరణ్‌సింగ్‌పై కేసు నమోదు చేశారు. శ్రీరాం మహేశ్, సూర్యప్రకాశ్‌ను అరెస్ట్ చేసి రిమాండ్ తరలించినట్లు పేర్కొన్నారు.

ఇన్‌ఫార్మర్ల నెపంతో ఇద్దరు గిరిజనుల హతం

చర్ల: పోలీస్ ఇన్‌ఫార్మర్లుగా వ్యవహరిస్తున్నారనే నెపంతో ఇద్దరు గిరిజనులను మావోయిస్టులు దారుణంగా హతమార్చారు. ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో ఆదివారం అర్ధరాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. బీజాపూర్ జిల్లా తెర్రెం గ్రామంలోని మంగులు కురసం (55) ఇంటికి వేట కొడవళ్లు, గొడ్డళ్లతో వచ్చిన ఐదుగురు మావోయిస్టులు ఆయనను నిద్ర లేపి మాట్లాడే పనిఉందని బయటకు తీసుకెళ్లారు. ఇదే సమ యాన చుట్వాయి గ్రామంలో కవాసి జోగా (55) ఇంటికి వెళ్లిన మరికొందరు మావోయిస్టులు జోగాను కూడా నిద్రలేపి బయటకు తీసుకొచ్చారు. వీరిద్దరినీ ఆయా గ్రామాల శివారు అటవీ ప్రాంతాలకు తీసుకెళ్లి వేట కొడవళ్లు, గొడ్డళ్లతో నరికి హతమార్చారు. పోలీసు ఇన్‌ఫార్మర్లుగా వ్యవహరిస్తున్నందునే వీరిని శిక్షించామని మృతదేహాల వద్ద లేఖలు వదిలారు.కాగా గత 25 రోజుల్లో ఇన్‌ఫార్మర్లుగా అనుమానిస్తూ మావోయిస్టులు 10 మందిని హతమార్చారు.

రీజినల్ రింగురోడ్డు, రైలు..
భూ సర్దుబాటు ఎలా?

తాజాగా రైల్వే శాఖ మంత్రి అశ్వినీవైష్ణవ్ ఆరా

- కొత్తగా భూసేకరణ బదులు రీజినల్ రింగురోడ్డుకు ప్రతిపాదించిన భూమిలో వాటా కోసం ప్రతిపాదన
- 30 మీటర్లు ఔటర్ రింగు రైలుకు ఇవ్వాలని సూచన
- మిగతా 70 మీటర్లలో రింగురోడ్డు అసాధ్యమంటున్న ఎన్‌హెచ్‌ఏఐ
- సాధ్యం కావాలంటే రోడ్డు డిజైన్‌ను పూర్తిగా మార్చాల్సిన పరిస్థితి
- అందుకు రూ.10 వేల కోట్లకు పైగా అదనపు వ్యయం



సాక్షి, హైదరాబాద్: రీజినల్ రింగురోడ్డు–ఔటర్ రింగు రైలు.. ఇప్పుడు ఈ రెండు ప్రాజెక్టుల నిర్మాణానికి కావాల్సిన భూమిని ఎలా సర్దుబాటు చేయాలో తెలియని సంకట పరిస్థితి కేంద్రానికి ఎదురైంది. రీజినల్ రింగురోడ్డుకు భూసేకరణ ప్రక్రియ దాదాపు పూర్తయ్యింది. రీజినల్ రింగురోడ్డును ఆసరా చేసుకొని దాని చుట్టూ నిర్మించాల్సిన ఔటర్ రింగురైలుకు ఇప్పటి వరకు భూసేకరణ జరగలేదు. రీజినల్ రింగురోడ్డుకు నాలుగైదు కిలోమీటర్ల దూరంలో ప్రతిపాదిస్తూ గత జనవరిలోనే రైల్వే శాఖ అలైన్‌మెంట్‌ను సూత్రప్రాయంగా ఖరారు చేసింది. రింగురోడ్డు దక్షిణ భాగం అలైన్‌మెంట్ ఖరారు కానందున, ఔటర్ రింగురైలు అలైన్‌మెంట్ ఎన్ని కిలోమీటర్లు వస్తుందో ఇప్పుడే తెలియని పరిస్థితి నెలకొంది. దక్షిణ రింగు అలైన్‌మెంట్ ఖరారైతే తప్ప ఔటర్ రింగురైలు నిడివి తేలదు. ఇది ఇలా ఉంటే..అసలు సమస్య ఇప్పుడు నెలకొంది. ఔటర్ రింగురైలుకు భూసేకరణే పెద్ద సమస్యగా మారింది. రీజినల్ రింగురోడ్డు కోసం భూసేకరణ చేస్తున్నప్పుడే రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురైంది. ఈ తరుణంలో కొత్తగా ఔటర్ రింగురైలు కోసం భూములు సేకరించటం అతిపెద్ద సవాల్‌గా మారింది. భూసేకరణకు ఎట్టిపరిస్థితుల్లో అంగీకరించబోమని రైతులు తేల్చి చెబుతున్నారు. ఈ విషయం నేరుగా రైల్వే శాఖ మంత్రి అశ్వినీవైష్ణవ్ దృష్టికి వెళ్లింది. జనం అడ్డుకుంటే ఆ ప్రాజెక్టే నిలిచిపోయే పరిస్థితి ఉందని అధికారుల నుంచి కూడా అభిప్రాయం వ్యక్తమైంది. దీంతో రీజినల్ రింగురోడ్డు కోసం సేకరించిన భూమిలోనే రైల్వే లైన్‌కు కొంత భూమిని కేటాయించాలన్న అంశాన్ని రైల్వే శాఖ ప్రతిపాదిస్తోంది.

క్రాసింగ్స్ ఎలా..?

ఇటు రోడ్డు–అటు రైలు కలిసి సాగితే.. వేర్వేరు ప్రాంతాల్లో జాతీయ, రాష్ట్ర రహదారులతో రీజినల్ రింగురోడ్డుకు అనుసంధానం చేయాల్సిన ప్రాంతాల్లో రైల్వే ట్రాక్ అడ్డుగా మారుతుంది. రైల్వే లైన్లను ఔటర్ రింగురైలుతో అనుసంధానించే చోట్ల రోడ్డు అడ్డుగా మారుతుంది. అలాంటి చోట్ల రోడ్డు–రైలు ఏదో ఒకటి ఎలివేటెడ్ పద్ధతిలో నిర్మించాల్సి ఉంటుంది. ఇందుకు కనీసం మరో రూ.2 వేల కోట్లకుపైగా అదనపు వ్యయం అవుతుంది. ఇక 25కుపైగా రైల్వే స్టేషన్లు నిర్మించాల్సి ఉంటుంది. ఊళ్లున్న చోటనే స్టేషన్లు ఉండాలి కాబట్టి ఆయా ప్రాంతాల్లో అదనంగా భూమిని సేకరించాల్సిందే. దానికీ అదనపు ఖర్చు తప్పదు. వెరసి, భూసేకరణ కంటే ఈ అదనపు ఖర్చు ఎక్కువ అయ్యేలా కనిపిస్తోంది. దీంతో, ఇప్పుడు ఈ సవాల్‌ను అధిగమించటం కేంద్ర ప్రభుత్వానికి పెద్ద సమస్యగానే మారింది. భూ పరిహారం మొత్తాన్ని భారీగా పెంచి ఇవ్వటం ద్వారా భూసేకరణకు ప్రజలను ఒప్పించి పూర్తి రైల్వేలైన్‌కు కావాల్సిన భూమిని సేకరిస్తారా, రిండురోడ్డుకు సేకరించిన భూమిలోనే భారీ వ్యయం చేసి రైల్వే లైనుకు సర్దుబాటు చేస్తారా అన్నది తేలాల్సి ఉంది.

70 మీటర్లు రింగురోడ్డుకు..
30 మీటర్లు రైల్వే లైన్‌కు..


రీజినల్ రింగురోడ్డును ఎనిమిది లేన్లుగా నిర్మించాల్సి ఉన్నందున.. వంద మీటర్ల వెడల్పుతో భూమిని సేకరిస్తున్నారు. ఇందులో రైల్వేకు 30 మీటర్లు ఇవ్వాల్సి వస్తే, మిగతా 70 మీటర్లలో రోడ్డు నిర్మాణం ఇబ్బందిగా ఉంటుందని ఎన్‌హెచ్‌ఏఐ అంటోంది. ఒక్కో లేన్ 3.75 మీటర్ల వెడల్పుతో ఉంటుంది. ఎనిమిది వరుసలకు గాను 30 మీటర్ల వెడల్పుతో భూమి అవసరం. మధ్యలో సెంట్రల్ మీడియన్‌ను 15 మీటర్లుగా ఖరారు చేశారు. స్తంభాల కోసం అటూఇటూ కలిపి 5 మీటర్లు అవసరం. వెరసి 50 మీటర్లు రోడ్డుకు అవసరమవుతుంది. ఇక, రింగురోడ్డు 6 మీటర్ల ఎత్తుతో నిర్మితమవుతుంది. అప్పుడు అంత ఎత్తు నుంచి కట్టను వాలుగా నిర్మిస్తారు. ఎత్తు ఎంత ఉంటే దానికి రెట్టింపు వాలు (స్లోప్) అవసరం. అంటే ఒక్కో వైపు 12 మీటర్ల స్లోప్.. రెండు వైపులా కలిపి 24 మీటర్ల స్థలం స్లోప్‌నకు కావాల్సి ఉంటుంది. ఎక్కడైనా రోడ్డు ఎత్తు మరింత పెరిగితే, అంతమేర స్లోప్ కూడా పెరుగుతుంది. అప్పుడు ఇంకా ఎక్కువ స్థలం కావాలి. వెరసి 70 మీటర్ల స్థలం సరిపోదు. దీనికి మిగిలిన ఒకేఒక పరిష్కారం.. స్లోప్‌గా రోడ్డు కట్టను నిర్మించకుండా, రిటైనింగ్ వాల్ పద్ధతిలో స్లోప్ లేకుండా వంతెన తరహాలో నిర్మించాల్సి ఉంటుంది. అది భారీ ఖర్చుతో కూడుకున్న వ్యవహారం. రోడ్డు నిడివి యావత్తు వంతెన తరహాలో ఉంటుంది. అది మొత్తం ప్రాజెక్టు వ్యయాన్ని కనీసం 20 శాతానికి పెంచుతుంది. అప్పుడు రీజినల్ రింగురోడ్డు వ్యయం కనీసం రూ.8 వేల కోట్లు మేర పెరుగుతుంది.

రెక్కీ చేసి.. పక్కా స్కెచ్ గీసి..

- సూర్యాపేట బంగారు షాపులో భారీ చోరీ
- 8 కిలోల బంగారు ఆభరణాలు, రూ.18 లక్షల నగదు అపహరణ
- గ్యాస్‌కట్టర్లతో లాకర్లు ధ్వంసం
- సీసీ కెమెరాలు మూసేసి దొంగతనం



దొంగలు అక్కడే వదిలివెళ్లిన గ్యాస్ సిలిండర్లు, కట్టర్



బాత్రూం గోడకు రంధ్రం చేసిన దొంగలు

సూర్యాపేటటౌన్: ఆదివారం అర్ధరాత్రి సూర్యాపేట జిల్లా కేంద్రంలోని జ్యువెలరీ షాపులో భారీ దోపిడీ జరిగింది. 8 కిలోల బంగారం, ఆభరణాల తోపాటు రూ.18 లక్షల నగదును దొంగలు అపహరించారు. చోరీకి గురైన బంగారు ఆభరణాల విలువ రూ.7.20 కోట్లు ఉంటుందని యజమాని అంటున్నారు. సూర్యాపేటకు చెందిన తెడ్ల కిషోర్ పట్టణంలోని ఎంజీ రోడ్డులో శ్రీ సాయి సంతోషి జ్యువెలరీ షాప్ నిర్వహిస్తున్నాడు. కిషోర్ సోమవారం ఉదయం 9 గంటలకు దుకాణం తెరిచి లాకర్ గదిలోకి వెళ్లి చూడగా గోడకు పెద్ద రంధ్రం చేసి ఉంది. లాకర్ రూంకు ఉన్న షట్టర్ కట్ చేసి ఉంది. దీంతో దొంగతనం జరిగినట్టు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చాడు.

తెలిసినవారా.. ప్రొఫెషనల్ ముఠానా?

దొంగలు పక్కా స్కెచ్‌తో బంగారం షాపులో దొంగతనానికి పాల్పడ్డారు. బంగారం దుకాణం మెయిన్ రోడ్డుకు ఉంటుంది. దొంగలు షాపు వెనకాల ఉన్న ఖాళీ స్థలంలో నుంచి వచ్చి బాత్రూంలోకి వెళ్లి తలుపును కట్ చేసి అందులో నుంచి లాకర్ రూంలోకి వెళ్లారు. లాకర్ రూం షట్టర్‌ను గ్యాస్ కట్టర్‌తో తొలగించి లోనికి ప్రవేశించి బీరువాలో ఉన్న 8 కిలోల బంగారం, ఆభరణాలతోపాటు రూ.18 లక్షల నగదు అపహరించారు. ఈ చోరీని ప్రొఫెషనల్ దొంగల ముఠా చేసిందా లేక తెలిసిన వ్యక్తులే చేశారా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఇంత పకడ్బందీగా.. బాత్రూం నుంచి వెళితే లాకర్ గది వస్తుందని దొంగలకు ఎలా తెలుస్తుందని పోలీసులు ఆరా తీస్తున్నారు. బాత్రూంలో నుంచి లోపలికి ప్రవేశించే ముందు అక్కడున్న జగ్గుతో సీసీ కెమెరాను మూసేశారు. లాకర్ గదిలోని రెండు బీరువాల్లో ఒక్కోదాంట్లో 8 కిలోల చొప్పున 16 కిలోల బంగారం ఉండగా.. ఒక బీరువాలోని 8 కిలోల బంగారాన్ని మాత్రమే ఎత్తుకెళ్లారు. దొంగలు గ్యాస్ కట్టర్, రెండు సిలిండర్లను అక్కడే వదిలేశారు. సిలిండర్‌పై ఉన్న నంబర్ ఆధారంగా దాన్ని కోదాడలో కొనుగోలు చేసినట్లు పోలీసులు గుర్తించారు. బంగారం షాపు వెనకాల ఖాళీ స్థలంలో రెండు తులాల రింగ్, చెవి దుద్దులు పడిపోగా వాటిని స్వాధీనం చేసుకున్నారు.

మూడు రోజులుగా రెక్కీ

ముగ్గురు వ్యక్తులు మూడు రోజుల క్రితం దుకాణం పక్క సందులో ఉన్న బాలాజీ గ్రాండ్ హోటల్ సమీపంలో రూంను అద్దెకు తీసుకున్నట్టు తెలిసింది. ఈ ముగ్గురు బంగారు షాపులో దొంగతనం చేసేందుకు మూడు రోజులుగా రెక్కీ నిర్వహించినట్టు సమీపంలోని సీసీ కెమెరాల్లో రికార్డు అయింది. ఆదివారం రాత్రి కూడా ఈ ముగ్గురు వ్యక్తులు రెండు గ్యాస్ సిలిండర్లు, కట్టర్ పట్టుకొని బాలాజీ గ్రాండ్ హోటల్ సందులో నుంచి నడుచుకుంటూ వెళ్లినట్టు తెలుస్తోంది. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ అక్కడ ఆధారాలను సేకరించాయి. దొంగలు ఆదివారం రాత్రి 12.09 గంటలకు షాపులోపలికి వచ్చినట్లుగా సీసీ కెమెరాల్లో రికార్డయింది. బంగారు షాపును సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ సోమవారం పరిశీలించారు. కేసును ఛేదించడానికి ఐదు పోలీసు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని, దొంగలను త్వరలో పట్టుకుంటామని చెప్పారు.

సెక్యూరిటీ ఎందుకు లేదు..

బంగారు షాపు యజమాని అంత పెద్ద మొత్తంలో షాపులో బంగారాన్ని పెట్టి కనీసం సెక్యూరిటీ గార్డ్‌ను కూడా పెట్టకపోవడం ఏమిటనే ప్రశ్న తలెత్తుతోంది. లాకర్‌కు అలారం సిస్టం కూడా ఏర్పాటు చేసుకోలేదు. జ్యువెలరీ షాపు యజమాని కిషోర్ అక్కడికి సమీపంలో మరో దుకాణాన్ని ఏర్పాటుచేసుకునే ప్రయత్నాల్లో ఉన్నాడు. అందులో భాగంగానే పెద్దమొత్తంలో బంగారం, ఆభరణాలు తీసుకొచ్చి ప్రస్తుత షాపులో పెట్టాడని అంటున్నారు.

ఫోన్‌లో ఎవరితో మాట్లాడుతున్నావని ప్రశ్నించినందుకు..
భర్తను చంపిన భార్య



వెంకటేశ్

తాండూరు రూరల్: ఫోన్‌లో ఎవరితో మాట్లాడుతున్నావని ప్రశ్నించినందుకు భర్తను గొంతు నులిమి చంపేసిందో భార్య. కూతురుకు మంచీచెడు చెప్పాల్సిన తండ్రి ఇందుకు సహకరించడం గమనార్హం. వికారాబాద్ జిల్లా తాండూరు మండలం మల్కాపూర్‌లో సోమవారం ఈ ఘటన చోటుచేసుకుంది. సీఐ నగేశ్, స్థానికుల వివరాల ప్రకారం.. మల్కాపూర్‌కు చెందిన రెడ్డిపల్లి వెంకటేశ్ (33)కు ఇదే మండలం కోట్లాపూర్ గ్రామానికి చెందిన జయశ్రీతో 11 ఏళ్ల క్రితం పెళ్లయింది. వీరికి ఈశ్వర్ ప్రసాద్ (10), సుకుమార్ (7) కుమారులు. కొన్నాళ్లు బాగానే సాగిన వీరి సంసారంలో ఓ ఫోన్ కాల్ చిచ్చురేపింది. భార్యాభర్తల మధ్య మనస్పర్ధలు నెలకొనడంతో నాలుగేళ్లు దూరంగా ఉన్నారు. ఇటీవలే నచ్చజెప్పిన ఇరుకుటుంబాల వారు దంపతులిద్దరినీ కలిపారు. జయశ్రీ తండ్రి పండరి సైతం వీరితో పాటే ఉంటున్నాడు. ఇదిలా ఉండగా ఆదివారం బోనాల పండుగ నేపథ్యంలో రాత్రి 11గంటల వరకు వెంకటేశ్ బయటే గడిపాడు. ఆ తర్వాత ఇంటికి వెళ్లగా భార్య ఫోన్ మాట్లాడుతూ కనిపించింది. ఈ విషయమై ఇరువురి మధ్య గొడవ జరిగింది. అనంతరం వెంకటేశ్ నిద్రపోయాడు. పక్క వీధిలో ఉండే మృతుడి సోదరులు శ్రీనివాస్, కృష్ణ సోమవారం ఉదయాన్నే వచ్చి తమ్ముడిని నిద్రలేపే ప్రయత్నం చేయగా చలనం కనిపించలేదు. దీంతో పోలీసులకు సమాచారం అందించారు. తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, రూరల్ సీఐ నగేశ్, ఎస్‌ఐలు రాథోడ్ వినోద్, సాజిద్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. తమ నాన్నను అమ్మ, తాత కలిసి గొంతు నులిమి చంపేశారని మృతుడి కుమారులు డీఎస్పీకి చెప్పారు. దీంతో నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకుని రిమాండుకు తరలించారు.

సెల్ఫీ వీడియో తీసుకుని విద్యార్థి ఆత్మహత్య



రుషికేశ్

మునిపల్లి (అందోల్): సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం కంకోల్‌లోని వోక్సన్ వర్సిటీలో ఆదివారం ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌ఐ రాజేశ్‌నాయక్ వివరాల ప్రకారం... హైదరాబాద్ సరూర్‌నగర్‌కు చెందిన రుషికేశ్ (19) వోక్సన్ వర్సిటీలో ఆర్కిటెక్చర్ సెకండ్ ఇయర్ చదువుతున్నాడు. ఆదివారం రాత్రి క్యాంపస్ రూమ్‌లో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. మూడు రోజుల క్రితమే స్నేహితులతో కలిసి రుషికేశ్ విహారయాత్రకు వెళ్లి వచ్చాడు. ఆత్మహత్యకు ముందు విద్యార్థి సెల్ఫీ వీడియో తీసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. రుషికేశ్ ప్రేమించిన అమ్మాయి ఇంకొకరిని పెళ్లి చేసుకోవడం ఓ కారణమని, అలాగే అతడు విహారయాత్రకు తీసుకెళ్లిన కారుకు ప్రమాదం జరగడంతో, డ్యామేజీకి సంబంధించి డబ్బులు కట్టివ్వాలని కారు యజమాని రుషికేశ్‌పై ఒత్తిడి తెచ్చారన్నారు. దీంతో ఏం చేయాలో తోచక ఆత్మహత్యకు పాల్పడినట్లు అనుమానం వ్యక్తం చేశారు.

జూరాల డ్యాంలో యువకుడి గల్లంతు

రాంగ్‌రూట్‌లో దూసుకొచ్చి బైక్‌ను ఢీకొన్న కారు

- భయంతో బైక్‌పై నుంచి డ్యాంలోకి దూకిన యువకుడు
- మరో యువకుడికి తీవ్ర గాయాలు



గాయపడిన జానకిరాములు



జూరాల ప్రాజెక్టుపై సంఘటన జరిగిన ప్రాంతం. (ఇన్‌సెట్‌లో) మహేశ్

ధరూరు: ప్రియదర్శిని జూరాల సందర్శనకు వచ్చిన ఓ యువకుడు ప్రాణభయంతో నదిలో దూకి గల్లంతయ్యాడు. జోగుళాంబ గద్వాల జిల్లా మానవపాడు మండలం బూడిదపాడు గ్రామానికి చెందిన మహేశ్, జానకిరాములుతోపాటు మరి కొంతమంది యువకులు ఆదివారం సెలవుదినం కావడంతో జూరాల సందర్శనకు వచ్చారు. రాత్రి 7.30 గంటల సమయంలో ఎడమ కాల్వ వైపు నుంచి తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో జూరాల ప్రాజెక్టుపై వారు బైక్‌పై వస్తుండగా.. ఫ్లడ్ కంట్రోల్ రూంవైపు నుంచి కర్ణాటకకు చెందిన ఓ కారు రాంగ్ రూట్లో వేగంగా వచ్చింది. గమనించిన బైక్‌పై వెళ్తున్న మహేశ్ భయాందోళనకు గురై ప్రాణభయంతో ఏకంగా క్రస్టు గేట్ల నుంచి దిగువకు విడుదలవుతున్న నీటి ప్రాంతం వైపు నదిలోకి (48వ గేటు) దూకేశాడు. ఆ సమయంలో కర్ణాటకకు చెందిన కారు డ్రైవర్ ఫోన్ మాట్లాడుతున్నట్లు తెలిసింది. ఈ సంఘటనలో అదే గ్రామానికి చెందిన జానకిరాములు తోపాటు మరో యువకుడి తలకు గాయాలవడంతో స్థానికులు వారిని గద్వాల ఏరియా ఆస్పత్రికి.. అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలించారు. కాగా.. గల్లంతైన యువకుడు మహేశ్ కోసం సోమవారం ఉదయం ప్రాజెక్టు అధికారులు, పోలీసులు రేవులపల్లికి చెందిన గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు. సాయంత్రం వరకు యువకుడి ఆచూకీ లభించలేదని అధికారులు తెలిపారు.

ఆశ్రమ విద్యార్థులకు అస్వస్థత

100 రూపాయలు దొంగిలించారని బియ్యంలో పసుపు, వేపాకు కలిపి తినిపించిన సహచర విద్యార్థిని



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

పెంబి: తన డబ్బులు దొంగిలించారని ఓ విద్యార్థిని సహచర విద్యార్థినులకు మూఢ నమ్మకంతో పసుపు, బియ్యం, వేపాకు కలిపి తినిపించడంతో 14 మంది అస్వస్థతకు గురయ్యారు. ఈ ఘటన నిర్మల్ జిల్లా పెంబిలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో జరిగింది. సోమవారం పాఠశాలకు సెలవు కావడంతో ఉపాధ్యాయులు రాలేదు. వార్డెన్ మాత్రమే ఉన్నారు. ఈ క్రమంలో ఓ విద్యార్థిని 100 రూపాయలు కనిపించకపోవడంతో తన సహచర విద్యార్థులే తీసి ఉంటారని అనుమానించింది. మూఢ నమ్మకంతో వంట గదిలోని పసుపు, బియ్యం, వేపాకు కలిపి విద్యార్థినులతో తినిపించింది. డబ్బులు తీసినవారికి కడుపు నొప్పి వస్తుందని తెలిపింది. దీంతో 14 మంది విద్యార్థినులు కడుపు నొప్పితో బాధపడ్డారు. వెంటనే వార్డెన్ విషయం తెలుసుకుని వారిని పెంబి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విద్యార్థుల పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న డీటీడీవో పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులు ఇలాంటి మూఢనమ్మకాలు నమ్మవద్దని సూచించారు.

పాత కక్షలతోనే అనిల్ హత్య

- ఐదుగురు అరెస్ట్.. పరారీలో మరో ఇద్దరు
- కేసు వివరాలను వెల్లడించిన ఎస్పీ శ్రీనివాస్



నిందితులను మీడియాకు చూపుతున్న ఎస్పీ డీవీ శ్రీనివాసరావు

మెదక్‌జోన్/మెదక్ మున్సిపాలిటీ: ఆర్థిక లావాదేవీలు, వ్యక్తిగత కక్షలు, రాజకీయ ప్రయోజనాలే మెదక్ జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ కార్యదర్శి మరెల్లి అనిల్ హత్యకు దారి తీశాయి. ఈ హత్యలో ప్రత్యక్షంగా, పరోక్షంగా ఏడుగురు పాల్గొనగా, ఐదుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఈమేరకు ఎస్పీ డీవీ శ్రీనివాస్‌రావు సోమవారం మీడియాకు వెల్లడించారు. ఈనెల 14న రాత్రి కొల్చారం మండలం పైతర గ్రామ శివారులో అనిల్ హత్యకు గురైన సంగతి తెలిసిందే. కొల్చారం మండలం పైతర గ్రామానికి చెందిన సోమన్నగారి రవీందర్‌రెడ్డి, ఇదే మండలం రంగంపేటకు చెందిన తాడెపు నాగరాజు, తాడెపు నాగభూషణం (అన్నదమ్ములు), ఎండీ ఫరీద్, టేక్మాల్‌కు చెందిన తలారి అశోక్, విజయవాడకు చెందిన షాబొద్దీన్, చిన్న ఈ హత్యలో పాల్గొన్నారు.

వివాదాలు, అవమానాలు..

పైతర గ్రామానికి చెందిన రవీందర్‌రెడ్డికి అనిల్ అత్యంత సన్నిహితుడు. అనిల్ కొల్చారం మండలం సంగాయిపేటలో రవీందర్‌కు చెందిన భూమిని లీజుకు తీసుకుని పెట్రోల్ బంక్ నిర్మించారు. రవీందర్ వ్యవసాయ భూమిని సైతం అనిల్ కుటుంబం కౌలుకు తీసుకుంది. వీరిద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో మూడేళ్లుగా అనిల్ కుటుంబీకులు రవీందర్ భూమిని సాగు చేయడం ఆపేశారు. అలాగే.. ఎవరూ కూడా ఆ భూమిని సాగు చేయకుండా అనిల్ అడ్డుకున్నాడు. అంతేకాకుండా రవీందర్‌కు అనైతిక సంబంధాలు అంటగడుతూ అనిల్ ప్రచారం చేశాడు. దీనిపై రవీందర్ తన సన్నిహితుడైన తాడేపు నాగరాజు(ఏ2)తో చర్చించాడు. నాగరాజు, అనిల్ ఒకప్పుడు మంచి స్నేహితులు. ఇటీవల నాగరాజు రాబోయే స్థానిక ఎన్నికల్లో రంగంపేటలో పోటీ చేస్తానని చెప్పగా.. అనిల్ అసభ్యకరంగా అవమానించినట్లు ఎస్పీ తెలిపారు. ఇదేక్రమంలో రంగంపేటలో ఉన్న ప్లాట్‌ను అమ్మేందుకు రవీందర్ యత్నిస్తుండగా అనిల్ అడ్డుకున్నాడు. నాగరాజు తల్లికి డబుల్‌బెడ్‌రూం ఇల్లు మంజూరు కాగా దాన్ని అనిల్ రద్దు చేయించాడు. అలాగే నాగరాజు సోదరుడైన నాగభూషణం వద్ద అనిల్ రూ.60 వేలు అప్పుగా తీసుకొని తిరిగి చెల్లించలేదు. ఇలా సాగుతున్న వివాదాలు, అవమానాల కారణంగా అనిల్‌పై రవీందర్‌రెడ్డి, నాగరాజు, నాగభూషణం కక్ష పెంచుకున్నారు.

బిహార్‌లో తుపాకీ, బుల్లెట్లు కొని..

అనిల్‌ను చంపేందుకు తుపాకీ కావాలని నాగరాజు తన మెకానిక్ షెడ్డులో పనిచేస్తున్న ఫరీద్‌కు చెప్పాడు. బిహార్‌లో తనకు తెలిసిన వాళ్లున్నారని చెప్పడంతో నాగరాజు ఫరీద్‌కు రూ.1.50 లక్షలు ఇచ్చాడు. ఫరీద్ బిహార్‌కు వెళ్లి అక్కడ సచిన్ అనే వ్యక్తి నుంచి తుపాకీతోపాటు ఆరు రౌండ్ల బుల్లెట్లు కొనుగోలు చేశాడు. తన గ్యారేజీలో పనిచేసే విజయవాడకు చెందిన షాబొద్దీన్, చిన్న,తో కలిసి నాగరాజు కొడిపల్లి నుంచి ఏడుపాయల వరకు రెక్కీ నిర్వహించారు. ఆరోజు కుదరక పోవడంతో ఫరీద్ మరుసటి రోజు (ఈనెల 14న) అనిల్ హైదరాబాద్‌వైపు వస్తున్నట్లు నాగరాజుకు సమాచారం ఇచ్చాడు. షాబొద్దీన్, చిన్న, నాగరాజు కలిసి అనిల్‌పై నిఘా పెట్టారు. అనిల్ పార్టీ సమావేశం కోసం కారులో హైదరాబాద్ వెళ్లగా.. నాగభూషణం గుమ్మడిదల నుంచి గాంధీ భవన్ వరకు అనుసరించాడు. ఈ క్రమంలో నాగభూషణం తన మిత్రుడు అశోక్‌కు ఫోన్ చేసి కారు తీసుకురమ్మని చెప్పాడు. అశోక్ స్విఫ్ట్ డిజైర్‌కారు తీసుకొని గుమ్మడిదలలో ఉన్న నాగభూషణం వద్దకు వెళ్లాడు. రాత్రి 7 గంటల సమయంలో తిరిగి గ్రామానికి కారులో వస్తున్న అనిల్‌ను నాగభూషణం, షాబొద్దీన్, చిన్న, ఫరీద్ డిజైర్‌కారులో అనుసరించారు. అప్పాజిపల్లిలో వీరు అనిల్‌పై దాడికి యత్నించారు. అక్కడ పోలీసు వాహనం ఎదురు కావడంతో విరమించుకొని వరిగుంతం శివారులోని సబ్‌స్టేషన్ వద్ద నాగభూషణం తన కారుతో అడ్డగించారు. అనిల్ తన వాహనం ఆపగానే వెనకే కారులో ఉన్న షాబొద్దీన్ తన వద్ద ఉన్న తుపాకీతో అనిల్‌పై నాలుగు రౌండ్ల కాల్పులు జరిపి హత్య చేశాడు. ఈ కేసులో ఐదుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించగా, షాబొద్దీన్, చిన్న పరారీలో ఉన్నారు. నిందితుల నుంచి కార్లు, ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు.

పార్లమెంటు సమావేశాలు

తొలిరోజే దుమారం

- విపక్షాల ఆరోపణలు, అధికారపార్టీ ప్రతివిమర్శలతో షురూ
- పహల్గాం, ఆపరేషన్ సిందూర్‌పై చర్చకు అంగీకరించిన కేంద్రం
- వచ్చేవారం చర్చించే ఛాన్స్



న్యూఢిల్లీ: ధూర్తదేశం పాక్‌పై భారత్ జరిపిన ఆపరేషన్ సిందూర్ తర్వాత తొలిసారిగా జరుగుతున్న పార్లమెంట్ సమావేశాలు తొలిరోజే తీవ్రస్థాయి వాదోపవాదాలతో మొదలయ్యాయి. పహల్గాం ఉదంతంలో కేంద్ర నిఘా వర్గాల ఘోర వైఫల్యాన్ని ఎత్తిచూపుతూ ఆపరేషన్ సిందూర్‌పై వెనువెంటనే చర్చ మొదలెట్టాలన్న విపక్షాల డిమాండ్లు ఓవైపు.. ఎమర్జెన్సీ విధించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భం, కేసులను మోస్తున్న రాబర్ట్ వాద్రాపై అధికార పార్టీ ప్రతివిమర్శలతో తొలిరోజు పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు వేడెక్కాయి. బిహార్‌లో ఓటర్ల జాబితా విస్తృతస్థాయిలో సవరించడం, మణిపూర్‌లో జాతుల మధ్య వైరంపై అధికార, విపక్ష పార్టీల పరస్పర ఆరోపణలతో లోక్‌సభ, రాజ్యసభల్లో వాతావరణం ఓవైపు మరింత ఉద్రిక్తంగా మారినా.. కాలిన కరెన్సీ కట్టల వ్యవహారంలో అపకీర్తిని మూటగట్టుకున్న అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ అభిశంసన అంశంలో అంతా ఏకతాటి మీదకు రావడం విశేషం. అవినీతిమరకలు అంటుకున్న జడ్జీని న్యాయపీఠం నుంచి పక్కకు తప్పించే క్రతువులో పార్టీలకతీతంగా సభ్యులు ఒకేమాటపై నిలబడ్డ సందర్భానికీ పార్లమెంట్ వేదికైంది.

తొలిరోజే నాలుగుసార్లు వాయిదా

సోమవారం ఉదయం 11 గంటలకు ఉభయసభలు మొదలయ్యాయి. పహల్గాంలో అత్యంత పాశవికంగా ఉగ్రవాదులు చేసిన దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి ఇరు సభల్లో సభ్యులు నివాళులర్పించారు. అహ్మదాబాద్‌లో ఎయిర్‌ఇండియా విమానం కుప్పకూలిన ఘటనలో సజీవదహనమైన ప్రయాణికులకూ ఇరుసభల సభ్యులు నివాళిగా కొద్దిసేపు మౌనం పాటించారు. తర్వాత లోక్‌సభలో ప్రశ్నోత్తరాలను స్పీకర్ బిర్లా మొదలెట్టగానే విపక్ష సభ్యులు వెంటనే వెల్‌లోకి దూసుకొచ్చి ఆందోళనకు దిగారు. ప్రభుత్వ ఘోర నిఘా వైఫల్యం వల్లే పహల్గాం ఉదంతం చోటుచేసుకుందని, ఆపరేషన్ సిందూర్‌పై తక్షణం చర్చ జరపాలని డిమాండ్లుచేశారు. ఈ అంశంలో సభకు వచ్చి ప్రధాని మోదీ వివరణ ఇవ్వాలని సభ్యులు పట్టుబట్టారు. ''ప్రశ్నోత్తరాల గంట ముగిశాకే మీకు మాట్లాడే అవకాశం ఇస్తా. క్వశ్చన్ అవర్ సజావుగా సాగనివ్వండి. మనల్ని ఎన్నుకున్న ప్రజల సమస్యలపై చర్చ జరగనివ్వండి. మీరు నినాదాలు ఇవ్వాలనుకుంటే బయటికెళ్లి ఇచ్చుకోండి'' అని బిర్లా సూచించినా విపక్ష సభ్యులు వినిపించుకోలేదు. దీంతో సభను 12 గంటల దాకా వాయిదావేశారు. తర్వాత 12 గంటలకు సభ ఆరంభమైనా పరిస్థితిలో ఎలాంటి మార్పు రాలేదు. మీరు ఎత్తిచూపిన అంశాలపై సుదీర్ఘ చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని అప్పటిదాకా ఓపిక పట్టాలని రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ కోరారు. సభావ్యవహారాల సలహా కమిటీ(బీఏసీ) ఎదుట విపక్ష సభ్యులు తమ వాదనల్ని మధ్యాహ్నం 2.30గంటలకు వినిపించవచ్చని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు సూచించారు. అయినా విపక్షసభ్యులు వినిపించుకోలేదు. దీంతో అప్పుడు సభాధ్యక్షపీఠంపై కూర్చున్న జగదాంబికా పాల్ సభను మధ్యాహ్నం రెండు గంటలకు వాయిదావేశారు. తర్వాత సభ మొదలైనా ఎలాంటి మార్పులేదు. అప్పటి స్పీకర్ స్థానంలో కూర్చున్న సంధ్యా రాయ్ సభను మధ్యాహ్నం నాలుగు గంటలకు వాయిదావేశారు. నాలుగు గంటలకు సభ సమావేశమైంది. అప్పుడు కూడా విపక్షసభ్యులు ఏమాత్రం వెనక్కి తగ్గకుండా తమ నిరసనలతో సభను హోరెత్తించారు. ఇక చేసేదిలేక సభాధ్యక్ష స్థానంలో కూర్చున్న దిలీప్ సైకియా లోక్‌సభను మంగళవారానికి వాయిదావేశారు. ఇలా తొలిరోజే లోక్‌సభ నాలుగుసార్లు వాయిదాపడింది. రాజ్యసభలోనూ ఇదే వాయిదా పర్వం కొనసాగింది.

వచ్చే వారం సిందూర్‌పై చర్చ

పహల్గాంలో ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్, తదనంతర పరిణామాలపై విస్తృతస్థాయి చర్చకు కేంద్రప్రభుత్వం తన సమ్మతి తెలిపింది. వచ్చే వారం ఈ అంశాలపై సమగ్రస్థాయిలో లోక్‌సభలో చర్చ జరిగే అవకాశం ఉంది. ప్రధాని మోదీ విదేశీ పర్యటనకు వెళ్తున్న కారణంగా ఈవారం ఆయన పార్లమెంట్‌కు రాలేరని, వచ్చే వారం ఆయన సమక్షంలోనే పార్లమెంట్‌లో చర్చ జరుగుతుందని తెలుస్తోంది. పార్లమెంట్ వ్యవహారాల సలహా కమిటీ సమావేశంలో ప్రభుత్వ ప్రతినిధులు ఈ విషయాలను విపక్ష నేతలకు తెలియజేశారని విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. మరోవైపు షిప్పింగ్ డాక్యుమెంట్ల సరళీకరణకు బాటలువేసే 'ది బిల్స్ ఆఫ్ ల్యాడింగ్ బిల్లు – 2025' కు రాజ్యసభ ఆమోదముద్ర వేసింది. ఈ బిల్లు మార్చిలోనే లోక్‌సభ ఆమోదం పొందింది.



సహాయక చర్యల్లో పాల్గొన్న ఫైర్, భద్రతా బలగాల సిబ్బంది

స్కూల్‌పై కూలిన జెట్

విద్యార్థులుసహా 20మంది మృతి

- మరో 171 మందికి గాయాలు
- బంగ్లాదేశ్‌లో ఘోర విమాన ప్రమాదం

ఢాకా: ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను శ్రద్ధగా వింటూ తరగతి గదిలో ప్రశాంతంగా కూర్చున్న విద్యార్థులపై అకస్మాత్తుగా ఆకాశం నుంచి మృత్యువు యుద్ధవిమానం రూపంలో దూసుకొచ్చింది. చైనా తయారీ ఎఫ్‌–7బీజీఐ శిక్షణ యుద్ధవిమానం ఉన్నపళంగా పాఠశాలపై కుప్పకూలడంతో పాఠశాల విద్యార్థులుసహా 20 మంది సజీవదహ నమయ్యారు. వీరిలో 16 మంది చిన్నారులు, ఇద్దరు ఉపాధ్యాయులు, ఒక పైలట్ ఉన్నట్లు స్థానిక మీడియాలో కథనాలు వెలువడ్డాయి. బంగ్లాదేశ్ రాజధాని ఢాకాలో ఈ ఘోర విమానప్రమాదం సోమవారం మధ్యాహ్నం 1.15 గంటలకు సంభవించింది. కాలినగాయాలతో రక్తమోడుతున్న మరో 171మందిని హుటాహుటిన ఆస్పత్రులకు తరలించి చికిత్సనందిస్తున్నారు. ఢాకా నగరంలోని ఉట్టారా పరిధిలోని డియాబరీ ప్రాంతంలోని మైల్‌స్టోన్ స్కూల్, కాలేజీ క్యాంపస్‌పై ఈ శిక్షణవిమానం కుప్పకూలిందని బంగ్లాదేశ్ ఫైర్ సర్వీస్, సివిల్ డిఫెన్స్ విభాగ డైరెక్టర్ జనరల్ బ్రిగేడియర్ జనరల్ జహీద్ కమల్ చెప్పారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని తెలిపారు. విమానంలో అకస్మాత్తుగా సాంకేతిక సమస్య తలెత్తడంతో అది అదుపుతప్పి ఇలా పాఠశాలపై పడిపోయిందని తెలుస్తోంది. ఒక్కసారిగా పాఠశాల మంటల్లో చిక్కుకుపోవడంతో స్థానికులు హుటాహుటిన వచ్చి రక్తసిక్తమైన చిన్నారులను రిక్షాలు, ఆటోల్లో దగ్గర్లోని ఆస్పత్రులకు తరలించారు. విషయం తెల్సుకున్న అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు వెంటనే రంగంలోకి దిగి సహాయక చర్యల్లో నిమగ్నమయ్యారు. ''కుర్మిటోలాలోని ఏకే ఖాన్‌దాకర్ వైమానిక స్థావరం నుంచి సోమవారం ఉదయం ఒంటిగంట ఆరు నిమిషాలకు బయల్దేరిన శిక్షణవిమానం కొద్దిసేపటికే అదుపుతప్పింది. పరిస్థితి సెకన్లలో పసిగట్టిన పైలట్ తౌకిర్ విమానాన్ని జనావాస ప్రాంతం మీద నుంచి దూరంగా తీసుకెళ్లేందుకు మళ్లించే ప్రయత్నంచేశారు. కానీ ఆలోపే విమానం వేగంగా కిందకు పడిపోయింది'' అని బంగ్లాదేశ్ ఆర్మీ అధికార ప్రతినిధి లెఫ్టినెంట్ కల్నల్ సమీ ఉద్ దౌలా చెప్పారు. ఘటనపై దర్యాప్తునకు కమిటీని ఏర్పాటుచేశామని దౌలా అన్నారు.

మిన్నంటిన రోదనలు

విగతజీవులుగా మారిన చిన్నారులను చూసి పిల్లల తల్లిదండ్రులు దిక్కులు పిక్కటిల్లేలా రోదిస్తున్న దృశ్యాలు మీడియాలో ప్రసారమయ్యాయి. కూలిన భవనం, చెల్లాచెదురుగా పడిన విద్యార్థుల మృతదేహాలు, తల్లిదండ్రుల ఆక్రందనలు, సహాయక చర్యలతో ఆ ప్రాంతమంతా భీతావహంగా మారింది. క్షతగాత్రులను తరలించేందుకు డజన్లకొద్దీ అంబులెన్సులు ఘటనాస్థలికి చేరుకున్నాయి. విమానం సృష్టించిన బీభత్సం ధాటికి నేలమట్టమైన పాఠశాల శిథిలాల కింద నుంచి 20 మృతదేహాలను వెలికితీశారు. గాయపడిన వారిలో ఎనిమిది మంది ఆరోగ్య పరిస్థితి అత్యంత విషమంగా ఉంది. కంబైన్డ్ మిలటరీ ఆస్పత్రి, ఢాకా మెడికల్ బోధ నాస్పత్రి, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బర్న్ అండ్ ప్లాస్టిక్ సర్జరీ(ఎన్‌ఐబీపీఎస్)లో పలువురికి చికిత్స నందిస్తున్నారు. మా ఆస్పత్రికి తీసుకొస్తున్న క్షతగాత్రుల సంఖ్య పెరుగుతోందని ఎన్‌ఐబీపీఎస్ వైద్యు డొకరు మీడియాతో చెప్పారు. విమానాన్ని నడిపిన పైలట్ లెఫ్టినెంట్ మొహమ్మద్ తౌకిర్ ఇస్లామ్ సైతం ప్రాణాలు కోల్పోయాడు. ఎఫ్‌–7బీజీఐ విమానం భారీ పేలుడుతో నాలుగంతస్తుల పాఠశాల భవనంపై కూలిందని ప్రత్యక్ష సాక్షులు చెప్పారు. రక్తసి క్తమైన మృతదేహాలను ఒకటి నుంచి ఏడో తరగతి క్లాసుల్లో వరుసగా పేర్చారని అక్కడి ఒక ఉపాధ్యా యుడు చెప్పారు. '' చిన్నపిల్లల క్లాసులు అయిపో యాయి. ఫైనల్ బెల్ కొట్టాం. ఆనందంగా పిల్లలు బ్యాగులు సర్దుకుని లైన్లలో నిల్చుని బయటకు వెళ్తున్నప్పుడే విమానం కూలింది. చుట్టూతా మంటలే. ఆ మంటలు, దట్టమైన పొగలో అసలేం కనిపించలేదు. నా రెండు చేతులు కాలిపోయాయి. ఊపిరాడలేదు'' అని ఒక ఉపాధ్యాయురాలు ఆ భ యానక దృశ్యాన్ని గుర్తుచేసుకున్నారు. '' మధ్యాహ్నం 1.15 గంటల ప్రాంతంలో క్లాసులు జరు గుతున్నాయి. హఠాత్తుగా విమానం నా కళ్లెదుటే కుప్పకూలింది. నాకు కేవలం 10 అడుగుల దూరంలో అది కూలడం చూశా. ప్రైమరీ స్కూల్ పిల్లలకు పాఠాలు చెప్పే రెండంతస్తుల బిల్డింగ్ గ్రౌండ్‌ఫ్లోర్‌ను విమానం ఢీకొట్టింది'' అని ప్రాంగణంలో 11వ గ్రేడ్ చదువుతున్న ఫహీమ్ హుస్సేన్ అనే విద్యార్థి భయపడుతూ చెప్పాడు.

ఈ పార్లమెంటు సమావేశాలు..

విజయోత్సవాలు

- ప్రధాని నరేంద్ర మోదీ అభివర్ణన
- హింసపై రాజ్యాంగ విజయానికి ప్రతీక
- పార్లమెంటు ఆవరణలో ప్రధాని వ్యాఖ్యలు
- ఆపరేషన్ సిందూర్‌పై చర్చకు సిద్ధమంటూ సంకేతం



న్యూఢిల్లీ: పార్లమెంటు వర్షాకాల సమావేశాలను జాతికి విజయోత్సవాలుగా ప్రధాని నరేంద్ర మోదీ అభివర్ణించారు. ''బాంబులు, తుపాకులు అవి పుట్టించే హింసపై ఎప్పటికీ రాజ్యాంగ స్ఫూర్తిదే పైచేయి. మా పాలనలో పదేపదే నిరూపితమవుతూ వస్తున్న వాస్తవమిది'' అని మోదీ చెప్పారు. ఆపరేషన్ సిందూర్‌తో సహా విపక్షాలు లేవనెత్తదలచిన అన్ని అంశాలపైనా చర్చకు ప్రభుత్వం సిద్ధమంటూ సంకేతాలిచ్చారు. సమావేశాల ప్రారంభం సందర్భంగా సోమవారం ఉదయం పార్లమెంటు ఆవరణలో ప్రధాని మీడియాతో మాట్లాడారు. ''ఇవి దేశానికి గర్వకారణంగా నిలవనున్న సమావేశాలు. విజయోత్సవాల వంటివి. మన సాయుధ బలగాల శక్తిసామర్థ్యాలను ప్రపంచమంతా అబ్బురపాటుతో వీక్షించింది. సైన్యం 100 శాతం కచ్చితత్వంతో లక్ష్యాలను సాధించి భారత పతాకను సమున్నతంగా ఎగురవేసింది'' అని ఆపరేషన్ సిందూర్‌ను ఉద్దేశించి పేర్కొన్నారు. ''ఆ ఘనతను అఖిలపక్ష బృందాలు దేశదేశాల్లో చాటాయి. ఆ పార్టీలకు, ఎంపీలకు నా అభినందనలు''అన్నారు. సిందూర్ వేళ మేడిన్ ఇండియా ఆయుధాలు అద్భుతంగా సత్తా చాటి ప్రపంచం దృష్టిని ఆకర్షించాయని గుర్తు చేశారు. ''పహల్గాం ఉగ్ర దాడి ప్రపంచాన్నే షాక్‌కు గురి చేసింది. ఉగ్రవాదంపై పోరులో దేశాలన్నీ మరోసారి ఒక్కతాటిపైకి వచ్చేలా చేసింది. అంతేకాదు, అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో కూడా మన పతాక ఇటీవలే సగర్వంగా ఎగిరింది. దేశంలో నక్సలిజం ఆనవాలు లేకుండా పోతోంది. నక్సల్ హింసతో రెడ్ జోన్‌గా మారిన అనేకానేక ప్రాంతాలు కాస్తా అభివృద్ధికి నోచుకుని హరితవర్ణం పులుముకుంటున్నాయి. కొద్దిరోజులుగా విస్తారంగా కురుస్తున్న వర్షాలతో దేశ ఆర్థికానికి ఎనలేని ఊపు లభిస్తోంది. డ్యామ్‌లు మూడింతల జలకళతో పరవళ్లు తొక్కుతున్నాయి. గత పాలకుల హయాంలో రెండంకెల్లో కొనసాగిన ద్రవ్యోల్బణం మా పాలనలో దశాబ్దకాలంగా నేలకు దిగుతోంది. వృద్ధి చుక్కలు తాకుతోంది''అంటూ తమ సర్కారు సాధించిన ప్రగతిని వివరించారు. ''పార్టీలుగా ఎవరి అజెండా వారికి ఉండొచ్చు. కానీ ఆ విభేదాలకు అతీతంగా ఎంపీలంతా సభల్లో ఒకే గళం వినిపించడం ద్వారా పార్లమెంటు సమావేశాల స్ఫూర్తిని సాకారం చేస్తారని ఆశిస్తున్నా'' అని విపక్షాలను ఉద్దేశించి పేర్కొన్నారు.

కేంద్రం ప్రతిపక్షం గొంతు నొక్కేస్తోంది: రాహుల్

న్యూఢిల్లీ: ప్రతిపక్ష నాయకుడినైన తనను లోక్‌సభలో మాట్లాడనివ్వకుండా చేస్తూ బీజేపీ ప్రతిపక్షం గొంతును నొక్కేస్తోందని కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ ఆరోపించారు. ప్రతిపక్ష నేతగా తనకు ప్రశ్నలు అడిగే హక్కు ఉందని ఆయన ఉద్ఘాటించారు. ప్రతిపక్షాలను అడ్డుకుంటూ, రక్షణ మంత్రి, ఇతర ట్రెజరీ బెంచ్ సభ్యులను మాత్రమే మాట్లాడటానికి అనుమతిస్తూ బీజేపీ కొత్త విధానం అనుసరిస్తోందని గాంధీ ఆరోపించారు. ప్రతిపక్షాలను కూడా అనుమతిస్తేనే అర్థమవంతమైన చర్చ జరుగుతుందని, మంత్రులు మాట్లాడినప్పుడు ప్రతిపక్షం వింటున్నప్పుడు, ప్రతిపక్షం మాట్లాడినప్పుడు ప్రభుత్వం వినాలని గుర్తు చేశారు. వయనాడ్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా సైతం ఇదే అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. పార్లమెంటులో మాట్లాడేందుకు సభ్యులను అనుమతించాలన్నారు. ప్రభుత్వం నిజంగా చర్చ కోరుకుంటే.. ప్రతిపక్ష నాయకుడు మాట్లాడేందుకు ఒక్క నిమిషం కూడా ఎందుకు అనుమతించలేదని ప్రశ్నించారు.

జస్టిస్ వర్మ అభిశంసన..

నోటీసులిచ్చిన ఎంపీలు

న్యూఢిల్లీ: హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మను అభిశంసించాలని కోరుతూ ఎంపీలు సోమవారం లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, రాజ్యసభ అధ్యక్షుడు జగదీప్ ధన్‌ఖడ్‌కు నోటీసులు అందజేశారు. అన్ని పార్టీలతో కూడిన కమిటీ సుమారు 145 మంది లోక్‌సభ సభ్యుల సంతకాలు చేసిన నోటీస్‌ను స్పీకర్ ఓం బిర్లాకు సోమవారం అందజేసింది. రాజ్యాంగంలోని 124, 217, 218 ఆర్టికల్స్ ప్రకారం జస్టిస్ వర్మను తొలగించాలని వారంతా అందులో కోరారు. లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ, బీజేపీ నేతలు రవి శంకర్ ప్రసాద్, అనురాగ్ ఠాకూర్, సుప్రియా సూలె, కేసీ వేణుగోపాల్, కె.సురేశ్, రామచంద్రన్ తదితరులు ఆ నోటీస్‌పై సంతకాలు చేశారు. ఇదే విషయమై 63 మంది సభ్యుల సంతకాలతో కూడిన నోటీసును రాజ్యసభ చైర్మన్ ధన్‌ఖడ్‌కు కూడా ఎంపీలు అందజేశారు. ఈ నోటీసుపై ఇండియా కూటమిలో ఆప్ సహా ప్రతిపక్ష పార్టీలకు చెందిన 63 మంది సభ్యులు సంతకాలు చేశారని కాంగ్రెస్ ఎంపీ జైరామ్ రమేశ్ చెప్పారు. టీఎంసీ సభ్యులు కూడా సంతకాలు చేస్తారన్నారు. అలహాబాద్ హైకోర్టు జడ్జి శేఖర్ యాదవ్‌ను తొలగించాలంటూ గతేడాది డిసెంబర్‌లోనే నోటీసిచ్చామని ఆయన గుర్తు చేశారు. ఇలా ఉండగా, జస్టిస్ వర్మ తొలగింపు కోరుతూ ఎంపీలు తనకు నోటీసు ఇచ్చారని రాజ్యసభ చైర్మన్ ధన్‌ఖడ్ ధ్రువీకరించారు. ఈ నోటీసుపై 50 మందికిపైగా సభ్యుల సంతకాలున్నాయన్నారు. ఇందుకు అవసరమైన కమిటీ ఏర్పాటు వంటి చర్యలు తీసుకోవాలని సెక్రటరీ జనరల్‌ను కోరానన్నారు. ఈ అంశంపై సభ ఫ్లోర్ లీడర్లతో చర్చిస్తానన్నారు. ఢిల్లీ హైకోర్టు జడ్జిగా ఉన్న జస్టిస్ వర్మ నివాసంలో మార్చిలో జరిగిన అగ్ని ప్రమాదం సమయంలో స్టోర్ రూంలో సగం కాలిన నోట్ల కట్టలు కనిపించినట్లు వార్తలు రావడం, ఆయ న్ను అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేయడం తెల్సిందే.

ఇదీ ప్రక్రియ..

జడ్జిలను తొలగించాలంటూ ఇచ్చే నోటీసులపై రాజ్యసభ ఎంపీలైతే కనీసం 50 మంది, లోక్‌సభ సభ్యులైతే కనీసం 100 మంది సంతకాలు చేయాల్సి ఉంటుంది. ఈ నోటీసులను లోక్‌సభ స్పీకర్, రాజ్యసభ చైర్మన్ తిరస్కరించవచ్చు లేదా ఆమోదించనూ వచ్చు. సంబంధిత తీర్మానం ఉభయ సభల ఆమోదం పొందిన పక్షంలో విచారణ కమిటీని ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. సుప్రీంకోర్టు సీనియర్ జడ్జి, ఒక హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, ప్రముఖ న్యాయ నిపుణుడితో ఏర్పాటయ్యే ఈ కమిటీ ఆరోపణలపై విచారణ చేపట్టి, మూడు నెలల్లోగా నివేదిక అందజేస్తుంది. ఈ నివేదికను పార్లమెంట్ ముందుంచుతారు. ఉభయ సభల్లోనూ దీనిపై చర్చ చేపడతారు. జడ్జి తొలగింపుపై ఓటింగ్ చేపడతారు.

జస్టిస్ వర్మ ఏమన్నారు..?

తన ఇంట్లో లభ్యమైన సగం కాలిన నోట్ల కట్టలతో తనకు గానీ, తన కుటుంబానికి గానీ ఎటువంటి సంబంధం లేదని జస్టిస్ వర్మ వాదిస్తున్నారు. తానెటువంటి తప్పు చేయలేదని చెప్పుకుంటున్నారు. అయితే, సుప్రీంకోర్టు ఏర్పాటు చేసిన విచారణ కమిటీ మాత్రం.. సగం కాలిన నోట్ల కట్టలు బయటపడిన స్టోర్‌రూంపై జస్టిస్ వర్మకు, ఆయన కుటుంబ సభ్యులకు నియంత్రణ ఉందని స్పష్టం చేసింది. ఈ ఘటన ఆయన్ను విధుల నుంచి తొలగించాలని కోరేంతటి తీవ్రమైందని నిరూపించిందని తెలిపింది.

ఆయన నీకేమైనా ఫ్రెండా..? ఇప్పటికీ జస్టిస్ వర్మే..!

వర్మను ఏకవచనంతో సంబోధించిన లాయర్‌పై సీజేఐ గవాయ్ ఆగ్రహం

న్యూఢిల్లీ: నగదు కట్టల వివాదంపై జస్టిస్ యశ్వంత్ వర్మపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కోరుతూ వేసిన పిటిషన్‌పై తక్షణ విచారణకు సుప్రీంకోర్టు నిరాకరించింది. దీనిపై తగు సమయంలో విచారణ చేపడతామని స్పష్టం చేసింది. సోమవారం న్యాయవాది, పిటిషనర్ అయిన మాథ్యూస్ నెడుంపర తీరుపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కేవీ చంద్రన్‌ల ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది. జస్టిస్ యశ్వంత్ వర్మను కేవలం వర్మ అంటూ సంబోధించడమేంటని ప్రశ్నించింది. ఆయనేమైనా మీకు స్నేహితుడా? ఆయన ఇప్పటికీ జస్టిస్ వర్మనే. ఓ కోర్టులో న్యాయమూర్తిగా ఉన్నారు. ఎంతో సీనియర్ అయిన ఆయన్ను అలా ఎలా సంబోధిస్తారు? కాస్త మర్యాదగా వ్యవహరించండి'అంటూ హితవు పలికింది. 'ఆయనకు అంత గౌరవం అవసరం లేదు. పిటిషన్‌పై విచారణ చేపట్టండి'అని నెడుంపర పేర్కొనగా మీరు మాకు ఆదేశాలివ్వక్కర్లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేసింది. జస్టిస్ వర్మకు సంబంధించిన వివాదానికి సంబంధించి ఆయన ఏకంగా మూడు పిటిషన్లు వేయడంపై అసంతృప్తి వ్యక్తం చేసింది. విచారణ కోసం నెడుంపర పట్టుబట్టగా..పిటిషన్‌ను ఇప్పుడే కొట్టేయమంటారా?అని ప్రశ్నించింది. 'కొట్టివేయడం అసాధ్యం. ఎఫ్ఐఆర్ నమోద వ్వాల్సిందే. వర్మ కూడా అదొక్కటే కోరుతార నిపిస్తోంది. ఎఫ్ఐఆర్, దర్యాప్తు జరగాలి'అని సీజేఐ గవాయ్ పేర్కొన్నారు. సుప్రీంకోర్టు నియమించిన కమిటీ నివేదికను పక్కనబెట్టాలంటూ జస్టిస్ వర్మ ఇటీవల సుప్రీంకోర్టులో పిటిషన్ వేయడం తెల్సిందే.

కమ్యూనిస్టు దిగ్గజం

వీఎస్ కన్నుమూత

- 101 సంవత్సరాల వయస్సులో అనారోగ్యంతో అచ్యుతానందన్ మృతి
- 8 దశాబ్దాల రాజకీయ జీవితం కలిగిన గొప్ప ప్రజా నాయకుడు



తిరువనంతపురం: కమ్యూనిస్టు దిగ్గజం, కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా–మార్క్సిస్ట్ (సీపీఐఎం) పార్టీ వ్యవస్థాపకుల్లో ఒకరు, కేరళ మాజీ సీఎం వీఎస్ అచ్యుతానందన్ కన్నుమూశారు. 101 ఏళ్ల అచ్యుతానందన్‌కు జూన్ 23న రెండోసారి గుండెపోటు వచ్చింది. అప్పటినుంచి తిరువనంతపురంలోని ఎస్‌యూటీ ఆస్పత్రిలో వెంటిలేటర్ సహాయంతో చికిత్స పొందుతున్నారు. పరిస్థితి విషమించడంతో సోమవారం కన్నుమూశారు. కేరళ రాజకీయ చరిత్రలో అచ్యుతానందన్ బలమైన శక్తి. భారత వామపక్ష ఉద్యమంలో అత్యున్నత నాయకుల్లో ఒకరైన ఆయనను వీఎస్ అని ప్రేమగా పిలుచుకుంటారు. 1964లో కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (సీపీఐ) జాతీయ కమిటీ నుంచి బయటకు వచ్చి సీపీఐఎం ఏర్పాటు చేసిన 32 మంది నాయకుల్లో వీఎస్ ఒకరు. 18 ఏళ్లు నిండకముందే పార్టీ సభ్యత్వం పొందిన ఆయన.. 2018 వరకు రాజకీయాల్లో చురుగ్గా ఉన్నారు. 44 ఏళ్ల వయసులో ఆయన తొలిసారి శాసనసభ సభ్యుడిగా ఎన్నికయ్యారు. 1965 నుండి 2016 వరకు ఆయన పదిసార్లు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి, ఏడుసార్లు గెలిచారు. మూడు సార్లు అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడిగా తన గళం వినిపించారు. 2006లో, 82 సంవత్సరాల వయసులో ఆయన సీపీఎంను తిరిగి అధికారంలోకి తెచ్చారు. 2011 వరకు రాష్ట్ర ముఖ్యమంత్రిగా పనిచేశారు. చివరగా ఆయన పరిపాలనా సంస్కరణల కమిషన్ చైర్మన్ బాధ్యతలను నిర్వహించారు. నాలుగేళ్ల కిందట గుండెపోటు రావడంతో ఆయన క్రియాశీల రాజకీయాలకు దూరంగా ఉన్నారు.

కార్మికోద్యమాల నుంచి కమ్యూనిస్టు పార్టీ వైపు..

1923 అక్టోబర్ 20న అలప్పుజలోని పున్నప్రాలోని పేద కుటుంబంలో జన్మించిన వీఎస్ పూర్తి పేరు వెలిక్కకతు శంకరన్ అచ్యుతానందన్. చిన్న వయసులోనే తల్లిదండ్రులను కోల్పోయారు. కమ్యూనిస్ట్ పార్టీలో చేరడానికి ముందు దర్జీ దగ్గర, ఆ తరువాత కొబ్బరి ఫ్యాక్టరీలో పనిచేశారు. ఆ సమయంలోనే స్వాతంత్ర్య సమరయోధుడు వి.కె. కరుణాకరన్ సంభాషణలను వింటూ కమ్యూనిస్టు రాజకీయాల వైపు ఆకర్షితులయ్యారు. ట్రావెన్‌కోర్ దివాన్ పాలనకు వ్యతిరేకంగా జరిగిన కార్మికుల తిరుగుబాటులో పాల్గొన్నారు. అప్పుడాయన వయసు 23 సంవత్సరాలు. పోలీసు దాడుల్లో తీవ్రంగా గాయపడిన ఆయనను చనిపోయారని భావించి కొండపై నుంచి విసిరివేశారు. ప్రాణాలతో బయటపడ్డారు. కమ్యూనిస్టు పార్టీపై నిషేధం ఉన్న సమయంలో మళ్లీ అరెస్టయ్యారు. వ్యంగ్యం, పాటలతో కూడిన ఆయన విలక్షణ ప్రసంగాలు ఇట్టే ఆకట్టుకునేవి. ముక్కుసూటి మనస్తత్వం ఆయన తరచూ వివాదాల్లోకి నెట్టింది. అయినా ఎక్కడా రాజీ పడలేదు. అదే ఆయనను ప్రజలకు మరింత దగ్గర చేసింది. రాజకీయ ప్రత్యర్థులు సైతం అభిమానించిన గొప్ప నేత. ప్రతిపక్ష నేతగా అటవీ ఆక్రమణలు, అక్రమ లాటరీ మాఫియాకు వ్యతిరేకంగా బలమైన గొంతుకగా నిలిచారు. ముఖ్యమంత్రిగా అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టారు. ఆయనకు భార్య వసుమతి, కుమారుడు అరుణ్‌కుమార్, కుమార్తె ఆశా ఉన్నారు. అచ్యుతానందన్ మృతితో కేరళ నిబద్ధత కలిగిన గొప్ప నాయకుడిని కోల్పోయింది.

ప్రముఖుల నివాళులు..

తమ సీనియర్ నాయకుడి మృతికి సీపీఎం నివాళులర్పించింది. ''కామ్రేడ్ వి.ఎస్.అచ్యుతానందన్‌కు రెడ్ సెల్యూట్! ఆయన పోరాట జీవితం, ప్రజల కోసం అచంచలమైన అంకితభావం ఎప్పటికీ స్ఫూర్తిదాయకంగా ఉంటుంది.''అని ఎక్స్‌లో పోస్ట్ చేసింది. కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ కూడా వీఎస్‌కు నివాళులర్పించారు. ''కేరళ కమ్యూనిస్ట్ ఉద్యమ దిగ్గజం అయిన వీఎస్ అత్యంత ప్రజాదరణ పొందిన నాయకుడు. తన అంకిత భావంతో లక్షలాది మంది ఆయన అనుచర గణాన్ని సంపాదించుకున్న ఆయనకు నివాళి''అని ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

ఎన్‌పీవోల డొనేషన్లకు పన్ను మినహాయింపు

పార్లమెంటరీ కమిటీ సిఫారసు

న్యూఢిల్లీ: బీజేపీ నేత వైజయంతి పాండా సారథ్యంలోని పార్లమెంటరీ కమిటీ పన్ను మినహాయింపులపై కీలక సిఫారసులు చేసింది. మత సంబంధ లాభాపేక్ష లేని సంస్థ(ఎన్‌పీవో)లకు అందే అజ్ఞాత విరాళాలపై పన్ను మినహాయింపు కొనసాగించాలని సూచించింది. పన్ను రద్దు చేస్తే ప్రతికూల ప్రభావం పడుతుందని పేర్కొంది. ఆయా సంస్థల ఆధ్వర్యంలో నడిచే అదేవిధంగా, ఐటీఆర్ ఫైలింగ్ తుది గడువు ముగిశాక దరఖాస్తు చేసుకునే వారిపై ఎలాంటి జరిమానా విధించకుండా టీడీఎస్ రీఫండ్ చేయాలంది. నూతన ఆదాయ పన్ను చట్టం –2025పై సమీక్షకు ఏర్పాటైన 31 మంది సభ్యుల కమిటీ సోమవారం ఈ మేరకు నివేదికను లోక్‌సభ ముందుంచింది. ఇందులో ముఖ్యమైన 32 సిఫారసులను సూచించింది. దీనిపై లోక్‌సభ చర్చించి, అవసరమైన చర్యలు తీసుకుంటుంది. వీటి అమలుపై నిర్ణయాధికారం అంతిమంగా ప్రభుత్వానిదే.

నేరం చేశారంటే నమ్మలేం

- రైలు పేలుళ్ల కేసు విచారణలో బాంబే హైకోర్టు వ్యాఖ్య
- మొత్తం 12 మంది నిందితులకూ విముక్తి కల్పిస్తూ తీర్పు

ముంబై: ముంబైలో 19 ఏళ్ల క్రితం 180 మందికిపైగా ప్రాణాలను బలిగొన్న రైలు పేలుళ్ల కేసులో సోమవారం కీలక పరిణామం సంభవించింది. పోలీసులు నేర నిరూపణలో ఘోరంగా విఫలమయ్యారని బాంబే హైకోర్టు పేర్కొంది. నిందితులు ఈ నేరం చేశారంటే నమ్మడం కష్టంగా ఉందని వ్యాఖ్యానించిన న్యాయస్థానం మొత్తం 12 మందినీ నిర్దోషులుగా ప్రకటిస్తూ తీర్పు వెలువరించింది. 'నిందితుల నేరాంగీకార ప్రకటనలు ఏమాత్రం ఆమోదయోగ్యంగా లేవు. అవన్నీ కాపీ చేసినట్లుగా కనిపిస్తున్నాయి. నేరం అంగీకరించాలంటూ పోలీసులు తమను తీవ్రంగా హింసించారని పేర్కొనడం ద్వారా నిందితులు నేరాంగీకార విశ్వసనీయతను మరింత దెబ్బతీశారు'అని వ్యాఖ్యానించింది. నేరానికిగాను ఏ రకం బాంబులు వాడారనే విషయం కూడా పోలీసులు చెప్పలేకపోయారని, సేకరించిన ఆధారాలు నేరనిరూపణకు సరిపోయేవి కావంది. 'బాంబులు, సర్క్యూట్ బాక్సుల వంటి స్వాధీనమైన వస్తువులకు సరిగ్గా సీళ్లు వేయలేదు. వాటిని జాగ్రత్తగా భద్రపర్చలేదు. కీలకమైన సాక్షులను ప్రశ్నించడంలోనూ విఫలమైంది'అంటూ ప్రాసిక్యూషన్ తీరుపై విరుచుకుపడింది. నిందితులకు న్యాయపరమైన సాయం అందించకుండానే నేరాంగీకార ప్రకటన రికార్డు చేయడాన్ని కూడా ధర్మాసనం తప్పుబట్టింది. నిందితుల నేరాంగీకార స్టేట్‌మెంట్లలో ఏమాత్రం స్పష్టత లేదంది. పేలుళ్ల కేసుకు మహారాష్ట్ర కంట్రోల్ ఆఫ్ ఆర్గనైజ్డ్ క్రైం యాక్ట్(మోకా)ను వాడకపోవడాన్ని ఎత్తి చూపింది. 'అసలైన నేరస్తుడిని శిక్షించడం నేర కార్యకలాపాలను అరికట్టడానికి, చట్టాన్ని నిలబెట్టడానికి, పౌరుల భద్రతను నిర్ధారించే దిశలో ఒక ముఖ్యమైన అడుగు'అని జస్టిస్ అనిల్ కిలోర్, జస్టిస్ శ్యామ్ చందక్‌ల ధర్మాసనం తన 671 పేజీల తీర్పులో పేర్కొంది. 'అందుకు విరుద్ధంగా ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీసేలా, సమాజానికి తప్పుడు సంకేతాన్ని పంపేలా ప్రాసిక్యూషన్ వ్యవహరించింది. అసలైన ముప్పు ఇప్పటికీ తొలగలేదనే విషయం ఈ కేసుతో తేటతెల్లమైంది'అని మండిపడింది. 'నిందితులపై కేసును నిరూపించడంలో ప్రాసిక్యూషన్ పూర్తిగా విఫలమైంది. నిందితులు నేరానికి పాల్పడ్డారని నమ్మడం కష్టం. అందుకే వారిపై ఆరోపణలను కొట్టివేస్తున్నాం' అని ధర్మాసనం పేర్కొంది. రైళ్లలో బాంబులు అమర్చడం తదితర నేరాలకు పాల్పడిన ఆరోపణలపై ప్రత్యేక కోర్టు మరణ శిక్ష ప్రకటించిన నలుగురితోపాటు జీవిత కాల జైలు శిక్షలు పడిన ఏడుగురిని నిర్దోషులుగా ప్రకటిస్తూ తీర్పు వెలువరించింది. వీరిలో మరణ శిక్ష పడిన కమాల్ అన్సారీ 2021లో జైలులోనే చనిపోయాడు. మహానగరం ముంబైలోని స్థానిక రైళ్లు ఏడింటిలో 2006 జూలై 11న పేలుళ్లు సంభవించాయి. ఘటనల్లో 180 మందికిపైగా ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే.

ఈడీ అన్ని పరిమితులను దాటుతోంది: సుప్రీం

న్యూఢిల్లీ: ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తీరుపై సుప్రీంకోర్టు తీవ్రంగా ధ్వజమెత్తింది. న్యాయపరమైన సలహాల కోసం లాయర్లకు సమన్లు పంపడంపై సీరియస్ అయ్యింది. అన్ని పరిమితులను దాటుతున్న ఈడీకి మార్గదర్శకాలు జారీ చేయాల్సిన అవసరముందని పేర్కొంది. న్యాయవాద వృత్తి స్వతంత్రతపై ఇటువంటి చర్యల ప్రభావం ఉండరాదని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ వినోద్‌చంద్రన్‌ల ధర్మాసనం పేర్కొంది. అరవింద్ దాతర్, ప్రతాప్ వేణుగోపాల్ అనే లాయర్లకు ఈడీ సమన్లు ఇవ్వడాన్ని సుమోటోగా ధర్మసనం సోమవారం విచారణ చేపట్టింది. ఈ విషయాన్ని ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుందని, న్యాయ సలహా కోసం లాయర్లకు నోటీసులు ఇవ్వొద్దని ఆదేశించిందని ఈ సందర్భంగా అటార్నీ జనరల్ ఆర్ వెంకటరమణి, సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా నివేదించారు. లాయర్లకు నోటీసులివ్వడంపై వస్తున్న వార్తలు తనకు ఆశ్చర్యం కలిగించాయని సీజేఐ పేర్కొన్నారు. అయితే, మీడియా కథనాల ఆధారంగా అభిప్రాయాలను ఏర్పర్చుకోవడం సరికాదని తుషార్ మెహతా తెలిపారు. ఈడీ అతిగా స్పందించిన సందర్భాలు చాలా ఉన్నాయన్న జస్టిస్ గవాయ్.. తాము వార్తలను, యూట్యూబ్ ఇంటర్వ్యూలు చూడమని, గత వారం కొన్ని సినిమాలు మాత్రమే చూశామని అన్నారు. తమ తీర్పులు వాస్తవాల విషయాల ఆధారంగానే ఉంటాయి తప్ప..వార్తలు, అభిప్రాయాలను బట్టి ఉండవని ధర్మాసనం తెలిపింది. 'అంతిమంగా, మనమందరం న్యాయవాదులం'అంటూ సీజేఐ..కోర్టు గదిలో వాదనలను మరో విధంగా భావించరాదన్నారు. ఈ అంశంపై తదుపరి విచారణను 29వ తేదీకి వాయిదా వేశారు.



మేం ఖాళీ చేయం..!
మోడల్ ఇందిరమ్మ కాలనీ ఏర్పాటు చేయాలన్న ప్రభుత్వ సంకల్పానికి ఆదిలోనే గండి పడుతోంది. బస్తీల్లో జీ ప్లస్ త్రీ గృహ సముదాయాల ప్రతిపాదనలకు నివాసితులు నో అంటున్నారు. -10లో



నేచర్‌లో.. నేర్చుకో..
నింగి, నేల, నీరు, నిప్పు, రాయీ రప్ప..పాఠ్యాంశాలుగా అవుట్ డోర్ క్లాస్ రూమ్ పాఠాలకు నగరవాసులు జై కొడుతున్నారు. ఆరుబయట అభ్యాసం..భలే ఉందంటున్నారు. -సిటీప్లస్‌లో

గరిష్టం/కనిష్టం
31.0/23.0
వాతావరణం
నగరంలో మంగళవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా వర్షం కురిసే అవకాశముంది. గరిష్టంగా 31, కనిష్టంగా 23 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయని అంచనా.

ఘటం.. ఘనం

పాతబస్తీలో అంగరంగ వైభవంగా సామూహిక ఘటాల ఊరేగింపు



అంబారీపై అక్కన్న మాదన్న ఆలయ అమ్మవారి ఘటం ఊరేగింపు..



లాల్‌దర్వాజ సింహవాహిని ఆలయం వద్ద ఘటాల ఊరేగింపు

బోనాల వేడుకల్లో భాగంగా పాతబస్తీలో సోమవారం సాయంత్రం శ్రీ మాతేశ్వరీ ఘటాల ఊరేగింపు అంగరంగ వైభవంగా కొనసాగింది. అద్భుతమైన అలంకరణలతో ఘటాలను వాహనాలపై ఉంచి...పెద్ద ఎత్తున భక్త జనం తరలి రాగా...పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు, యువత నృత్యాలతో ఘటాల ఊరేగింపు సందడిగా సాగింది. పోలీసుల పటిష్టమైన బందోబస్తు చర్యల నడుమ ఊరేగింపు ప్రశాంతంగా కొనసాగింది. భవిష్యవాణి అనంతరం మాతేశ్వరీ ఘటాల ఊరేగింపునకు శ్రీకారం చుట్టారు. పాతబస్తీలోని అన్ని ప్రధాన దేవాలయాలకు చెందిన అమ్మవారి ఘటాలు ఈ ఊరేగింపులో పాల్గొని భక్తులకు దర్శనమిచ్చాయి. భాగ్యనగర్ శ్రీ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ ఆధ్వర్యంలో చార్మినార్ వద్ద అమ్మవారి ఘటాలకు పలువురు అధికార, అనధికార ప్రతినిధులు ఘనంగా స్వాగతం పలికారు.

ఆకట్టుకున్న ఆపరేషన్ సింధూర్ శకటం

మీరాలంమండి శ్రీ మహంకాళేశ్వర అమ్మవారి ఘటంతో పాటు వివిధ రకాల శకటాలు, కళా బృందాలు దారిపొడవునా భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆపరేషన్ సింధూర్ పేరుతో ఏర్పాటు చేసిన శకటం ఊరేగింపునకే హైలెట్‌గా నిలిచింది. సింహాల రథంపై అమ్మవారి ఘటాన్ని ఊరేగింపుగా తరలించారు. మీరాలంమండి నుంచి సాయంత్రం 6 గంటలకు బయలు దేరి రెండు గంటల పాటు మీర్‌చౌక్ పీఎస్ రోడ్డు, చెడవ్ మసీద్, అలీజా కోట్ల, కోట మైసమ్మ, సర్దార్ మహల్ గుండా దారిపొడవునా భక్తులను అలరించి చార్మినార్‌కు చేరుకుంది. పాతబస్తీలోని అన్ని దేవాలయాలలో తొమ్మిది రోజుల పాటు జరిగిన అమ్మవారి పూజలలో పాతబస్తీ ప్రజలు పాల్గొని బోనాలు సమర్పించారు. అత్యంత వైభవంగా జరిగిన ఈ బోనాల జాతర ఉత్సవాలు సోమవారం నిర్వహించిన మాతేశ్వరీ ఘటాల ఊరేగింపుతో ముగిశాయి.

- చార్మినార్



మీరాలం మండిలో ఆకట్టుకున్న ఆపరేషన్ సింధూర్ శకటం



గజరాజు ఆశీర్వాదం తీసుకుంటున్న సీపీ సీవీ ఆనంద్



ఘటాల ఊరేగింపులో యువతుల నృత్యాలు

అనుమతులు సరే... ఆటోలు నడిచేదెలా?



గ్రేటర్‌లో భారీగా సీఎన్జీ కొరత

- కొత్తగా రోడ్డెక్కనున్న 10 వేల సీఎన్జీ ఆటోలు
- సీఎన్జీ, ఎల్పీజీ వాహనాలకే ఎక్కువ డిమాండ్
- నగరంలో అరకొరగా సీఎన్జీ బంకులు

గ్రేటర్ హైదరాబాద్‌లో
మొత్తం వాహనాల సంఖ్య : 78 లక్షలు
ఎల్పీజీ, సీఎన్జీ వాహనాలు : 4.5 లక్షలు
ఎల్పీజీ, సీఎన్జీ ఆటోరిక్షాలు : 1.4 లక్షలు
కొత్తగా రోడ్డెక్కనున్న ఎల్పీజీ, సీఎన్జీ ఆటోలు : 20 వేలు
లీటర్ పెట్రోల్ ధర : రూ.107.46
లీటర్ డీజిల్ ధర : రూ.95.70
ఒక కిలో సీఎన్జీ ధర : రూ.96
ఒక కిలో ఎల్పీజీ ధర : రూ.43.01



సాక్షి, సిటీబ్యూరో

గ్రేటర్‌లో సహజ ఇంధనాల కొరత అతి పెద్ద సవాల్‌గా మారింది. ఒకవైపు సీఎన్జీ, ఎల్పీజీ వాహనాలు పెద్ద ఎత్తున రోడ్లపైకి వస్తున్నాయి. వ్యక్తిగత కార్లలో పెట్రోల్, డీజిల్ వాహనాల తరువాత సీఎన్జీ వాహనాలే ఎక్కువగా ఉన్నాయి. కొంతకాలంగా ఎలక్ట్రిక్ వాహనాల వైపు మొగ్గుచూపుతున్నప్పటికీ చార్జింగ్ కేంద్రాలు తక్కువగానే ఉన్నాయి. ఈ క్రమంలో పెట్రోల్, డీజిల్‌కు సీఎన్జీ, ఎల్పీజీ ప్రత్యామ్నాయంగా మారింది. ప్రభుత్వం తాజాగా 20 వేల సీఎన్జీ, ఎల్పీజీ ఆటోలకు పర్మిట్లను విడుదల చేసింది.

ఇప్పటికే సుమారు 10 వేల మందికి పైగా ఈ కేటగిరీలకు చెందిన వాహనాలను కొనుగోలు చేసేందుకు తమ పేర్లను నమోదు చేసుకున్నారు. మరి కొద్ది రోజుల్లో ఈ పర్మిట్ల ప్రక్రియ ముగిసి కొత్త ఆటోలు రోడ్డెక్కనున్నాయి. ఇప్పటికే నగరంలో సుమారు 1.4 లక్షల ఆటోరిక్షాలు సహజ ఇంధనాలను వినియోగిస్తున్నాయి. వాహన కాలుష్యాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం కొంత కాలంగా ఎల్పీజీ, సీఎన్జీ ఆటోలకు మాత్రమే అనుమతులను ఇస్తోంది. ఈసారి ఎలక్ట్రిక్ ఆటోలకు కూడా అనుమతులను ఇచ్చారు. కానీ వాటి ధరలు, విద్యుత్ చార్జీ కేంద్రాలు అందుబాటులో లేకపోవడం వంటి కారణాల దృష్ట్యా ఆటో డ్రైవర్లు సైతం ఎల్పీజీ, సీఎన్జీ వాహనాలకే మొగ్గుచూపుతున్నారు. దీంతో ఇప్పుడు ఉన్న 1.4 లక్షల ఆటోలతో పాటు మరో 20 వేలు కొత్తగా పెరగనున్నాయి. ఈ మేరకు నగరంలో ఈ ఇంధనాల లభ్యతను పెంచేందుకు చర్యలు చేపట్టవలసి ఉంది.

బంకులు అరకొర..

కంప్రెస్డ్ నేచురల్ గ్యాస్ (సీఎన్జీ) వినియోగంలోకి మారేందుకు చాలామంది ఆసక్తి చూపుతున్నారు. పెట్రోల్, డీజిల్ వినియోగంలోంచి సీఎన్జీలోకి మారేందుకు వాహనాల్లో రిట్రోఫిట్‌మెంట్ కిట్‌లను అమర్చుకుంటున్నారు. దీంతో ఏటేటా సీఎన్జీకి డిమాండ్ పెరుగుతోంది. భాగ్యనగర్, మేఘా, టోరెంట్, గోగో తదితర కంపెనీలు నగరంలో ప్రస్తుతం సీఎన్జీ సరఫరా చేస్తున్నాయి. కానీ డిమాండ్ మేరకు అందుబాటులో లేదు. దీంతో బంకుల వద్ద కిలోమీటర్ల కొద్దీ వాహనాలు బారులు తీరుతున్నాయి. ఎల్పీజీకీ సైతం ఇదేస్థాయిలో భారీ డిమాండ్ ఉంది. కానీ సీఎన్జీ కంటే ఎల్పీజీ సరఫరా కొంత వరకు మెరుగ్గానే ఉంది. గ్రేటర్ హైదరాబాద్‌లో సుమారు 812 బంకులు ఉన్నాయి. వీటిలో సీఎన్జీ, ఎల్పీజీ లభించే బంకులు 141 మాత్రమే ఉన్నాయి. దీంతో వాహనదారులు ఈ ఇంధనాల కోసం పడిగాపులుకాయాల్సి వస్తోంది. రవాణాశాఖ లెక్కల ప్రకారం సుమారు 4.5 లక్షల వాహనాలు సీఎన్జీ, ఎల్పీజీ వినియోగిస్తున్నాయి. కొత్తగా రోడ్డెక్కనున్న ఆటోరిక్షాల వల్ల ఈ ఇంధనాలకు డిమాండ్ మరింత పెరగనుంది. పెట్రోల్, డీజిల్ వాహనాలు ఒక లీటర్‌కు వాటి సామర్థ్యం మేరకు సుమారు 15 కి.మీ.వరకు వెళ్లగలిగితే సీఎన్జీ, ఎల్పీజీ వాహనాలు ఒక కిలో వినియోగానికి 25 కి.మీ.వరకు మైలేజీనిస్తాయి. ఈ విధంగా కూడా ఈ ఇంధనాల వినియోగం ఎక్కువ.

ఇంధనాల సరఫరా పెంచాలి..

''ఆటోడ్రైవర్లకు ఉపాధి కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం పర్మిట్లు ఇవ్వడం బాగానే ఉంది. కానీ ఎల్పీజీ, సీఎన్జీ అందుబాటులో లేకపోవడం వల్ల ఆటోడ్రైవర్లు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కొత్తగా ఔటర్‌రింగ్‌రోడ్డు వరకు అనుమతులు ఇచ్చారు. ఈ మేరకు బంకుల్లో ఈ ఇంధనాల సరఫరాను పెంచాలి' అని ఏఐటీయూసీ ప్రధానకార్యదర్శి బి.వెంకటేశం డిమాండ్ చేశారు. ఎల్పీజీ, సీఎన్జీ కొనుగోలు చేసేందుకు ఆటోడ్రైవర్లు రాత్రింబవళ్లు బంకుల్లోనే పడిగాపులు కాయడం వల్ల ఉపాధిని కోల్పోవలసి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. మరోవైపు ఇప్పటి వరకు ఆటోరిక్షాల కోసం సుమారు 15 వేల మంది దరఖాస్తు చేసుకున్నారని, కానీ ఆర్టీఏ అధికారులు సకాలంలో అనుమతులను ఇవ్వకుండా జాప్యం చేస్తున్నారని ఆటో సంఘాలు ఆరోపిస్తున్నాయి. డ్రైవర్ల వివరాలను పరిశీలించిన వెంటనే ప్రాసీడింగ్‌లను సైతం అందజేయాలని వివిధ సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

25 నుంచి రేషన్ కార్డుల పంపిణీ : కలెక్టర్



సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ జిల్లాలో ఈ నెల 25 నుంచి వచ్చే నెల 10 వరకు నిర్వహించే కార్యాక్రమాల పర్యవేక్షణ కోసం ప్రతి నియోజకవర్గానికి ఒక నోడల్ అధికారి, మండలాలకు ప్రత్యేక అధికారులను నియమిస్తున్నట్లు కలెక్టర్ హరిచందన దాసరి వెల్లడించారు. సోమవారం సీఎం వీడియో కాన్ఫరెన్స్ అనంతరం ఆమె మాట్లాడారు. అన్ని మండల కేంద్రాల్లో అధికారికంగా ఈ నెల 25 నుంచి రేషన్ కార్డుల పంపిణీ, మెడికల్ క్యాంపులకు సంబంధించిన షెడ్యూల్‌ను సిద్ధం చేయాలని ఆమె సూచించారు. వర్షాలు పడే ముందస్తు సమాచారాన్ని సేకరించి నగర ప్రజలను ముఖ్యంగా లోతట్టు ప్రాంత ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని సూచించారు. ఈ కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు జి.ముకుంద రెడ్డి, కదిరవన్ పలని, ఈ.వెంకటాచారి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటి, జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక విభాగం.. వసూళ్ల పర్వం!

నకిలీ ఉత్పత్తుల విక్రేతలే వీరి టార్గెట్

- కాపీరైట్ కేసులనూ వదలని అధికారులు
- 'భాగస్వాముల' సహకారంతో వ్యవహారం
- తాజాగా వీరి బారిన పొరుగు జిల్లా వ్యాపారి
- బెదిరించి రూ.10 లక్షలు లాక్కున్న వైనం
- విచారణకు ఆదేశించిన ఉన్నతాధికారులు
- గతంలోనూ ఇలాంటి వ్యవహారాలు ఎన్నో



సాక్షి, సిటీబ్యూరో: అది నగర పోలీసు విభాగానికి గుండెకాయ వంటి ప్రత్యేక విభాగం...ఏడు బృందాలతో ఉండే ఆ వింగ్ గతంలో రెండు కేంద్రాలుగా పని చేసేది.. ఇప్పుడా సంఖ్య మూడుకు పెరిగింది. 'ఊరికి ఉత్తరం'గా ఉన్న కేంద్రంలోని ఓ బృందం వసూళ్ల, బెదిరింపుల దందాకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. ఈ వ్యవహారంలో వీళ్ల కొందరు 'భాగస్వాములతో' కలిసి వ్యవస్థీకృతంగా వ్యవహరిస్తున్నారు. ఇటీవల పొరుగు జిల్లాకు చెందిన ఓ వ్యాపారిని నకిలీ పొగాకు ఉత్పత్తుల విక్రయం పేరుతో బెదిరించి రూ.10 లక్షలు దండుకున్నారు. దీనిపై సమాచారం అందుకున్న ఉన్నతాధికారులు సమగ్ర విచారణకు ఆదేశించారు. ఈ కేంద్రం కేంద్రంగా గతంలోనూ ఇలాంటి వ్యవహారాలు అనేకం జరిగినట్లు తెలుస్తోంది.

డబ్బు ఇస్తానంటూ పిలిపించి...

నగరంలోని మధ్య మండలం కేంద్రంగా వ్యాపారం చేసే ఓ వ్యాపారి గతంలో నకిలీ పొగాకు ఉత్పత్తులు సరఫరా చేసేవాడు. ఈ దందాలో పొరుగు జిల్లాకు చెందిన మరో వ్యాపారి ఇతడికి భాగస్వామిగా ఉండేవాడు. ప్రత్యేక విభాగానికి చెందిన ఓ బృందంతో నగర వ్యాపారి టచ్‌లో ఉంటుంటాడు. కొన్ని రోజుల క్రితం ఇతడి సహకారంతో ఆ బృందం అధికారులు పొరుగు జిల్లా వ్యాపారిని టార్గెట్ చేశారు. నగర వ్యాపారి అతడికి కొంత నగదు ఇవ్వాల్సి ఉంది. ఆ మొత్తం ఇస్తానంటూ సిటీ వ్యాపారి ద్వారానే అతడిని పిలిపించి, అదుపులోకి తీసుకుని, తమ కార్యాలయానికి తరలించారు. ఆ సమయంలో అతడి వద్ద ఎలాంటి నకిలీ ఉత్పత్తులు లభించలేదు.

నిర్బంధించి, బెదిరించి రూ.10 లక్షలు...

పొరుగు జిల్లా వ్యాపారిని తమ కార్యాలయంలో నిర్బంధించిన ప్రత్యేక విభాగానికి చెందిన బృందం తీవ్రంగా బెదిరించింది. నకిలీ ఉత్పత్తులు దొరక్కపోయినా తమ వద్ద ఉన్న గంజాయిని రికవరీ చూపించి మాదకద్రవ్యాల కేసు నమోదు చేస్తామని బెదిరించింది. అలా కాకుండా ఉండాలంటే భారీ మొత్తం చెల్లించాలని డిమాండ్ చేసింది. బేరసారాల తర్వాత రూ.10 లక్షలు వసూలు చేసి, ఎవరికీ చెప్పద్దని బెదిరించి ఆ వ్యాపారిని విడిచిపెట్టింది. ఈ మొత్తం నుంచి నగర వ్యాపారికీ కొంత వాటా ఇచ్చారని తెలుస్తోంది. పొరుగు జిల్లా వ్యాపారి ఎట్టకేలకు ధైర్యం చేసి తనకు జరిగిన అన్యాయంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు సమగ్ర విచారణకు ఆదేశించారు. ఈ వ్యవహారంలో అధికారుల నుంచి సిబ్బంది వరకు ఆరుగురి పాత్ర ఉన్నట్లు సమాచారం.

గతంలోనూ అనేక విధాలుగా వసూళ్లు...

ఈ బృందానికి చెందిన అధికారులు, సిబ్బంది గతంలోనూ వివిధ పంథాలను అనుసరించి భారీ మొత్తాలు వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రముఖ కంపెనీల పేర్లతో నకిలీ ఉత్పత్తుల విక్రయాలు నగరంలో జోరుగా సాగుతున్నాయి. ఈ వ్యాపారులపై దాడులు చేసి భారీ మొత్తంలో సరుకు పట్టుకున్నప్పుడు ఆ వ్యాపారులతో డీల్ కుదుర్చుకోవడం చేశారు. అక్కడ దొరికిన సరుకులో 20 నుంచి 30 శాతం మాత్రమే రికవరీ చూపిస్తూ మిగిలింది వ్యాపారి వద్దే వదిలేసేశారు. దీని కోసం భారీ మొత్తం వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. అంతర్జాతీయ బ్రాండ్ సెల్‌ఫోన్ల కంపెనీ పేరుతో తయారైన నకిలీ ఉత్పత్తుల విషయంలో ఇలానే చేసినట్లు తెలుస్తోంది.

భాగస్వాముల్ని మచ్చిక చేసుకుని వ్యవహారం

ఈ అక్రమ ద్రవ్యమార్పిడి దందాల్లో ఉన్న భాగస్వాముల్ని ఈ బృందం మచ్చిక చేసుకుంటోంది. వారి ద్వారానే నగరంలోని వివిధ ప్రాంతాలకు రవాణా అవుతున్న హవాలా డబ్బు పట్టుకుంటోంది. దీనిపై కేసులు లేకుండా భారీ మొత్తాలు తీసుకుని పంచుకుంటున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఈ బేరసారాల్లో తేడా రావడంతోనే ఇటీవల రూ.17 లక్షలకు సంబంధించి వ్యవహారం నడిచింది. బెట్టింగ్ దందాలో ఉన్న బుకీలు, పంటర్లను ఈ బృందం వదలట్లేదు. వాళ్లు చిక్కినప్పుడు సంబంధిత ఠాణాల్లో ఎఫ్ఐఆర్‌లు కాకుండా తక్కువ తీవ్రత గల కేసులు నమోదు చేయించడానికి వారితో ఒప్పందాలు చేసుకుంటున్నారు. దీని నిమిత్తం ఈ బృందం రేటు కట్టి మరీ ఆయా పంటర్లు, బుకీల నుంచి వసూళ్లకు పాల్పడుతోందనే ఆరోపణలు ఉన్నాయి.

సమన్వయ లోపం.. ప్రజలకు శాపం!

జీహెచ్ఎంసీ-హైడ్రా మధ్య కనిపించని ఐక్యత

- వానల్లోనూ అధికార యంత్రాంగాల అశ్రద్ధ



సాక్షి, సిటీబ్యూరో: నగరంలో గత నాలుగు రోజులుగా వానలు కురుస్తున్నాయి. మరో నాలుగైదు రోజుల పాటు వర్షాలుంటాయని వాతావరణశాఖ హెచ్చరికలున్నాయి. ఈ నేపథ్యంలో, కోటి మందికి పైగా ప్రజలకు సేవలందించాల్సిన ప్రభుత్వ యంత్రాంగాలు ఐక్యంగా సమన్వయంతో ప్రజలకు ఇబ్బందుల్లేకుండా ఎప్పటికప్పుడు తగిన చర్యలతో పనులు చేయాల్సి ఉండగా, అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నాయి. దీంతో ప్రజలు పడరాని పాట్లు పడుతున్నారు. వర్షంలో ఎక్కడ ఏ గుంత ఉందో, ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందో తెలియక, తప్పనిసరి ప్రయాణాలు చేయాల్సిన వారు వణికిపోతున్నారు. తమవైపు నుంచి చేయాల్సిన పనులు చేస్తున్నామని జీహెచ్ఎంసీ ఇంజినీర్లు చెబుతున్నారు. తాము హైడ్రాకు సహకరిస్తున్నప్పటికీ, వారి నుంచి ఉండాల్సిన స్పందన ఉండటం లేదని ఆరోపించారు. హైడ్రా అధికారులకు నగరంలో వాటర్ లాగింగ్ పాయింట్లు ఎక్కడ ఉన్నాయో, అక్కడి నుంచి వాన నీరు ఏ నాలాలోకి వెళ్తుందో వారికి ఎన్నో పర్యాయాలు తెలియజేశామన్నారు. నగరంలో ప్రస్తుతమున్న 141 వాటర్‌లాగింగ్ ప్రాంతాల వివరాలు తెలిపామని చెప్పారు. గత శనివారం జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్లు కూడా హైడ్రా అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారని, జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో జరిగిన జోనల్ కమిషనర్లు, సూపరింటెండింగ్ ఇంజినీర్ల సమావేశంలో సైతం హైడ్రా అధికారులు తగిన విధంగా స్పందించాల్సిందిగా కోరినట్లు ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు. వాటర్ లాగింగ్ ప్రాంతాలతో పాటు క్యాచ్‌పిట్ల వద్ద, ఫుట్‌పాత్‌ల పక్కన పేరుకుపోయే సిల్ట్‌ను తొలగించాల్సి ఉండగా, ఆ పనులు జరగడం లేదని కొందరు ఈఈలు ఆరోపించారు. సిల్ట్ తొలగించకపోవడంతో క్యాచ్‌పిట్లలోకి నీరు వెళ్లక రోడ్లు చెరువులయ్యే ప్రమాదం ఉందన్నారు. వర్షం వెలిసిన సమయాల్లో ఈ పనులు చేయాల్సి ఉన్నప్పటికీ, అవి జరగడం లేదని ఆరోపించారు.

హైడ్రా చేయాల్సిన పనులు

జూన్ 9వ తేదీన జారీ అయిన మెమో ప్రకారం హైడ్రా ఏమేం పనులు చేయాలో స్పష్టంగా తెలిపారని, ఆ మేరకు మాన్సూన్ ఎమర్జెన్సీ పనుల్లో భాగంగా దిగువ పనులు చేయాల్సి ఉందని జీహెచ్ఎంసీ ఇంజినీర్లు పేర్కొన్నారు.

- క్యాచ్‌పిట్ల మూతలపై పేరుకుపోయిన చెత్తాచెదారాలు తొలగించాలి.
- అవసరాన్ని బట్టి ట్రాఫిక్ డైవర్షన్ చర్యలు చేపట్టాలి.
- నాలా సేఫ్టీ ఆడిట్ నిర్వహించాలి.
- వర్షాలు వెలిశాక నాలాల్లో పూడికతీత పనులు చేయాలి.
- రోడ్లపై ఉండే పూడిక తొలగించాలి.
- వరదనీరు నాలాల్లోకి సాఫీగా వెళ్లేందుకు ఏవైనా ఆటంకాలుంటే తొలగించాలి.
- రోడ్లపై పడే విద్యుత్‌స్తంభాలు, చెట్టకొమ్మలు తొలగించాలి.

గతంలో వానాకాలంలో అత్యవసర పనులు చేసేందుకు జీహెచ్ఎంసీ మాన్సూన్ ఎమర్జెన్సీ టీమ్స్ (ఎంఈటీ)ను నియమించేది. వాటికి సంబంధించి అక్రమాలకు తెరలేపారని గుర్తించిన ప్రభుత్వం జీహెచ్ఎంసీ ఈ సంవత్సరం పిలిచిన టెండర్లను రద్దు చేయడంతో పాటు, వానాకాల సమస్యల పరిష్కార బాధ్యతల్ని హైడ్రాకు బదలాయించింది. హైడ్రాతో సమన్వయంతో పనిచేయాలని, తగిన సహకారం అందించాలని జీహెచ్ఎంసీతోపాటు ఇతరత్రా విభాగాలకు కూడా సూచించినట్లు సమాచారం.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



తరుణ్ కుమార్ మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలిస్తున్న పోలీసులు

రాజేంద్రనగర్: స్నేహితుడిని ఇంటి వద్ద వదిలి వెళుతుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓయువకుడు మృతి చెందిన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై రాజ్‌కుమార్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి... మెహిదీపట్నం మురాత్‌నగర్ చెందిన తరుణ్ కుమార్ (23) ప్రైవేటు ఉద్యోగి. బోనాల పండుగ సందర్భంగా తన ఇంటికి వచ్చిన స్నేహితుడు తరుణ్ కుమార్‌ను ఆదివారం రాత్రి రాజేంద్రనగర్‌లో దిగబెట్టేందుకు వచ్చాడు. తెల్లవారుజామున బైక్‌పై ఇంటికి తిరిగి వెళుతుండగా రాజేంద్రనగర్ పీవీ నర్సింహారావు ఎక్స్‌ప్రెస్‌వే 218 సమీపంలో ముందు వెళుతున్న లారీని వెనుక నుంచి బలంగా ఢీకొట్టాడు. ఈ ఘటనలో తీవ్ర గాయాలు కావడంతో తరుణ్ కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. రాజేంద్రనగర్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. మృతుడి సెల్‌ఫోన్ ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం అందించిన పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్‌ఐ, హెడ్ కానిస్టేబుల్‌పై దాడి

ఫలహారం బండి ఊరేగింపులో ఘటన

ఉప్పల్/రామంతాపూర్: బోనాల ఉత్సవాల నేపథ్యంలో ఆదివారం సాయంత్రం ఫలహారం బండి ఊరేగింపులో కొందరు ఆకతాయిలు బందోబస్తులో ఉన్న ఎస్‌ఐ, హెడ్ కానిస్టేబుల్‌పై దాడికి పాల్పడిన సంఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. రామంతాపూర్ భరత్ నగర్‌కు చెందిన రామరాజు ఆదివారం రాత్రి ఫలహారం బండి ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాడు. అదే సమయంలో వేగంగా వచ్చిన వాహనాన్ని అడ్డుకున్న పోలీసులు నెమ్మదిగా వెళ్లాలని సూచించారు. ఆ కారులో అనిల్, క్రాంతి ఉన్నారు. క్రాంతి మద్యం మత్తులో ఉండటంతో అతడిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దీంతో ఆగ్రహానికి లోనైన అనిల్ తన అనుచరులతో స్టేషన్‌కు వచ్చి వాహనాన్ని, క్రాంతిని ఎందుకు తీసుకెళ్లారని ప్రశ్నిస్తూ ఎస్సైపై దురుసుగా ప్రవర్తించి కర్రలు, రాళ్లతో దాడి చేశారు. దీంతో ఎస్‌ఐ మధు, హెడ్‌కానిస్టేబుల్ సురేష్, కానిస్టేబుల్ లఖన్‌కు గాయాలయ్యాయి. దాడికి పాల్పడిన వారిని హబ్సిగూడకు చెందిన మామిడాల అనిల్, మేడిపల్లికి చెందిన లక్ష్మణ్, రామంతాపూర్‌కు చెందిన రామరాజు, సాయిగా గుర్తించిన పోలీసులు వారిపై కేసు నమోదు చేశారు. ఈ ఘటనలో పాల్గొన్న కొందరు పరారీలో ఉండటంతో వారి కోసం గాలింపు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.





ఎస్‌ఐపై దాడి చేస్తున్న దృశ్యం

మద్యం మత్తులో ఎస్‌ఐతో వాగ్వాదం

సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అరెస్టు

బంజారాహిల్స్: బోనాల వేడుకలు ముగిసిన అనంతరం ఎక్కడి వారిని అక్కడ పంపిస్తుండగా ఎస్‌ఐని దూషించడమేగాక కానిస్టేబుల్ ఫోన్ ధ్వంసం చేసి న్యూసెన్స్‌కు పాల్పడిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌ను బంజారాహిల్స్ పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే... బంజారాహిల్స్ రోడ్డునెంబర్-2లోని ఇందిరానగర్ బస్తీలో పోచమ్మ గుడి వద్ద ఆదివారం రాత్రి విధుల్లో ఉన్న సెక్టార్ ఎస్‌ఐ విజయ్, కానిస్టేబుల్ రాజ్‌కుమార్ అక్కడ గుమిగూడిన వారిని ఇళ్లకు పంపించే ప్రయత్నం చేస్తున్నారు. ఆ సమయంలో అదే బస్తీకి చెందిన రాకేష్ అనే సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ స్నేహితుడు అరుణ్‌తో కలిసి ఒకరిపై ఒకరు జోకులు వేసుకుంటూ న్యూసెన్స్ చేస్తున్నారు. దీంతో ఎస్‌ఐ విజయ్ వారిని ఇళ్లకు వెళ్లిపోవాలని చెప్పాడు. మద్యం మత్తులో ఉన్న రాకేష్ తాము ఇక్కడ ఉంటే మీకు ఏమంటూ దురుసుగా ప్రవర్తించాడు. అసభ్యకరంగా ప్రవర్తిస్తూ న్యూసెన్స్ చేయడమేగాక అక్కడే బైఠాయించాడు. అతడిని పైకి లేపడానికి యత్నిస్తున్న ఎస్‌ఐ, కానిస్టేబుళ్లపై దురుసుగా ప్రవర్తించడంతో కానిస్టేబుల్ రాజ్‌కుమార్ ఫోన్ కిందపడి ధ్వంసమైంది. దీంతో పోలీసులు రాకేష్‌పై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. బంజారాహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పోయిన బైక్ 8 ఏళ్లకు దొరికింది

ట్రాఫిక్ పోలీసుల తనిఖీల్లో గుర్తింపు



బంజారాహిల్స్: బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన వాహన తనిఖీల్లో ఎనిమిదేళ్ల క్రితం చోరీకి గురైన ఓ బైక్ పట్టుబడింది. వివరాల్లోకి వెళితే.. ఎల్బీనగర్ సాగర్ రింగ్‌రోడ్డులోని సద్గురునగర్ కాలనీకి చెందిన వట్రపాటి మహేష్‌కుమార్ 2017 సెప్టెంబర్ 7న రాత్రి ఇబ్రహీంపట్నం వందనా విహార్ రెస్టారెంట్‌కు వెళ్లి తన బైక్‌ను హోటల్ ముందు పార్కు చేశాడు. ఉదయం పార్కింగ్ స్థలంలో బైక్ కనిపించకపోవడంతో ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు చోరీ కేసు నమోదు చేశారు. ఇదిలా ఉండగా సోమవారం ఉదయం బంజారాహిల్స్ ట్రాఫిక్ క్రేన్ ఎస్‌ఐ సుమన్‌రెడ్డి సిబ్బందితో కలిసి బంజారాహిల్స్ రోడ్డునెంబర్-12లో రోడ్ల పక్కన అక్రమ పార్కింగ్ చేసిన ఓ బైక్‌ను సీజ్ చేసి చలానా విధించి క్రేన్‌లోకి ఎక్కించాడు. కొద్దిసేపట్లోనే అక్కడికి వచ్చిన అబూ అల్తామస్ అనే వ్యక్తి బైక్ తనదేనని చెప్పి జరిమానా చెల్లించాడు. బైక్ తీసుకుని అక్కడి నుంచి వెళ్లిపోతుండగా బంజారాహిల్స్ ఇన్‌స్పెక్టర్‌కు టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఫోన్ చేశారు. ఇంతకు ముందు మీరు సీజ్ చేసిన బైక్ చోరీ చేసినదని, వెంటనే ఆపాలని చెప్పారు. దీంతో సదరు వ్యక్తిని ఆపారు. అప్పటికే బైక్ యజమానికి చలానా విధించిన మెసేజ్ వెళ్లింది. ఈ బైక్ తనదేనని, చోరీకి గురైందని, సంబంధిత పత్రాలను అటు ఇబ్రహీంపట్నం పోలీసులు, అటు వాహన యజమాని పోలీసులకు పంపాడు. దీంతో సదరు బైక్‌తో పాటు అబూ అల్తామస్‌ను కూడా ఇబ్రహీంపట్నం పోలీసులకు అప్పగించారు.

యూసుఫ్‌గూడ కార్పొరేటర్‌పై కేసు నమోదు

బంజారాహిల్స్: బోనాల పండుగ విందులో గొడవ జరగడంతో యూసుఫ్‌గూడ కార్పొరేటర్ రాజ్‌కుమార్‌పటేల్‌తో పాటు మరో 13 మంది బీఆర్‌ఎస్ నేతలపై జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాల్లోకి వెళితే.. యూసుఫ్‌గూడ డివిజన్, శ్రీకృష్ణానగర్ బీ-బ్లాక్‌లో నివసించే బీఆర్‌ఎస్ నేతలు మల్లేష్ పటేల్, అతడి కుమారుడు ప్రవీణ్‌పటేల్ శనివారం రాత్రి తమ నివాసంలో బోనాల పండుగ విందు ఏర్పాటు చేసి యూసుఫ్‌గూడ కార్పొరేటర్ రాజ్‌కుమార్‌పటేల్‌ను ఆహ్వానించారు. ఈ విందు క్యాటరింగ్‌ను బీఆర్‌ఎస్‌కు చెందిన రవితేజపటేల్‌కు అప్పగించారు. రాత్రి రవితేజ భోజనాన్ని తీసుకుని ప్రవీణ్‌పటేల్ ఇంటికి వచ్చాడు. అందరూ భోజనం చేస్తుండగా మల్లేష్‌పటేల్ అక్కడే ఉన్న రవితేజ పటేల్‌ను ఉద్దేశించి నీ కారణంగా డివిజన్‌లో గొడవలు జరుగుతున్నాయని ఆరోపించాడు. దీంతో రవితేజ వార్డుమెంబర్ రవీందర్‌కు ఫోన్ చేసి తనను కించ పరుస్తున్నాడని ఫిర్యాదు చేశాడు. దీంతో రవీందర్ పది మందితో కలిసి నేరుగా మల్లేష్‌పటేల్ ఇంటికి రాగా అక్కడ ఉన్న బీఆర్‌ఎస్ నేతలు అడ్డుకున్నారు. దీంతో మల్లేష్‌పటేల్ అనుచరులు, రవీందర్‌పటేల్ అనుచరుల మధ్య వాగ్వాదం జరగడంతో ఒకరినొకరు నెట్టేసుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. దీంతో డయల్ 100కు సమాచారం అందించడంతో పోలీసులు అక్కడికి చేరుకుని రెండు గ్రూపులను పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసులు నమోదు చేశారు. కార్పొరేటర్ రాజ్‌కుమార్‌పటేల్‌తో పాటు ఆయన అనుచరులు ఆరుగురిపై, ఇటువైపు రవితేజపటేల్, రవీందర్‌తో పాటు మరో ఐదుగురిపై మొత్తం 14 మందిపై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మీడియా ప్రతినిధులపై పోలీసుల దురుసు ప్రవర్తన

మాదాపూర్: మాదాపూర్‌లోని శిల్పకళావేదికలో సోమవారం జరిగిన హరిహర వీరమల్లు ప్రీ లాంచ్ కార్యక్రమానికి వెళ్లిన మీడియా ప్రతినిధులపై పోలీసులు దురుసుగా ప్రవర్తించడమేగాక లాఠీచార్జ్ చేశారు. వివరాల్లోకి వెళితే పవన్ కళ్యాణ్ అభిమానులపై పోలీసులు లాఠీచార్జ్ చేస్తుండగా దానిని కవర్ చేస్తున్న మీడియా ప్రతినిధులపై మాదాపూర్ అడిషనల్ డీసీపీ ఉదయ్‌కుమార్‌రెడ్డి దురుసుగా ప్రవర్తించారు. పోలీసులు వైఖరిపై రంగారెడ్డి జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా జాయింట్ సెక్రటరీ మహమ్మద్ షకిల్ అసంతృప్తి వ్యక్తం చేశారు. తక్షణమే మీడియా ప్రతినిధులకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

భూ వివాదంలో 'విల్లా స్ప్రింగ్స్'కు ఎదురుదెబ్బ

ట్రయల్‌కోర్టు తీర్పులో జోక్యానికి హైకోర్టు నిరాకరణ

సాక్షి, హైదరాబాద్: మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా, అల్వాల్ మండలం, కొకూర్‌లోని భూ వివాదంలో విల్లా స్ప్రింగ్స్ హౌస్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. 2023, అక్టోబర్ 19న ట్రయల్‌కోర్టు ఇచ్చిన తీర్పులో జోక్యం చేసుకునేందుకు నిరాకరించింది. విల్లా స్ప్రింగ్స్ దాఖలు చేసిన సివిల్ రివిజన్ పిటిషన్‌ను కొట్టివేసింది. కొకూర్‌లో అసోసియేషన్‌లో 110 విల్లాలున్నాయి. వీటికి ఆనుకుని రెండెకరాల ఐదు గుంటల భూమిలో అసోసియేషన్‌కు 8 గుంటల భూమి వాడుకునేందుకు అనుమతి ఉందని, దీనికి సంబంధించి తమ వద్ద ఎంఓయూ ఉందంటూ నిక్సన్‌నాథన్ అనే వ్యక్తితోపాటు మరికొందరు ఆ స్థలాలను ఆట స్థలాలుగా మార్చారు. అయితే సదరు రెండెకరాల ఐదు గుంటల భూమిని తాను కొనుగోలు చేశానని, అప్పటి నుంచి నిక్సన్ అండ్ కో తనను వేధించడమే కాకుండా దౌర్జన్యానికి దిగారని అదే అసోసియేషన్ నివాసి మౌనికదేవి వాదన. ఈ వివాదం కోర్టుకు చేరింది. విచారణ చేపట్టి వాదనలు విన్న ట్రయల్‌కోర్టు ఆ భూమిపై మౌనికకు అనుకూలంగా ఇంజక్షన్ ఉత్తర్వులు ఇచ్చింది. దీనిని సవాల్ చేస్తూ విల్లా స్ప్రింగ్స్ హైకోర్టులో అప్పీల్ చేసింది. దీనిపై జస్టిస్ తడకమళ్ల వినోద్‌కుమార్ విచారణ చేపట్టి తాజాగా తీర్పునిచ్చారు. ట్రయల్‌కోర్టు అన్ని అంశాలను పరిశీలించిన తర్వాతే తుది ఉత్తర్వులు జారీ చేశాసిందని, పొరుగు భూమిపై తమకు హక్కు ఉందంటూ అనవసర రాద్ధాంతం చేస్తున్న విల్లా స్ప్రింగ్స్‌కు ఎలాంటి హక్కులు లేవని తేల్చిచెప్పారు. 17 ఏళ్ల నుంచి ఆ భూమిని వాడుకుంటున్నామన్న నిక్సన్ వాదనలో నిజం లేదన్నారు. ఎంఓయూ రాసుకున్నదే 2015లో అని.. అదీ రిజిస్టర్ చేయలేదన్నారు. అందులోనూ భూ యజమానులు అమ్ముకునే వరకు 3 గుంటలే వాడుకునేందుకు ఒప్పందం ఉందని, 8 గుంటలు అని చెప్పడం అవాస్తవమని చెప్పారు. మౌనికాదేవికి అమ్మడానికి ముందే ఆ అనధికారిక ఎంఓయూను కూడా రద్దు చేశారంటూ.. విల్లా స్ప్రింగ్స్ దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేశారు.

ఐఏఎస్ అధికారి గొలుసు చోరీ

ఫైవ్‌స్టార్ హోటల్‌లో ఘటన

బంజారాహిల్స్: న్యూఢిల్లీకి చెందిన ఓ ఐఏఎస్ అధికారి బంగారు గొలుసు చోరీకి గురైన సంఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. న్యూఢిల్లీకి చెందిన ఐఏఎస్ అధికారి అజయ్‌కుమార్ ఝా విధి నిర్వహణలో భాగంగా హైదరాబాద్‌కు వచ్చి బంజారాహిల్స్ రోడ్డునెంబర్-2లోని ది లీలా ఫైవ్ స్టార్ హోటల్‌లో బస చేశాడు. ఉదయం హోటల్‌లోనే స్విమ్మింగ్ పూల్‌కు వెళ్లిన అతను ఈత అనంతరం గదిలోకి వచ్చి చూసుకోగా రూ.2 లక్షలు విలువైన బంగారు గొలుసు కనిపించలేదు. దీంతో ఆయన హోటల్ సిబ్బందికి సమాచారం ఇచ్చాడు. గది నుంచి స్విమ్మింగ్ పూల్‌కు వెళ్లేటప్పుడు మెడలో గొలుసు ఉండగా, స్విమ్మింగ్ అనంతరం గదికి వెళ్లే క్రమంలో మెడలో గొలుసు కనిపించకపోవడాన్ని సీసీ ఫుటేజీల్లో గుర్తించారు. స్విమ్మింగ్ పూల్‌లో గొలుసు పడిపోయి ఉండవచ్చునని భావించి నీటిని ఖాళీ చేసి గాలించినా ఫలితం కనిపించలేదు. దీంతో ఆయన బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. క్రైం పోలీసులు కేసు నమోదు చేసుకుని ఘటనా స్థలంలో దర్యాప్తు చేపట్టారు. సీసీ ఫుటేజీలను పరిశీలించి సిబ్బంది కదలికలపై నిఘా పెట్టారు. తాను స్విమ్మింగ్ పూల్‌కు వెళ్లేటప్పుడు మెడలో గొలుసు ఉందని, బయటకు వచ్చిన తర్వాతే కనిపించలేదని, అయితే ఈ గొలుసును గుర్తుతెలియని వ్యక్తులు తస్కరించి ఉంటారని ఆరోపిస్తూ అజయ్‌కుమార్ ఝా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బంజారాహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళలు స్వశక్తితో ఎదగాలి

ఇందిరా మహిళా శక్తి సంబరాల్లో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



డ్వాక్రా సంఘాలకు వడ్డీ మాఫీ చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం: మహిళలు స్వశక్తితో ఎదిగి, కోటీశ్వరులుగా మారేందుకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. స్థానిక శాస్త్రా గార్డెన్‌లో సోమవారం అబ్దుల్లాపూర్ మెట్, యాచారం, మంచాల, ఇబ్రహీంపట్నం మండలాల మహిళ సంఘాల సభ్యులతో కలిసి ఇందిరా మహిళా శక్తి సంబరాలు నిర్వహించారు. 3,642 సంఘాలకు రూ.3.93 కోట్ల వడ్డీ (5 నెలలు) మాఫీ, 21 మందికి లోన్ బీమా రూ.19 లక్షలు, ఇద్దరికి ప్రమాద బీమా కింద రూ.20 లక్షల చెక్కులను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మహిళలు తీసుకున్న రుణాలతో ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో మహిళలను నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. నియోజకవర్గంలో 20 వేల ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తామన్నారు. ఇప్పటికే 3,500 వేల ఇళ్లు మంజూరు చేసినట్లు చెప్పారు. లబ్ధిదారులకు ప్రభుత్వం అందజేసే రూ.5 లక్షలు కాకుండా డ్వాక్రా సంఘాల ద్వార మరో రూ.2లక్షల రుణాలను అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కంబాలపల్లి గురునాథ్‌రెడ్డి, వైస్ చైర్మన్ మంఖాల కరుణాకర్, డీఆర్‌డీఏ పీడీ శ్రీలత, ఎంపీడీఓ జంగయ్యగౌడ్, పార్టీ నాయకులు ఈసీ శేఖర్‌గౌడ్, మంఖాల దాసు, రాచర్ల వెంకటేశ్వర్లు, జడల రవీందర్‌రెడ్డి, పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు జయమ్మ, అమృతసాగర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పట్టాలు సిద్ధం

ఫార్మా భూ బాధితులకు ఇప్పటికే ప్రొసీడింగ్స్



రిజిస్ట్రేషన్ ప్రక్రియ కోసం వివరాలు అందిస్తున్న ప్లాట్లు పొందిన లబ్ధిదారులు (ఫైల్)

- ఇటీవలే పూర్తయిన ప్లాట్ల నంబర్ల డ్రా కార్యక్రమం
- రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు రెడీ చేసిన అధికారులు
- త్వరలోనే సీఎం చేతుల మీదుగా అందజేత

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఫార్మాసిటీ భూ సేకరణలో భాగంగా భూములు కోల్పోయిన బాధితులకు త్వరలోనే సీఎం చేతుల మీదుగా కన్వేయన్స్ డీడ్ (రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు) అందజేయనున్నారు. ఇప్పటికే అర్హులకు ప్రొసీడింగ్స్ జారీ చేసిన అధికారులు ఇటీవల డ్రా నిర్వహించి ప్లాట్ నంబర్లు కేటాయించింది. రిజిస్ట్రేషన్ల శాఖ అక్కడికక్కడే వారి ఫొటోలు, సంతకాలు సేకరించింది. ఎలాంటి చలాన్లు లేకుండా (పైసా ఖర్చు లేకుండా) ఆయా ప్లాట్లను వారి పేరున కన్వేయన్స్ డీడ్‌లు జారీ చేయనుంది. ఇప్పటికే కొంత మంది రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు కూడా రెడీ అయ్యాయి. త్వరలోనే మీర్‌ఖాన్‌పేట వేదికగా భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసి లబ్ధిదారులకు పట్టాలు అందజేయనున్నట్లు తెలిసింది.

అన్ని మౌలిక సదుపాయాలు

ఫార్మాసిటీ ఏర్పాటు కోసం గత ప్రభుత్వం కందుకూరు, కడ్తాల్, యాచారం మండలాల్లో 19,333 ఎకరాల భూమిని సేకరించాలని లక్ష్యంగా నిర్ణయించింది. ఆ మేరకు 13,972 ఎకరాలను సేకరించింది. ఫార్మాసిటీ కోసం భూములు ఇచ్చిన రైతులకు నష్టపరిహారంగా పట్టా భూములకు 16.5 లక్షల చొప్పున, అసైన్డ్ భూములకు రూ.8.5 లక్షల చొప్పున చెల్లించింది. అంతేకాకుండా మీర్‌ఖాన్‌పేట్ (సర్వే నం.120) సహా పంజాగూడ (సర్వే నం.90) లో 642 ఎకరాల్లో తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాలు, అభివృద్ధి సంస్థ (టీజీఐఐసీ) అభివృద్ధి చేసిన లే అవుట్‌లో ఎకరానికి 121 గజాల చొప్పున నివాస స్థలాన్ని కేటాయించనున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు కందుకూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో 1,580 మంది, ఇబ్రహీంపట్నం రెవెన్యూ డివిజన్ పరిధిలో 3,900 మంది లబ్ధిదారులను గుర్తించి, వారికి అప్పట్లోనే ప్రొసీడింగ్స్ కూడా జారీ చేసింది. లే అవుట్‌ను పూర్తిస్థాయిలో సిద్ధం చేసి, ఆయా ప్లాట్లకు నంబర్లు వేసింది. ఇటీవల వరుసగా నాలుగు రోజుల పాటు మీర్‌ఖాన్‌పేట వేదికగా డ్రా కార్యక్రమం నిర్వహించింది. గ్రామాల వారీగా భూములు కోల్పోయిన బాధితులను అక్కడికి రప్పించి, బాధితుల సమక్షంలో డ్రా తీసి, వచ్చిన టోకెన్ నంబర్ల వారీగా ప్లాట్లను కేటాయించింది.

కేటగిరీలుగా విభజించి..

భూములు కోల్పోయిన రైతులను కేటగిరీలుగా విభజించారు. ఎకరలోపు కోల్పోయిన వారికి 60 గజాల చొప్పున, ఆ పై విస్తీర్ణం కోల్పోయిన రైతులకు 121 గజాల నుంచి 544 గజాల విస్తీర్ణం ప్లాట్లను సిద్ధం చేశారు. తొలి విడతలో 4,174 మంది లబ్ధిదారుల కోసం డ్రా తీయగా, వీరిలో 2,602 మంది కార్యక్రమానికి హాజరై టోకెన్లు పొందారు. వారి పేరున పైసా ఖర్చు లేకుండానే రిజిస్ట్రేషన్లు చేసి ఇవ్వనున్నారు. వివిధ కారణాలతో మరో 1,572 మంది హాజరుకాలేదు. వీరిలో భూములు ఇచ్చేందుకు నిరాకరించి కోర్టుకు వెళ్లిన బాధితులతో పాటు అనర్హులు సైతం ఉన్నట్లు తెలుస్తోంది. గ్రామాల వారీగా నిర్వహించిన డ్రా కార్యక్రమానికి హాజరైతే ఎక్కడ తాము దొరికిపోతామో అనే భయంతో బినామీలు, నకిలీలు ఇందుకు దూరంగా ఉన్నట్లు సమాచారం. ఇదిలా ఉంటే వీరంతా ఇప్పటికే ప్రభుత్వం నుంచి పరిహారం పొందడం గమనార్హం. ఇక ఐదు ఎకరాలకు పైగా భూములు ఇచ్చిన వారి కోసం ప్లాట్లకు సమీ పంలోనే లే అవుట్‌ను సిద్ధం చేస్తున్నారు.

ప్లాట్ నంబర్ల కేటాయింపు ఇలా..

విస్తీర్ణం (గజాల్లో)	లబ్ధిదారులు	డ్రాకు హాజరైనవారు	గైర్హాజరైన వారు
60	670	363	307
121	1,061	718	343
181	581	340	241
242	562	388	174
302	379	261	118
363	334	206	128
423	200	136	64
484	225	140	85
544	162	50	112
మొత్తం	4,174	2,602	1572

సాయం చేస్తున్నట్లు నటించి..

వృద్ధ దంపతుల దృష్టి మళ్లించి
20.5 తులాల బంగారు అభరణాల చోరీ

అమీర్‌పేట: ఆటోలో ప్రయాణిస్తున్న వృద్ధ దంపతులకు సాయం చేస్తున్నట్లు నటించి ఓ మహిళ బంగారు ఆభరణాలు కాజేసిన సంఘటన ఎస్‌ఆర్ నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కుత్బుల్లాపూర్, గణేష్‌నగర్‌కు చెందిన కొంగ వజ్రమ్మ (70) ఆదివారం సాయంత్రం తన భర్త భూ రాములుతో కలిసి బోనాల వేడుకలు జరుపుకునేందుకు ఆటోలో బల్కంపేటలో ఉంటున్న కుమార్తె స్వప్న ఇంటికి బయలుదేరింది. రెండు బ్యాగుల్లో దుస్తులు సర్దిన ఆమె ఒక బ్యాగులో దుస్తుల కింద 20.5 తులాల బంగారు ఆభరణాలు దాచింది. చింతల్ నుంచి బాలానగర్ ఆటో స్టాండ్‌కు వచ్చారు. వారి వద్దకు వచ్చిన ఓ మహిళ బల్కంపేటకు వెళ్లే ఆటోలో బ్యాగులు పెట్టేందుకు వారికి సహకరించింది. ఆటో బల్కంపేట సమీపంలోకి రాగా తన కాళ్లపై పెట్టుకుంటానని బ్యాగు తీసుకుంది. బల్కంపేటలో ఆటో దిగిన వారు కుమార్తె ఇంటికి వెళ్లిన తర్వాత చూడగా బ్యాగులో దాచిన నగలు కనిపించలేదు. ఆటోలో తమతో పాటు వచ్చిన మహిళ తమ దృష్టి మరల్చి ఆభరణాలు కాజేసిందని గుర్తించిన వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బనకచర్ల ప్రాజెక్ట్‌పై విద్యార్థులకు అవగాహన



ఇబ్రహీంపట్నం: గోదావరిలో తెలంగాణ రాష్ట్ర వాటాను వదులుకుంటే మరో ఉద్యమం తప్పదని బీఆర్‌ఎస్ విద్యార్థి విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పి.రాజ్‌కుమార్ హెచ్చరించారు. ఇబ్రహీంపట్నంలోని బీసీ వసతి గృహంలో బనకచర్ల ప్రాజెక్టుపై సోమవారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని రేవంత్ సర్కార్ సహకారంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అక్రమంగా బనకచర్ల ప్రాజెక్ట్ నిర్మిస్తున్నట్లు ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ ద్వారా కోటి ఎకరాల మాగాణికి నీరందించేందుకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం కృషిచేస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం గోదావరి జలాలను ఆంధ్రకు దోచిపెట్టేందుకు సిద్ధమైందన్నారు. దీనిని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రజలకు అన్యాయం చేయాలని చూస్తే సహించేదిలేదన్నారు.

ఆర్టీసీలో అప్రెంటీస్‌కు దరఖాస్తుల ఆహ్వానం

షాద్‌నగర్‌రూరల్: ఆర్టీసీ మహబూబ్‌నగర్ రీజియన్ పరిధిలోని వివిధ డిపోల్లో ఇంజనీరింగ్, నాన్ ఇంజనీరింగ్ గ్రాడ్యుయేషన్ విభాగాల్లో మూడేళ్ల అప్రెంటిస్ శిక్షణకోసం దరఖాస్తు చేసుకోవాలని రీజినల్ మేనేజర్ సంతోష్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రాడ్యుయేషన్/ఇంజనీరింగ్, ఐటీ/ కంప్యూటర్ సైన్స్/ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ/గణితం విద్యలో ఇంజనీరింగ్, డిప్లొమా, నాన్ ఇంజనీరింగ్ గ్రాడ్యుయేషన్ విద్యార్హతలు కలిగి ఉండి 2021లో ఉత్తీర్ణులై ఉండాలని తెలిపారు. దరఖాస్తులను నేషనల్ అప్రెంటిస్ ట్రైనింగ్ స్కీం(ఎన్‌ఏటీఎస్) కింద వెబ్ పోర్టల్‌లో ఈ నెల 27 వరకు రిజిస్టర్ చేసుకొని మహబూబ్‌నగర్ రీజియన్‌కు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇంజనీరింగ్, డిప్లొమా, నాన్ ఇంజనీరింగ్ గ్రాడ్యుయేషన్‌లో మెరిట్ ప్రాతిపదికన ఎంపిక ఉంటుందన్నారు. శిక్షణ కాలంలో అభ్యర్థులకు స్టైఫండ్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.

కూరగాయల ధరలు

శ్రీనగర్‌కాలనీ: ఎర్రగడ్డ రైతుబజార్‌లో వివిధ కూరగాయల ధరలు ఈ విధంగా ఉన్నాయి. టమాట కిలో రూ. 35, నల్లవంకాయ 18, పొడుగువంకాయ 18, బెండకాయ 45, పచ్చిమిర్చి 65, బజ్జీమిర్చి 65, క్యాప్సికం 65, పచ్చి కాకరకాయ 20, పందిరిబీర 23, క్యాబేజీ 18, క్యారెట్ 37, దొండకాయ 18, గుండు బీన్స్ 45, గింజచిక్కుడు 55, గోకరకాయ 35, కీర 18, దోసకాయ 15, బీట్‌రూట్ 18, ఉల్లిగడ్డ 22, ఆలుగడ్డ 23, చామగడ్డ 25, మొరంగడ్డ 28, కందగడ్డ 35, క్యాలీఫ్లవర్ 21, సొరకాయ 11, పొట్లకాయ 18, అరటికాయ 10, మునగకాయ 4, మామిడికాయ 35, ముల్లంగి 4–5, ఉల్లిపొరక 28 ప్రకారం ధర పలుకుతున్నాయి. ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

నాయీ బ్రాహ్మణ సంఘ కార్యవర్గం ఎన్నిక



గుర్తింపు కార్డులను అందజేస్తున్న రామ్ చందర్

రహమత్‌నగర్: నాయీ బ్రాహ్మణ సంఘం రహమత్‌నగర్ డివిజన్ నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బోడిగంవార్ గంగాప్రసాద్, ఉపాధ్యక్షులుగా బి.అనిల్, ఆర్.రాకేష్, ప్రధాన కార్యదర్శిగా బి.విఠల్, సహాయ కార్యదర్శిగా వర్దన్, కోశాధికారిగా రాజు, సంయుక్త కార్యదర్శిగా శ్రీను, సలహాదారుగా వేణుగోపాల్, గౌరవ అధ్యక్షుడిగా యాదగిరిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఎస్పీఆర్ హిల్స్‌లోని ఏర్పాటు చేసిన ప్రమాణ స్వీకార కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ్‌చందర్ మాట్లాడుతూ... సంఘం ప్రతినిధులు ఐక్యంగా ముందుకు సాగుతూ, సంఘం అభివృద్ధికి సహకరించాలని కోరారు. అనంతరం నూతన కమిటీ సభ్యులను ఆయన గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. డివిజన్ కాంగ్రెస్ కమిటీ నాయకుడు పురిమి సంజీవ తదితరులు పాల్గొన్నారు.

27న మాగంటి గోపీనాథ్ సంతాప సభ



సభ ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద

రహమత్‌నగర్: దివంగత జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ సంతాప సభను ఈ నెల 27 బోరబండ డివిజన్‌లోని పీజేఆర్ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్నట్లు కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద తెలిపారు. ఆయన సోమవారం బోరబండలో పర్యటించి సభ ప్రాంగణంలో ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం పీజేఆర్ గ్రౌండ్‌లో జరిగే మాగంటి గోపీనాథ్ సంతాప సభలో బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ రాష్ట్ర నాయకులు పాల్గొంటారన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

సనత్‌నగర్: బేగంపేటలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో విద్యాబోధన చేసేందుకు గెస్ట్ ఫ్యాకల్టీ నోటిఫికేషన్‌ను జారీ చేశారు. ఇంగ్లీష్, సంస్కృతం, అరబిక్, కామర్స్, ట్యాక్సేషన్, ఫైనాన్స్ (ఎం.కామ్ అర్హత), హెచ్ఆర్ ఆపరేషన్స్ (ఎం.కామ్ అర్హత), బీబీఏ, బీబీఏ (ఈ–కామ్, ఆపరేషన్స్), పొలిటికల్ సైన్స్, డిజిటల్ మార్కెటింగ్ (మాస్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజంలో పీజీ అర్హత), బోటనీ, అప్లైడ్ న్యూట్రిషన్ బయో టెక్నాలజీ, మైక్రో బయాలజీ, ఫార్మా, సైకాలజీ, మ్యాథమేటిక్స్, ఫిజిక్స్, స్టాటిస్టిక్స్, కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్స్, డేటా సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెకానికల్ లెర్నింగ్, బీసీఏ అండ్ గేమింగ్ కోర్సుల్లో బోధన చేసేందుకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మావతి తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 24వ తేదీ సాయంత్రం 5 గంటలకు లోపు కళాశాలలోని కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాల్సి ఉంటుందన్నారు.

చర్చ్ ఆఫ్ సౌత్ ఇండియా మోడరేటర్‌గా రూబెన్ మార్క్



రూబెన్ మార్క్

అమీర్‌పేట: చర్చ్ ఆఫ్ సౌత్ ఇండియా మోడరేటర్‌గా రెవరెండ్ డాక్టర్ కె.రూబెన్ మార్క్ నియమితులయ్యారు. సీఎస్ఐ చర్చి కమిటీ సభ్యులు హైకోర్టు న్యాయవాది సుధీర్‌కుమార్ సోమవారం రూబెన్ మార్క్‌ను కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సుధీర్ మాట్లాడుతూ.. అత్యంత కీలకమైన మోడరేటర్ పదవి తెలంగాణ రాష్ట్రానికి చెందిన వ్యక్తికి రావడం సంతోషదాయకమన్నారు. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు కేరళ,తమిళనాడు,శ్రీలంకకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు.

626 గుంతలు పూడ్చింది 399

'హిల్స్'లో నడ్డివిరుస్తున్న రహదారులు

- ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల్లో అడుగడుగునా తప్పని ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు
- గుర్తించిన చోట్లా పూడ్చని వైనం



జూబ్లీహిల్స్‌లో గుంతలమయమైన రోడ్డు



బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-14 జుడియో షోరూం ముందు గుంతలు

బంజారాహిల్స్: వానాకాలం సమీపించకముందే రోడ్లపై ఏర్పడిన గుంతలను తారుతో పూడ్చి మరమ్మతుల చేయాల్సి ఉండగా జీహెచ్ఎంసీ ఇంజనీర్ల నిర్వాకంతో ఎక్కడికక్కడ రోడ్లపై గోతులు తేలి వాహనదారులతో పాటు పాదచారులు నరకయాతనకు గురవుతున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఐఏఎస్‌లు ప్రయాణిస్తున్న ప్రధాన రోడ్లపై కూడా గుంతలు నడ్డివిరుస్తున్నాయి. ముఖ్యమంత్రి రాకపోకలు సాగించే రోడ్లపై కూడా గుంతలు కనిపిస్తున్నా పూడ్చడంలో ఇంజనీర్లు విఫలం అవుతున్నారు. ఒకరకంగా చెప్పాలంటే ఇంజనీరింగ్ వ్యవస్థ జీహెచ్ఎంసీలో అత్యంత నిర్లక్ష్యంగా, అధ్వాన్నంగా, లోపభూయిష్టంగా, ప్రణాళికలు లేకుండా ఉన్నట్లు రోడ్లపై గుంతలు కళ్లకు కడుతున్నాయి.

- నెల క్రితమే ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల పరిధిలో ఎక్కడెక్కడ రోడ్లపై గుంతలు ఏర్పడ్డాయో వాటి వివరాలను ఆయా సర్కిళ్ల ఇంజనీర్లకు అందజేశారు. అయితే రోజూ వర్షాలు పడుతున్నాయనే సాకుతో ఏఈలు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు గుంతలను పూడ్చడానికి వెనుకంజ వేస్తున్నారు.
- జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ సర్కిల్–17 పరిధి కిందికి వచ్చే సోమాజిగూడ, ఖైరతాబాద్, అమీర్‌పేట, సనత్‌నగర్ డివిజన్ల పరిధిలో 222 గుంతలను గుర్తించారు. ఇందులో సోమవారం నాటికి 146 గుంతలు మాత్రమే పూడ్చి మరమ్మతులు చేపట్టారు. మిగతావి గాలికొదిలేశారు. దీంతో రోడ్లపై గుంతలు వాహనదారులకు నరకాన్ని చూపిస్తుండగా పాదచారులకు వరదనీటితో ప్రమాదకరంగా మారాయి.
- జూబ్లీహిల్స్ సర్కిల్–18 పరిధి కిందికి వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, షేక్‌పేట డివిజన్ల పరిధిలో 171 గుంతలను గుర్తించారు. ఇందులో సోమవారం నాటికి 106 గుంతలను మాత్రమే పూడ్చారు.
- సర్కిల్–18 ఇంజనీరింగ్ విభాగం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాసిత ప్రాంతం కాగా ఇక్కడే ఇంజనీర్ల నిర్లక్ష్యంగా స్పష్టంగా కనిపిస్తున్నది. అసమర్థ ఏఈ, వర్క్ ఇన్‌స్పెక్టర్లతో జూబ్లీహిల్స్ సర్కిల్ రోజురోజుకూ గుంతలమయంగా మారుతుంది.
- యూసుఫ్‌గూడ సర్కిల్–19 పరిధి కిందికి వచ్చే రహమత్‌నగర్, యూసుఫ్‌గూడ, వెంగళరావునగర్, బోరబండ, ఎర్రగడ్డ డివిజన్ల పరిధిలో 233 గుంతలను గుర్తించారు. ఇందులో సోమవారం నాటికి 147 గుంతలను మాత్రమే పూడ్చారు. మిగతావి ఇంకా స్థానికులకు నరకప్రాయంగానే ఉన్నాయి.
- ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రహదారులు కూడా ఛిద్రమయ్యాయి. వరదనీటితో ఈ గుంతలు మరింతగా పెద్దవి అవుతున్నాయి.
- గుంతలు చిన్నగా ఉన్నప్పుడే తారుతోనో, సిమెంట్‌తోనో పూడ్చి ఉంటే ఖర్చు తక్కువ అవడమే కాకుండా సమస్య కూడా తగ్గుముఖం పట్టి ఉండేది. అయితే కాంట్రాక్టర్ల నుంచి లంచాలకు అలవాటుపడ్డ ఇంజనీర్లు కమీషన్ల కోసం ప్రత్యేక నిధులను విడుదల చేయిస్తూ సమస్య తీవ్రతరం అయిన తర్వాత గోతులు పూడుస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.
- ప్రధాన రోడ్ల నుంచి అంతర్గత రహదారులకు వెళ్లే మలుపుల వద్ద భారీ గుంతలు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. నిత్యం ఇంజనీర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు చూసుకుంటూ వెళ్లడమే కానీ, వీటిని పూడ్చిన పాపానపోవడం లేదు.
- కాలనీల్లో రహదారులు పూర్తిగా గుంతలమయమయ్యాయి. ఇటువైపు ఇంజనీర్లు తొంగిచూడడం లేదు.
- ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల పరిధిలో రోడ్ల పరిస్థితి రోజురోజుకూ దిగజారుతుండగా ప్రజాప్రతినిధులు పట్టించుకున్న పాపానపోవడం లేదంటూ ప్రజలు దుమ్మెత్తిపోస్తున్నారు.

కుంభ వృష్టితో వర్షాలు కురుస్తాయి





ఇందిరానగర్ నల్లపోచమ్మ ఆలయం వద్ద భవిష్యవాణి చెబుతున్న జోగిని మదమ్మ. ఆలయం వద్ద భక్తులు

ఇందిరానగర్‌లో జోగిని మదమ్మ భవిష్యవాణి

బంజారాహిల్స్: ఈ సారి వర్షాలకు కుంభవృష్టితో కురుస్తాయని, పంటలు పుష్కలంగా పండుతాయని జోగిన మదమ్మ భవిష్య వాణి వినిపించారు. బంజారాహిల్స్ రోడ్ నెం. 2లోని ఇందిరానగర్ నల్లపోచమ్మ ఆలయం వద్ద సోమవారం నిర్వహించిన రంగం కార్యక్రమం భక్తుల కోలాహలం మధ్య ఘనంగా జరిగింది. జోగిని మదమ్మ ఆలయానికి విచ్చేసి భక్తుల ప్రశ్నలకు సమాధానాలు చెప్పారు. యువత దారి తప్పుతున్నారని అమ్మవారిపట్ల భక్తితో లేనందుకే యువత ఇలా వ్యసనాలకు బానిసలవుతున్నారని ఆలయంలో వారి కోసం ప్రత్యేక పూజలు చేయాలని సూచించారు. అనంతరం నిర్వహించిన పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. వందలాది మంది భక్తులు రంగం కార్యక్రమంలో పాల్గొన్నారు. బస్తీ నేతలు పి.మోహన్‌యాదవ్, సింహం, లడ్డు రాజు, మల్లేష్ యాదవ్, బాబా గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఖైరతాబాద్ మహంకాళి ఆలయంలో...

ఖైరతాబాద్: ఈ సంవత్సరం కుంభ వృష్టితో వర్షాలు కురుస్తాయని, అగ్ని దేవుడు ఆగ్రహం మీద ఉన్నాడని, ఓ మహమ్మారి రాబోతోంది జాగ్రత్తగా ఉండాలని సోమవారం ఖైరతాబాద్‌లో మహంకాళి అమ్మవారి ఆలయంలో నిర్వహించిన రంగం కార్యక్రమంలో లాల్ బజార్‌కు చెందిన రేణుకా అమ్మవారు భవిష్యవాణి చెప్పారు. ఖైరతాబాద్ మహంకాళి అమ్మవారి ఆలయంలో బోనాల ఉత్సవాల మరుసటి రోజు నిర్వహించే రంగం కార్యక్రమంలో రేణుకా అమ్మవారు భవిష్యవాణి వినిపించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఒడి బియ్యం నింపిన తరువాత ఆలయం ఆవరణలో రేణుకా అమ్మవారు భవిష్యవాణి చెప్తూ ఈ సంవత్సరం కుంభ వృష్టి వర్షాలు కురుస్తాయన్నారు. నా అక్క మహంకాళి అమ్మవారు కళ్లు తెరిచిందన్నారు. పిల్లకు తల్లి కాకుండా, తల్లికి పిల్లకాకుండా, తండ్రికి కొడుకు, కొడుకుకు తండ్రి కాకుండా పోతున్నారు. ఓ మహమ్మారి వచ్చేది ఉంది అందరూ జాగ్రత్తగా ఉండాలని భవిష్యవాణితో హెచ్చరించారు. మహంకాళి అమ్మవారి ఆలయంలో గాలి గోపురం కట్టించాలని మూడు సంవత్సరాల నుంచి చెబుతున్నా మీరు ముందడుగు వేయడం లేదు, నా కొడుకు (ఆలయ నిర్వాహకుడు) తొమ్మిది వారాల పాటు ఉపవాసం ఉండి ముందడుగు వేస్తే అంతా జయమే జరుగుతుంది అని పేర్కొన్నారు. మంచి జరగాలంటే ఊరి పొలిమేర చుట్టూ బలి కట్టాలని, గాలి గత్తర లేకుండా నేను కాపాడుతానని రేణుకా అమ్మవారు తెలిపారు. రంగం కార్యక్రమంలో మహంకాళి అమ్మవారి దేవాలయ సభ్యులు, స్థానిక నాయకులు, భక్తులు పాల్గొన్నారు.



ఖైరతాబాద్‌లో భవిష్యవాణి వినిపిస్తున్న రేణుక

సీఎం దిష్టిబొమ్మ దహనం కేసులో బీఆర్ఎస్ నేతలకు నోటీసులు

బంజారాహిల్స్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టి బొమ్మను దహనం చేసిన ఘటనలో బీఆర్ఎస్ నేతలకు బంజారాహిల్స్ పోలీసులు సోమవారం నోటీసులు జారీ చేశారు. వివరాలివీ... బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోగా ఆర్డినెన్స్ జారీ చేయకుండా డైరెక్ట్‌గా ఎలా ఇస్తారంటూ బీఆర్ఎస్ సీనియర్ నేత గెల్లు శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో నేతలు బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–12లోని అగ్రసేన్ చౌరస్తాలో ఈ నెల 11వ తేదీన సీఎం దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ ఘటనలో గెల్లు శ్రీనివాస్‌యాదవ్‌తో పాటు ధూళిమెట్ల బాలరాజ్, కోటి కిషోర్, ఉపేంద్రచారి, విజయ్‌కుమార్, ఆంజనేయగౌడ్, నాగరాజు తదితరులపై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇందులో బాలరాజ్, కిషోర్, ఉపేంద్ర, విజయ్‌కుమార్‌లకు నోటీసులు జారీ చేశారు.

మరో ఘటనలో...

ఓ టీవీ చానల్‌పై దాడి చేసిన కేసులో బీఆర్ఎస్ భవన్‌లో ఉన్న గెల్లు శ్రీనివాస్‌యాదవ్‌ను అరెస్టు చేసేందుకు వచ్చిన పోలీసులను అడ్డుకునేందుకు యత్నించిన బీఆర్ఎస్ నేతలు మన్నె గోవర్ధన్‌రెడ్డి, పావనీరెడ్డి, సునీత, బాల్క సుమన్‌లపై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. గత నెల 28వ తేదీన అర్ధరాత్రి తెలంగాణ భవన్ వద్ద ఈ ఘటన జరిగింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సోమవారం మన్నె గోవర్ధన్‌రెడ్డి, పావనీరెడ్డి, సునీతలకు నోటీసులు జారీ చేశారు.

గురుబ్రహ్మానగర్‌లో ఘనంగా బోనాలు





అంబేద్కర్‌నగర్‌లో కీర్తిరెడ్డి..

ఫిలింనగర్: బోనాల పర్వదిన వేడుకలు సోమవారం జూబ్లీహిల్స్‌లోని నందగిరిహిల్స్‌ను ఆనుకుని ఉన్న గురుబ్రహ్మానగర్ బస్తీలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. బస్తీలో కొలువుదీరిన శ్రీపోచమ్మతల్లికి మహిళలు బోనమెత్తి నైవేద్యం సమర్పించారు. ఫిలింనగర్ 18 బస్తీల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మామిడి నర్సింగరావు, గురుబ్రహ్మానగర్ బస్తీ అధ్యక్షుడు గోపాల్‌నాయక్‌తో పాటు స్థానికులు విశేష పూజలు నిర్వహించారు. బస్తీలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. డప్పుల హోరు, పోతరాజుల విన్యాసాల మధ్య ఈ వేడుక వైభవంగా జరిగింది.

అంబేద్కర్‌నగర్‌లో..

శ్రీనగర్‌కాలనీ: జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో సోమవారం బోనాల వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎల్లారెడ్డిగూడ అంబేద్కర్‌నగర్‌లో బోనాల వేడుకల్లో భాగంగా అమ్మవారి ఆలయంలో బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షురాలు కీర్తిరెడ్డి జూటూరు ప్రత్యేక పూజలను నిర్వహించారు. స్థానిక నేత కైలాష్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

కమలానగర్‌లో టీపీసీసీ కార్యదర్శి పర్యటన



పూజల్లో పాల్గొన్న శివకుమార్‌గుప్తా

రహమత్‌నగర్: టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఉప్పల శివకుమార్‌గుప్తా సోమవారం ఎస్పీఆర్ హిల్స్ కమలానగర్ బస్తీలో పర్యటించారు. జూబ్లీహిల్స్ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి నల్లోల్ల జీవన్ ఆహ్వానం మేరకు పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికంగా ఉన్న అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... సీఎం రేవంత్‌రెడ్డి చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. త్వరలో జరుగనున్న జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ డివిజన్ ప్రధాన కార్యదర్శి నాగరాజు, నాయకులు పల్లె సాయిలు, వికాస్, రాజు యాదయ్య, సాయి కుమార్, ఆనంద్, చింటు పాల్గొన్నారు.

పలువురికి ఎమ్మెల్యే పరామర్శ



భాస్కర్‌రెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే తలసాని

సనత్‌నగర్: మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ సోమవారం సనత్‌నగర్‌లో పర్యటించి పలువురిని పరామర్శించారు. ముందుగా ఎస్సార్టీకాలనీకి చెందిన భాస్కర్‌రెడ్డి ఇటీవల చికిత్స పొంది ఇంటికి రాగా ఎమ్మెల్యే పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా బీఆర్ఎస్ నేత హరి మాతృమూర్తి సులోచన ఇటీవల మరణించగా, సుభాష్‌నగర్‌లోని వారి నివాసానికి వెళ్లారు. సులోచన చిత్రపటం వద్ద నివాళి అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట కొలను బాల్‌రెడ్డి, ఖలీల్‌బేగ్, సురేష్‌గౌడ్, ప్రవీణ్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, గోపీలాల్‌చౌహాన్, ఫాజిల్, సమీవుల్లా, రాజు పాల్గొన్నారు.

ఎన్ఎస్‌యూఐని రద్దు చేయండి

ఉస్మానియా యూనివర్సిటీ: ఎన్ఎస్‌యూఐని రద్దు చేయాలని ఏబీవీపీ రాష్ట్ర నాయకులు జీవన్ డిమాండ్ చేశారు. సోమవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఎన్ఎస్‌యూఐ ఒడిశా రాష్ట్ర అధ్యక్షుడు ఉదిత్ ప్రధాన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. విద్యార్థినులపై జరిగే లైంగిక దాడుల వెనుక ఎన్ఎస్‌యూఐ నేతల హస్తం ఉందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో పృథ్వితేజ, అలివేలి రాజు, హరిప్రసాద్, కమల్ సురేష్, ఉదయ్, వినయ్, సాయి తేజ, దృహన్, శివ శంకర్ పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ బీసీ విద్యార్థులకు పూర్తి ఫీజు చెల్లించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: ఇంజనీరింగ్ చదివే బీసీ విద్యార్థులకు పూర్తి ఫీజు చెల్లించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన ఓయూలో మాట్లాడుతూ..బీసీ విద్యార్థులకు ర్యాంకులతో సంబంధంలేకుండా బోధన ఫీజు మొత్తాన్ని చెల్లించాలని లేఖ ద్వారా సీఎం రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. 10 వేల లోపు ర్యాంక్ విద్యార్థులకు మొత్తం ఫీజును చెల్లిస్తూ 10 వేల ర్యాంక్ దాటిన విద్యార్థులకు కేవలం రూ.35 వేలు మాత్రమే చెల్లించడం వలన మిగత ఫీజును చెల్లించలేక అప్పుల పాలవుతున్నారని పేర్కొన్నారు. ఇతర కులాల విద్యార్థులకు ర్యాంక్‌లతో సంబంధం లేకుండా ఫీజులు చెల్లిస్తున్నట్లు బీసీలకు కూడా మొత్తం ఫీజు చెల్లించాలని డిమాండ్ చేశారు.

24న ప్రంభన్ యాదవ్ సంతాప సభ

ఉస్మానియా యూనివర్సిటీ: సామాజిక వేత్త దివంగత ప్రొ.ప్రంభన్ యాదవ్ సంతాప సభను ఈ నెల 24న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్నట్లు ఏబీటీబీసీ జేఏసీ చైర్మన్ డా.అవ్వారు వేణుకుమార్ సోమవారం పేర్కొన్నారు. మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమగు సభకు పార్టీలకు అతీతంగా బహుజనులు హాజరుకావాలని కోరారు.

25న అవార్డుల ప్రదానోత్సవం



సనత్‌నగర్: వైశ్య లైమ్ లైట్ అవార్డుల ప్రదానోత్సవాన్ని ఈ నెల 25న నగరంలోని ప్రధాన్ కన్వెన్షన్‌లో నిర్వహించనున్నట్లు అవార్డుల వ్యవస్థాపకుడు శివకుమార్ ఇమ్మడి తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను సోమవారం బేగంపేటలోని ఓ హోటల్‌లో నిర్వహించారు. అనంతరం శివకుమార్ మాట్లాడుతూ.. వైశ్య సామాజిక వర్గంలో ఉన్నత స్థాయికి ఎదిగి స్ఫూర్తిగా నిలిచిన వారిని ఒక వేదిక పైకి చేర్చడమే కాకుండా వారికి అవార్డులు అందజేసి మరింత ఉత్తేజపూరితంగా సేవలు అందించేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. స్వయంశక్తితో ఎదిగిన వారి జీవితాలు భావితరాలకు స్ఫూర్తిగా నిలిచేలా చేయడమే ఈ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అన్నారు.

రైలు బోగీ నుంచి జారిపడి వ్యక్తి మృతి

సికింద్రాబాద్: నడుస్తున్న రైలు బోగీ నుంచి జారిపడిన గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ కే.నారాయణ తెలిపిన వివరాల ప్రకారం..చర్లపల్లి–ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్ల మధ్య గల రైల్వే ట్రాక్ పక్కన ఓ వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉన్నట్టు పోలీసులకు ఆదివారం రాత్రి 10 గంటలకు సమాచారం అందింది. ఘటనా స్థలానికి వెళ్లిన పోలీసులు అంబులెన్స్‌ను రప్పించి క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. కొద్ది గంటల పాటు చికిత్స పొందిన ఆ వ్యక్తి మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. ఘటన స్థలంలో పరిస్థితులకు బట్టి సుమారు 35 ఏళ్ల వయసున్న వ్యక్తి రైలు బోగీ నుంచి జారిపడి గాయపడ్డట్టు తెలుస్తుందని వారు చెప్పారు. మృతుడి ఒంటిపై మెరూన్ కలర్ షర్టు, బ్లూ కలర్ జీన్స్ ప్యాంటు ఉన్నట్టు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

చికిత్స పొందుతున్న గుర్తుతెలియని వ్యక్తి మృతి

సనత్‌నగర్: చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు వివరాల ప్రకారం.. ఈ నెల 18న భరత్‌నగర్ బ్రిడ్జిపై ఓ వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. వెంటనే 108 వాహన సిబ్బందితో ఘటనా స్థలానికి వెళ్లి సదరు వ్యక్తిని గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన ఉధృతం



మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి తదితరులు

సుల్తాన్‌బజార్: పెన్షనర్ల సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనలకు దిగుతామని తెలంగాణ స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి హెచ్చరించారు. సోమవారం బడిచౌడిలోని రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.... రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పెన్షనర్లకు నగదు రహిత వైద్యాన్ని అందించాలని డిమాండ్ చేశారు. ఈహెచ్‌ఎస్ ద్వారా వైద్య సేవలను అందించేలా కృషి చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం నగదు రహిత వైద్యాన్ని అందిస్తామని చెప్పి నెలలు గడుస్తున్నా నేటికి ఇలాంటి చర్యలు లేకపోవడం శోచనీయమన్నారు. ఈహెచ్‌ఎస్ ద్వారా పెన్షనర్ల వద్ద నుంచి రూ.500 జమ చేసుకొని తమకు నగదు రహిత వైద్యాన్ని అందించాలని కోరారు. లేనిపక్షంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి పి.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

జూ పార్కు అభివృద్ధికి సహకారం

బహదూర్‌పుర: నెహ్రూ జూలాజికల్ పార్కు అభివృద్ధికి సహకారం అందిస్తామని సెంట్రల్ అథారిటీ సభ్య కార్యదర్శి డాక్టర్ వి. క్లెమెంట్ బెన్ అన్నారు..సోమవారం నెహ్రూ జూలాజికల్ పార్క్ ను సందర్శించారు. నెహ్రూ జూలాజికల్ పార్కు నిర్వహణను రాష్ట్ర జూ పార్కు డైరెక్టర్ డాక్టర్ ఎస్ సునీల్ హిరేమత్ వివరించారు. అనంతరం వివిధ రకాల పండ్ల, అరుదైన మొక్కలను జూలో నాటారు.

కీసర ఆలయంలో మహన్యాస పూర్వక రుద్రాభిషేకం





రామలింగేశ్వరస్వామి

కీసర: కీసరగుట్ట భవానీ రామలింగేశ్వరస్వామికి ఏకాదశిని పురస్కరించుకుని విశేష పూజలు చేశారు. సోమవారం గర్భాలయంలో కొలువైన స్వామివారికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించిన అనంతరం అర్చకులు క్షీరాభిషేకం నిర్వహించారు. ఈసీఐఎల్, కాప్రా, నాగారం, కుషాయిగూడ, దమ్మాయిగూడ ప్రాంతాల్లోని మార్వాడీలు కావడి పూజలో భాగంగా కాలినడకన కీసరగుట్టకు పెద్దఎత్తున తరలివచ్చి గంగాజలాలతో స్వామివారికి అభిషేకాలు చేసి స్వామివారిని దర్శించుకున్నారు.

ప్రకృతిని మరింతగా ఆరాధించండి

అంబర్‌పేట: మహంకాళి ఆలయంలో రంగం కార్యక్రమం ఘనంగా జరిగింది. సోమవారం ఆలయ ప్రాంగణంలో ఏర్పుల విజయ్‌కుమార్ భవిష్యవాణి వినిపించారు. ''అమ్మవారికి 5 వారల పాటు సాకు సమర్పించండి. ఈ ఏడాది వర్షాలు బాగానే కురుస్తాయి. ప్రకృతిని మరింతగా ఆరాధించండి. అంబర్‌పేట బురుజు గల్లీలో ఉన్న పురాతన హనుమాన్ ఆలయాన్ని పునర్నిర్మించండి అందుకు తాను సహకరిస్తాను. పూజలు ఆర్భాటలతో కాకుండా నిష్ఠతో చేయండి'' అని భవిష్యవాణి పేర్కొన్నారు.

నగరంలో నేడు

- రవీంద్రభారతిలో సాయంత్రం 5.30గంటలకు దాశరథి కృష్ణమాచార్య శత జయంతి ఉత్సవాలు, సాహితీ పురస్కార ప్రదానోత్సవం.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు.
- మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో హైలైఫ్ ఎగ్జిబిషన్ ఉదయం 11 గంటల రాత్రి 8 గంటల వరకు..
- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో చిత్ర ప్రదర్శన ఉదయం 10.30గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు..
- శ్రీనగర్ కాలనీలోని శ్రీ సత్యసాయి నిగమగమంలో ఉదయం 10 నుంచి రాత్రి 8.30 గంటల వరకు ఇండియన్ సిల్క్ గ్యాలరీ ఎక్స్‌పో..
- మాదాపూర్‌లోని శిల్పారామంలో హస్తకళా మ్యూజియం ఉదయం 10.30గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు..
- మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళా శక్తి బజార్‌లో చేనేత ఉత్పత్తుల ప్రదర్శన ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు..

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజు నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

వీటీసీ పేరుతో అక్రమాలు!

- వాణిజ్య పన్నుల శాఖలో వాహన తనిఖీల్లో అవినీతి దందా
- ఏరియా తమదంటే తమదంటూ పలు డివిజన్లలో వాగ్వివాదాలు
- వే బిల్లుల్లో మోసాలు..అడ్డగోలుగా వసూళ్లంటూ ఆరోపణలు



వాణిజ్యపన్నుల శాఖ ప్రధాన కార్యాలయం

అబిడ్స్: వాణిజ్య పన్నుల శాఖ (జీఎస్టీ)లో వీటీసీ (వెహికల్ ట్రాఫిక్ చెక్) పేరుతో పలువురు అధికారులు అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారు. వ్యాపారులను నిలువునా ముంచేస్తున్నారు. ఆదాయం దండిగా ఉంటుండడంతో చాలా మంది ఏసీటీఓ(అసిస్టెంట్ కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసర్)లు తమకే చెకింగ్ అధికారం కావాలంటూ పోటీ పడుతున్నారు. రోడ్లపైనే ఒకరిపై ఒకరు వాగ్వివాదాలకు దిగుతున్నారు.

- కొద్ది రోజుల ముందు నగరంలోని బేగంపేట డివిజన్‌లో వెహికిల్ చెకింగ్ జరుగుతుండగా ఒక అధికారిపై మరో అధికారి ఆరోపణలు చేస్తూ రోడ్డుపై నానా హంగామా చేశారు. తన ఏరియాలోకి ఎందుకు వచ్చావంటూ ఆ అధికారి నిలదీయడంతో అక్కడే ఉన్న కొంత మంది సిబ్బంది నేరుగా పోలీస్ కంట్రోల్ రూం 100కు ఫోన్ చేశారు. రంగంలోకి దిగిన పంజగుట్ట పోలీసులు వారికి సర్దిచెప్పి అక్కడి నుంచి పంపించారు.
- ఆరు నెలల క్రితం గోషామహల్ ప్రధాన రహదారిలో ఒక మహిళా అధికారి వీటీసీలో భాగంగా వాహనాలు తనిఖీ చేస్తుండగా..మరో అధికారి తన డివిజన్‌లో ఎందుకు తనిఖీలు చేస్తున్నారని రోడ్డుపైనే ఆమెను నిలదీశారు. సమాచారం అందుకున్న స్థానిక గోషామహల్ పోలీసులు స్పాట్‌కు వచ్చి ఇద్దరు అధికారులకు నచ్చజెప్పి పంపించారు.
- ఇలా వీటీసీ వాహనాల చెకింగ్‌లో తరచు ఏసీటీఓ స్థాయి అధికారుల మధ్యనే గొడవలు జరుగుతున్నా పట్టించుకునే నాథుడే లేడు. వాహనాలను చెక్‌చేసే అధికారులు వ్యాపారుల వద్ద వే బిల్లులు లేవని..ఇతరత్రా పత్రాలు కూడా లేవంటూ వారిని పలు విధాలుగా వేధిస్తూ మామూళ్ల వసూలు చేస్తున్నారని పలువురు వ్యాపారులు ఆరోపిస్తున్నారు.

అనుమతి లేకుండా వాహనాల తనిఖీలు

- నగర శివార్లతో పాటు నిజామాబాద్ తదితర డివిజన్లలో కమిషనర్ కార్యాలయ అనుమతులు లేకుండా పలువురు జీఎస్టీ అధికారులు వీటీసీ తనిఖీలు చేపడుతున్నారు. నిజామాబాద్ నుంచి నగరానికి వచ్చే పలు వాహనాలను జీఎస్టీ ఇన్‌చార్జి అధికారులు కూడా తనిఖీలు చేస్తూ వేధిస్తున్నారని పలువురు పేర్కొంటున్నారు.
- కమిషనర్ కార్యాలయ అనుమతి లేకుండా సీనియర్ అసిస్టెంట్లే ఏసీటీఓలుగా చెప్పుకుంటూ వాహనాల తనిఖీలకు వెళ్తున్నారని, పెద్ద ఎత్తున మామూళ్ల వసూలు చేస్తున్నట్లు పలువురు వ్యాపారులు పేర్కొంటున్నారు.
- వీటీసీ వాహనాల తనిఖీలకు గతంలో డీసీలను మాత్రమే అనుమతించేవారు. కాగా పలువురు వ్యాపారులు అధికారులపై ఫిర్యాదులు చేయడంతో నేరుగా కమిషనర్ కార్యాలయం నుంచి వీటీసీ తనిఖీలకు అనుమతిస్తున్నారు. ఇలా అయినప్పటికీ కొంతమంది మధ్యస్థాయి అధికారులు తమకు నచ్చిన వాళ్లను వీటీసీ తనిఖీలకు పంపుతుండడంతో ఆరోపణలు వస్తున్నాయి.
- నిజామాబాద్ డివిజన్‌లో కొంతమంది సిబ్బంది 20 సంవత్సరాల నుంచి 30 సంవత్సరాల వరకు ఒకే డివిజన్‌లో పనిచేస్తున్నా వారిని బదిలీ చేయకపోవడంతో వారిపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి.
- కొంతమంది అధికారులు వాహన తనిఖీలలో నోటీసులపై వ్యాపారుల వద్ద సంతకాలు తీసుకొని సెటిల్‌మెంట్ చేసుకుంటున్నారని, సెటిల్‌మెంట్ కాకుంటే అప్పుడు నోటీసులు జారీచేసి పెనాల్టీలు వసూలు చేస్తున్నారని పలువురు పేర్కొంటున్నారు.

వే బిల్లుల పేరుతో ఖాళీ వాహనాల తరలింపు

- కొంతమంది అధికారులు వ్యాపారులతో కుమ్మక్కై వే బిల్లులు ఇచ్చి ఖాళీ వాహనాలను నగరం నుంచి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారని ఆరోపణలున్నాయి. ఖాళీ వాహనం వెళ్లడం..తిరిగి రావడం ద్వారా ఇన్‌పుట్ దందా (ఇన్‌పుట్ స్కామ్) చేస్తున్నారు.
- వాహనాల నెంబర్‌ప్లేట్లను కూడా మార్చివేస్తూ వే బిల్లులు తయారుచేసి ఇస్తున్నారు. దీంతో ఖాళీ వాహనాలే వెళ్లి వస్తున్నాయి. పలువురు ఇలాంటి దందాలు చేపడుతున్నా పట్టించుకునే నాథుడే లేడు.
- ఫేక్ రిజిస్ట్రేషన్లు తీసుకున్నవారే పెద్ద ఎత్తున ప్రభుత్వానికి జీఎస్టీ ఎగవేస్తూ స్కామ్‌లకు పాల్పడుతున్నారు. అంతేకాక ఫేక్ రిజిస్ట్రేషన్ల పేరుమీద భారీ ఎత్తున దందా కొనసాగుతుంది.
- ఒరిజినల్‌గా అన్ని సర్టిఫికెట్లు ఉన్నవారికి జీఎస్టీ రిజిస్ట్రేషన్ ఇచ్చేందుకు మామూళ్ల అడుగుతూ..అధికారులు వేధిస్తున్నారు. ఇటీవల మాదాపూర్ పరిధిలో ఒక వ్యాపారి జీఎస్టీ రిజిస్ట్రేషన్ కావాలని కోరగా రూ.8 వేలు డిమాండ్ చేయడం..ఆ ఏసీటీఓను ఏసీబీ అధికారులు అరెస్ట్ చేసిన విషయం విదితమే.

ఖర్చులపై పలు అనుమానాలు..

- వాణిజ్య పన్నుల శాఖ (జీఎస్టీ) ప్రధాన కార్యాలయానికి వచ్చే బడ్జెట్ ఖర్చుల బిల్లులపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల సంవత్సరం వాటర్ బిల్లు లక్షల్లో రావడం ఇందుకు ఉదాహరణగా చెబుతున్నారు.
- ట్రైనింగ్ క్లాస్‌ల కోసం ఏదైనా సమావేశం జరిగితే అయ్యే ఖర్చులూ అడ్డగోలుగా చేస్తున్నారని అంటున్నారు. ఈ బడ్జెట్ ఖర్చులపై విచారణ జరిపితే అన్ని నిజాలు బయటకు వస్తాయని పలువురు కింది స్థాయి అధికారులు పేర్కొంటున్నారు.

ధన్వంతరి పూజలు చేయండి

రంగంలో భవిష్యవాణి వినిపించిన స్వర్ణలత

చార్మినార్: నేను మహమ్మారిని తొక్కేస్తున్నాను..ప్రజలు రోగాల పాలు కాకుండా కాపాడుతున్నాను..అయితే మీరు మాత్రం క్రమం తప్పకుండా నాకు పూజలు చేయండి..అవి ఎలాంటివంటే..ధన్వంతరి పూజలతో పాటు పసుపు, బెల్లంతో సాక పెట్టి 5 వారాల పాటు పూజలు చేయాలి..అంటూ మాతంగి స్వర్ణలత భవిష్యవాణిలో చెప్పారు. రాష్ట్ర ప్రజలకు అన్ని తానై అండగా ఉంటానన్నారు. ఈసారి వర్షాలు దండిగా కురుస్తాయని..రాష్ట్రం పాడి పంటలతో కళకళలాడుతుందన్నారు. సోమవారం మీరాలంమండి శ్రీ మహంకాళేశ్వర దేవాలయంలో రంగం కార్యక్రమం సందర్భంగా ఆమె భవిష్యవాణి వినిపించారు. సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి దేవాలయంలో ప్రతి సంవత్సరం బోనాల జాతర సందర్భంగా భవిష్యవాణి వినిపించే సర్వలత గత కొన్నేళ్లుగా మీరాలంమండి అమ్మవారి దేవాలయంలో కూడా భవిష్యవాణి వినిపిస్తున్నారు. పాతబస్తీలో సోమవారం అమ్మవారి ఘటాల సామూహిక ఊరేగింపు సందర్భంగా ఈ భవిష్యవాణి కార్యక్రమం భక్తి శ్రద్ధలతో జరిగింది. అందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలు కలిగి ఉండేలా తాను చూస్తానన్నారు.

'అందరినీ చల్లగా చూస్తా'

చాంద్రాయణగుట్ట: నా పిల్లలను నేను చల్లగా కాపాడుకుంటానని లాల్‌దర్వాజ సింహవాహిని మహంకాళి అమ్మవారిని ఆవహించిన అనురాధ భవిష్యవాణి వినిపించారు. కొందరు చేసిన పాపాలకు శిక్ష అనుభవించక తప్పదన్నారు. యాప రిల్లలతో సాకలుపెట్టాలి...ముత్తైదువలు పసుపుబొట్టు ఇచ్చి హారతులివ్వాలన్నారు. నేను ఉన్న దగ్గరనే ఉంటాను. నా పిల్లలను నేను కాపాడుకుంటాను అన్నారు.





భవిష్యవాణి వినిపిస్తున్న మాతంగి స్వర్ణలత ,అనురాధ

శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా పటిష్ట బందోబస్తు


– నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్

యాకుత్‌పురా: 350 సంవత్సరాల ఘన చరిత్ర గల శ్రీ అక్కన్న మాదన్న ఆలయాన్ని దర్శించుకొని అమ్మవారి అంబారీ ఊరేగింపును ప్రారంభించడం తన అదృష్టమని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ సంతోషం వ్యక్తం చేశారు. పాతబస్తీ బోనాల ఉత్సవాల ముగింపు సందర్భంగా ప్రధానమైన అంబారీ ఊరేగింపు కార్యక్రమానికి సోమవారం సతీమణి లలితా ఆనంద్‌తో కలిసి అంబారిపై అమ్మవారి ఊరేగింపును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ప్రధాన ఊరేగింపులో శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో పాతబస్తీ ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ అధ్యక్షుడు రాఘవేందర్, నగర అదనపు కమిషనర్ (శాంతిభద్రతలు) విక్రమ్ మాన్ సింగ్, జాయింట్ కమిషనర్ (ట్రాఫిక్) జోయల్ డేవిస్, దక్షిణ మండలం డీసీపీ స్నేహ మెహ్రా, స్పెషల్ బ్రాంచ్ డీసీపీ అపూర్వ రావు పాల్గొన్నారు.



అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న సిటీ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్

యువకుడి దారుణ హత్య



మహ్మద్ ఖబులా (ఫైల్)

విజయనగర్‌కాలనీ: ఓ యువకుడు హత్యకు గురైన సంఘటన ఆసిఫ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ఆనంద్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. సాబేర్‌నగర్‌కు చెందిన మహ్మద్ ఖబులా అలియాస్ అడ్డుఖాన్ (28) సోఫా మేకర్‌గా పని చేసేవాడు. ఆదివారం రాత్రి అతను స్థానిక ఆసిఫ్‌నగర్ జిర్రా రహత్‌హోటల్ సమీపంలోని కిషన్‌నగర్ సందులో తన స్నేహితుడు షేక్ ఖబులాతో కలిసి మద్యం సేవిస్తుండగా గుర్తుతెలియని యువకులు అతడిపై కత్తితో దాడి చేశారు. ఈ ఘటనలో ఖబులా కిందపడిపోవడంతో బండరాళ్లతో తలపై మోది దారుణంగా హత్య చేసి అక్కడి నుంచి పరారయ్యారు. సమాచారం అందుకున్న ఆసిఫ్‌నగర్ పోలీస్ డివిజన్ ఏసీపీ కిషన్‌కుమార్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించిన పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సెటా నూతన కార్యవర్గం ఎన్నిక



రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ ఎలక్ట్రిక్ ట్రేడర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నికైంది. అసోసియేషన్ కార్యవర్గ సమావేశం సికింద్రాబాద్‌లో జరిగింది. అధ్యక్షుడిగా జీ సురానా, కార్యదర్శిగా జీ సుధీర్ కొఠారి, కోశాధికారిగా సిద్దార్థ కేవల్ రమణి ఎన్నికయ్యారు. ఈసందర్భంగా నూతన కమిటీ సభ్యులు తమకు అవకాశం కల్పించిన కార్యవర్గ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి ఐక్యంగా ముందుకు సాగాలి



సమావేశమైన జేఏసీ నాయకులు

హిమాయత్‌నగర్ : కారోబార్, బిల్ కలెక్టర్ల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా ముందుకు సాగాలని గ్రామ పంచాయతీ కారోబార్ అండ్ బిల్ కలెక్టర్స్ ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశంలో జేఏసీ నాయకులు మామిడాల నరసింహులు యజ్ఞ నారాయణ, బింగి గణేష్, సాదుల శ్రీకాంత్, బాలరాజు మాట్లాడారు. జీవో 51 నుంచి కారోబార్, బిల్ కలెక్టర్ మినహాయించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని త్వరలో జేఏసీ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయిలో ఆత్మీయ సమ్మేళనం హైదరాబాద్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. జేఏసీ రాష్ట్ర మీడియా మీడియా ఇంచార్జ్ తేలుకంటి మురళి, నేతలు పాల్గొన్నారు.

మినీట్యాంక్ బండ్‌పై చెత్తకుప్పలు



సరూర్‌నగర్ మినీట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ సమీపంలో చెత్తకుప్ప

చైతన్యపురి: మినీట్యాంక్ బండ్‌గా ప్రసిద్ధి చెందిన సరూర్‌నగర్ చెరువు కట్టపై ఎక్కడ చూసినా చెత్త కుప్పలు దర్శనం ఇస్తున్నాయి. నిత్యం వందలాది మంది వాకింగ్‌చేసే యువకులు, వృద్ధులు, సాయంత్రం సమయంలో సేదతీరేందుకు పరిసర కాలనీల నుంచి చిన్నపిల్లలతో మినీ ట్యాంక్ బండ్‌కు వస్తుంటారు. సుందరంగా తీర్చిదిద్ది పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాల్సిన పాలకులు, అధికారుల నిర్లక్ష్యం మూలంగా మినీట్యాంక్‌బండ్ రోజురోజుకీ అందవిహీనంగా మారుతుంది. ఇటీవల ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేసిన ఓపెన్‌జిమ్ పరిసరాల్లో కూడా చెత్త కుప్పలు పేరుకుపోతున్నాయి. శానిటేషన్ పనులు సక్రమంగా నిర్వహించకపోవటం, నిర్వహణ లోపం వల్ల సేద తీరేందుకు ఇక్కడకు వచ్చే సందర్శకులకు ఇక్కడ పరిస్థితులు అసౌకర్యాన్ని కలిగిస్తున్నాయని స్థానికులు అంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మినీట్యాంక్‌బండ్‌ను అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.

నాణ్యమైన వైద్యం కోసమే ఆస్పత్రుల తనిఖీ

తెలంగాణ మెడికల్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్



సాక్షి, సిటీ బ్యూరో: ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలనే ఏకైక లక్ష్యంతో నకిలీ వైద్యులు, ఆసుపత్రులను తనిఖీ చేస్తున్నామని తెలంగాణ మెడికల్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ తెలిపారు. సోమవారం హయత్‌నగర్‌లో పలు ఆసుపత్రుల్లో తనిఖీలు నిర్వహించగా అర్హత లేని వ్యక్తులు వైద్య సేవలందిస్తున్నారని, అనధికారికంగా పెద్దమొత్తంలో యాంటీబయోటిక్స్ వినియోగిస్తున్నట్లు గుర్తించామన్నారు. బీహెచ్ఎంఎస్, ఇంటర్మీడియట్ చదివిన వ్యక్తులు ఎంబీబీఎస్‌గా చెప్పుకుంటున్నారని వివరించారు. ఈ మేరకు సన్‌రే ఆసుపత్రి, డయాగ్నోస్టిక్ సెంటర్, శ్రీ విజయ బ్రహ్మేంద్ర ఫస్ట్ ఎయిడ్ సెంటర్, హనుమాన్ ఫస్ట్ ఎయిడ్ సెంటర్, శ్రీ సాయి పాలీక్లినిక్, బాలాజీ ఫస్ట్‌ఎయిడ్ సెంటర్లపై కేసులు నమోదు చేస్తున్నామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వైద్య సేవలందించడం, మందులు వినియోగించడం, నకిలీ వైద్యులుపై ఇప్పటి వరకు సుమారు 500 కేసులు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

ఓయూలో విద్యార్థులపై దాడి



ఓయూలో విద్యార్థుల ధర్నా

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో విద్యార్థుల పై బయటి వ్యక్తుల దాడిని నిరసిస్తూ విద్యార్థి సంఘాల నేతలు సోమవారం రోడ్డు పై బైఠాయించి ధర్నా చేపట్టారు. క్యాంపస్‌లోని రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద బోనాల పండుగ సందర్భంగా బయటి వ్యక్తులు మద్యంతాగి విద్యార్థుల పై దాడి చేయడాన్ని నిరసిస్తూ ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, ఎన్ఎస్‌యూఐ, పీడీఎస్‌యూ ధర్నా చేపట్టారు. సెక్యూరిటీ సిబ్బంది నిర్లక్ష్యం వల్లే ఓయూ క్యాంపస్‌లో బయటి వ్యక్తులు మద్యం తాగుతూ ఇష్టారాజ్యాంగ వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. విద్యార్థుల పై దాడిని బీఎస్ఎఫ్ నాయకులు నరేందర్ తీవ్రంగా ఖండించారు. ఓయూ ప్రైవేటు సెక్యూరిటీ సిబ్బంది పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

డేటా సైన్స్‌పై వారం రోజుల శిక్షణ ప్రారంభం



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్కీ డైరెక్టర్ డాక్టర్ రామేశ్వరరావు

రాయదుర్గం: సృష్టిని ప్రతి సృష్టి చేయగల డేటా సైన్స్, కృత్రిమ మేధ అని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ రామేశ్వరరావు పేర్కొన్నారు. డేటా సైన్స్ అండ్ ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌పై గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో వారం రోజులు జరిగే శిక్షణా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డేటా సైన్స్ కృత్రిమ మేధ ప్రపంచ వ్యాపార, వాణిజ్య రంగాల్లో నూతన ఆవిష్కరణలకు నాంది పలికాయన్నారు. విశ్లేషణా సామర్థ్యాలను తెలియచేసే డేటాసైన్స్‌తో కృత్రిమమేధ తోడైనప్పుడు ఆటోమేషన్ ద్వారా అద్భుతమైన ఫలితాలను అందించవచ్చన్నారు. చెన్నయ్ ఈటడీ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ చీఫ్ టెక్నికల్ ఆఫీసర్ డాక్టర్ అభిషేక్ చింతగుంట తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సంస్కృతికి ప్రతీక బోనాలు : ఎమ్మెల్సీ కవిత

కాచిగూడ: బోనాల జాతర వేడుకలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుట్ల కవిత అన్నారు. చెప్పల్‌బజార్‌లో నిర్వహించిన బోనాల జాతర పలహారం బండి ఊరేగింపు కార్యక్రమంలో ఆమె పాల్గొని ఉజ్జయిని మహంకాళి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు ఎం. అనిల్ యాదవ్, ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. పోతరాజుల విన్యాసాలు, డప్పు వాయిద్యాలకు యువత నృత్యాలు, చిన్నారుల కేరింతలతో అమ్మవారి ఫలహారం బండి ఊరేగింపు కోలాహలంగా సాగింది.



కారు సీట్లో కూర్చుని వ్యక్తి మృతి



గణపతి మృతదేహం

శంషాబాద్ రూరల్: కారు డ్రైవింగ్ సీటులో కూర్చున్న వ్యక్తి కూర్చున్న చోటే మృతి చెందిన సంఘటన తొండుపల్లిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కె.నరేందర్‌రెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. కర్ణాటకకు చెందిన ఏవీ.గణపతి(60), కోమల దంపతులు తొండుపల్లిలో నివాసముంటున్నారు. ఈ నెల 20న మధ్యాహ్నం గణపతి ఇంటి ముందు కారులో డ్రైవింగ్ సీట్లో కూర్చుని అపస్మారకస్థితిలో చేరుకున్నాడు. దీనిని గుర్తించిన కుటుంబ సభ్యులు అతడిని పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. డోర్లు వేసుకుని కారులో ఎక్కువ సమయం కూర్చోవడంతో ఊపిరి ఆడక లేదా గుండెపోటుతో మృతి చెందినట్లు భావిస్తున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మేం ఖాళీ చేయం..!

- ఇందిరమ్మ ఇళ్లకు 'స్లమ్ నివాసితుల' ససేమిరా...!
- నివాసాలు ఖాళీ చేసే ప్రసక్తి లేదంటున్న పేద కుటుంబాలు
- ఒప్పించేందుకు ప్రయత్నిస్తున్న అధికారులు..
- నివాస స్థలాలకు అనుగుణంగా డబుల్ ఇళ్లు మంజూరుకు డిమాండ్
- ఆదిలోనే ఇందిరమ్మ ఇళ్ల సర్వేకు అడ్డంకులు

సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో మురికి వాడలను ముంబై తరహా సమగ్ర అభివృద్ధితో రూపురేఖలను మార్చి జీ ప్లస్ త్రీ నివాస సముదాయల నిర్మాణాలతో మోడల్ ఇందిరమ్మ కాలనీ ఏర్పాటు చేయాలన్న ప్రభుత్వం సంకల్పానికి ఆదిలోనే హంసపాదు ఎదురవుతోంది. గత ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ భవన సముదాయాలు నిర్మించిన తరహా లోనే బస్తీ (మురికివాడలు)ల్లోని తాత్కాలిక ఇల్లు కూల్చి అక్కడే జీ ప్లస్ త్రీ గృహ సముదాయాలు నిర్మిస్తామనే ప్రతిపాదనలకు నివాసితులు నుంచి సుముఖత వ్యక్తం కానట్లు తెలుస్తోంది. వారికి అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు సర్ది చెబుతూ ఒత్తిడి తేస్తుండటంతో ఒక వేళ ఇళ్లు ఖాళీ చేస్తే మాత్రం నిర్మాణాలు పూర్తయి ఇల్లు అప్పగించే వరకు నివాసం కోసం డబుల్ బెడ్ రూమ్ వసతి కల్పించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. మరి కొందరు తాము నివాసం ఉంటున్న స్థలాలకు అనుగుణంగా రెండు ఇళ్లు కేటాయిస్తేనే అంగీకరిస్తామని తేల్చి చెబుతున్నారు.

ఇదీ పరిస్థితి

హైదరాబాద్ జిల్లా పరిధిలో సుమారు 16 ప్రాంతాల్లో ఇరవై ఏళ్లకుపైగా పేదలు ప్రభుత్వ స్థలాల్లో (మురికి వాడలు) ఉన్నట్లు రెవెన్యూ యంత్రాంగం గుర్తించింది. అందులో ఎలాంటి వివాదాలు లేని సైదాబాద్ మండలంలోని సరళాదేవినగర్, మాదన్నపేట, పిల్లి గుడిసెలు, మారేడుపల్లిలోని అంబేద్కర్ నగర్, ఆసిఫ్‌నగర్‌లోని మంగార్ బస్తీ, ఖైరతాబాద్‌లోని గురుబ్రహ్మ నగర్‌లతోపాటు మరో తొమ్మిది ప్రాంతాలోని మురికి వాడల్లో సైతం దృష్టి సారించి ఇందిరమ్మ మోడల్ కాలనీల ఏర్పాటు కోసం సర్వేకు సిద్ధమైంది. అయితే పెద్దగా కోర్టు వివాదాలు లేనప్పటికీ స్థానికుల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోంది. కొన్ని మురికి వాడల్లో సర్వేకోసం వెళ్లిన రెవెన్యూ, గృహనిర్మాణ, జీహెచ్ఎంసీ అధికారులకు సహాయ నిరాకరణ తప్ప లేదు. వాస్తవంగా ఎంపిక చేసిన మురికి వాడల్లో జీఐఎస్ బేస్డ్ సర్వే నిర్వహించి ఆ తర్వాత ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాలను కూడా గుర్తించి ఇళ్ల నిర్మాణం చేపట్టాలని సర్కారు యోచిస్తోంది.

అసెంబ్లీ సెగ్మెంట్‌కు 1500 ఇళ్లు..

తొలి విడతగా ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద అసెంబ్లీ సెగ్మెంట్‌కు సుమారు 1,500 ఇళ్ల చొప్పున ఇళ్లు నిర్మించేలా ప్రణాళిక రూపొందించుకున్నట్లు తెలుస్తోంది. వాస్తవంగా ఇందిరమ్మ ఇండ్ల కోసం దాదాపు 5.40 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. అర్హులను ఎంపిక చేసేందుకు క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించగా దాదాపు 4.22 లక్షల కుటుంబాలకు ఎలాంటి స్థలం లేనట్లు గుర్తించారు. వారికి ప్రభుత్వ స్థలాల్లో బహుళ అంతస్తులతో ఇళ్లు నిర్మించాలని, వాటితోపాటు స్లమ్స్‌లోని నివాసాలను కూల్చేసి జీ ప్లస్ 3 అంతస్తులుగా నిర్మించాలని భావిస్తోంది. అయితే ఇందిరమ్మ మోడల్ కాలనీలో స్థలాభావంతో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కాకుండా సింగిల్ బెడ్ రూమ్ ఇళ్లుగా కుదిస్తే నిర్వాసితులతోపాటు ఇళ్లు లేని కుటుంబాలకు లబ్ధి చేకూర్చే అవకాశం ఉంటుందని యోచిస్తున్నట్లు భావిస్తున్నట్లు సమాచారం. ఒక్కో లబ్ధిదారునికి 400 స్క్వేర్ ఫీట్స్(చదరపు అడుగుల) విస్తీర్ణంలో సింగిల్ బెడ్‌రూం ఫ్లాటును ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, మంగళవారం, 22, జూలై, 2025

కాశీ నేపథ్యంలో..
కైలాసవాస శివ పాట

ప్రసాద్ ల్యాబ్ వేదికగా ఆవిష్కరించిన తనికెళ్ల భరణి



సాక్షి, సిటీబ్యూరో: శివుడి అనుమతి ఉంటేనే కాశీ వెళ్లగలమని, శివతత్వాన్ని మరోసారి పాటలో ప్రతిబింబించారని ప్రముఖ సినీ నటుడు తనికెళ్ల భరణి అన్నారు. ప్రముఖ సంగీత దర్శకులు అనుదీప్ దేవ్ నేతృత్వంలో రూపొందించిన 'కైలాసవాస శివ' పాటను నగరంలోని ప్రసాద్ ల్యాబ్ వేదికగా సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నిహారిక కొణిదెల, శ్రీనివాస్ అవసరాల, బీవీఎస్ రవి, యదువంశీ తదితర సినీ ప్రముఖులు పాల్గొన్నారు. పాట విన్నాక భావోద్వేగంతో మళ్లీ ఓసారి కాశీకి వెళ్లాలనిపించిందని భరణి అన్నారు. ఆసియాలోనే అత్యంత ప్రాచీన నగరమైన కాశీ, కాశీ సాహిత్యానికి సంబంధించి తెలుగులో మొదటిసారి ఏనుగుల వీరాస్వామి 'కాశీ యాత్ర చరిత్ర'ను రచించారని గుర్తు చేశారు.

రౌద్రానికి భిన్నంగా శాంతి సంగీతం..

కుంభమేళా జరిగిన నెల రోజులకు కాశీ వెళ్లి ఈ పాట చిత్రీకరించామని సంగీత దర్శకులు అనుదీప్ అన్నారు. శివుడి పాటలంటేనే గుర్తొచ్చే స్వరం.. విజయ్ ప్రకాశ్. ఆయనే తెలుగు, హిందీ భాషల్లో ఈ పాట పాడారు. అద్భుతమైన తెలుగు పదాలతో కిట్టు రాసిన ఈ పాట ప్రైవేట్ ఆల్బమ్స్‌లో పెద్ద హిట్ అవుతుందని గట్టిగా నమ్ముతున్నాం. ఈ పాట నిర్మాణానికి ఎస్ఆర్‌డీ సంస్థ ఆర్థిక సాయం అందించింది. శివుడి పాట అంటే రౌద్రం, హై పిచ్ మ్యూజిక్ ఎక్కువ. కానీ శివుడిలోని ధ్యాన సంద్రం, శాంతిని ప్రతిబింబించేలా స్లో మెలోడీలో ఈ పాట చేశామని పేర్కొన్నారు. డైరెక్టర్ నాగ్ అర్జున్ రెడ్డి, మాలిక్‌రామ్, హర్షితా రెడ్డి, కమిటీ కుర్రోళ్లు సినీ బృందం పాల్గొని సందడి చేసింది.



26న గోవాలో డ్రీమ్ అచీవ్‌మెంట్ అవార్డ్స్

హాజరుకానున్న గోవా గవర్నర్, సీఎం

హిమాయత్‌నగర్ : పలు రంగాల్లో నిష్ణాతులైన వారిని గుర్తించి 'డ్రీమ్ అచీవ్‌మెంట్ అవార్డ్స్–2025' పేరుతో యేటా అవార్డులు అందజేస్తుంటారు. దీనికి సంబంధించిన గోడ పత్రికను బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో సోమవారం ఆవిష్కరించారు. దీనికి ముఖ్య అతిథిగా విచ్చేసి కేంద్ర మాజీ మంత్రి సముద్రాల వేణుగోపాలాచారి మాట్లాడుతూ ప్రతిభను గురించి ఇటువంటి అవార్డులు అందజేయడం అభినందనీయమన్నారు. అనంతరం రాయల్ సక్సెస్ బుక్ ఆఫ్ రికార్డ్స్ డైరెక్టర్ హారిక, ఇంటర్నేషనల్ చీఫ్ దిలీప్‌లు మాట్లాడారు. ఈనెల 26న గోవాలో జరగనున్న ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజు, సీఎం ప్రమోద్ సావంత్, తదితరులు హాజరుకానున్నారని తెలిపారు. యేటా పలు రంగాల్లో విశేష సేవలందించిన వారికి, అలాగే సామాజిక సేవ చేస్తున్న వారికి డాక్టరేట్ పేరుతో వారిని సత్కరిస్తున్నట్లు వెల్లడించారు. సంస్థ ప్రతినిధులు రాకేష్ జైన్, జయకృష్ణ, కిరణ్, నరేష్, జితేందర్ సింగ్ పాల్గొన్నారు.

ఆకాశంలో తారలు, చందమామల గురించి మనకు తెలుసు. చెట్లూ పుట్టల గురించి కూడా మనకు తెలుసు.. అయితే వీటిలో చాలా వరకూ మనం నాలుగు గోడల మధ్య తరగతి గదిలో కూర్చుని చదువుకున్నాం.. కాబట్టి మనకు అవగాహన ఉంది.. కానీ ఆకాశంలోకి చూస్తూ.. నక్షత్రాల గురించి, అడవిలో నడుస్తూ ఆకులు, చెట్ల గురించి తెలుసుకోవడం ఎలా ఉంటుంది? 'అదే అసలైన చదువు' అంటున్నారు పలువురు నగరవాసులు. అవుట్ డోర్ క్లాస్ రూమ్ లెసన్స్‌కి జై కొడుతున్నారు.
- సాక్షి, సిటీబ్యూరో

నేచర్‌లో.. నేర్చుకో..

అరుబయట అభ్యాసం.. అరుదైన అనుభవం..

- నింగి, నేల, నీరు, నిప్పు, రాయీ రప్ప..పాఠ్యాంశాలే
- నగరానికి చెందిన ఫ్రెండ్స్ రూపుదిద్దిన కాన్సెప్ట్
- అవుట్‌డోర్ క్లాస్ రూమ్స్ శిక్షణకు ఆదరణ

వయసులకు అతీతంగా సిటిజనుల ఆసక్తి





ప్రస్తుతం ఆకాశం వైపు చూడటం కంటే మొబైల్ స్క్రీన్లనే పిల్లలు ఎక్కువగా చూస్తున్నారు. చందమామను కూడా తల్లులు మొబైల్స్‌లోనే చూపించాల్సిన దుస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో అసలైన చదువు అంతా ఆరుబయటే ఉందని భావించిందో మిత్రబృందం. అనుకున్నదే తడవుగా ఓ కొత్త ఆలోచనకు తెర తీసింది. తద్వారా అవుట్ డోర్ క్లాస్ రూమ్ అనే కాన్సెప్ట్ డిజైన్ చేసింది. సరికొత్త తరగతి గదులను నగరవాసులకు పరిచయం చేస్తోంది. 'ఈ కాన్సెప్ట్‌ని కోవిడ్ సమయంలో ఆలోచించాం. నాలుగేళ్ల క్రితం మొదలుపెట్టాం. తొలిదశలో మొత్తం ఐదారుగురమే కానీ, ఇప్పుడు మా టీమ్ 25కి చేరింది' అంటూ చెప్పారు మాజీ ఐటీ ఉద్యోగి రాఘవ. తమ కాన్సెప్ట్ గురించి ఆయన పంచుకున్న విశేషాలు ఆయన మాటల్లోనే..

వాట్సాప్ గ్రూప్‌గా ప్రారంభమై..

నా స్నేహితుడు దేవేందర్, ఐశ్వర్యలతో కలిసి మరికొందరు స్నేహితులను ఆహ్వానించడం ద్వారా అది ఒక వాట్సాప్ గ్రూప్‌గా ప్రారంభమైంది. కాలక్రమేణా మా కార్యకలాపాలు వైవిధ్యభరితంగా మారాయి. మా టీమ్‌లో నక్షత్రాలూ పాలపుంతలను విడమరిచే ఆస్ట్రానమీ తెలిసిన నిపుణుల నుంచి గణితాన్ని ప్రకృతితో ముడిపెట్టి వివరించే మాథ్‌మెటీషియన్ వరకూ.. ఒక్కొక్కరూ ఒక్కో సబ్జెక్ట్‌లో స్పెషలైజేషన్ చేసిన 25 మంది ఉన్నారు. ఎంచుకున్న టాపిక్ బట్టి వారు ఆయా సెషన్లకు హాజరవుతూ పాఠాలు బోధనలా కాకుండా ప్రాక్టికల్ అనుభవాలను అందిస్తారు.



నగరంలోని పార్కుల నుంచి కర్ణాటకలోని కూర్గ్ వరకూ..

'నగరంలోని రాక్ ఏరియాలు, పార్కులు, లేక్స్.. ఇలా కాదేదీ క్లాస్‌రూమ్‌కి అనర్హం అన్నట్టుగా మారిపోతాయి. నగరం మాత్రమే కాదు రాష్ట్రాలు కూడా దాటుతూ, కూర్గ్ వంటి హిల్ స్టేషన్స్‌లో సైతం సెషన్స్ ఏర్పాటు చేస్తాం. ట్రెక్కింగ్, రాక్ క్లైంబింగ్, హైకింగ్‌లు, ఫొటో వాక్‌లు, చారిత్రక బాటలు, రాత్రుళ్లు నక్షత్రాల వీక్షణం, తల్లిదండ్రులు–పిల్లల శిబిరాలు.. ఇలా అవుట్ డోర్ క్లాస్‌రూమ్స్ ప్రతి నెలా అనేక సెషన్‌లు నిర్వహిస్తుంది. పాఠశాల విద్యార్థుల నుంచి కార్పొరేట్ బృందాల వరకూ ఇందులో భాగస్వాములవుతున్నారు. పైగా వీరంతా ఈ తరహా బోధనకు ఆకర్షితులవుతున్నారు' అని చెప్పుకొచ్చారు.

ఇప్పటికి దాదాపు 100కిపైగా క్లాసులు..



'ప్రతి సెషన్‌లో కనీసం 25 నుంచి 40 మంది వరకూ స్థానం కల్పిస్తాం. నగరంలోని పలు స్కూల్స్, కార్పొరేట్ సంస్థలతో కలిసి వీటిని ప్లాన్ చేస్తుంటాం. ఇప్పటికి దాదాపు 100కి పైగానే క్లాస్ రూమ్స్ నిర్వహించాం. ఇతర నగరాల్లోనే కాకుండా భవిష్యత్తులో విదేశాలకు సైతం విస్తరించాలనే ఆలోచన చేస్తున్నాం' అంటూ ముగించారు రాఘవ. ఉరుకుల పరుగుల జీవితంలో నేర్చుకోవడం కూడా అంతే వేగంగా మారిపోయింది. ఈ నేపథ్యంలో నేచర్ గురించి తెలుసుకోవడం ఎంత ముఖ్యమో.. నేచురల్‌గా నేర్చుకోవడమూ అంతే ముఖ్యం అనే ఆలోచనే ఈ తరహా అవుట్ డోర్ క్లాస్ రూమ్స్‌కి ఊపునిస్తోందనేది నిర్వివాదమైన అంశం.



పచ్చని విరులు.. ఆరోగ్యపు సిరులు..

ఇటు ఆరోగ్యం.. అటు ఆహ్లాదం..

- కనువిందు చేస్తున్న పూలు, ఆయుర్వేదం, పండ్ల మొక్కలు
- అలంకరణ కోసం వివిధ రకాల రంగుల కుండీలు
- హఫీజ్‌పేట కొత్తకుంట చెరువుపై ఆకట్టుకుంటున్న నర్సరీలు
- వర్షాకాలం కావడంతో కొనుగోలుదారులతో సందడి



ప్రతి ఒక్కరూ పచ్చని ప్రకృతిని చూస్తే పరవశించిపోతారు. అలాంటి పచ్చని ప్రకృతి మన ఇంట్లోనే ఉంటే ఇటు కంటికి.. అటు ఒంటికి ఆరోగ్యాన్ని అందిస్తాయి. వర్షాకాలం కావడంతో నగరంలో నర్సరీలు పూలు, పండ్లు, ఆయుర్వేదం మొక్కలతో అమ్మకాలకు సిద్ధమయ్యాయి. అదే తరహాలో కొనుగోలుదారులతో సందడిగా మారుతున్నాయి. ఇంటి అలంకరణలో భాగంగా మొక్కలు పెంచేందుకు రంగు రంగుల కుండీలు సైతం ఆకర్షిస్తున్నాయి. హఫీజ్‌పేట డివిజన్ పరిధిలోని కొత్తకుంట చెరువు కట్టపై ఆర్టీసీ కాలనీ వద్ద, జాతీయ రహదారి జెనిసిస్ స్కూల్ వద్ద నర్సరీలు ఏర్పాటు చేశారు. ఇవి మొక్కల ప్రేమికులను, కొనుగోలుదారులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి.
- చందానగర్

ఆంధ్రప్రదేశ్‌లోని రాజమండ్రి, కడియం నర్సరీల నుంచి మొక్కలు తీసుకొచ్చి అమ్మకందారులు ఇక్కడ ఏర్పాటు చేస్తున్నారు. గత పదేళ్లుగా కూకట్‌పల్లిలోని హౌసింగ్ బోర్డులో నర్సరీలు ఏర్పాటు చేసేవారు మొక్కల అమ్మకాలకు డిమాండ్ ఏర్పడటంతో మియాపూర్, హఫీజ్‌పేట్ పరిసర ప్రాంతాల్లోనూ విరివిగా ఏర్పాటు చేస్తున్నారు. కొన్ని కుటుంబాలకు నర్సరీలే జీవనాధారం. ఈ నర్సరీల్లో 500ల రకాల వరకూ వివిధ రకాల మొక్కలు ఏర్పాటు చేస్తారు. అలంకరణ మొక్కలు, పూల మొక్కలు, ఆయుర్వేదం, పండ్ల జాతులు అమ్మకాలకు ఉంచుతారు. ఆవరణలో ఏర్పాటు చేసే లాన్ కూడా సప్లై చేస్తున్నారు. కుండీలు రూ.20 నుంచి రూ.350 వరకూ అమ్ముతున్నారు.

పూల మొక్కలకు గిరాకీ..

గులాబీ, చామంతి, మందారం, అలంకరణ పూలు వంటివి సుమారు 300 రకాలు అందుబాటులో ఉన్నాయి. ఇన్ అండ్ అవుట్ డోర్ మొక్కలు, తులసిలో లక్ష్మి, కృష్ణ, శివుడి పూజకు బిల్వపత్రం, శంకం పూలు, పారిజాతం, ఉసిరి, జమ్మి వంటి మొక్కలు అమ్మకానికి ఉన్నాయి. వీటిలో రూ.30 నుంచి రూ.350 వరకూ ధరల్లో విక్రయిస్తున్నారు.

ఇతర ఉత్పత్తులు..



మొక్కల పెంపకానికి కావాల్సిన వివిధ రకాల మోడళ్లలో రంగు రంగుల కుండీలు, సేంద్రీయ ఎరువులు, వర్మీ కంపోస్టు, కోకోపిట్, ఆయుర్వేదం, పండ్లు, పూలు, అలంకరణ మొక్కలకు కావాల్సిన పురుగు మందులు, ఇళ్లలోకి కీటకాలను నివారించే మొక్కలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. దీంతో పాటు ఇంటి

ఆయుర్వేదం, పండ్ల మొక్కలు..

వివిధ రకాల రోగాలను నియంత్రించడంలో ఉపయోగపడే ఆయుర్వేదం మొక్కలైన తులసి, కలబంద, నల్లేరు, రణపాల, గరిక, తిప్పతీగ, మారేడు మొక్కలతోపాటు పండ్ల మొక్కలైన సపోట, దానిమ్మ, జామ, మామిడి, అంగూర్, నిమ్మ తదితర హైబ్రిడ్ మొక్కలు అలరిస్తున్నాయి. దోమలను నివారించే లెమన్ గ్రాస్, లావెండర్, పుదీన, సిట్రొనెల్లా వంటి అనేక మొక్కలు ఉన్నాయి.

నర్సరీ ఏర్పాటు సంతోషకరం..



కొత్తకుంట చెరువు కట్టపై నర్సరీ ఏర్పాటు సంతోషకరం.. కాలనీ వాసులు ఇష్టానుసారం చెత్త వేస్తున్న నేపథ్యంలో అదే స్థలంలో మొక్కలు పెంచడం మంచిపరిణామం. చెరువు నీరు మొక్కల ఎదుగుదలకు ఉపయోగం. వివిధ రకాల పూలు, పండ్ల మొక్కలు అమ్మకానికి అందుబాటులో ఉంచారు.
– సురేష్, మదీనాగూడ

ఆయుర్వేద మొక్కలకు గిరాకీ..



ఇటీవలి కాలంలో చాలా మందికి ఆరోగ్యంపై అవగాహన పెరగడంతో ఆయుర్వేద మొక్కలకు గిరాకీ పెరిగింది. దీంతో పాటు కీటకాలను నివారించే కొన్ని రగకాల గడ్డిజాతి మొక్కలకు కూడా డిమాండ్ ఏర్పడింది.
– రాజు, నర్సరీ నిర్వాహకుడు



ఉత్సాహంగా సైకిల్ ఫర్ ఏ కాజ్..

- రాడిసన్ బ్లూ ప్లాజా నుంచి వినూత్నంగా రైడ్





సాక్షి, సిటీబ్యూరో: సామాజిక అభివృద్ధి, బాధ్యతపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా నగరంలోని రాడిసన్ బ్లూ ప్లాజాలో 'సైకిల్ ఫర్ ఏ కాజ్' పేరుతో రైడ్ నిర్వహించారు. రాడిసన్ హోటల్ గ్రూప్ సౌత్ ఆసియా చేపట్టిన ఈ ఈవెంట్‌లో 120 మందికి పైగా సైక్లిస్టులు పాల్గొన్నారు. రాడిసన్ పీపుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక అభివృద్ధికి, అవగాహనకు మద్దతివ్వడంలో భాగంగా నిర్వహించిన ఈ రైడ్‌లో సైక్లిస్టులు రైడ్ ఫర్ హోప్ (3 కి.మీ), రైడ్ ఫర్ చేంజ్ (6 కి.మీ), రైడ్ ఫర్ ఇంపాక్ట్ (50 కి.మీ) వంటి మూడు విభాగాల్లో పోటీపడ్డారు. ఈ సందర్భంగా సంస్థ జనరల్ మేనేజర్ సందీప్ జోషి మాట్లాడారు. హైదరాబాద్‌తో పాటు దేశవ్యాప్తంగా 60కి పైగా నగరాల్లో దీనిని నిర్వహించామన్నారు. ఈ సైక్లోథాన్ కేవలం సైక్లింగ్ మాత్రమే కాదు, సమాజంలో నిజమైన మార్పే దీని ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమం ద్వారా వచ్చిన నిధులు ఆతిథ్య రంగంలో నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలకు వినియోగిస్తామని పేర్కొన్నారు.

నయనానందకరం అనుష్క నృత్యం



గన్‌ఫౌండ్రీ : నాట్య గురువు ప్రమోద్‌రెడ్డి శిష్యురాలు చెరుకు అనుష్క భరతనాట్యం నయనానందకరమని ఐపీఎస్ అధికారి ఎం.రమేష్ అన్నారు. రవీంద్రభారతిలో అభినేత్రి ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో అనుష్క అరంగేట్రం కన్నుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే పిల్లలకు సంస్కృతి, సంప్రదాయ నృత్యం పట్ల అవగాహన కల్పించి శిక్షణ ఇప్పించాలని అన్నారు. ఓ వైపు సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ, మరోవైపు సంప్రదాయ నృత్యాన్ని నేర్చుకోవడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా పుష్పాంజలి, ఆనంద నర్తన గణపతి, వర్ణం, థిల్లాన, ప్రదోష సమయం వంటి అంశాలపై చక్కటి హావాభావాలతో సాగిన నృత్య ప్రదర్శన అహూతులను ఆకట్టుకుంది. భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, నాట్య గురువు అనుపమ కైలాష్, తల్లిదండ్రులు చెరుకు గోవర్ధన్‌రెడ్డి, అంజలి పాల్గొన్నారు.

క్లుప్తంగా...

25న ఢిల్లీలో బాగీదారి న్యాయ సమ్మేళనం

- టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్



సాక్షి, హైదరాబాద్: ఈనెల 25న ఢిల్లీలోని తల్కటోరా ఆడిటోరియంలో కాంగ్రెస్ ఓబీసీ విభాగం ఆధ్వర్యంలో బాగీదారి న్యాయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి.మహేశ్‌కుమార్‌గౌడ్ వెల్లడించారు. దేశవ్యాప్తంగా ఓబీసీలకు ప్రభుత్వ, ప్రైవేటు, కార్పొరేట్ రంగాల్లో తగినంత ప్రాతినిధ్యం లభించడం లేదని తెలిపారు. ఇందుకు ఓ ఉద్యమాన్ని నిర్వహించాలన్న ఆలోచనతో కాంగ్రెస్ పార్టీ ఈ మహా సమ్మేళనాన్ని నిర్వహిస్తోందని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమ్మేళనంలో పాల్గొనేందుకు జిల్లాల నుంచి కాంగ్రెస్ పార్టీ నేతలు తమ పేరు నమోదు చేయించుకోవాలని కోరారు.

ఇంకెంత మంది చనిపోవాలి?

- మీ రాతి గుండె కరగదా?
- సీఎంపై మాజీ మంత్రి హరీశ్‌రావు ధ్వజం



సాక్షి, హైదరాబాద్: గురుకులాల్లో ఇంకెంత మంది ప్రాణాలు కోల్పోతే మీ రాతి గుండె కరుగుతుందని సీఎం రేవంత్‌రెడ్డిని మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రశ్నించారు. ఇప్పటికైనా స్పందించి ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఢిల్లీకి చక్కర్లు కొట్టడం తప్ప, రాష్ట్రంలో పరిపాలనను చక్కదిద్దడం చేతకాదా అని ఎద్దేవా చేశారు. 48 గంటల్లో సంగారెడ్డి, నారాయణ్‌ఖేడ్, నాగర్‌కర్నూల్, భద్రాద్రి కొత్తగూడెం, భద్రాచలం జిల్లాలు, నాగల్ గిద్ద మోడల్ పాఠశాల, పెద్ద కొత్తపల్లి, జగిత్యాల రూరల్ మండలం, లక్ష్మీపూర్ గురుకులాల్లో చోటుచేసుకున్న ఫుడ్ పాయిజన్ ఘటనలు కాంగ్రెస్ అసమర్థ పాలనకు నిదర్శనమని పేర్కొన్నారు. ప్రతిపక్షాలపై నోరు పారేసుకునే ముఖ్యమంత్రికి రోజురోజుకు దిగజారుతున్న గురుకులాల దీనస్థితి కనిపించడంలేదా అని నిలదీశారు. వరుస ఫుడ్‌పాయిజన్ ఘటనలతో పదుల సంఖ్యలో విద్యార్థులు ఆసుపత్రి పాలవుతుంటే రాతి గుండె కరగడంలేదా అని అన్నారు. కేసీఆర్ గురుతులు చెరిపేయాలనే లక్ష్యంతో రేవంత్ రెడ్డి గురుకులాల వ్యవస్థను చిన్నాభిన్నం చేస్తున్నారని మండిపడ్డారు.

హరీశ్‌రావువి దొంగ సర్వేలు

- చొప్పదండి ఎమ్మెల్యే సత్యం ధ్వజం



సాక్షి, హైదరాబాద్: తన మామ కేసీఆర్‌తో ఫామ్ హౌజ్‌లో కూర్చుని తయారుచేసిన దొంగ సర్వేలను తీసుకొచ్చి మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రచారం చేస్తున్నారని చొప్పదండి కాంగ్రెస్ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం వ్యాఖ్యానించారు. వచ్చే జిల్లా పరిషత్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ కొన్ని జిల్లా పరిషత్‌లు గెలుచుకుంటుందని కాకమ్మ కబుర్లు చెబుతున్నాడని, ముందు సిద్దిపేట జెడ్పీటీసీని గెలిపించుకుంటే చాలని ఎద్దేవా చేశారు. ఆయన సోమవారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లోనే కారు టైర్లలో గాలిపోయిందన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో ఇంజన్ పనికి రాకుండా పోయిందని, బీఆర్ఎస్ బోరుకొచ్చిందని చెప్పారు. పాత ఇనుప సామానుకు కూడా ఆ పార్టీ పనికి రాదన్నారు. తుక్కు తుక్కయి ఫామ్‌హౌజ్ గ్యారేజీలో పడి ఉన్న కారుకు.. మళ్లీ గాలి కొట్టేందుకు హరీశ్‌రావు అబద్ధాలు ప్రచారం చేస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలోని అన్ని జిల్లా పరిషత్‌లను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి కనీసం పదేళ్లు ఉంటారని, ఆ తర్వాత గరిష్ఠంగా ఎన్నేళ్లయినా ఉండవచ్చని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు.

తాటాకు చప్పుళ్లకు భయపడేది లేదు

- టీబీజీకేఎస్ రాష్ట్ర ఇన్‌చార్జి కొప్పుల ఈశ్వర్



గోదావరిఖని: తాటాకు చప్పుళ్లకు భయపడేది లేదని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం రాష్ట్ర ఇన్‌చార్జి కొప్పుల ఈశ్వర్ అన్నారు. టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి అధ్యక్షతన పెద్దపల్లి జిల్లా గోదావరి ఖనిలోని ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో సోమ వారం ఏర్పాటు చేసిన ఆత్మీయ సన్మానసభలో ఆయన మాట్లాడారు. తమ యూని యన్ నాయకుల అక్రమ బదిలీలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. యూనియన్ బలోపేతానికి నియోజక వర్గాల్లోని మాజీ ఎమ్మెల్యేలు త్వరలో అన్ని గనుల్లో పర్యటిస్తారన్నారు. టీబీజీకేఎస్‌లో ఉంటూనే కాంగ్రెస్, ఐఎన్‌టీయూసీతో అంటకాగేవారు తమ కు అవసరం లేదన్నారు. త్వరలో మరో పెద్ద సమావేశం ఏర్పాటు చేసి.. కేటీఆర్‌ను ఆహ్వాని స్తామని వెల్లడించారు. కార్యక్రమంలో కోరు కంటి చందర్, పుట్ట మధు, నడిపెల్లి దివాకర్‌రావు పాల్గొన్నారు.

పూడిక.. ఏళ్లుగా తీయక

దీంతో ప్రాజెక్టుల్లో తగ్గుతున్న నీటినిల్వ సామర్థ్యం

- చివరి ఆయకట్టుకు అందని సాగునీరు
- వర్షాల సమయంలో పెద్ద మొత్తంలో కడలి పాలవుతున్న నీరు
- అత్యధికంగా శ్రీశైలం, నాగార్జునసాగర్‌లో తగ్గుదల
- ఎస్సారెస్పీ, నిజాంసాగర్‌లోనూ పూడిక ఎక్కువే..

ఏటేటా సాగునీటి ప్రాజెక్టులు పూడుకుపోతున్నాయి. నిర్మించిన నాటి నుంచి ఇప్పటివరకు పూడిక తీయకపోవడంతో ప్రాజెక్టుల నీటినిల్వ సామర్థ్యం తగ్గుతోంది. కృష్ణా, గోదావరి పరీవాహక ప్రాంతాల్లోని నాగార్జునసాగర్, శ్రీశైలం, జూరాల, శ్రీరాంసాగర్ ప్రాజెక్టు, మిడ్‌మానేర్, ఎల్లంపల్లి, నిజాంసాగర్‌తోపాటు ప్రధాన రిజర్వాయర్లకు పూడిక బెడద తప్పడం లేదు. ప్రధాన ప్రాజెక్టులైన నాగార్జునసాగర్, శ్రీశైలంలోనే పెద్దఎత్తున పూడిక పేరుకుపోవడంతో ఏటా వందల టీఎంసీల నీరు కడలి పాలవుతోంది.

- సాక్షి ప్రతినిధి, నల్లగొండ/హైదరాబాద్



ఇదీ వివిధ ప్రాజెక్టుల్లో పరిస్థితి (టీఎంసీల్లో)..

ప్రాజెక్టు	పూర్తిస్థాయి నిల్వ	ప్రస్తుత సామర్థ్యం	తగ్గిన సామర్థ్యం
నాగార్జునసాగర్	408.0237	312.0450	95.978
శ్రీశైలం	308.06	205.95	102.11
ఎస్సారెస్పీ	112	80.5	31.5
నిజాంసాగర్	29.5	17.8	11.7
ప్రియదర్శిని జూరాల	11.941	9.647	2.294
సింగూరు	29.917	28.917	1
తాలిపేరు	0.730	0.586	0.162
కోయిల్‌సాగర్	2.27	1.97	0.3
మూసీ	4.83	4.09	0.74
డిండి	2.46	2.3	0.16
పోచారం	2.216	1.820	0.414

లెక్కలతోనే సరి

జలాశయాల్లో పేరుకుపోతున్న పూడికపై పదేళ్లకోసారి కేంద్ర జలసంఘం సర్వే చేయిస్తోంది. మన రాష్ట్రంలోనూ 1991, 2001, 2015లో సర్వే జరిగింది. 2020లోనూ కొన్ని ప్రాజెక్టులపై రిమోట్ సెన్సింగ్ టెక్నాలజీని ఉపయోగించి హైడ్రోగ్రాఫిక్ సర్వే చేపట్టారు. వరద నీటితోపాటు ఒండ్రు మట్టి, ఇసుక, రాళ్లు జలాశయాలకు వచ్చి చేరుతోందని గుర్తించారు. అయితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సాగునీటి ప్రాజెక్టుల్లో పూడిక తొలగింపునకు పక్కా చర్యలు చేపట్టడం లేదు. కాల్వల్లోనూ మట్టి పేరుకుపోవడం, కంప చెట్లు పెరిగిపోయి ఆయా ప్రాజెక్టుల కింద ఉన్న చివరి ఆయకట్టుకు నీరందని పరిస్థితి నెలకొంది. పూడిక స్థితిగతులు తెలుసుకునేందుకు మిడ్‌మానేరు, లోయర్‌మానేరు, కడెంలను పైలెట్ ప్రాజెక్టులుగా ఎంపిక చేసి రాష్ట్ర ప్రభుత్వం టెండర్లు కూడా పిలిచింది.

శ్రీశైలం, నాగార్జునసాగర్‌లో భారీగా..

శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల్లో అధిక మొత్తంలో పూడిక పేరుకుపోయింది. 1976లో శ్రీశైలం ప్రాజెక్టును ప్రారంభించినప్పుడు దాని పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 308.06 టీఎంసీలు కాగా, 2020లో జల వనరుల శాఖ చేసిన హైడ్రోగ్రాఫిక్ సర్వే ద్వారా శ్రీశైలం సామర్థ్యం 205.95 టీఎంసీలకు తగ్గిపోయినట్టు 2021లో జల వనరుల శాఖ ప్రభుత్వానికి ఇచ్చిన నివేదికలో పేర్కొంది.

- నాగార్జునసాగర్ జలాశయం కూడా పూడికతో నిండిపోతుంది. 1967లో ప్రాజెక్టు పనులు పూర్తయినప్పుడు పూర్తి స్థాయి నీటినిల్వ సామర్థ్యం 408.0237 టీఎంసీలు. అది 2015 నాటికి 312.0450 టీఎంసీలకు తగ్గిపోయినట్టు అప్పట్లో నిర్వహించిన సర్వేలో తేలింది.

ఎస్సారెస్పీలోనూ...

శ్రీరాంసాగర్(ఎస్సారెస్పీ) జలాశయంలో భారీగా పూడిక పేరుకుపోయింది. ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరదతో ఏటా 0.8 టీఎంసీల నీరు తగ్గుతున్నట్టు అధికారిక లెక్కలే చెబుతున్నాయి. ప్రాజెక్ట్ నిర్మాణం పూర్తయిన 1978లో జలాశయ పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 112 టీఎంసీలు కాగా, 2023లో చేసిన సర్వే ద్వారా 80.5 టీఎంసీలకు పడిపోయినట్టు తేల్చారు.

నిజాంసాగర్‌లోనూ ఎక్కువే..

మంజీర నదిపై 1923–31లో నిర్మించిన నిజాంసాగర్ ప్రాజెక్టు సామర్థ్యం 29.5 టీఎంసీలు. పైనున్న కర్ణాటక, మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు వరదలతోపాటు మట్టి, ఇసుక కొట్టుకురావడంతో ప్రాజెక్టులో పూడిక చేరింది. దీంతో ప్రాజెక్టు సామర్థ్యం 17.8 టీఎంసీలకు తగ్గిపోయింది.

జూరాలలోనూ 2టీఎంసీల మేర తగ్గుదల

ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 11.941 టీఎంసీలు. ఇందులో 2.294 టీఎంసీల మేర సిల్ట్ పేరుకుపోయినట్టు 2022లో నిర్వహించిన హైడ్రోగ్రాఫిక్ సర్వేలో తేలింది. ప్రస్తుతం ప్రాజెక్టు సామర్థ్యం 9.647టీఎంసీలకు తగ్గిపోయింది.

- కోయిల్ సాగర్ ప్రాజెక్ట్ నిల్వ సామర్థ్యం 2.27 టీఎంసీలు కాగా అందులో 0.3 టీఎంసీల మేర పూడిక పేరుకుపోయింది.

ఏటా వందల టీఎంసీల నీరు వృథా

పూడిక పెరిగిపోవడంతో ఆయా ప్రాజెక్టుల నీటినిల్వ సామర్థ్యం తగ్గిపోతోంది. దీంతో వందల టీఎంసీల నీరు వృథా అవుతోంది. వరద అధికంగా వచ్చినప్పుడు క్రస్ట్ గేట్లను తెరిచి నీటిని వదిలేయాల్సి వస్తోంది. శ్రీశైలం, నాగార్జునసాగర్ కిందే ఈ పరిస్థితి తీవ్రంగా ఉంది. నాగార్జునసాగర్ నుంచి 2013 సంవత్సరంలో 136.19 టీఎంసీలు, 2014 సంవత్సరంలో 212 టీఎంసీలు, 2019లో అత్యధికంగా 698 టీఎంసీలు, 2020లో 71 టీఎంసీలు నీరు వృథా అయ్యింది.

మట్టి తింటున్న 'కడెం

కడెం: కడెం ప్రాజెక్టు మట్టి తింటోంది. ఏటేటా పెరిగిపోతున్న పూడికతో నీటి నిల్వ సామర్థ్యం పడిపోతూ వస్తోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 7.603 టీఎంసీలు కాగా, 2.904 టీఎంసీల నీటినిల్వ సామర్థ్యం మేర పూడిక పేరుకుపోయినట్టు అధికారులు గుర్తించారు. ప్రస్తుతం అది సుమారు 4టీఎంసీల మేర ఉండొచ్చని అంచనా.

పూడికతో 'మూసీ'వేత

- మూసీ రిజర్వాయర్ నిర్మాణం 1963లో పూర్తికాగా, అదే ఏడాది నిర్వహించిన ఒరిజినల్ సర్వే ప్రకారం జలాశయ గరిష్ఠ నిల్వ సామర్థ్యం 4.83 టీఎంసీలు. అయితే 2024 నాటికి 4.09 టీఎంసీలకు తగ్గిపోయింది. 100 ఏళ్ల తర్వాత 2124 సంవత్సరం నాటికి జలాశయ నిల్వ సామర్థ్యం 3.42 టీఎంసీలకు పడిపోనుందని సీడబ్ల్యూసీ అంచనా వేసింది. 1962లో మూసీ రిజర్వాయర్ డెడ్‌స్టోరేజీ 0.23 టీఎంసీలు ఉండగా, ప్రస్తుతం 0.01 టీఎంసీలకు పడిపోయింది. 2084 నాటికి జలాశయ డెడ్‌స్టోరేజీ సామర్థ్యాన్ని పూర్తిగా కోల్పోయి 'సున్న'కు చేరనుంది.
- హిమాయత్‌సాగర్ నిర్మాణం 1927లో పూర్తికాగా, అదే ఏడాది నిర్వ హించిన ఒరిజినల్ సర్వే ప్రకారం జలాశయ గరిష్ఠ నిల్వ సామర్థ్యం (ఎఫ్ఆర్ఎల్) 3.8 టీఎంసీలు. అయితే 2020–21 నాటికి 2.68 టీఎంసీలకు పడిపోయింది. 94 ఏళ్లలో నికరంగా 1.12 టీఎంసీల (29.47శాతం) నిల్వ సామర్థ్యాన్ని జలాశయం కోల్పోయింది.

పూడిక తొలగించాలి



పాలమూరు జిల్లాలోని జూరాటల ప్రాజెక్టులో సిల్ట్‌ను వెంటనే తొలగించాలి. కేటాయించిన నీటిని కూడా నిల్వ చేసుకోలేని దుస్థితి నెల కొంది. సిల్ట్ తొలగిస్తే రైతులకు ఎంతో ఉపయోగం.

– ఇక్బాల్‌పాషా, పాలమూరు అధ్యయన వేదిక

చివరి భూములకు నీరందడం లేదు



పూడిక, కంపచెట్ల కారణంగా చివరి ఆయకట్టుకు నీరందడం లేదు. సాగర్‌లో పూడిక కారణంగా, నీరు తగ్గిపోయింది. ఎప్పుడోసారి వచ్చే నీరు కాల్వల్లో కంపచెట్లు పెరిగిపోవడంతో అదీ అందడం లేదు.

– వెంకటేశ్వర్లు, రామాపురం, సూర్యాపేట

హెచ్‌సీఏ కేసులో కీలక మలుపు

- అధ్యక్ష ఎన్నికలో ఐఏఎస్, ఐపీఎస్‌లతో ఓట్లు వేయించినట్లు ఆరోపణలు
- ఎవరెవరు ఓటు వేశారన్న దానిపై ఆరా తీస్తున్న సీఐడీ

సాక్షి, హైదరాబాద్: హైదరా బాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) అధ్యక్ష ఎన్నికల్లో నిబంధనల అతిక్రమణ, నిధుల గోల్‌మాల్ కేసు కీలక మలుపులు తిరుగుతోంది. ఈ కేసులో ఏ–1గా ఉన్న హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు గెలుపు అంశంలో మరికొన్ని కొత్త కోణాలు వెలుగులోకి వచ్చాయి. జగన్‌మోహన్‌రావును గెలిపించేందుకు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు సైతం ఓట్లు వేసినట్టు వచ్చిన ఆరోపణలపై సీఐడీ లోతుగా ఆరాతీస్తోంది. ఇందుకు సంబంధించిన ప్రాథమిక ఆధారాలు సేకరిస్తోంది. మొత్తం 23 ఇన్‌స్టిట్యూషన్‌ల నుంచి వీరంతా ఓటు వేసినట్లు గుర్తించింది. అయితే వీరికి హెచ్‌సీఏలో ఓటు హక్కు ఉందా? ఎలాంటి అర్హతలతో ఓట్లు వేశారన్న కోణంలో దర్యాప్తు చేస్తోంది. హెచ్‌సీఏ అధ్యక్ష ఎన్నికకు ఉన్న మ్యాన్యువల్, బీసీసీఐ విధివిధానాలకు సంబంధించిన రికార్డులు సేకరించారు. కాగా, ఐదో రోజు కస్టడీలో భాగంగా సీఐడీ అధికారులు సోమవారం సైతం జగన్‌మోహన్‌రావు, హెచ్‌సీఏ ట్రెజరర్ శ్రీనివాసరావు, సీఈవో సునీల్ కాంటె, శ్రీచక్ర క్రికెట్ క్లబ్ అధ్యక్షురాలు కవిత, సెక్రటరీ రాజేందర్ యాదవ్‌లను విచారించారు. అధ్యక్ష ఎన్నికలో వెలుగుచూస్తున్న కొత్త కోణాలతోపాటు, పలు కాంట్రాక్టులకు సంబంధించి వేర్వేరుగా ప్రశ్నించి వారి స్టేట్మెంట్లు రికార్డు చేశారు.

దమ్ముంటే కల్లు కాంపౌండ్లు బంద్ చేయండి

- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్



మాట్లాడుతున్న శ్రీనివాస్ గౌడ్. చిత్రంలో పల్లెరవి గౌడ్, బిక్షమయ్య గౌడ్

సాక్షి హైదరాబాద్: కల్లు కాంపౌండ్లను బంద్ చేస్తే ప్రభుత్వాన్ని నడవనీయమని, దమ్ముంటే కల్లు కాంపౌండ్ బంద్ చేసి చూడాలని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరించారు. గీత కార్మికులకు ఐదు ఎకరాల పొలం ఇస్తామని, గీత కార్మికులు చెట్లపై నుంచి పడి చనిపోతే రూ.10 లక్షల నష్టపరిహారం ఇస్తామన్న హామీ ఏమైందని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. తెలంగాణ భవన్‌లో సోమవారం మాజీ ఎమ్మెల్యే భిక్షమయ్యగౌడ్, బీఆర్ఎస్ నేతలు పల్లె రవికుమార్‌గౌడ్, గట్టు రాంచందర్‌రావు, నాగేందర్ గౌడ్‌లతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. కల్లు కాంపౌండ్లతో పది కులాలు బతుకుతున్నాయని చెప్పారు. లిక్కర్ కంపెనీల కమీషన్లకు కక్కుర్తిపడి, లిక్కర్ మాఫియాకు తలొగ్గి కల్లు కాంపౌండ్లను బంద్ చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. హైదరాబాద్ నగరం నడిబొడ్డున నీరా కేఫ్ ఏర్పాటు చేసి కులవృత్తిని కాపాడామని గుర్తు చేశారు. భిక్షమయ్యగౌడ్ మాట్లాడుతూ దశాబ్దాలుగా కాంగ్రెస్ బీసీలను మోసం చేస్తోందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి బీసీలపై వివక్ష చూపుతున్నారని ఆరోపించారు.

హస్తిన చేరిన కమలం నేతల కలహం

- బండి సంజయ్, ఈటల రాజేందర్ పంచాయితీపై ఆచితూచి స్పందిస్తున్న రాష్ట్ర నాయకత్వం



సాక్షి,హైదరాబాద్ : ఇద్దరు బీజేపీ ముఖ్యనేతల మధ్య ముదిరిన వివాదం ఇప్పుడు హస్తినకు చేరింది. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, పార్టీ జాతీయ కార్యవర్గసభ్యుడు, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ జాతీయ నేతలు కావడంతో ఈ పంచాయితీని తీర్చాల్సిన బాధ్యత పార్టీ అగ్ర నాయకత్వంపై పడింది. పార్లమెంట్ సమావేశాలు సోమవారం నుంచే ప్రారంభం కావడంతో వీరి వ్యవహారంపై జాతీయ నాయకత్వం వెంటనే స్పందిస్తుందా లేదా అన్నది చర్చనీయాంశమవుతోంది. ఇద్దరూ ఢిల్లీలోనే ఉన్న నేపథ్యంలో సంజాయిషీ కోరి సమస్యను వేగంగా పరిష్కరిస్తారా లేదా అన్నది ఆసక్తికరంగా మారింది. తాజాగా చోటుచేసుకున్న పరిణామాలు, అందుకు దారితీసిన పరిస్థితులపై ఇప్పటికే వివిధ రూపాల్లో జాతీయ నాయకత్వానికి నివేదికలు వెళ్లినట్టుగా ప్రచారం జరుగుతోంది. వీరిద్దరి పంచాయితీ, వివాదానికి గల కారణాలపై రాష్ట్ర నాయకత్వం ఆచితూచి స్పందిస్తోంది. అయితే ఈ వివాదంలో ఇద్దరిదీ తప్పేనని, ఆయా సందర్భాల్లో వారు చేసిన వ్యాఖ్యలు, స్పందనల పట్ల సంయమనం పాటించాల్సి ఉందన్న అభిప్రాయం ముఖ్యనేతల నుంచి వ్యక్తమవుతోంది రాష్ట్ర పార్టీ అధ్యక్షుడిగా ఎన్నికయ్యాక, ఈ వివాదం కొనసాగుతున్న సందర్భంలోనే తొలిసారిగా రాంచందర్‌రావు ఢిల్లీ పర్యటనకు వెళ్లడం చర్చనీయాంశమైంది. పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాతో ఆయన సమావేశం కానుండడంతో...ఇద్దరు ఎంపీల తీరుపై తన నివేదిక సమర్పించే అవకాశాలున్నాయని తెలుస్తోంది.

బీసీ రిజర్వేషన్లను 9వ షెడ్యూల్‌లోకి తీసుకురాలేం

- సాధ్యం కాదని తెలిసే.. ఓటు బ్యాంకు కోసం మోసం చేస్తున్నారు
- కాంగ్రెస్ ప్రభుత్వంపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు



మాట్లాడుతున్న రాంచందర్‌రావు చిత్రంలో ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ సర్కార్ కోరుతున్నట్టుగా 42% బీసీ రిజర్వేషన్లను 9వ షెడ్యూల్‌లోకి తీసుకురాలేమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు స్పష్టం చేశారు. సాధ్యం కాదని తెలిసే.. ఓటు బ్యాంకు కోసం కాంగ్రెస్ ప్రభుత్వం, ఆ పార్టీ నేతలు ప్రజలను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. రిజర్వేషన్ల విషయంలో కేంద్ర ప్రభుత్వం, బీజేపీపై నిందలు వేయడం సరికాదన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు తీసుకున్న తర్వాత తొలిసారి ఢిల్లీకి వచ్చిన రాంచందర్‌రావు సోమవారం ఢిల్లీలో రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ సునీల్ బన్సల్, అర్వింద్ మీనన్, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. అనంతరం తెలంగాణ భవన్‌లో ఆయన విలే కరులతో మాట్లాడారు. 'బీసీలకు 42% రిజర్వేషన్లు ఇవ్వాలంటే.. రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చాలని కాంగ్రెస్ నాయకులు చెబుతున్నారు. 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలంటే సుప్రీంకోర్టు ఇచ్చినటువంటి 50 శాతం పరిమితి మించుతుంది. అసలు 9వ షెడ్యూల్‌లో పంపించే ప్రక్రియ వారికి తెలుసా? న్యాయ సలహాదారులు వారికి చెప్పలేదా? జయలలిత తమిళనాడులో చేసిన రిజర్వేషన్లను 9వ షెడ్యూల్‌లో చేర్చినా, అది ఇప్పటికీ కోర్టులో పెండింగ్‌లో ఉంది. ఇంకా తుది నిర్ణయం రాలేదు. కాబట్టి 42% బీసీ రిజర్వేషన్ల కోసం 9వ షెడ్యూల్‌ను చూపిస్తూ మళ్లీ మళ్లీ ప్రజలను మభ్యపెట్టడం సరికాదు. కాంగ్రెస్ ప్రభుత్వం అసలు సమస్యల నుంచి దృష్టి మళ్లించేందుకు బీసీల రిజర్వేషన్ల విషయంలో తప్పుదోవ పట్టిస్తూ రాజకీయ ప్రయోజనాల కోసం నాటకం ఆడుతోంది'అని రాంచందర్‌రావు చెప్పారు.

46సార్లు వెళ్లినా రేవంత్‌ను రాహుల్ కలవలేదు

'సీఎం రేవంత్‌రెడ్డి గత 19 నెలల్లో ఢిల్లీకి మొత్తం 46 సార్లు వెళ్లారు. ఆ సమయంలో రాహుల్‌గాంధీ, ఇతర కాంగ్రెస్ కీలక నేతలు ఆయనకు ఒక్కసారి కూడా అపాయింట్‌మెంట్ ఇవ్వలేదు. రేవంత్‌ని రాహుల్ గాంధీ కలవనివ్వకపోవడం తెలంగాణ ప్రజలను అవమానపరిచినట్టే'అని రాంచందర్‌రావు అన్నారు. మంగళవారం బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాలను కలుస్తా అని చెప్పారు.

దళితబంధుతో ఆర్థికంగా ఎదగాలి

- పక్కదారి పట్టిన యూనిట్ల రికవరీకి ఆదేశం
- డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క



చింతకానిలో దళితబంధు లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, పక్కన కలెక్టర్ అనుదీప్, వైరా ఎమ్మెల్యే రాందాస్

చింతకాని/బోనకల్: దళితబంధు పథకం ద్వారా యూనిట్లు పొందిన లబ్ధిదారులు ఆర్థికంగా బలోపేతం కావాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సూచించారు. ఖమ్మం జిల్లా చింతకాని రైతువేదికలో 214 మందికి దళితబంధు రెండో విడత నిధుల చెక్కులను సోమవారం ఆయన కలెక్టర్ అనుదీప్‌తో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ తాను సీఎల్పీ నేతగా ఉన్నప్పుడు దళితబంధు పథకానికి చింతకాని మండలాన్ని పైలెట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేశారన్నారు. మండలంలోని 3,462 కుటుంబాలను ఎంపిక చేయగా, తాము అధికారంలోకి వచ్చాక 847 మందికి రెండో విడత సాయం అందలేదని గుర్తించినట్టు చెప్పారు. వీరిలో 214 మందికి రెండో విడత సాయంగా రూ.4.63,15,726 నిధులు కేటాయించామన్నారు. అయితే, తొలిదశలో 1,387 యూనిట్లు పక్కదారి పట్టినట్టు తేలిందని చెప్పారు. అధికారులు విచారణ చేపట్టి యూనిట్లను రికవరీ చేయాలని ఆదేశించారు. రెండో విడత విడుదల చేసిన నిధులను కలెక్టర్ ఖాతాలో జమ చేసి.. విడతల వారీగా చెల్లించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హస్తకళల కార్పొరేషన్ చైర్మన్ నాయుడు సత్యం, వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి కరుణించింది..

ఈ సీజన్‌లోనూ రాష్ట్రంపై ప్రకృతి కరుణ చూపినందున గత ఏడాది మాదిరిగానే పెద్ద ఎత్తున ఆహార ఉత్పత్తులు పండించి దేశంలోనే తెలంగాణ ఆదర్శంగా నిలవనుందని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. ఖమ్మం జిల్లా బోనకల్‌లోని రైతువేదిక నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో భట్టి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. తొలుత వర్షాలు నెమ్మదించినా ప్రస్తుతం విస్తారంగా కురుస్తుండడంతో సాగుకు ఇబ్బందులుండవన్నారు.

తల తాకట్టు పెట్టయినా హామీలు నెరవేరుస్తాం

- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేస్తున్న మంత్రులు పొంగులేటి, శ్రీధర్‌బాబు

భూపాలపల్లి: 'గత ప్రభుత్వం రూ.8 లక్షల కోట్లు అప్పులు చేసింది. తల తాకట్టు పెట్టయినా రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తాం'అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావుతో కలిసి సోమవారం భూపాలపల్లిలో పోలీస్‌కమాండ్ కంట్రోల్‌రూం ప్రారంభం సహా పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చెల్పూరులో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ నాడు దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి మహిళలను లక్షాధికారులను చేయాలని సంకల్పిస్తే ప్రస్తుత ప్రజాప్రభుత్వం కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతోనే పనిచేస్తోందన్నారు. ఇదే కాంగ్రెస్ ప్రభుత్వ పాలనకు నిదర్శనమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో మహిళాశక్తి కార్యక్రమం ఏర్పాటు చేశారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 3.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నామని చెప్పారు. అర్హులైన ప్రతి పేదవారికి ఇందిరమ్మ ఇళ్లు కట్టించడమే తమ లక్ష్యమన్నారు. ప్రతి సోమవారం లబ్ధిదారుడి ఖాతాలో డబ్బులు జమ చేస్తామన్నారు. మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ పేద విద్యార్థులకు మెరుగైన విద్య అందించేందుకు నియోజకవర్గంలో రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణం, గణపురంలో 60 ఎకరాల్లో పారిశ్రామిక పార్కు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

స్థానిక ఎన్నికలకు సన్నద్ధం కావాలి

- ఈ వారంలోనే నియోజకవర్గస్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశాలు : కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ నేతలంతా సన్నద్ధం కావాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సూచించారు. ఈ వారంలోనే రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో ముఖ్య కార్యకర్తలు సమావేశాలు ప్రారంభించేలా చూడాలని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పార్టీ అధ్యక్షులు తమ జిల్లాల్లోని ప్రతీ నియోజకవర్గ కేంద్రంలో ఈ సమావేశాలు నిర్వహించేలా సమన్వయం చేసుకోవాలని చెప్పారు. ఈ సమావేశాల్లో పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, జెడ్పీ చైర్మన్లు, కార్పొరేషన్ మాజీ చైర్మన్లు, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సీనియర్ నేతలు పాల్గొనాలన్నారు. త్వరలోనే స్థానిక ఎన్నికలు ప్రభుత్వ నిర్వహించే అవకాశముందని వార్తలొస్తున్న నేపథ్యంలో పార్టీ శ్రేణులను సంసిద్ధం చేయాలని పార్టీ నేతలను ఆదేశించారు.



ఎంబీబీఎస్ విద్యార్థిని సుస్మితను ఆశీర్వదిస్తున్న కేటీఆర్

ప్రజలకు ఇచ్చిన హామీను అమలు చేయకుండా కాంగ్రెస్ చేస్తున్న మోసాలతోపాటు రేవంత్ ప్రభుత్వ అవినీతి, అప్రజాస్వామిక విధానాలు, వైఫల్యాలను గ్రామగ్రామాన విస్తృతంగా ప్రచారం చేయాలని కేటీఆర్ చెప్పారు. బీసీలకు ఇస్తానన్న 42 శాతం రిజర్వేషన్ల విషయంలో చిత్తశుద్ధి లేని కాంగ్రెస్ సర్కార్ ఆర్డినెన్స్ పేరుతో ఆడుతున్న డ్రామాలను ప్రజలకు చెప్పాలన్నారు.

ఎంబీబీఎస్ విద్యార్థినికి చేయూత...

అయిజ: జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన సుస్మిత కల్వకుర్తి గురుకులంలో చదివి ఉస్మానియా మెడికల్ కళాశాలలో సీటు సాధించింది. అయితే చదువుకునేందుకు ఆర్థిక సహాయం చేయాలని 9 నెలల క్రితం ఎక్స్‌లో పోస్ట్ చేసింది. దీనికి స్పందించిన కేటీఆర్ ఆ విద్యార్థిని చదువుకునేందుకు చేయూతనందిస్తామని గతేడాది అక్టోబర్ 8న ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఈ క్రమంలోనే సోమవారం విద్యార్థిని సుస్మిత, ఆమె తల్లిదండ్రులు దేవదాసు, బొజ్జమ్మ కేటీఆర్‌ను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిశారు. 'గిఫ్ట్ ఏ స్మైల్'కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్‌కు చెందిన వైద్య దంపతులు చంద్రశేఖర్–ప్రణయవాణి కేటీఆర్ సమక్షంలో సుస్మితకు రూ.60 వేల నగదు అందించగా.. కేటీఆర్ వారిని అభినందించారు. ఎంబీబీఎస్ చదువు పూర్తయ్యే వరకు చేయూతనందిస్తానని కేటీఆర్ ఆమెకు హామీ ఇచ్చారు.



అడవిని సాకుతున్న ఆడపడుచులు!

అడవిలోని కోతులు చిటారుకొమ్మనున్న పండును రుచి చూస్తున్నట్టుగా కొద్దిగా కొరికేసి, మళ్లీ మరో పండును అందుకుంటాయి. పూర్తిగా తినేయకుండానే పండ్లనిలా పక్కకు విసిరేస్తున్నందుకు విసుగూ, చిరాకు మనకు.

అరణ్యంలోని ఏనుగు అవసరమైనదేదో తినేయకుండా అందుతున్న కొమ్మల్ని అల్లిబిల్లిగా విరిచేసి అల్లంత దూరానికి విసిరేసి చెల్లాచెదురుగా పడేస్తుంది.



చూడ్డానికి ఇదేదో వృథా పనిలా అనిపిస్తుందిగానీ... ఇందులో అడవి మనుగడ దాగుంది. కోతి మాత్రమే చిటారు కొమ్మకు చేరగలుగుతుంది. కానీ అంతదూరాలకు ఎక్కలేనివీ... మధ్య కొమ్మలూ, చెట్టు మొదళ్లలో ఉండే జీవులూ తినడానికి ప్రకృతి చేసిన ఏర్పాటది. అలా ఎన్ని జీవులు ఎంత ఎక్కువగా తింటే... వాటి గింజలు అంతంత దూరాలకు చేరి అక్కడ మొలకెత్తుతుంటాయి. అలా మొలకెత్తే మొక్కలకు సూర్యరశ్మి అందేందుకూ... పక్కలకు పాకకుండా ఇతర మొక్కలకూ అవకాశమిస్తూ చెట్టు నిటారుగానే ఎదిగేందుకు ఏనుగులిలా పక్క కొమ్మల్ని విరిచి పడేస్తుంటాయి.



మనుగడ కోసం అన్ని జీవులూ ప్రయత్నిస్తున్నట్టే... తన లోని ఇతర జీవులను బతికించుకుంటూ... తాను బతికి పచ్చటి ఆకుల బట్టకట్టడానికి ప్రయత్నిస్తుంది అడవి. సహజ సహజాతం తప్ప ఇతర జ్ఞానాలేమీ లేని మూగజీవులూ అందుకు తోడ్పడుతుంటే... అద్భుత జ్ఞానం ఉండి... అన్నీ తెలిసిన మనిషి మాత్రం అడవుల నిర్మూలనకు పాల్పడుతుంటాడు.

అయితే కేరళ ఉత్తర వాయనాడ్‌లోని పెరియ అనే ప్రాంతంలోని గురుకుల బొటానికల్ శాంక్చువరీలో... అంతరిస్తున్న ఓ అడవిని కాపాడటానికి ఇరవై మంది మహిళలు నిత్యం కృషి చేస్తుంటారు. వారి శ్రమ కారణంగా మునపటి విస్తీర్ణానికి తోడు... ఇప్పుడు మరో 32 హెక్టార్లు అదనంగా పెరుగుతోందా ఆ అడవి. అక్కడి అరుదైన జాతుల్లో దాదాపు 40% మొక్కలకు ఆ అడవే నివాసం. గోరింటాకు పెట్టుకునే ఆ మహిళల చేతులే... ఇప్పుడు 'గుల్‌మెహందీ' అనే హిందీ పేరున్న 'బల్సామినసీ' కుటుంబపు అనేక ప్రజాతుల మొక్కలను పెట్టని కోటలా కాపాడుతున్నాయి.

ఆ అడవి ఇప్పుడు అత్యంత అరుదైన మొక్కలకు ఆలవాలం. ఎర్రచందనం చెట్లు కేవలం శేషాచలం అడవుల్లోనే పెరుగుతూ మరెక్కడా జీవించలేనట్టే... అత్యంత అరుదైన జాతి మొక్కలైన 'ఇంపాటియెన్స్ జెర్డోనియా' వంటి మొక్కలు అక్కడ... అంటే ఆ పశ్చిమ కనుమల సానువుల్లో తప్ప మరెక్కడా పెరగవు. 'బల్సామినసీ' అనే కుటుంబానికి చెందిన ఆ మొక్కలన్నీ దాదాపుగా అంతరించే దశకు చేరుకున్నాయి.

అలాంటి జాతుల మొక్కల్ని సంరక్షించడమే కాదు... అలాంటి అనేక రకాల అరుదైన ఇతర జాతుల మొక్కలకూ ఆ అడవిలో ఆవాసం కల్పిస్తూ వాటిని సంరక్షిస్తున్నారా అతివలు.

మరోమాటగా చెప్పాలంటే అవన్నీ ఎపీఫైటిక్ ప్లాంట్స్. 'ఎపీ' అంటే 'పైన'... 'ఫైట్' అంటే మొక్క. అంటే తమ మనుగడ కోసం అవి మరో చెట్టుని ఆలంబనగా చేసుకోవాలి. ఇక్కడ 'పారసైట్'కూ, 'ఎపీఫైట్'కు తేడా ఏమిటంటే... తాము ఎదుగుతున్న చెట్టుపైనే బతుకుతూ, అలా బతకడానికి దాని ఆహారాన్ని దొంగతనంగా తీసుకుంటే అవి పారసైట్స్. కేవలం తమ అవసరాలైన సూర్యరశ్మీ, ఇతర వనరులు చక్కగా అందడానికి ఇతర మొక్కల మీద ఎదిగేవీ ఎపీఫైట్స్. తాము పెరగడానికి దోహదపడుతున్న చెట్ల ఆహారాన్ని ఇవి దొంగిలించవు. అలాంటి ఈ ఎపీఫైట్స్ మనుగడ కోసం తీవ్రంగా ఫైట్ చేస్తున్నారు ఆ అడవిని సంరక్షిస్తున్న ఆడపిల్లలు.

– యాసీన్

వైరల్

ఆమె కాబడిలో అతను



హృదయాన్ని కదిలించే ఎన్నో దృశ్యాలు కావడి యాత్రలో కనిపిస్తున్నాయి. తాజా విషయానికి వస్తే... ముజఫర్ నగర్ (ఉత్తర్‌ప్రదేశ్)లో ఒక మహిళ, పక్షవాతానికి గురైన భర్తను కావడి యాత్రలో భాగంగా 150 కిలోమీటర్‌ల వరకు వీపుపై మోసుకెళ్లింది. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

'ఏదో ఒక రోజు నా భర్త తప్పకుండా నడుస్తాడని ఆశిస్తున్నాను' అంటుంది ఘజియాబాద్ ప్రాంతానికి చెందిన ఆశ.

ఆమె భర్త సచిన్ పదమూడు సంవత్సరాలుగా కాలినడకన కన్వర్ యాత్ర (కావడి యాత్ర) చేస్తున్నాడు. అయితే దురదృష్టవశాత్తూ గత సంవత్సరం పక్షవాతానికి గురయ్యాడు.

'ఈ స్థితిలో యాత్రకు ఏం వెళ్లగలను' అనుకున్న సచిన్‌కు భార్య ఆశ అండగా నిలబడింది.

పక్కన ఇద్దరు పిల్లలు నడుస్తుండగా భర్తను మోసుకుంటూ యాత్రకు తీసుకెళ్లింది.

'భార్యాభర్తల అనుబంధానికి అద్దం పట్టే వీడియో' అంటూ నెటిజనులు స్పందించారు. ఆశపై ప్రసంశల వర్షం కురిపించారు.

రీ ఎంట్రీ

పునరుత్తేజం



ప్రతిభా కటాంబ్లే టోరేకు క్రికెట్ అంటే ఇష్టం కాదు, ప్రాణం. 1980 దశకంలో మహారాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించిన ప్రతిభ 22 ఏళ్ల వయసులో తనకు అత్యంత ఇష్టమైన క్రీడకు దూరమైంది. పెళ్లి చేసుకొని కుటుంబ జీవితానికే పరిమితం అయింది. క్రికెట్ ఆడకపోయినా మాజీ క్రికెటర్‌లతో మ్యాచ్ డాటా, యువ క్రికెటర్‌ల ప్రతిభ... ఇతరత్రా విషయాల గురించి మాట్లాడేది.

యాభై ఆరేళ్ల వయసులో తన అభిమాన క్రీడకు మళ్లీ దగ్గరైంది ప్రతిభ. ఇండియన్ క్రికెటర్స్ అసోసియేషన్ (ఐసీఏ) మాజీ మహిళా క్రికెటర్‌లకు సంబంధించిన సమాచారాన్ని సేకరిస్తున్న సమయంలో మళ్లీ తన ఇష్టమైన ఆటకు దగ్గరయ్యే అవకాశం వచ్చింది. 2019 నుంచి మహారాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ (ఎంసీఏ)లో ఎన్నో కీలక బాధ్యతలు నిర్వహిస్తోంది. అండర్–15, అండర్–19 ఉమెన్స్ క్రికెట్ టీమ్ సెలెక్టర్‌గా, మహిళల 'మహారాష్ట్ర ప్రీమియర్ లీగ్' రాయగఢ్ రాయల్స్‌కు మేనేజర్‌గా వ్యవహరించింది.

పుణెలో పుట్టి పెరిగిన ప్రతిభ చిన్నప్పటి నుంచి క్రికెట్ బాగా ఆడేది.

'నాకు ఇష్టమైన ఆటకు మళ్లీ దగ్గరవుతాను అని ఎప్పుడూ అనుకోలేదు. గ్రౌండ్‌లో ఉంటే నాలో ఎంతో శక్తి వచ్చినట్లు అనిపిస్తుంది' అంటుంది ప్రతిభ కటాంబ్లే టోరే.

బులియన్

(బంగారం 10 గ్రా.: వెండి కిలో) జూలై 21న ముగింపు రూ.లలో

హైదరాబాద్	
బంగారం (24 క్యారెట్లు)	99,010
బంగారం (22 క్యారెట్లు)	93,760
వెండి	1,15,800
విజయవాడ	
బంగారం (24 క్యారెట్లు)	1,01,450
బంగారం (22 క్యారెట్లు)	91,800
వెండి	1,15,700
విశాఖపట్నం	
బంగారం (24 క్యారెట్లు)	1,00,150
బంగారం (22 క్యారెట్లు)	91,800
వెండి	1,26,000
రాజమండ్రి	
బంగారం (24 క్యారెట్లు)	1,01,450
బంగారం (22 క్యారెట్లు)	94,550
వెండి	1,15,700
ప్రొద్దుటూరు	
బంగారం (24 క్యారెట్లు)	98,500
బంగారం (22 క్యారెట్లు)	90,620
వెండి	1,14,700
చెన్నై	
బంగారం (24 క్యారెట్లు)	1,00,140
బంగారం (22 క్యారెట్లు)	91,800
వెండి	1,26,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

ట్రెల్లిస్ అవకాడో, దానిమ్మ!

ద్రాక్ష, డ్రాగన్ ఫ్రూట్ లేదా తీగజాతి పంటలను Y ఆకారంలో ఉండే ఇనుప ట్రెల్లిస్ పద్ధతిలో సాగు చెయ్యటం తెలిసిందే. అయితే, ఫ్రటెల్లి ఫ్రూట్స్ రైతు ఉత్పత్తిదారుల కంపెనీ (ఎఫ్‌పీసీ) దానిమ్మ, అవకాడో వంటి పొద పంటలను సైతం వినూత్నంగా ఈ పద్ధతిలోనే సాగు చేస్తోంది. మహారాష్ట్ర రాష్ట్రం నాసిక్ సమీపంలో పింపాల్‌గోన్ బసంత్ వద్ద ఫ్రటెల్లి ఫ్రూట్స్ వ్యవసాయ క్షేత్రం ఉంది. అనంత్ బి మోర్ దీనికి ఛైర్మన్‌గా ఉన్నారు. భారతీయ ఉద్యాన తోటల సాగు రంగంలో ఇదొక విప్లవాత్మక మార్పుగా చెప్పుకోవచ్చు.

డ్యూక్ 7 వేరు మూలంపై గ్రాఫ్ట్ చేసిన మలుమ అవకాడో చెట్లను, భగువ రకం దానిమ్మ చెట్లను ట్రెల్లిస్ పద్ధతిలో సాగు చేస్తున్నారు. ప్రెసిషన్ ఫార్మింగ్‌లో భాగంగా ట్రెల్లిస్ పద్ధతిలో ద్రాక్షతో పాటు దానిమ్మ, అవకాడో తోటలను పెంచుతున్నారు. మొక్కలు నాటేటప్పుడే శాస్త్రీయ పద్ధతిలో నేలను సిద్ధం చేస్తున్నారు. భూగర్భ డ్రైనేజీ, ఆధునిక నీటి యాజమాన్య పద్ధతిని అనుసరిస్తున్నారు. కొమ్మలను ట్రెల్లిస్‌కు అనుగుణంగా ప్రూనింగ్ చేస్తూ పెంచుతున్నారు. కొమ్మలన్నిటికీ సూర్యరశ్మి, గాలి తగలడానికి, కాయ కోతకు, పిచికారీ చేసే ద్రావణాలు/పురుగుమందులు చెట్టు మొత్తానికీ అందించడానికి, సమర్థవంతంగా చీడపీడలను నియంత్రించడానికి.. ఇలా ఈ పద్ధతి ప్రయోజనాలు ఎన్నో ఉన్నాయని చెబుతున్నారు.

కాయలన్నిటికీ ఎండ తగిలేలా చూడటం ద్వారా మచ్చలు లేని, నిగారింపుతో కూడిన నాణ్యమైన కాయలను పండిస్తోంది ఫ్రటెల్లి ఫ్రూట్స్ ఎఫ్‌పీసీ. సమస్యాత్మక వాతావరణ పరిస్థితుల్లో, భారీ వర్షాల తర్వాత కూడా ఆరోగ్యదాయకమైన దానిమ్మ పండ్ల దిగుబడి తీస్తుండటం విశేషం. ఎఫ్‌పీసీ సభ్యులైన రైతులకు అధిక దిగుబడులు సాధించడానికి లాభదాయకమైన, మెరుగైన సాగు పద్ధతులపై ఈ ఎఫ్‌పీసీ శిక్షణ ఇస్తోంది.




25–26 తేదీల్లో బయోచార్‌పై జాతీయ సదస్సు

భూసారం పెంపుదలతో పాటు పర్యావరణ కాలుష్యాన్ని గణనీయంగా తగ్గించటంలో ప్రత్యేక పద్ధతుల్లో తయారు చేసే కట్టె బొగ్గు (బయోచార్) ప్రాధాన్యాన్ని సంతరించుకుంటున్నది. అంతర్జాతీయంగా కార్బన్ క్రెడిట్స్ పొందే అవకాశం ఉండటంతో రైతులతో పాటు అనేక మంది వ్యక్తులు, వాణిజ్య సంస్థలు బయోచార్ ఉత్పత్తి రంగంలోకి ప్రవేశిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 25,26 తేదీల్లో 'ప్రోగ్రెస్సివ్ బయోచార్ సొసైటీ, హైదరాబాద్' ఆధ్వర్యంలో హైదరాబాద్ యూసఫ్‌గూడలోని ఎన్‌ఐ–ఎంఎస్‌ఎంఈ (నిమ్స్‌మే) ఆడిటోరియంలో జాతీయ సదస్సు జరగనుంది. ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఇతర వివరాలకు.. సొసైటీ అకడమిక్స్ డైరెక్టర్ డా. ఎం.ఎ. ఆరిఫ్ ఖాన్ – 97018 76662.

సాగుబడి

పుష్యమి కార్తె: జూలై 20 నుంచి

ధాన్యం తేమ కష్టాలు తీర్చే యంత్రం!



సకాలంలో వర్షాలు పడి నీరు అందుబాటులో ఉండే వరి ధాన్యం పండించటం ఎంత సులువో.. పండిన ధాన్యాన్ని హార్వెస్టర్ యంత్రంతో కోత కోసి, శుభ్రం చేసి, తేమ తగ్గే వరకు ఎండబెట్టి అమ్మటం అంతకన్నా కష్టంగా మారిందంటే అతిశయోక్తి కాదు. ఈ క్రమంలో డ్రయ్యింగ్ ప్లాట్‌ఫారాలు తగినన్ని అందుబాటులో లేకపోవటంతో రోడ్లపైనే రైతులు ధాన్యాన్ని రోజుల తరబడి ఆరబెట్టుకోవటం మనకు ప్రతి ఖరీఫ్, రబీ సీజన్ల ముగింపు దశలో కనిపించే కష్టాలే. అయితే, ఈ కోత అనంతర కష్టాలకు చెక్ చెప్పేందుకు దోహదపడే ఒక సమీకృత శుద్ధి యంత్రాన్ని (ఇంటిగ్రేటెడ్ ప్రాసెసింగ్ మెషీన్‌ను) కాన్పూర్ ఐఐటీలోని ఇంక్యుబేషన్ సెంటర్ 'రుటాగ్' (రూరల్ టెక్నాలజీ యాక్షన్ గ్రూప్) ఆవిష్కరించింది.

> వరి రైతుల కోత అనంతర కష్టాలు తీర్చే 'సమీకృత శుద్ధి యంత్రా'న్ని ఆవిష్కరించిన కాన్పూర్ ఐఐటీ
>
> ధాన్యం కోసిన తర్వాత తాలు తప్ప, చెత్తా చెదారం తొలగించటం.. తేమను తగ్గించటం వంటి 3 పనులను ఏకకాలంలో చేసే యంత్రం సిద్ధమైంది
>
> పొలాల దగ్గరకే తీసుకెళ్లి ట్రాక్టర్, జనరేటర్‌తో అనుసంధానం చేసి దీన్ని నడుపుకోవచ్చు
>
> రోడ్లపైన ధాన్యం ఆరబెట్టుకోవటం, తేమ ఎక్కువగా ఉంటే ధర నష్టపోవటం వంటి సమస్యలకు ఇక కాలం చెల్లినట్లే!

భారత ప్రభుత్వ ప్రధాన శాస్త్ర విషయాల సలహాదారు చొరవతో కాన్పూర్ ఐఐటీలో రుటాగ్ ఏర్పాటైంది. ఉన్నత స్థాయి శాస్త్ర, సాంకేతిక పరిశోధనల ద్వారా గ్రామీణ ప్రాంతవాసుల అభ్యున్నతికి దోహదపడే ఆవిష్కరణలకు పూర్తి మద్దతు ఇవ్వటమే లక్ష్యంగా రుటాగ్ పనిచేస్తోంది.

మూడు పనుల్ని ఏకకాలంలో చేసే ఈ యంత్రానికి సంబంధించిన సాంకేతికతను కాన్పూర్ ఐఐటీ రుటాగ్ నుంచి పొందిన ఉత్తరప్రదేశ్‌కు చెందిన టికోరంగ్ ఇంజనీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ అనే కంపెనీ రూ.7.8 లక్షలకు యంత్రాన్ని విక్రయిస్తోంది.

వరి కోత యంత్రం పంటను కోసిన తర్వాత ధాన్యాన్ని ఎత్తి ఈ యంత్రంలోకి పొయ్యాలి. స్టార్ట్ చేసి, క్లీన్ చేసి, వేడి గాలితో ధాన్యంలో తేమను అవసరమైన మేరకు అప్పటికప్పుడు తగ్గించేస్తుంది. ఈ యంత్రాన్ని విద్యుత్‌తో నడపొచ్చు. లేదంటే జనరేటర్, ట్రాక్టర్‌లతో అనుసంధానం చేసి ఉపయోగించుకోవచ్చు. ఈ వెసులుబాటు ఉండటంతో గ్రామీణ ప్రాంతాల్లో మారుమూల పొలాల దగ్గరకే తీసుకెళ్లి వాడుకోవచ్చు. ధాన్యాన్ని సులువుగా ఆరబెట్టేసుకొని, నేరుగా విక్రయించుకోవచ్చు లేదా గోదాములకు తరలించవచ్చు. కోత అనంతర పనుల కోసం ప్రత్యేక షెడ్లు వంటివేమీ అవసరం లేదు. రోడ్ల మీద పోసి తేమ తగ్గే వరకు అనేక రోజుల పాటు కష్టపడి ఆరబెట్టుకునే క్రమంలో బాధలు పడే అవసరం ఇక ఉండదు.

పరిశ్రమలను అభివృద్ధి చేయటం, వినూత్న ఆవిష్కరణలను ప్రోత్సహించటం, మౌలిక సదుపాయాలు కల్పించటం వంటి 2030 నాటికి సాధించాల్సిన ఐక్యరాజ్యసమితి నిర్దేశిత లక్ష్యాల సాధనకు ఈ సమీకృత శుద్ధి యంత్రం దోహదం చేస్తుంది. తత్ఫలితంగా రైతులు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, సహకార సంఘాలతో పాటు అంతిమంగా వినియోగదారులకు సైతం మేలు జరుగుతుందని నిపుణులు చెబుతున్నారు.



తేమ సమస్యకు పొలాల దగ్గరే పరిష్కారం

తాలు గింజలు తియ్యటానికి, శుద్ధి చేయటానికి, ఆరబెట్టడానికి వేర్వేరు యంత్రాలు వాడుతూ అధిక ఖర్చులకు, అధిక శ్రమకు గురయ్యే రైతులకు ఈ యంత్రం ఎంతో ఊరట కల్పిస్తుంది. ధాన్యం తేమ కొంచెం ఎక్కువ ఉన్నా, శుభ్రంగా లేకపోయినా రైతుకు వచ్చే ఆదాయం తగ్గిపోతుంది. ఈ కోత అనంతర కష్టాలకు సమీకృత శుద్ధి యంత్రం ముగింపు పలకనుంది. ఈ యంత్రం విద్యుత్‌తో లేదా జనరేటర్‌తో నడుస్తుంది కాబట్టి ఈ యంత్రం మారుమూల ప్రాంతాల్లో వరి కోతలయ్యే పొలాల దగ్గరకే తీసుకెళ్లి ఉపయోగించుకోవచ్చు. రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, సహకార సంఘాలు, మార్కెటింగ్ యార్డులు, ధాన్యం సేకరణ చేసే సంస్థలు ఈ సమీకృత ప్రాసెసింగ్ యంత్రాలను కొనుగోలు చేసి అందుబాటులోకి తెస్తే రైతుల వ్యయప్రయాసలు గణనీయంగా తగ్గుతాయి. ఈ యంత్రాన్ని ఉత్పత్తి చేస్తున్న టికోరంగ్ ఇంజనీరింగ్ కంపెనీ ఇప్పటికే పలువురికి విక్రయించినట్లు తెలిపారు. ఇతర వివరాలకు.. యంత్రం ఉత్పత్తిదారు: anivesh.mech.ism@gmail.com

కాన్పూర్ ఐఐటీ రుటాగ్: jrkumar@iitk.ac.in

ఎలా పనిచేస్తుంది?

ఈ సమీకృత శుద్ధి యంత్రంలో రెండు చాంబర్‌లు ఉంటాయి. మొదటి చాంబర్‌లో పోసిన ధాన్యపు గింజలను జల్లెడ పట్టడానికి 4 మెష్‌లు ఉంటాయి. మొదట ధాన్యంలో నుంచి తాలు గింజలను యంత్రం వేరు చేసి, చెత్తా చెదారాన్ని తొలగించి క్లీన్ చేస్తుంది. ఆ తర్వాత ఇన్సులేటెడ్ చాంబర్‌లో వేడి గాలి ద్వారా ధాన్యంలో తేమను యంత్రం ఆరబెడుతుంది. కాన్పూర్ ఐఐటీ 'రుటాగ్'కు చెందిన డాక్టర్ అమన్‌దీప్ సింగ్ మాట్లాడుతూ, 230 ఆర్‌పీఎం గల 3హెచ్‌పీ గేర్ మోటారుతో నడిచే 14 అడుగుల పొడవు కన్వేయర్‌ను ఈ యంత్రానికి అమర్చినట్లు చెప్పారు. 4 అడుగుల ఎయిర్ బ్లోయర్ నుంచి వెలువడే వేడి గాలి డెల్టా బాక్స్ డిజైన్ ట్యాంక్ ద్వారా సర్క్యులేట్ అయ్యి ధాన్యాన్ని ఆరబెడుతుందన్నారు.

పోర్టబుల్ కౌ లిఫ్ట్

నిలబడలేకపోతున్న పశువులకు చికిత్స చేయించటం చాలా కష్టంతో కూడిన పని. సాధారణంగా పశువు ప్రసవించిన తర్వాత, కండరాల సమస్య వల్ల, సోలిపోయి పైకి లేవలేకపోవటం జరుగుతూ ఉంటుంది. దీన్నే 'డౌనర్ కౌ సిండ్రోమ్' అంటారు. అలాంటి కష్టం వచ్చినప్పుడు ఏడెనిమిది మంది మనుషులు పట్టుకొని పశువును లేపి నిలబెట్టే ప్రయత్నం చేస్తుంటారు. ఇది పాడి రైతులకు, గోశాలల నిర్వాహకులకు, బాధిత పశువులకు కూడా చాలా బాధాకరమైన అనుభవం.

ఈ గడ్డు సమస్యను సులువుగా అధిగమించేందుకు ఉపయోగపడే 'పోర్టబుల్ కౌ లిఫ్ట్' అనే పరికరం ఇప్పుడు అందుబాటులోకి వచ్చింది. ఐఐటీ బాంబేలోని రూరల్ టెక్నాలజీ యాక్షన్ గ్రూప్ (రుటాగ్)కు చెందిన మెకానికల్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్ తన్మయ్ కె భండార్కర్ ఈ సాంకేతికతను రూపొందించారు. సెంటర్ ఫర్ టెక్నాలజీ ఆల్టర్నేటివ్స్ ఫర్ రూరల్ ఏరియాస్ (సీటీఏఆర్ఏ)కు చెందిన ప్రొ. విశాల్ ఆర్. సర్దేశ్ పాండే ఈ డిజైన్‌కు మెరుగులు దిద్దారు.

పశువును ప్రత్యేకంగా కుట్టిన జాకెట్‌ను పశువుకు చుట్టి, రెండు వైపుల నుంచి కొసలను పైకి తీసి, ఇరువైపులా నిలువుగా పది అడుగుల ఎత్తున ఉన్న ఇనుప చట్రం పైభాగంలో అమర్చిన గిలక ద్వారా గొలుసును సులువుగా లాగుతూ పశువును నిలబెట్టడానికి ఈ పరికరం ఉపయోగపడుతుంది. డౌన్ కౌ సింగ్రోమ్ చికిత్సకు అనేక రోజుల సమయం పడుతుంది. అప్పుడు పశువును నిలబెట్టడానికి, ఒక చోటు నుంచి మరో చోటుకు నడిపించడానికి కూడా ఈ పరికరం ఉపయోగపడుతుంది. 500–600 కిలోల బరువు గల పశువును ఇది నిలబెట్టగలదు. ఇప్పటికే అనేక గోశాలల్లో దీన్ని వాడి పరిశీలించి మెరుగు పరిచారు. ఐఐటీ బాంబే అనుమతితో ఈ పోర్టబుల్ కౌ లిఫ్ట్‌ను రుటాగ్ అనుమతితో జి.ఎన్. మంజునాథ తయారు చేసి రూ. 50 వేలకు విక్రయిస్తున్నారు. మొబైల్: 87226 49074.

manju.genasinakuni@gmail.com



మళ్లీ చాంపియన్స్ లీగ్ టి20 టోర్నీకి ఐసీసీ ప్రణాళికలు

దుబాయ్: దాదాపు దశాబ్దం క్రితం రద్దయిన చాంపియన్స్ లీగ్ టి20 టోర్నీని మళ్లీ ప్రారంభించాలని అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) యోచిస్తోంది. దీని సమర్థ నిర్వహణకు కొత్తగా ప్రణాళికలు రూపొందించేందుకు సిద్ధమైంది. సింగపూర్‌లో జరిగిన ఐసీసీ సమావేశంలో చాంపియన్స్ లీగ్‌పై వచ్చిన ప్రతిపాదనకు అన్ని బోర్డులూ మద్దతు పలికినట్లు సమాచారం. వేర్వేరు దేశాలకు చెందిన క్లబ్ టీమ్‌లు బరిలోకి దిగుతూ 2009–2014 మధ్య నిర్వహించిన ఈ టోర్నీని పలు కారణాలతో రద్దు చేశారు. ఐపీఎల్‌లాంటి టోర్నీలతో పోలిస్తే ప్రేక్షకాదరణ చాలా తక్కువగా ఉండటంతో పాటు వాణిజ్యపరంగా కూడా సరైన స్పందన లభించకపోవడంతో లీగ్‌ను పక్కన పెట్టాల్సి వచ్చింది. అయితే ఇప్పుడు కూడా దీనిని నిర్వహించడం అంత సులువు కాకపోవచ్చు. టి20 స్టార్ ఆటగాళ్లంతా ప్రపంచవ్యాప్తంగా వేర్వేరు జట్ల తరఫున ఆడుతున్నారు. చాంపియన్స్ లీగ్ జరిగితే వారు ఏ ఫ్రాంచైజీకి ప్రాతినిధ్యం వహిస్తారనే విషయంలో నిర్ణయం తీసుకోవడం అంత సులువు కాదు. మరోవైపు టెస్టు క్రికెట్‌ను రెండు వేర్వేరు స్థాయిల్లో (2 టియర్ సిస్టం) నిర్వహించాలనే ఆలోచనతో ఉన్న ఐసీసీ దీనిపై సాధ్యాసాధ్యాల కోసం ప్రత్యేకంగా వర్కింగ్ కమిటీని ఏర్పాటు చేసింది. ఎనిమిది మంది సభ్యుల ఈ కమిటీకి ఐసీసీ సీఈఓ సంజోగ్ గుప్తా నాయకత్వం వహిస్తారు.


స్మృతి, హర్మన్

విజయంతో ముగించాలని!

- నేడు ఇంగ్లండ్‌తో భారత మహిళల జట్టు చివరి వన్డే
- సాయంత్రం గం. 5:30 నుంచి సోనీ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

చెస్టర్–లీ–స్ట్రీట్: ఇంగ్లండ్ పర్యటనలో అంచనాలకు మించి రాణించిన భారత మహిళల క్రికెట్ జట్టు విజయంతో ఘనంగా ముగించాలని పట్టుదలగా ఉంది. ఐదు మ్యాచ్‌ల టి20 సిరీస్‌ను 3–2తో గెలుచుకున్న భారత్... ఇప్పుడు వన్డే సిరీస్‌లో 1–1తో సమంగా ఉంది. నేడు జరిగే చివరి వన్డేలో నెగ్గితే ఈ సిరీస్ కూడా మన సొంతమవుతుంది. దాదాపు మూడేళ్ల క్రితం ఇంగ్లండ్ గడ్డపైనే జరిగిన వన్డే సిరీస్‌ను భారత్ 3–0తో గెలుచుకొని సత్తా చాటింది. నాటి సిరీస్ ఆడిన హర్మన్, స్మృతి, దీప్తి, హర్లీన్ ఇప్పుడు కూడా బరిలో ఉన్నారు. టూర్ ఆసాంతం ఆకట్టుకున్న హర్మన్ బృందం మరో మ్యాచ్‌లో తమ స్థాయికి తగ్గ ప్రదర్శన ఇస్తే గెలుపు సొంతమవుతుంది. తొలి వన్డేలో నెగ్గిన అనంతరం వర్షం బారిన పడిన రెండో మ్యాచ్‌లో జట్టు బ్యాటింగ్ కాస్త తడబడింది. దూకుడుగా ఆడే ప్రయత్నంలో బ్యాటర్లు చెత్త షాట్లతో వెనుదిరిగారు. స్మృతి, దీప్తి రాణిస్తుండగా... ప్రతీక, హర్లీన్, జెమీమా కూడా మెరుగైన స్కోర్లు సాధించాల్సి ఉంది. టూర్‌లో ఆడిన 6 మ్యాచ్‌లలో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ ఒక్క చెప్పుకోదగ్గ ప్రదర్శన కూడా కనబర్చలేదు. జట్టు గెలిచినా ఆమె బ్యాటింగ్ పేలవంగా సాగింది. ఈ సారైనా ఒక మంచి ఇన్నింగ్స్‌తో హర్మన్ ముగించాలని టీమ్ కోరుకుంటోంది. మరో వైపు టి20 సిరీస్ కోల్పోయిన ఇంగ్లండ్ వన్డే సిరీస్‌నైనా గెలిచి స్వదేశంలో పరువు నిలబెట్టుకోవాలని భావిస్తోంది. గత మ్యాచ్‌లో గెలుపు ఆ జట్టులో కాస్త ఉత్సాహాన్ని పెంచింది. సీనియర్లయిన కెప్టెన్ నాట్ సివర్, బీమాంట్, డంక్లీ, ఎకెల్‌స్టోన్ మెరుగ్గా ఆడుతుండటం సానుకూలాంశం.

బరిలో బుమ్రా

- నాలుగో టెస్టులో ఆడనున్న టాప్ పేసర్
- ఫిట్‌గా మారిన రిషభ్ పంత్


జడేజా, సిరాజ్


బుమ్రా

మాంచెస్టర్: ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్‌లో ఇప్పటికే రెండు మ్యాచ్‌లు ఆడిన భారత స్టార్ పేస్ బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా నాలుగో టెస్టులో ఆడటం ఖాయమైంది. ఈ విషయాన్ని జట్టు సభ్యుడు మొహమ్మద్ సిరాజ్ నిర్ధారించాడు. ఆటగాళ్ల గాయాల కారణంగా జట్టు కూర్పులో ప్రతి రోజూ మార్పులు జరుగుతున్నాయని... అయితే బుమ్రాను ఆడించాలని మేనేజ్‌మెంట్ నిర్ణయించినట్లు అతను వెల్లడించాడు. పని భారాన్ని తగ్గించడంలో భాగంగా ఈ సిరీస్‌లో బుమ్రా ఏవైనా మూడు టెస్టులు మాత్రమే ఆడతాడనే టీమ్ మేనేజ్‌మెంట్ ముందే ప్రకటించింది. ఈ నేపథ్యంలో చివరి రెండు టెస్టుల్లో అతను ఎందులో బరిలోకి దిగుతాడనే విషయం టీమ్ ప్రకటించలేదు. అయితే ఇప్పుడు ఓల్డ్ ట్రఫోర్డ్‌లో ఆడేందుకు సిద్ధం కావడంతో దీనిపై స్పష్టత వచ్చింది. గత టెస్టుకు, నాలుగో టెస్టుకు మధ్య ఎనిమిది రోజుల విరామం కూడా ఉండటంతో బుమ్రాకు తగినంత విశ్రాంతి కూడా లభించింది. భారత్ ఈ మ్యాచ్‌లో గెలిచి సిరీస్‌లో సమంగా నిలిస్తే ఓవల్‌లో జరిగే చివరి టెస్టులోనూ బుమ్రా ఆడే అవకాశం ఉంది. అర్ష్‌దీప్ నాలుగో టెస్టుకు దూరమైనట్లు బీసీసీఐ ఇప్పటికే ప్రకటించింది. అయితే మరో పేసర్ ఆకాశ్‌దీప్ ఆడటం కూడా సందేహంగానే ఉంది. సోమవారం అతను స్వల్పంగా ప్రాక్టీస్ చేసినా... దీని వల్ల ఫిట్‌నెస్‌పై ఇంకా ఎలాంటి అంచనాకు రాలేదు. మరో రెండు రోజుల సాధన తర్వాతే అతని విషయంలో నిర్ణయం తీసుకోవచ్చు. వికెట్ కీపర్ పంత్ పూర్తిగా కోలుకున్నట్లు సమాచారం. సోమవారం ప్రాక్టీస్ సెషన్‌లో అతను బ్యాటింగ్‌తో పాటు వికెట్ కీపింగ్ కూడా చేశాడు.

సాయి సుదర్శన్‌కు చాన్స్!

గాయంతో నితీశ్ కుమార్ రెడ్డి సిరీస్‌కు దూరం కావడంతో అతని స్థానంలో రెగ్యులర్ బ్యాటర్ సాయి సుదర్శన్‌కు మాంచెస్టర్ టెస్టులో చోటు దక్కవచ్చు. సుదర్శన్ ఈ సిరీస్‌లో తొలి టెస్టు ఆడాడు. అతను ఆడితే పిచ్ పరిస్థితిని బట్టి ఆల్‌రౌండర్లు వాషింగ్టన్ సుందర్, శార్దుల్ ఠాకూర్‌లలో ఒకరికే అవకాశం లభిస్తుంది. ఆకాశ్‌దీప్ కూడా తప్పుకుంటే ప్రసిధ్, కొత్త ఆటగాడు అన్షుల్‌లలో ఒకరిని ఎంపిక చేస్తారు. రెండు టెస్టులు ఆడిన ప్రసిధ్ పూర్తిగా విఫలం కాగా... ఆకాశ్‌దీప్ శైలిలోనే సీమ్ బౌలింగ్ చేసే అన్షుల్ అరంగేట్రం చేసే చాన్స్ ఉంది. అయితే ఆటగాళ్ల గాయాలతో టీమ్‌లో ఎన్నో మార్పులు జరుగుతున్నా... ఆశ్చర్యకరంగా జట్టులో ఉన్న ఏకైక రెగ్యులర్ స్పిన్నర్, ఇంగ్లండ్‌పై మంచి ప్రభావం చూపే అవకాశం ఉన్న కుల్దీప్ యాదవ్ పేరు కూడా ప్రస్తావనకు రాకపోవడం ఆశ్చర్యకరం. టీమిండియా వ్యూహాల ప్రకారం చూస్తే కుల్దీప్ ఒక్క టెస్టూ ఆడకుండానే తిరిగి వచ్చేలా కనిపిస్తోంది.

> “భారత్ తరఫున ఆడే అవకాశం రావడమే అన్నింటికీ ప్రేరణ అందిస్తుంది. దాంతోనే కావాల్సినంత ఉత్సాహం వస్తుంది. మైదానంలో వంద శాతం కష్టపడటమే నాకు తెలిసింది. దేవుని దయ వల్ల ఆరోగ్యంగా, ఫిట్‌గా ఉన్నాను. పని భారం తగ్గించడం ముఖ్యమే కావచ్చు కానీ చివరకు నేను ఎన్ని ఓవర్లు బౌలింగ్ చేశాననేదే స్కోరు బోర్డులో కనిపిస్తుంది. నాకు లభించిన అవకాశాన్ని సమర్థంగా వాడుకొని జట్టును గెలిపించడమే నా లక్ష్యం. కాబట్టి ఎక్కువ ఓవర్లు వేయడంలో ఎలాంటి రహస్యమూ లేదు. ఏ బౌలరైనా వికెట్లు పడగొట్టేందుకు ప్రయత్నిస్తాడు. నేను చాలా బాగా బౌలింగ్ చేస్తున్నా కొన్నిసార్లు అదృష్టం కలిసి రావడం లేదు. గత సిరీస్‌తో పోలిస్తే ఈ సారి డ్యూక్స్ బంతులు తొందరగా మెత్త పడుతున్నాయనేది వాస్తవం. అయితే అన్నీ మనకు అనుకూలించవు. ప్రతికూల పరిస్థితుల్లోనూ రాణించడం ముఖ్యం. గత టెస్టులో చివరి వికెట్‌గా అవుటైనప్పుడు చాలా బాధపడ్డాను. దాని నుంచి కోలుకునేందుకు ఎంతో సమయం పట్టింది. మ్యాచ్ మేం గెలవాల్సింది. జడేజా, బుమ్రా బాగా ఆడినా మేం ఓడాం. చాలా ముందే 80 పరుగుల తేడాతో ఓడిపోయినా ఇంతగా బాధపడేవాళ్లం కాదేమో. చాలా చేరువగా వచ్చి గెలవలేకపోవడం నిరాశకు గురి చేసింది.
>
> – మీడియా సమావేశంలో సిరాజ్

ఇంగ్లండ్ ఒక మార్పుతో...

నాలుగో టెస్టుకు రెండు రోజుల ముందే ఇంగ్లండ్ తమ తుది జట్టును ప్రకటించింది. గత టెస్టులో గాయపడిన షోయబ్ బషీర్ స్థానంలో లెఫ్టార్మ్ స్పిన్నర్ లియామ్ డాసన్ జట్టులోకి వచ్చాడు. 2017 తర్వాత అతనికి ఇదే తొలి టెస్టు కానుంది.

ఇంగ్లండ్ తుది జట్టు: స్టోక్స్ (కెప్టెన్), జాక్ క్రాలీ, బెన్ డకెట్, పోప్, జో రూట్, హ్యారీ బ్రూక్, జేమీ స్మిత్, డాసన్, క్రిస్ వోక్స్, కార్స్, జోఫ్రా ఆర్చర్.

హారికపై గెలుపుతో సెమీస్‌లో దివ్య


హారిక


దివ్య

బతూమి (జార్జియా): మహిళల ప్రపంచకప్ చెస్ టోర్నమెంట్‌లో భారత్‌కు చెందిన అంతర్జాతీయ మాస్టర్ (ఐఎం), జూనియర్ ప్రపంచ చాంపియన్ దివ్య దేశ్‌ముఖ్ సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. భారత్‌కే చెందిన గ్రాండ్‌మాస్టర్ ద్రోణవల్లి హారికతో సోమవారం జరిగిన టైబ్రేక్‌లో మహారాష్ట్రకు చెందిన 19 ఏళ్ల దివ్య 2–0తో విజయం సాధించింది. ఈ ఇద్దరి మధ్య ఆదివారం నిర్ణీత రెండు గేమ్‌లు ముగిశాక స్కోరు 1–1తో సమంగా ఉండటంతో... విజేతను నిర్ణయించేందుకు సోమవారం టైబ్రేక్ నిర్వహించారు. తొలి గేమ్‌లో తెల్ల పావులతో ఆడిన దివ్య 57 ఎత్తుల్లో గెలిచింది. సెమీస్ చేరే అవకాశాలు సజీవంగా ఉండాలంటే కచ్చితంగా గెలవాల్సిన రెండో గేమ్‌లో తెల్ల పావులతో ఆడిన హారిక 76 ఎత్తుల్లో ఓడిపోవడంతో టోర్నీ నుంచి నిష్క్రమించింది. నేడు జరిగే సెమీఫైనల్స్ తొలి గేమ్‌లలో టింగ్‌జీ లె (చైనా)తో భారత్‌కే చెందిన గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి; టాన్ జోంగి (చైనా)తో దివ్య తలపడతారు. భారత్ నుంచి ఇద్దరు ప్లేయర్లు సెమీఫైనల్ చేరుకోవడంతో ఒక పతకం ఖాయమైంది. అంతేకాకుండా వచ్చే ఏడాది జరిగే క్యాండిడేట్స్ టోర్నీకి కూడా భారత్‌కు ఒక బెర్త్ ఖరారైంది. ప్రపంచకప్ టోర్నీలో టాప్–3లో నిలిచిన ప్లేయర్లు ప్రపంచ చాంపియన్ ప్రత్యర్థిని నిర్ణయించే క్యాండిడేట్స్ టోర్నీకి అర్హత పొందుతారు.

ప్రపంచకప్ చెస్ టోర్నీకి భారత్ ఆతిథ్యం

ఈ ఏడాది అక్టోబర్ 30 నుంచి నవంబర్ 27 వరకు నిర్వహణ


2023 టోర్నీ రన్నరప్ ప్రజ్ఞానంద, విన్నర్ కార్ల్‌సన్

న్యూఢిల్లీ: ఈ ఏడాది భారత్‌లో పురుషుల ప్రపంచకప్ చెస్ టోర్నమెంట్ జరగనుంది. అక్టోబర్ 30 నుంచి నవంబర్ 27 వరకు ఈ టోర్నీని నిర్వహిస్తారు. అయితే వేదికను ఖరారు చేయాల్సి ఉంది. 23 ఏళ్ల తర్వాత ఈ మెగా ఈవెంట్‌కు భారత్ ఆతిథ్యమివ్వనుంది. చివరిసారి 2002లో హైదరాబాద్ వేదికగా ప్రపంచకప్ జరగ్గా... భారత దిగ్గజం విశ్వనాథన్ ఆనంద్ విజేతగా నిలిచాడు. అయితే ఈసారి జరగబోయేది క్యాండిడేట్స్ టోర్నీకి అర్హత సాధించే ప్రపంచకప్ ఈవెంట్. ఇందులో ప్రపంచవ్యాప్తంగా 206 మంది ఆటగాళ్లు తలపడతారు. ఇది నాకౌట్ టోర్నీ. ప్రతీ రౌండ్‌లో ఓడిన ఆటగాడు నిష్క్రమిస్తాడు. ‘కొన్నేళ్లపాటు చెస్ టోర్నీ వివిధ ఫార్మాట్లుగా జరిగింది. కానీ 2021 నుంచి నాకౌట్ పద్ధతిలోనే ప్రపంచకప్ నిర్వహిస్తున్నాం. ఒక రౌండ్ మూడు రోజుల పాటు జరుగుతుంది. రెండు క్లాసికల్ గేమ్‌లను నిర్వహిస్తారు. సమమైతే మూడో రోజు టైబ్రేక్ పోటీ ఉంటుంది’ అని అంతర్జాతీయ చెస్ సమాఖ్య తెలిపింది. 2023లో అజర్‌బైజాన్‌లో జరిగిన ప్రపంచకప్‌లో కార్ల్‌సన్ (నార్వే) విజేతగా... ప్రజ్ఞానంద (భారత్) రన్నరప్‌గా నిలిచారు.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ఫ్లస్ స్పోర్ట్స్ ఈ–పేపర్‌లో

సాక్షి సినిమా

ఈ సినిమాకి మా బెస్ట్ ఇచ్చాం – పవన్ కల్యాణ్

‘‘‘హరిహర వీరమల్లు’ సినిమా క్రిష్‌గారి వల్ల నా దగ్గరకు వచ్చింది. వ్యక్తిగత, వృత్తిపరమైన కారణాల వల్ల ఆయన మధ్యలో వెళ్లిపోవాల్సి వచ్చింది. ఆయన తర్వాత జ్యోతికృష్ణ ఈ సినిమాను హ్యాండిల్ చేశారు. ఇక నేను డిప్యూటీ సీఎంని కావొచ్చు. కానీ ఈ సినిమాకు హీరోని. నిధీ అగర్వాల్‌గారు యాక్టివ్‌గా ఈ సినిమా ప్రమోషన్ చేయడం చూసి, సిగ్గు తెచ్చుకుని నేను మీడియా ఇంట్రాక్షన్‌లో పాల్గొంటున్నాను’’ అని ఏపీ ఉప ముఖ్యమంత్రి, హీరో పవన్ కల్యాణ్ అన్నారు. పవన్ కల్యాణ్ హీరోగా నటించిన తాజా చిత్రం ‘హరిహర వీరమల్లు’. ఈ సినిమాలో నిధీ అగర్వాల్ హీరోయిన్. క్రిష్ జాగర్లమూడి, జ్యోతికృష్ణ దర్శకత్వంలో ఏయం రత్నం సమర్పణలో ఎ. దయాకర్ రావు నిర్మించిన ఈ చిత్రం ఈ రెండు భాగాలుగా విడుదల కానుంది. తొలి భాగం ‘హరిహర వీరమల్లు: స్వోర్డ్ వర్సెస్ స్పిరిట్’ సినిమా ఈ నెల 24న విడుదల కానుంది. ఈ సందర్భంగా సోమవారం సాయంత్రం హైదరాబాద్‌లో జరిగిన ఈ చిత్రం ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు, ఏపీ మంత్రి కందుల దుర్గేష్, కర్ణాటక మంత్రి కె. ఈశ్వర్ ముఖ్య అతిథులుగా పాల్గొని, ఈ సినిమా విజయాన్ని ఆకాంక్షించారు.


ఎ. దయాకర్ రావు, నిధీ అగర్వాల్, పవన్ కల్యాణ్, ఏయం రత్నం

ఈ వేడుకలో ఇంకా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ – ‘‘‘హరిహర వీరమల్లు’ అనేది కల్పిత పాత్ర. విజయవాడ దగ్గరలోని కొల్లూరు దగ్గర్లో లభించిన కోహినూర్ వజ్రం నిజాం నవాబు దగ్గరికి వెళ్లి, ఆ తర్వాత మొఘలులకు వెళ్లి, ఫైనల్‌గా... ఇప్పుడు లండన్ మ్యూజియంలో ఉంది. ఈ విషయాలను దృష్టిలో పెట్టుకుని క్రిష్‌గారు కథ చెప్పారు. మా చేతుల్లో ఉన్నది ది బెస్ట్ ఇవ్వడం. అది చేశాం. మీకు (అభిమానులు, ప్రేక్షకులు) నచ్చిందా బద్దలు కొట్టేయండి’’ అన్నారు. ‘‘మేమెంతో కష్టపడి తీసిన ఈ సినిమాను ప్రేక్షకులు ఆదరించాలి’’ అన్నారు దయాకర్ రావు. ‘‘1684 నుంచి ‘హరిహర వీరమల్లు’ కథ మొదలవుతుంది’’ అని అన్నారు జ్యోతికృష్ణ. బ్రహ్మానందం, తనికెళ్ల భరణి, కీరవాణి తదితరులు పాల్గొన్నారు.

కోట శ్రీనివాసరావు నాకు అత్యంత ఆప్తుడు – మోహన్‌బాబు



ప్రముఖ నటుడు కోట శ్రీనివాసరావు జూలై 13న కన్ను మూసిన సంగతి తెలిసిందే. ఆ రోజు తాను హైదరాబాద్‌లో లేనని, అందుకే ఆయన భౌతికకాయాన్ని సందర్శించలేకపోయానని మోహన్‌బాబు పేర్కొన్నారు. సోమవారం కోట శ్రీనివాసరావు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా మోహన్‌బాబు మాట్లాడుతూ – ‘‘కమెడియన్‌గా, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా వినూత్న శైలిలో డైలాగ్స్ చెప్పి, నటించిన గొప్ప నటుడు కోట శ్రీనివాసరావు. మా ‘కన్నప్ప’ రిలీజ్ రోజు ఫోన్ చేసి, ‘‘సినిమా చాలా బాగుంది... విష్ణుకు మంచి పేరు వచ్చింది’’ అని చెప్పారాయన. ఇక 1987లో నా బేనర్‌లో నిర్మించిన ‘వీరప్రతాప్’ సినిమాలో మాంత్రికుడిగా మెయిన్ విలన్‌గా చేసే అవకాశం ఇచ్చాను. ఆ తర్వాత మా బ్యానర్‌లో, బయట బ్యానర్లలో మేం కలిసి చాలా సినిమాల్లో నటించాం. కోట శ్రీనివాసరావు నాకు అత్యంత ఆప్తుడు. మా ఫ్యామిలీకి సన్నిహితుడు. ఆయన మరణం నా కుటుంబానికే కాకుండా సినీ పరిశ్రమకు తీరని లోటు. ఒక గొప్ప నటుణ్ణి కోల్పోయాం. కోట శ్రీనివాసరావు ఆత్మకు శాంతి, వారి కుటుంబానికి మనశ్శాంతి కలగాలని కోరుకుంటున్నాను’’ అని అన్నారు.

చేంజోవర్ మొదలైంది!


రామ్‌చరణ్

‘పెద్ది’ సినిమా కోసం రామ్ చరణ్ చేంజోవర్ మొదలైంది. రామ్‌చరణ్ హీరోగా బుచ్చిబాబు సానా దర్శకత్వంలో రూపొందుతున్న రూరల్ అండ్ మల్టీస్పోర్ట్స్ పీరియాడికల్ సినిమా ‘పెద్ది’. ఈ చిత్రంలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా శివ రాజ్‌కుమార్, జగపతిబాబు, దివ్యేందు శర్మ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమా కొత్త షూటింగ్ షెడ్యూల్ చిత్రీకరణ సోమవారం ప్రారంభమైంది. ఈ లెంగ్తీ షెడ్యూల్‌తో ‘పెద్ది’ సినిమా చిత్రీకరణ ఓ కొలిక్కి వస్తుంది. కాగా ఈ కొత్త షెడ్యూల్ కోసం రామ్‌చరణ్ సరికొత్తగా మేకోవర్ అయ్యారు. ఇక్కడున్న ఫొటో చూస్తే, రామ్‌చరణ్ ఎంత అంకితభావంతో ‘పెద్ది’ చిత్రం కోసం మేకోవర్ అయ్యారో తెలుస్తుంది. ‘‘‘పెద్ది’ సినిమా కోసం చేంజోవర్ మొదలైంది’’ అని రామ్ చరణ్ ‘ఎక్స్’ వేదికగా పేర్కొని, ఈ ఫోటోను షేర్ చేశారు. అలాగే రామ్‌చరణ్ మేకోవర్‌ను చూస్తుంటే ఈ షెడ్యూల్‌లో భారీ యాక్షన్ సీక్వెన్స్‌ని చిత్రీకరిస్తున్నారని తెలుస్తోంది. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్న ఈ సినిమా మార్చి 27న విడుదల కానుంది. ఈ చిత్రానికి సంగీతం: ఏఆర్ రెహమాన్.


వరుణ్ తేజ్, తమన్

వరుణ్ తేజ్ హీరోగా మేర్లపాక గాంధీ దర్శకత్వంలో యూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్ బేనర్లపై ఓ చిత్రం రూపొందుతున్న విషయం తెలిసిందే. ఇండో–కొరియన్ బ్యాక్‌డ్రాప్‌లో హారర్, కామెడీ మూవీగా తెరకెక్కుతున్న ఈ చిత్రం టైటిల్‌ని త్వరలో ప్రకటించి, ఫస్ట్ గ్లింప్స్‌ని కూడా విడుదల చేయనున్నారు. ఈ చిత్రానికి తమన్ సంగీతదర్శకుడు. ‘‘ఇప్పటికే ఇండియా, విదేశాల్లో మూడు షెడ్యూల్స్ పూర్తి చేశాం. ఈ చిత్రీకరణలో భాగంగా రెండు ఎనర్జిటిక్ సాంగ్స్ షూట్ చేశాం. ప్రస్తుతం మిగతా పాటల కంపోజింగ్ సెషన్స్ జరుగుతున్నాయి. ‘తొలిప్రేమ’ తర్వాత వరుణ్ – తమన్ కాంబినేషన్‌లో మరోసారి మంచి ఆల్బమ్ రానుంది’’ అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రంలో రితికా నాయక్ హీరోయిన్‌గా నటిస్తున్నారు.

మొదటి అధ్యాయం పూర్తి


రిషబ్ శెట్టి

‘కాంతార’ (2022) సంచలన విజయంతో దర్శకుడిగా–హీరోగా ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్నారు కన్నడ స్టార్ రిషబ్ శెట్టి. ఇప్పుడు ఈ చిత్రానికి ప్రీక్వెల్‌గా (అంతకు ముందు ఏం జరిగింది) ‘కాంతార: చాప్టర్ 1’ని రూపొందించారు. ‘కాంతార’ విడుదలైన తర్వాత ఈ చిత్రం షూటింగ్ ఆరంభించారు. ఈ మూడేళ్ల ప్రయాణానికి సంబంధించిన మేకింగ్ వీడియోను విడుదల చేసి, ‘మొదటి అధ్యాయం’ షూటింగ్ పూర్తయినట్లుగా పేర్కొంది చిత్రనిర్మాణ సంస్థ హోంబలే ఫిల్మ్స్. ఈ చిత్రంలోనూ హీరోగా నటించి, దర్శకత్వం వహించారు రిషబ్ శెట్టి. ఇక ‘కాంతార: చాప్టర్ 1’ మేకింగ్ వీడియోలో తెరవెనక యూనిట్ పడిన కష్టం, భారీ సెట్స్, అలాగే కెమెరా ముందు నటీనటుల పర్ఫార్మెన్స్... రిషబ్ వర్కవుట్స్ వంటి విజువల్స్‌ని చూపించారు. అక్టోబర్ 2న ఈ సినిమా కన్నడ, హిందీ, తెలుగు, మలయాళ, తమిళ, బెంగాలీ, ఇంగ్లిష్ భాషల్లో పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుంది. ఈ చిత్రానికి సంగీతం: బి. అజనీష్ లోకనాథ్, కెమెరా: అరవింద్ కశ్యప్.

అడగక అందిన వరమా...


ధనుష్ రఘుముద్రి, మనోజ్


‘‘చిక్కక చిక్కిన గుమ్మా... నిను వదలను ఏ జన్మా... అడగక అందిన వరమా... చేజార్చను ఇకపైనా..’’ అంటూ సాగుతుంది ‘థాంక్యూ డియర్’ సినిమాలోని ‘చిక్కక చిక్కిన గుమ్మ...’ పాట. ధనుష్ రఘుముద్రి, హెబ్బా పటేల్, రేఖా నిరోషా ప్రధాన పాత్రల్లో నటించిన సినిమా ఇది. తోట శ్రీకాంత్ కుమార్ దర్శకత్వంలో పప్పు బాలాజీ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం విడుదలకు సిద్ధం అవుతోంది. ఈ సందర్భంగా ఈ సినిమాలోని తొలి పాట ‘చిక్కక చిక్కిన గుమ్మ...’ను హీరో మంచు మనోజ్ రిలీజ్ చేసి, మాట్లాడుతూ– ‘‘ఈ చిత్రం గొప్ప విజయం సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను’’ అని చెప్పారు. ఈ పాటకు ఈ చిత్రనిర్మాత బాలాజీ రెడ్డి సాహిత్యం అందించగా, శ్రీచరణ్ పాడారు. ఈ సినిమాకు సంగీతం: సుభాష్ ఆనంద్.

ఓటీటీ – ఇది చూడొచ్చు

మనకు తెలియని రహస్యం

ఓటీటీలో ‘ఇది చూడొచ్చు’ అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో ‘ది హంట్–ది రాజీవ్ గాంధీ అసాసినేషన్ కేస్’ ఒకటి. ఈ సిరీస్ గురించి తెలుసుకుందాం.

ఎన్నో సంచలన ఘటనలకు సజీవ సాక్ష్యం చరిత్ర. కానీ సామాన్యులకు చరిత్ర ద్వారా ఆ ఘటనల గురించి తెలిసేది గోరంతే... తెలియాల్సింది కొండంత. అయితే ఇప్పుడు జరిగిపోయిన సంచలన ఘటనలను విశ్లేషించి వాటికో సజీవ రూపాన్ని అందించే ప్రయత్నం ఓటీటీ సిరీస్ రూపంలో జరుగుతోంది. సాధారణంగా ఏదైనా ఘటన అంటే అది ఎలా జరిగింది? ఎప్పుడు జరిగింది? అన్న ఉత్సుకత ప్రతి ఒక్కరికీ ఉంటుంది. అటువంటి ఉత్సుకతను దృష్టిలో పెట్టుకునే ఓటీటీ నిర్మాతలు జరిగిపోయిన సంచలనాత్మక ఘటనలపై దృష్టి సారిస్తున్నారు. ఆ నేపథ్యంలోనే ఇటీవల సోనీ లివ్ ఓటీటీ వేదికగా స్ట్రీమ్ అవుతున్న సిరీస్ ‘ది హంట్–ది రాజీవ్ గాంధీ అసాసినేషన్ కేస్’ బాగా ప్రేక్షకాదరణ పొందుతోంది. మాజీ ప్రధాన మంత్రి రాజీవ్ గాంధీని చెన్నై నగరంలోని పెరుంబుదూర్ ప్రాంతంలోని ఓ మీటింగ్‌లో ఎల్‌టీటీఈ తీవ్రవాదులు మానవ బాంబుతో అతి కిరాతకంగా చంపడం మనందరికీ తెలుసు. అయితే ఆ చంపిన తీవ్రవాదులను సరిగ్గా 90 రోజుల్లోనే మన ఇంటెలిజెన్స్ బృందం మట్టుబెట్టింది. ఈ ఆపరేషన్ ఇంత త్వరగా ఆ సంస్థ ఎలా చేసింది? అనేది 7 ఎపిసోడ్లలో అద్భుతంగా చిత్రీకరించారు. మొదటి ఎపిసోడ్‌లో జరిగిన ఘటనను చూపించి ఆ తదనంతర విచారణను చాలా స్పష్టంగా తీశారు దర్శకుడు. ఇటువంటి ఘటనలను తెరకెక్కించడంలో సిద్ధహస్తుడైన నగేశ్ కుకునూర్ ఈ సిరీస్‌కు దర్శకత్వం వహించారు. ఇంట్లో ఏదైనా రహస్యం ఉంటేనే మనం దానిని కనుక్కోవాలని విపరీతంగా ఉబలాటపడతాం. అలాంటిది మన దేశ ప్రధాని హత్య వెనుక రహస్యాన్ని చూడడం ఇంకెంత ఆసక్తి రేపుతుందో చెప్పనక్కరలేదు. ఈ 7 ఎపిసోడ్ల సిరీస్ తెలుగు భాషలో కూడా లభ్యమవుతోంది. మస్ట్ వాచ్ సిరీస్.



– హరికృష్ణ ఇంటూరు

సాక్షి బిజినెస్
మంగళవారం
22-7-2025

స్టాక్ మార్కెట్లు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▲ 443	నిఫ్టీ ▲ 122
82,200	25,091

విదేశీ సూచీలు			
నాస్‌డాక్	21,046	▲	150
డోజోన్స్	44,563	▲	221
ఎఫ్‌టీఎస్‌ఈ 100	9,013	▲	21
డాక్స్	24,308	▲	18
షాంఘై	3,560	▲	25
నికాయ్ (అత్యధికం ముగింపు)	39,819	▼	82

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్


ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	భామనెడుక	84.46	87.39
£	బ్రిటన్ పౌండ్	భామనెడుక	113.84	118.10
€	యూరో	భామనెడుక	98.46	102.33
¥	జపాన్ యెన్ (100)	భామనెడుక	47.00	69.00
AU$	ఆస్ట్రేలియా డాలర్	భామనెడుక	53.86	57.66
S$	సింగపూర్ డాలర్	భామనెడుక	65.01	68.66
SAR	సౌదీ రియాల్	భామనెడుక	22.14	23.62
UAE D	యూఏఈ దిర్హామ్	భామనెడుక	22.60	23.85
¥	చైనా యువాన్	భామనెడుక	11.15	12.97

ఉపాధి 'కొత్త'పుంతలు!



మే నెలలో ఆల్‌టైమ్ రికార్డు...
- ఈపీఎఫ్‌వోలో 20 లక్షల మంది నమోదు
- 9.42 లక్షల మంది కొత్త సభ్యులే



న్యూఢిల్లీ: ఉద్యోగుల భవిష్యనిధి (ఈపీఎఫ్‌వో) సంస్థ కింద నికర సభ్యుల చేరిక కొత్త రికార్డులను తాకింది. ఈ ఏడాది మే నెలలో 20.06 లక్షలకు చేరుకుంది. ఇది ఆల్‌టైమ్ రికార్డు. ఏప్రిల్ నెల గణాంకాలతో పోల్చి చూస్తే మేలో 4.79 శాతం అధిక ఉపాధి నెలకొనగా, గతేడాది మేతో పోల్చి చూస్తే 3 శాతం వృద్ధి సాధ్యమైంది. మే నెలలో మొత్తం నికర సభ్యుల్లో 9.42 లక్షల మంది కొత్తగా ఉపాధి పొందిన వారు కావడం గమనార్హం. ఏప్రిల్‌తో పోల్చి చూస్తే 11 శాతం అధికం. మేనెల పేరోల్ గణాంకాలను కేంద్ర కార్మిక శాఖ సోమవారం విడుదల చేసింది. దేశ సంఘటిత రంగంలో ఉపాధి కల్పన బలంగా పెరుగుతోందన డానికి ఈ గణాంకాలు నిదర్శనమని కార్మిక మంత్రి మన్‌సుఖ్ మాండవీయ తెలిపారు. ముఖ్యంగా ఈ ఏడాది జనవరి నుంచి సభ్యుల చేరిక స్థిరంగా పెరుగుతూ వస్తుండడాన్ని గమనించొచ్చు.

ఇతర ముఖ్యాంశాలు..
- కొత్తగా చేరిన సభ్యుల్లో 5.60 లక్షల మంది 18–25 ఏళ్ల వయసులోని వారే. అంటే మొత్తం కొత్త సభ్యుల్లో వీరు 60%గా ఉన్నారు. ఏప్రిల్ నెలతో పోల్చి చూస్తే 14.53 శాతం పెరిగారు.
- మేలో 18–25 ఏళ్ల వయసు నుంచి నికర సభ్యుల చేరిక 8.73 లక్షలుగా ఉంది.
- 16.11 లక్షల మంది సభ్యులు లోగడ ఒక సంస్థలో ఉద్యోగం మానివేసి, మే నెలలో మరో సంస్థలో కొత్తగా చేరారు. ఏప్రిల్ నెలతో పోల్చి చూస్తే 2 శాతం, క్రితం ఏడాది మే నెలతో పోల్చి చూస్తే 14 శాతం వృద్ధి నమోదైంది.
- ఈపీఎఫ్ఓలో కొత్త మహిళా సభ్యుల చేరిక 2.62 లక్షలుగా ఉంది. ఏప్రిల్ నెల కంటే ఇది 7 శాతం అధికం కాగా, గతేడాది మే నెలతో పోల్చి చూస్తే 6 శాతం పెరిగారు.
- మే నెలలో మహిళా సభ్యుల నికర చేరిక 4.25 లక్షలుగా ఉంది. ఏప్రిల్ నెల కంటే 7.54 శాతం పెరిగింది.
- నికర సభ్యుల చేరికలో మహారాష్ట్ర నుంచి 20.33 శాతం మంది ఉన్నారు. కర్ణాటక, తమిళనాడు, గుజరాత్, హరియాణా, ఢిల్లీ, యూపీ, తెలంగాణ రాష్ట్రాల నుంచి 5 శాతానికిపైనే (విడిగా ఒక్కో రాష్ట్రం) సభ్యుల చేరిక నమోదైంది.

బ్యాంకు షేర్లకు డిమాండ్

- రెండు రోజుల నష్టాలకు బ్రేక్
- అర శాతం పెరిగిన సూచీలు



ముంబై: ప్రయివేటు రంగ బ్యాంకులు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, ఐసీఐసీఐ బ్యాంకుతో పాటు మెటల్ షేర్లు రాణించడంతో స్టాక్ సూచీలు సోమవారం అరశాతానికి పైగా లాభపడ్డాయి. సెన్సెక్స్ 443 పాయింట్లు పెరిగి 82,200 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 122 పాయింట్లు బలపడి 25,091 వద్ద నిలిచింది. ఆసియా మార్కెట్లలోని సానుకూల సంకేతాలు, విదేశీ ఇన్వెస్టర్ల పునరాగమనం సెంటిమెంట్‌ను మరింత బలపరిచాయి. ఒక దశలో సెన్సెక్స్ 516 పాయింట్లు పెరిగి 82,274 వద్ద, నిఫ్టీ 143 పాయింట్లు బలపడి 25,111 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకాయి. కాగా.. డాలర్ మారకంలో రూపాయి విలువ 15 పైసలు బలహీనపడి 86.31 వద్ద స్థిరపడింది.

- బీఎస్‌ఈలో రంగాల వారీ ఇండెక్సుల్లో క్యాపిటల్ గూడ్స్ 1.33%, బ్యాంకెక్స్ 1.28%, ఫైనాన్సియల్ సర్వీసెస్ 1.26%, మెటల్, కమోడిటీస్ 1%, ఆటో, కన్జూమర్ డిస్క్రెషనరీ 0.5% చొప్పున పెరిగాయి.
- అంచనాలకు మించి తొలి త్రైమాసిక నికర లాభం రూ.16,258 కోట్ల నమోదుతో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు షేరు 2% పెరిగి రూ.2,000 వద్ద స్థిరపడింది. క్యూ1 ఆర్థిక ఫలితాల ప్రకటన సందర్భంగా ఒక్కో షేరుకు రూ.5 ప్రత్యేక మధ్యంతర డివిడెండ్, తొలిసారి 1:1 నిష్పత్తిలో బోనస్ షేర్ల జారీతో పాటు బ్రోకరేజ్ సంస్థలు షేరుకు 'బై' రేటింగ్ కేటాయింపు అంశాలు కలిసొచ్చాయి.
- ఐసీఐసీఐ బ్యాంకు షేరు 3% లాభపడి రూ.1,466 వద్ద స్థిరపడింది. తొలి త్రైమాసికంలో మెరుగైన పనితీరు ప్రదర్శించడంతో పాటు ఆస్తుల నాణ్యత మెరుగుపడటంతో ఈ షేరుకు కొనుగోళ్ల మద్దతు లభించింది.
- రిలయన్స్ ఇండస్ట్రీస్ షేరు 3% నష్టపోయి రూ.1428 వద్ద నిలిచింది. తొలి త్రైమాసికంలో ఆయిల్–కెమికల్స్(ఓ2సీ), రిటైల్ విభాగాల పనితీరు నిరాశపరచడంతో పాటు ఇటీవలి ర్యాలీతో షేరులో లాభాల స్వీకరణ చోటు చేసుకుంది.

ఆంథెమ్.. బంపర్ లిస్టింగ్



సీఆర్‌డీఎంఓ సేవలు అందించే ఆంథెమ్ బయోసైన్సెస్ షేరు లిస్టింగ్‌లో అదరగొట్టింది. ఇష్యూ ధర(రూ.570)తో పోలిస్తే 27% ప్రీమియంతో రూ.723 వద్ద లిస్టయ్యింది. ఇంట్రాడేలో 31% ఎగసి రూ.747 వద్ద గరిష్టాన్ని తాకింది. చివరికి 28% లాభంతో రూ.730 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.40,717 కోట్లుగా నమోదైంది.

8 వేల మంది ప్రొఫెషనల్స్‌కి ఏఐ నైపుణ్యాల్లో శిక్షణ

వర్టెక్స్ గ్లోబల్ సర్వీసెస్ వెల్లడి



న్యూఢిల్లీ: వచ్చే మూడేళ్లలో భారత్‌లో 8,000 మంది ప్రొఫెషనల్స్‌కు కృత్రిమ మేధ (ఏఐ) సంబంధ నైపుణ్యాల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు అమెరికాకు చెందిన బీపీవో సంస్థ వర్టెక్స్ గ్లోబల్ సర్వీసెస్ (వీజీఎస్) తెలిపింది. కాంటాక్ట్ సెంటర్ ప్రక్రియలను మెరుగుపర్చే వీఅసిస్ట్ టూల్‌తో ఈ శిక్షణా కార్యక్రమం తమ సంస్థ అంతర్గతంగా సామర్థ్యాలను పెంచుకునేందుకు ఉపయోగపడుతుందని వివరించింది. కస్టమర్ల నుంచి వచ్చే క్వెరీలను మరింత మెరుగ్గా అర్థం చేసుకుని, విశ్లేషించుకుని, సముచిత కేటగిరీల కింద వర్గీకరించడం (కాంటాక్ట్ సెంటర్, కస్టమర్ సర్వీస్, వ్యాపార అవసరాలు) ద్వారా కంపెనీ సిబ్బంది తగిన పరిష్కార మార్గాలను అందించేందుకు ఈ టూల్ ఉపయోగపడుతుందని సంస్థ తెలిపింది. ఏఐ రాకతో దేశీ బీపీవో రంగంలో కూడా శరవేగంగా పెను మార్పులు వస్తున్నాయని వీజీఎస్ ప్రెసిడెంట్ గగన్ ఆరోరా తెలిపారు. అధునాతన టెక్నాలజీలు, ఏఐ దన్నుతో 2033 నాటికి ఈ విభాగం 280 బిలియన్ డాలర్లకు పెరుగుతుందనే అంచనాలు ఉన్నట్లు వివరించారు. ప్రస్తుతం 2025లో ఇది 139.5 బిలియన్ డాలర్లుగా ఉంది. ఉద్యోగులు, ఏఐ మధ్య సమతూకం సాధించడం ద్వారా ఏజెంట్ల పనితీరును మెరుగుపర్చుకోవడంతో పాటు కస్టమర్లకు కూడా మరింత సంతృప్తికరమైన సేవలు అందించేందుకు వీలవుతుందని పేర్కొన్నారు.

ఎటర్నల్ లాభం డౌన్

క్యూ1లో రూ. 25 కోట్లు

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025–26) తొలి త్రైమాసికంలో క్విక్ కామర్స్, ఫుడ్ డెలివరీ దిగ్గజం ఎటర్నల్ ఆసక్తికర ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్–జూన్(క్యూ1)లో రూ. 25 కోట్ల నికర లాభం ఆర్జించింది. గతేడాది(2024–25) ఇదే కాలంలో సాధించిన రూ. 253 కోట్లతో పోలిస్తే భారీగా క్షీణించింది. జొమాటో, బ్లింకిట్ బ్రాండ్ల కంపెనీ మార్చిలో ఎటర్నల్‌గా అవతరించిన సంగతి తెలిసిందే. కాగా.. మొత్తం ఆదాయం మాత్రం రూ. 4,206 కోట్ల నుంచి రూ. 7,167 కోట్లకు జంప్‌చేసింది. అయితే మొత్తం వ్యయాలు రూ. 4,203 కోట్ల నుంచి రూ. 7,433 కోట్లకు భారీగా పెరిగాయి.



ఫలితాల నేపథ్యంలో ఎటర్నల్ షేరు 5.4% జంప్‌చేసి రూ. 271 వద్ద క్లోజైంది.

అల్ట్రాటెక్ లాభం హైజంప్

క్యూ1లో రూ. 2,221 కోట్లు • ఆదాయం రూ. 21,275 కోట్లు



న్యూఢిల్లీ: ఆదిత్య బిర్లా గ్రూప్ దిగ్గజం అల్ట్రాటెక్ సిమెంట్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) తొలి త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్–జూన్ (క్యూ1)లో రూ. 2,221 కోట్ల నికర లాభం ఆర్జించింది. గతేడాది(2024–25) ఇదే కాలంలో కేవలం రూ. 1,493 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 18,819 కోట్ల నుంచి రూ. 21,275 కోట్లకు ఎగసింది. అయితే ఈ కాలంలో దక్షిణాది సంస్థ ఇండియా సిమెంట్స్‌తోపాటు.. వండర్ వాల్‌కేర్, రస్ అల్ ఖైమా, ఆర్ఏకేడబ్ల్యూసీటీ(యూఏఈ)లను కొనుగోలు చేసినందున ఫలితాలను పోల్చి చూడతగదని అల్ట్రాటెక్ పేర్కొంది. అంతేకాకుండా కేశోరామ్ ఇండస్ట్రీస్ సిమెంట్ బిజినెస్ విలీనం సైతం 2025 మార్చి1 నుంచి అమల్లోకి రావడాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించింది. ఈ నేపథ్యంలో కన్సాలిడేటెడ్ సిమెంట్ అమ్మకాలు 10 శాతం ఎగసి 36.83 మిలియన్ టన్నులను తాకాయి.

సామర్థ్య విస్తరణ: ఇతర కంపెనీల కొనుగోళ్లు, సొంత కార్యకలాపాల విస్తరణ కారణంగా గ్రే సిమెంట్ సామర్థ్యం వార్షికంగా 192.26 మిలియన్ టన్నుల(ఎంటీపీఏ)కు చేరినట్లు అల్ట్రాటెక్ వెల్లడించింది. ఈ కాలంలో వేస్ట్ హీట్ రికవరీ సిస్టమ్ ద్వారా 12 మెగావాట్ల యూనిట్‌ను ప్రారంభించింది. మొత్తం వ్యయాలు రూ.18,405 కోట్లను దాటాయి. ఇతర ఆదాయంతో కలిసి మొత్తం టర్నోవర్ రూ. 21,456 కోట్లకు చేరింది.

ఫలితాల నేపథ్యంలో అల్ట్రాటెక్ షేరు 0.5% బలపడి రూ. 12,560 వద్ద ముగిసింది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..	
టైర్.. రయ్ రయ్!	దక్షిణాదిలో జీసీసీల జోరు

బ్రిగేడ్ హోటల్ @ రూ. 85-90

ఈ నెల 24–28 మధ్య ఐపీవో • రూ. 760 కోట్ల సమీకరణపై కన్ను



న్యూఢిల్లీ: రియల్టీ దిగ్గజం బ్రిగేడ్ ఎంటర్‌ప్రైజెస్ అనుబంధ సంస్థ బ్రిగేడ్ హోటల్ వెంచర్స్ పబ్లిక్ ఇష్యూకి రూ. 85–90 ధరల శ్రేణి ప్రకటించింది. ఇష్యూ ఈ నెల 24న ప్రారంభమై 28న ముగియనుంది. దీనిలో భాగంగా రూ. 760 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. తద్వారా రూ. 760 కోట్లు సమీకరించాలని భావిస్తోంది. ఇష్యూ నిధుల్లో రూ. 468 కోట్లు రుణ చెల్లింపులకు, రూ. 108 కోట్లు ప్రమోటర్ సంస్థ బ్రిగేడ్ ఎంటర్‌ప్రైజెస్ నుంచి భూమి కొనుగోలుకి వెచ్చించనుంది. ప్రధానంగా దక్షిణాదిలో విస్తరించిన కంపెనీ 9 హోటళ్ల ద్వారా 1,604 గదులను నిర్వహిస్తోంది. గతేడాది(2024–25) రూ. 468 కోట్లకు పైగా ఆదాయం ఆర్జించింది. ధరల శ్రేణి ప్రకారం కంపెనీ విలువ రూ. 3,400 కోట్లుగా నమోదుకానుంది. బెంగళూరు, చెన్నై, మైసూరు, కొచ్చి తదితర 9 ప్రాంతాలలో 1,604 గదులతో హోటళ్లను కలిగి ఉంది. మారియట్, ఎకార్, ఇంటర్‌కాంటినెంటల్ హోటల్స్ గ్రూప్ వీటిని నిర్వహిస్తున్నాయి.

భవిత
స్పర్ధయా వర్ధతే విద్య

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం–ఇండియన్ పాలిటీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం–మెథడాలజీ
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం–జనరల్ స్టడీస్–జాగ్రఫీ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం–బ్యాంకింగ్ అవేర్‌నెస్

విద్య, ఉద్యోగ సమాచారం

ఏఏఐ, నార్తర్న్ రీజియన్ విభాగంలో 197 అప్రెంటిస్‌లు

ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఏఏఐ), నార్తర్న్ రీజియన్..2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి వివిధ విభాగాల్లో గ్రాడ్యుయేట్, డిప్లొమా, ఐటీఐ అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
» మొత్తం ఖాళీల సంఖ్య: 197.
» ఖాళీల వివరాలు: గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌లు–33, డిప్లొమా అప్రెంటిస్‌లు–96, ఐటీఐ ట్రేడ్ అప్రెంటిస్‌లు–68.
» అర్హత: గ్రాడ్యుయేట్/డిప్లొమా అప్రెంటిస్‌కు సంబంధించి అభ్యర్థులు ఏఐసీటీఈ ద్వారా గుర్తింపు పొందిన విద్యా సంస్థల నుంచి 2021 తర్వాత డిగ్రీ/డిప్లొమా పూర్తిచేసి ఉండాలి. ఐటీఐ ట్రేడ్ అప్రెంటిస్ పోస్టులకు, ఏఐసీటీఈ/ఎన్‌సీవీటీ గుర్తింపు పొందిన సంస్థల నుంచి సంబంధిత ట్రేడ్స్‌లో ఐటీఐ/నేషనల్ సర్టిఫికేట్ కలిగి ఉండాలి.
» వయసు: 11.08.2025 నాటికి 18 నుంచి 26 ఏళ్ల మధ్య ఉండాలి.
» స్టైపెండ్: నెలకు గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌కు రూ.15,000, డిప్లొమా అప్రెంటిస్‌కు రూ.12,000, ఐటీఐ ట్రేడ్ అప్రెంటిస్‌కు రూ.9000.
» ఎంపిక విధానం: విద్యార్హతల్లో పొందిన మార్కులు, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఫిట్‌నెస్ సర్టిఫికేట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 11.08.2025
» వెబ్‌సైట్: https://www.aai.aero

భారత్ డైనమిక్స్ లిమిటెడ్‌లో 212 ట్రైనీ ఇంజనీర్ పోస్టులు

హైదరాబాద్‌లోని భారత్ డైనమిక్స్ లిమిటెడ్‌లో ఒప్పంద ప్రాతిపదికన ట్రైనీ ఇంజనీర్, ఆఫీసర్, డిప్లొమా అసిస్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
» మొత్తం పోస్టుల సంఖ్య: 212.
» పోస్టుల వివరాలు: ట్రైనీ ఇంజనీర్–100, ట్రైనీ ఆఫీసర్–12, డిప్లొమా అసిస్టెంట్–90, ట్రైనీ అసిస్టెంట్–10.

भारत डायनामिक्स लिमिटेड
BHARAT DYNAMICS LIMITED

» విభాగాలు: ఎలక్ట్రానిక్స్, మెకానికల్, ఎలక్ట్రికల్, కంప్యూటర్ సైన్స్, హెచ్‌ఆర్, ఫైనాన్స్, బిజినెస్ డెవలప్‌మెంట్.
» అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా, డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
» వయసు: 10.08.2025 నాటికి 28 నుంచి 33 ఏళ్లు ఉండాలి.
» వేతనం: నెలకు ట్రైనీ ఇంజనీర్, ఆఫీసర్‌కు రూ.29,000 నుంచి రూ.38,500, డిప్లొమా అసిస్టెంట్, ట్రైనీ అసిస్టెంట్‌కు రూ.24,500 నుంచి రూ.29,000.
» ఎంపిక విధానం: రాతపరీక్ష ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 10.08.2025.
» హాల్ టికెట్ల డౌన్‌లోడ్ తేది: 18.08.2025.
» రాతపరీక్ష తేది: 24.08.2025.
» వెబ్‌సైట్: https://www.bdlindia.in

బీవోబీ క్యాపిటల్ మార్కెట్స్ లిమిటెడ్‌లో 80 పోస్టులు

బీవోబీ క్యాపిటల్ మార్కెట్ లిమిటెడ్.. వివిధ రాష్ట్రాల్లో ఖాళీగా ఉన్న బిజినెస్ డెవలప్‌మెంట్ మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
» మొత్తం పోస్టుల సంఖ్య: 80.
» అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు సేల్స్, ఫైనాన్స్ రంగంలో 6 నెలల పని అనుభవం ఉండాలి.
» దరఖాస్తు విధానం: ఈమెయిల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» ఈమెయిల్: careers@bobcaps.in
» దరఖాస్తులకు చివరితేది: 31.07.2025.
» వెబ్‌సైట్: https://www.bobcaps.in

ఆర్‌వీఎన్‌ఎల్‌లో 12 పోస్టులు

రైల్ వికాస్ నిగమ్ లిమిటెడ్(ఆర్‌వీఎన్‌ఎల్).. రెగ్యులర్ ప్రాతిపదికన డిప్యూటీ జనరల్ మేనేజర్, మేనేజర్, డిప్యూటీ మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
» మొత్తం పోస్టుల సంఖ్య: 12.
» పోస్టుల వివరాలు: డిప్యూటీ జనరల్ మేనేజర్(ఐటీ–ఎస్–టీ/బీడీ)–02, మేనేజర్(ఎస్–టీ)–05, డిప్యూటీ మేనేజర్(ఎస్–టీ)–05.
» అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్ (కంప్యూటర్/ఐటీ/ఎలక్ట్రానిక్స్), పీజీ, డిప్లొమా ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.
» వయసు: డిప్యూటీ మేనేజర్‌కు 35 ఏళ్లు, మేనేజర్‌కు 40 ఏళ్లు, డిప్యూటీ జనరల్ మేనేజర్‌కు 45 ఏళ్లు ఉండాలి.
» వేతనం: నెలకు డిప్యూటీ జనరల్ మేనేజర్‌కు రూ.70,000 నుంచి రూ.2,00,000, మేనేజర్‌కు రూ.50,000 నుంచి రూ.1,60,000, డిప్యూటీ మేనేజర్‌కు రూ.40,000 నుంచి రూ.1,40,000.
» ఎంపిక విధానం: రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును డిస్పాచ్ సెక్షన్, గ్రౌండ్ ఫ్లోర్, ఆగస్టు క్రాంతి భవన్, భికాజీ కామా ప్లేస్, ఆర్‌కేపురం, న్యూఢిల్లీ–110066 చిరునామకు పంపించాలి.
» దరఖాస్తులకు చివరితేది: 13.08.2025.
» వెబ్‌సైట్: https://rvnl.org

బీఈసీఐఎల్, న్యూఢిల్లీలో 16 పోస్టులు

న్యూఢిల్లీలోని బ్రాడ్‌కాస్ట్ ఇంజనీరింగ్ కన్సల్టెంట్స్ ఇండియా లిమిటెడ్(బీఈసీఐఎల్) ..ఒప్పంద ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
» మొత్తం పోస్టుల సంఖ్య: 16.
» పోస్టుల వివరాలు: డ్రైవర్–02, డీఈవో–02, ఎంటీఎస్–11. జీఐఎస్ ఆపరేటర్–01.
» అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో పదో తరగతి, ఇంటర్, డిగ్రీలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» వేతనం: నెలకు డ్రైవర్‌కు రూ.25,506, డీఈవోకు రూ.23,218, ఎంటీఎస్‌కు రూ.19,760 నుంచి రూ.23,218, జీఐఎస్ ఆపరేటర్‌కు రూ.25,506.
» దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును బ్రాడ్‌కాస్ట్ ఇంజనీరింగ్ కన్సల్టెంట్స్ ఇండియా లిమిటెడ్(బీఈసీఐఎల్), బీఈసీఐఎల్ భవన్, సీ–56/ఏ–17, సెక్టార్–62, నోయిడా–201307(ఉత్తరప్రదేశ్) చిరునామకు పంపించాలి.
» దరఖాస్తులకు చివరితేది: 30.07.2025.
» వెబ్‌సైట్: https://www.becil.com

అవుతారా.. అగ్నివీర్ వాయు

ఇండియన్ ఎయిర్‌ఫోర్స్(ఐఏఎఫ్).. అగ్నివీర్ వాయు నియామకాలకు నోటిఫికేషన్ విడుదల చేసింది. అగ్నిపథ్ స్కీమ్‌లో భాగంగా ఎంపికైన యువతకు నాలుగేళ్లపాటు భారత వాయుసేనలో పనిచేసే అవకాశం కల్పిస్తారు. అవివాహిత పురుష, మహిళా అభ్యర్థులు దరఖాస్తుకు అర్హులు. ఈ నేపథ్యంలో... అగ్నివీర్ వాయు తాజా నోటిఫికేషన్, దరఖాస్తుకు అర్హతలు, ఎంపిక విధానం, అగ్నిపథ్ స్కీమ్‌తో ప్రయోజనాలు తదితర వివరాలు...

» అగ్నివీర్ వాయు నియామకాలకు ఐఏఎఫ్ నోటిఫికేషన్
» ఎంపికైతే నాలుగేళ్లు వాయుసేనలో పనిచేసే అవకాశం



- నోటిఫికేషన్: అగ్నివీర్ వాయు ఇన్ టేక్ 02/2026 అండర్ అగ్నిపథ్ స్కీమ్.

అర్హతలు
- సైన్స్ సబ్జెక్టులకు: కనీసం 50 శాతం మార్కులతో మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, ఇంగ్లిష్ సబ్జెక్టులతో ఇంటర్మీడియెట్/10+2/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. లేదా మూడేళ్ల పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సులను 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులవ్వాలి. లేదా ఫిజిక్స్, మ్యాథమెటిక్స్‌లో ఇంటర్మీడియెట్ ఒకేషనల్ కోర్సు కనీసం 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులవ్వాలి.
- సైన్స్ కాని సబ్జెక్టులు: కనీసం 50 శాతం మార్కులతో ఏదైనా గ్రూప్‌లో ఇంటర్మీడియెట్/10+2/తత్సమాన కోర్సు లేదా కనీసం 50 శాతం మార్కులతో ఇంటర్మీడియెట్ ఒకేషనల్ కోర్సులో ఉత్తీర్ణత సాధించాలి.
- వయసు: 02.07.2005 నుంచి 02.01.2009 మధ్య జన్మించి ఉండాలి.

అగ్నిపథ్ స్కీమ్–ప్రయోజనాలు
- అగ్నిపథ్ స్కీమ్‌లో అగ్నివీర్ వాయుగా ఎంపికైన వారికి మొదటి సంవత్సరం నెలకు రూ.30వేలు, రెండో సంవత్సరం నెలకు రూ.33వేలు, మూడో సంవత్సరం నెలకు రూ.36,500, నాలుగో సంవత్సరం నెలకు రూ.40వేలు చొప్పున స్థిరమైన వేతనం అందుతుంది.
- అగ్నివీర్ వాయుకు ప్రతి నెలా అందే వేతనం నుంచి 30 శాతం అగ్నివీర్ కార్పస్ ఫండ్‌లో జమ అవుతుంది. అంతే మొత్తాన్ని ప్రభుత్వం సైతం జమ చేస్తుంది. ఇలా నాలుగేళ్ల సర్వీసు పూర్తయ్యే నాటికి జమ అయ్యే మొత్తం రూ.10.04 లక్షల సేవా నిధి ప్యాకేజిని అగ్నివీర్ వాయుకు అందచేస్తారు.
- అగ్నివీర్ వాయుగా ఎంపికై నాలుగేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న వారిలో 25 శాతం మందిని రెగ్యులర్ కేడర్‌లోకి తీసుకుంటారు.

ఎంపిక ప్రక్రియ
- అగ్నివీర్–వాయు పోస్టులకు అనుగుణంగా సైన్స్, సైన్సేతర సబ్జెక్ట్స్, సైన్స్ సబ్జెక్ట్స్ అండ్ సైన్సేతర సబ్జెక్ట్‌ల పేరిట అర్హతలను, పరీక్ష విధానాన్ని పేర్కొంటారు. సైన్స్ సబ్జెక్ట్స్‌కు సంబంధించి ఇంటర్మీడియెట్(ఎంపీసీ), సైన్సేతర సబ్జెక్ట్స్‌కు సంబంధించి ఏదైనా గ్రూప్‌తో ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణత ఉండాలి.
- సైన్స్ సబ్జెక్ట్స్‌కు సంబంధించిన రాత పరీక్ష 60 నిమిషాల వ్యవధిలో 70మార్కులకు నిర్వహిస్తారు. ఈ పరీక్షలో ఇంగ్లిష్ 20 ప్రశ్నలు, మ్యాథమెటిక్స్ 25 ప్రశ్నలు, ఫిజిక్స్ 25 ప్రశ్నలు చొప్పున అడుగుతారు. సైన్సేతర సబ్జెక్ట్స్‌కు పరీక్ష 45 నిమిషాల వ్యవధిలో 50 మార్కులకు ఉంటుంది. రీజనింగ్ అండ్ జనరల్ అవేర్‌నెస్ నుంచి 30 ప్రశ్నలు, ఇంగ్లిష్ నుంచి 20 ప్రశ్నలు అడుగుతారు.

సైన్స్ అండ్ సైన్సేతర సబ్జెక్ట్స్ పరీక్ష ఇలా
- ఈ విభాగం పరీక్ష 85 నిమిషాల వ్యవధిలో 100 మార్కులకు ఉంటుంది. ఇంగ్లిష్ నుంచి 20 ప్రశ్నలు,రీజనింగ్ అండ్ జనరల్ అవేర్‌నెస్ నుంచి 30 ప్రశ్నలు,మ్యాథమెటిక్స్ నుంచి 25ప్రశ్నలు, ఫిజిక్స్ నుంచి 25 ప్రశ్నలు చొప్పున అడుగుతారు.
- టెక్నికల్ విభాగాల్లో చేరాలనుకునే వారు సైన్స్ సబ్జెక్ట్ పరీక్షకు; నాన్–టెక్నికల్ విభాగాల్లో చేరాలనుకునే వారు సైన్సేతర సబ్జెక్ట్ పరీక్షకు; ఈ రెండు విభాగాల్లోనూ చేరాలనుకొని తగిన అర్హత ఉన్న వారు సైన్స్ అండ్ సైన్సేతర సబ్జెక్ట్ పరీక్షలకు హాజరవ్వాల్సి ఉంటుంది.
- ఈ పరీక్షలో ప్రతి ప్రశ్నకు ఒక మార్కు లభిస్తుంది. నెగిటివ్ మార్కుల నిబంధన ఉంది. ప్రతి తప్పు సమాధానానికి 0.25 మార్కులను తగ్గిస్తారు.

రెండో దశ.. పీఎఫ్‌టీ-1

ఎంపిక ప్రక్రియ రెండో దశలో భాగంగా.. ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్–1 పేరుతో శారీరక ద్రుఢత్వ పరీక్ష నిర్వహిస్తారు. 1.6 కిలోమీటర్ల దూరాన్ని పురుష అభ్యర్థులు ఏడు నిమిషాల్లో; మహిళా అభ్యర్థులు ఎనిమిది నిమిషాల్లో చేరుకోవాల్సి ఉంటుంది.

మూడో దశ.. పీఎఫ్‌టీ-2

రెండో దశలోని ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్–1లో ఉత్తీర్ణత సాధించిన వారికి.. మూడో దశలో ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్–2 పేరుతో పలు ఫిజికల్ ఈవెంట్స్ నిర్వహిస్తారు. పురుష అభ్యర్థులు 10 పుష్–అప్స్(1 నిమిషం వ్యవధి); 10 సిట్–అప్స్(1 నిమిషం వ్యవధి); 20 స్క్వాట్స్(1 నిమిషం వ్యవధి) చేయాల్సి ఉంటుంది. మహిళా అభ్యర్థులు 10 పుష్–అప్స్ (1:30 నిమిషాల వ్యవధి); 15 స్క్వాట్స్(1 నిమిషం వ్యవధి) తీయాల్సి ఉంటుంది.

చివరగా అడాప్టబిలిటీ టెస్ట్

తొలిదశలో నిర్వహించే ఆన్‌లైన్ టెస్ట్, ఆ తర్వాత జరిపే పీఎఫ్‌టీ–1, 2లలో ప్రతిభ చూపిన వారికి చివరగా అడాప్టబిలిటీ టెస్ట్ ఉంటుంది. ఈ టెస్ట్‌లో అభ్యర్థులకు ఎయిర్‌ఫోర్స్‌లో ఇమిడిపోయే లక్షణం, రక్షణ రంగంలో రాణించే తత్వాన్ని పరీక్షిస్తారు. ఇందులో భాగంగా.. సిట్యుయేషన్ రియాక్షన్ టెస్ట్ ఉంటుంది. అదే విధంగా అడాప్టబిలిటీ టెస్ట్–1లో అభ్యర్థుల వ్యక్తిత్వాన్ని పరిశీలిస్తారు. అడాప్టబిలిటీ టెస్ట్–2లో గ్రూప్ డిస్కషన్ నిర్వహిస్తారు. అడాప్టబిలిటీ టెస్ట్‌లోనూ విజయం సాధించిన వారికి మెడికల్ టెస్ట్ నిర్వహించి.. ఎయిర్‌ఫోర్స్‌లో విధులకు సరితూగుతారా? లేదా? అని పరీక్షిస్తారు. ఇందులో సానుకూల ఫలితం పొందితే.. అగ్నివీర్ వాయుగా నియామకం ఖరారు చేస్తారు.

టెక్నికల్, నాన్–టెక్నికల్ విధులు
- అగ్నివీర్–వాయుగా నియమితులైన వారు టెక్నికల్, నాన్–టెక్నికల్ విభాగాల్లో విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. ఎయిర్‌మెన్ హోదాకు ఎంపికైన వారు.. ఎయిర్‌మెన్ గ్రూప్–ఎక్స్ పరిధిలో ఎయిర్‌ఫోర్స్‌లోని టెక్నికల్ విభాగాల్లో పని చేయాల్సి ఉంటుంది. అలాగే గ్రూప్–వై పరిధిలో నాన్–టెక్నికల్ విభాగాల్లో విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది.
- నేవిగేటర్‌గా ఎంపికైన వారు ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్, ఫ్లయింగ్ విభాగం, గ్రౌండ్ డ్యూటీ విభాగాల మధ్య సమన్వయం చేస్తూ విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది.
- పైలట్‌గా నియమితులైన వారు యుద్ధ విమానాలు, వైమానిక దళానికి చెందిన ఇతర ఎయిర్ క్రాఫ్ట్‌ను నడపాల్సి ఉంటుంది.
- కమిషన్డ్ ఆఫీసర్ హోదాలో నియమితులైన వారికి ఫ్లయింగ్ ఆఫీసర్, ఫ్లైట్ లెఫ్టినెంట్, వింగ్ కమాండర్, స్క్వాడ్రన్ లీడర్, గ్రూప్ కెప్టెన్ వంటి హోదాలు లభిస్తాయి.

ముఖ్య సమాచారం
- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
- ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభం: 11.07.2025
- ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది: 31.07.2025
- వెబ్‌సైట్: https://agnipathvayu.cdac.in/AV

పెద్ద సార్లే పారిశ్రామికవేత్తలు

సీఎంఎస్‌టీఈఐ పథకంలో అవకతవకలు జరుగుతున్నాయనే ఆరోపణలు.. గిరిజన యువతను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే లక్ష్యానికి గండి

పథకం లబ్ధిదారుల్లో ఉన్నతాధికారుల కుటుంబసభ్యులు!

రూ.50 లక్షల వరకు ట్రైకార్ రాయితీ పక్కదారి?

గత ఐదేళ్లలో దాదాపు 250 మంది ఎంపిక..

దాదాపు రూ.121 కోట్లు రాయితీ రూపంలో అందజేత

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కీసర సమీపంలో ఏర్పాటైన ఈ స్టోన్ క్రషింగ్ ఇండస్ట్రీ నిర్మాణ వ్యయం రూ.2 కోట్లు. ఈ పరిశ్రమ ఏర్పాటుకు కూడా ట్రైకార్ ద్వారా పెద్ద ఎత్తున రాయితీ మంజూరైంది. యూనిట్ కాస్ట్‌లో దాదాపు 50 శాతానికి పైబడి బ్యాంకు రుణం పొందిన లబ్ధిదారు.. మిగిలిన మొత్తం తన వాటా కింద పరిశ్రమ స్థాపించారు. ఈ పరిశ్రమ కూడా గతంలో గిరిజన సంక్షేమ శాఖలో హెచ్‌ఓడీగా పనిచేసిన ఓ ఉన్నతాధికారి (సివిల్ సర్వెంట్) కుమారుడిది కావడం గమనార్హం.



సాక్షి, హైదరాబాద్: చీఫ్ మినిస్టర్ షెడ్యూల్డ్ ట్రైబ్స్ ఎంటర్‌ప్రెన్యూర్ షిప్ అండ్ ఇన్నోవేషన్ స్కీమ్ (సీఎంఎస్‌టీఈఐ).. ఔత్సాహిక గిరిజన యువతను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు రూపొందించిన ఈ పథకం పక్క దారి పడుతోంది. గిరిజన సంక్షేమ శాఖ ఉన్నతాధికా రులు కొందరు అర్హులకు ఈ పథకాన్ని అందకుండా చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. భారీ మొత్తంలో రాయితీ లభిస్తుండటంతో కొందరు తమ కుమారులు, కుమార్తెలు, బంధువుల పేరిట యూనిట్లు ఏర్పాటయ్యేలా చేస్తున్నారని, కొన్నిచోట్ల సదరు అధికారులే ఆయా యూనిట్లను పర్యవేక్షిస్తున్నారని సమాచారం.

లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు

➤ బ్యాచిలర్ డిగ్రీ పూర్తి చేసి వ్యాపారంలో కనీసం రెండేళ్ల అనుభవం ఉన్న గిరిజన యువత ఈ పథకం కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. ఎంపికైన లబ్ధిదారుకు ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ) భాగస్వామ్యంతో సెంటర్ ఫర్ ఇన్నోవేటివ్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ (సీఐఈ)లో 3 నెలల పాటు శిక్షణ ఇస్తారు. శిక్షణ సమయంలోనే లబ్ధి దారు ఏర్పాటు చేయ తలపెట్టిన ప్రాజెక్టుకు సంబంధించి సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) తయారు చేయిస్తారు. దానిని అధికారులు నిశితంగా పరిశీలించిన తర్వాత ప్రభుత్వం ఆమోదించి యూనిట్ ఏర్పాటుకు అనుమతులు జారీ చేస్తుంది. ఈ పథకం కింద ఏర్పాటు చేసే ఒక్కో యూనిట్‌కు గరిష్టంగా రూ.50 లక్షల మేర తెలంగాణ షెడ్యూల్డ్ ట్రైబ్స్ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ (ట్రైకార్) రాయితీగా ఇస్తోంది. ఈ క్రమంలో గత ఐదేళ్లలో దాదాపు 250 మందిని ఈ పథకం కింద ఎంపిక చేశారు. దాదాపు రూ.121 కోట్లు రాయితీ రూపంలో అందించారు. కానీ లబ్ధిదారుల ఎంపికలో పెద్ద ఎత్తున అవకతవకలు జరిగినట్లు ఆరోపణలున్నాయి. ప్రధానంగా సదరు శాఖలోని కొందరు ఉన్నతాధికారులే చక్రం తిప్పి తమ వారిని సైతం అర్హులుగా ఎంపిక చేసి, యూనిట్లు ఏర్పాటు చేయించినట్లు తెలుస్తోంది.

తూతూ మంత్రం నిబంధనలు!

రాష్ట్ర ప్రభుత్వం ఈ సీఎంఎస్‌టీఈఐ పథకానికి అధికమొత్తంలో రాయితీ ఇస్తోంది. సంక్షేమ పథకాల్లో భాగంగా ఉన్నత చదువులు చదివే విద్యార్థులకు విద్యానిధి పథకం కింద రూ.20 లక్షల సాయం అందిస్తుండగా.. ఒక్క సీఎంఎస్‌టీఈఐ పథకానికే అంతకు రెండున్నర రెట్లు అధికంగా రాయితీ అందుతుండటం గమనార్హం. ఇంత పెద్ద మొత్తంలో రాయితీ ఇస్తున్న పథకం కింద అర్హులకే లబ్ధి చేకూరేలా కఠినమైన నిబంధనలను రూపొందించాల్సి ఉండగా.. గిరిజన సంక్షేమ శాఖ ఉన్నతాధికారులు పలు లొసుగు లతో నిబంధనలు రూపొందించారనే ఆరోపణలున్నాయి. సాధారణంగా ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకంలో అత్యంత కీలక అంశం కుటుంబ వార్షికాదాయం. వార్షికాదాయం ఆధారంగానే వారి స్థితిగతులను అంచనా వేస్తారు. కానీ ఈ పథకంలో వార్షికాదాయ నిబంధననే పొందుపర్చలేదు. మరోవైపు రెండేళ్ల అనుభవం ఉండాలని చెప్పినప్పటికీ... అందుకు సంబంధించి ఎలాంటి ఆధారాలను సమర్పించాలని చెప్పకపోవడం గమనార్హం. ఏటా గరిష్టంగా 50 మందిని ఈ పథకం కింద ఎంపిక చేస్తూ..రూ. 25 కోట్ల మేర బడ్జెట్‌లో కేటాయిస్తుండగా.. వీరిలో నిజంగా అర్హులైన గిరిజన యువత అంతంత మాత్రమేననే ఆరోపణలున్నాయి.

లబ్ధిదారుల జాబితాలేవీ?

ఈ పథకం కింద అర్హత సాధించిన వారి జాబితాలను గిరిజన సంక్షేమ శాఖ అధికారులు బయట పెట్టక పోవడం.. ఈ పథకంలో అవకతవకలు జరుగు తున్నాయనే ఆరోపణలకు బలం చేకూరుస్తోంది. ట్రైకార్ వద్ద జాబితాలు ఉన్నప్పటికీ అధికారులు ఇవి బయట పడకుండా జాగ్రత్తపడు తున్నారు. గిరిజన సంక్షేమ శాఖ వెబ్ సైట్‌లోనూ లబ్ధిదారులు, ఇతరత్రా వివరాలు బహిర్గతం చేయక పోవడం అనుమానాలకు తావిస్తోంది.

3 లక్షలపైన ర్యాంక్ వచ్చినా

కన్వీనర్ కోటాలో ఎంబీబీఎస్ సీటు



గత ఏడాది నీట్ కటాఫ్ ర్యాంకుల ఆధారంగా నిపుణుల అంచనా

బీసీ-ఏ కేటగిరీలో గత ఏడాది కటాఫ్ ర్యాంక్ 3,36,989.. జనరల్ కేటగిరీలో 2.12 లక్షల ర్యాంకు

రాష్ట్రం నుంచి 43,400 మంది నీట్‌లో క్వాలిఫై

మొదలైన ఆలిండియా కౌన్సెలింగ్ ప్రక్రియ

సాక్షి, హైదరాబాద్: నీట్-యూజీలో అర్హత సాధించిన విద్యార్థులకు ఎంబీబీఎస్, ఎండీఎస్ కోర్సుల్లో ప్రవేశాలకు దేశవ్యాప్తంగా కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. ఈనెల 16 నుంచే రిజిస్ట్రేషన్లు మొదలు కాగా, సోమవారం నుంచి జాతీయ స్థాయిలో కౌన్సెలింగ్ మొదలైంది. నేషనల్ మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ (ఎన్‌ఎంసీసీ) ఆధ్వర్యంలో ఆలిండియా కోటా, డీమ్డ్ యూనివర్సిటీ, సెంట్రల్ యూనివర్సిటీలకు చెందిన కళాశాలల్లో ప్రవేశాల కోసం మొదటి రౌండ్ ప్రక్రియ ఈనెల 30 వరకు జరుగుతుంది. అలాగే స్టేట్ కౌన్సెలింగ్ మొదటి దశలో ఈనెల 30 నుంచి ఆగస్టు 6 వరకు సాగుతుంది. మూడు రౌండ్‌లలో జరిగే ఈ ప్రక్రియ ఆలిండియా కోటా కింద సెప్టెంబర్ 10 వరకు, రాష్ట్ర కోటాలో సెప్టెంబర్ 18 వరకు సాగనుంది. అయితే ఎంత ర్యాంకు వస్తే కన్వీనర్ కోటాలో సీటు దక్కుతుందనే విషయంపై విద్యార్థులు ఆరా తీస్తున్నారు.

ప్రభుత్వ కళాశాలల నుంచి 15 శాతం సీట్లు

రాష్ట్రం నుంచి 43,400 మంది విద్యార్థులు నీట్‌కు అర్హత సాధించారు. ఆలిండియా కౌన్సెలింగ్‌లో రాష్ట్రంలోని ప్రభుత్వ కళాశాలల నుంచి 15 శాతం సీట్లను కేటాయించనున్నారు. రాష్ట్రంలోని 34 ప్రభుత్వ కాలేజీల్లోని 4,090 సీట్లలో 15% అంటే 613 సీట్లు ఆలిండియా కోటా కింద వెళ్తాయి. వీటితోపాటు రాష్ట్రంలోని ఈఎస్‌ఐ కాలేజీలోని 125 సీట్లు, బీబీనగర్ ఎయిమ్స్‌లోని 100 సీట్లకు కౌన్సెలింగ్ మొదలైంది. ఈ ఏడాది నీట్ ప్రశ్నపత్రం చాలా కఠినంగా రావడంతో మార్కులు తగ్గాయి. దాంతో ఆలిండియా టాప్ స్కోర్ 686 మార్కులే. రాష్ట్రం నుంచి 670 మార్కులే అత్యధికం.

రాష్ట్ర ర్యాంకుల్లో 10వేల కన్నా ఎక్కువ వచ్చినా..

గత ఏడాది జనరల్ కేటగిరీలో ఆలిండియా నీట్ ర్యాంకు 2.12 లక్షలు (చివరిర్యాంకు) వచ్చిన విద్యార్థికి కన్వీనర్ కోటాలో సీటు దక్కింది. విద్యార్థినుల్లో 1.98 లక్షల వచ్చిన వారికి కూడా సీటు వచ్చింది. బీసీ- ఏ కేటగిరీలో అత్యధికంగా 3,36,989 ర్యాంకు వచ్చిన విద్యార్థికి, బీసీ-ఏ మహిళా కేటగిరీలో 3.31 లక్షల ర్యాంకు వచ్చిన విద్యార్థినికి కన్వీనర్ కోటాలో సీటు దక్కింది. ఈ ఏడాది ఇంతకన్నా ఎక్కువ ర్యాంకు వచ్చినా. కన్వీనర్ కోటాలో సీటు దక్కే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. బీసీ-ఏ, బీసీ-సీ, ఎస్సీ, ఎస్టీ కేటగిరీలోని విద్యార్థులకు ఈసారి నీట్‌లో 3 లక్షల ర్యాంకుపైనా, రాష్ట్ర ర్యాంకుల్లో 10వేల ర్యాంకు కన్నా ఎక్కువ వచ్చిన వారికి కూడా కన్వీనర్ కోటాలో సీటు దక్కే అవకాశం ఉందని అంటున్నారు.

రాష్ట్రంలో సీట్లు ఇలా..

రాష్ట్రంలో 34 రాష్ట్ర ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ఉండగా, వాటిలో 4,090 సీట్లు ఉన్నాయి. వాటిలో 15 శాతం ఆలిండియా కోటా పోను 3,477 సీట్లు తెలంగాణవాసులకు దక్కుతాయి. 25 ప్రైవేటు కాలేజీల్లో 4,200 సీట్లు ఉన్నాయి. ఇందులో 50 శాతం అంటే 2,100 సీట్లు కన్వీనర్ కోటాలో తెలంగాణ వాసులకే దక్కనున్నాయి. ఇవికాకుండా మల్లారెడ్డి డీమ్డ్ వర్సిటీ పేరిట 2 కాలేజీలు ఉండగా, ఇందులోని 400 సీట్లు పూర్తిగా ప్రైవేటులోనే ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వానికి చెందిన ఈఎస్‌ఐ (150 సీట్లు), బీబీ నగర్ ఎయిమ్స్ (100 సీట్లు)లో ఆలిండియా కౌన్సెలింగ్‌లోనే వంద శాతం సీట్లు కేటాయిస్తారు. రాష్ట్రంలోని మొత్తం కళాశాలల్లో కలిపి 8,915 ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులో ఉన్నప్పటికీ, స్టేట్ కోటాలో దక్కేవి మాత్రం 5,577 మాత్రమే. కాగా దివ్యాంగులకు సంబంధించి వైకల్యాన్ని నిర్ధారించేందుకు నిమ్స్ ఆసుపత్రిని ఎంపిక చేశారు.

నీట్ యూజీ 2024–25లో కటాఫ్ ర్యాంకుల వివరాలు..

కేటగిరీ	జనరల్	మహిళ
బీసీ-ఏ	3,36,989	3,31,596
బీసీ-బీ	2,29,597	2,36,008
బీసీ-సీ	3,15,341	3,09,851
బీసీ-డీ	2,14,648	2,11,904
బీసీ-ఈ	2,23,906	2,29,718
మైనార్టీ	2,29,439	2,23,599
ఎస్సీ	3,11,648	3,11,126
ఎస్టీ	2,93,753	2,93,873
ఓపెన్ కేటగిరీ	2,12,617	1,98,126
ఈడబ్ల్యూఎస్	1,80,510	1,73,724

రూ.12 లక్షలు పెడితేనే

ఓ మోస్తరు కాలేజీలో కంప్యూటర్ సీటు



ఇంజనీరింగ్ బీ కేటగిరీ సీట్లకు పెరిగిన గిరాకీ

మంచి కాలేజీలో, మంచి బ్రాంచి కోసం విద్యార్థుల యత్నాలు..

టాప్ కాలేజీల్లో రూ.19 లక్షల వరకూ దండుకుంటున్నారనే ఆరోపణలు

జేఈఈ, ఎప్‌సెట్ ర్యాంకుల ఆధారంగా ఇవ్వాల్సి ఉన్నా యాజమాన్యాల ఇష్టారాజ్యం

ప్రభుత్వం దృష్టి పెట్టాలంటున్న విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రులు

సాక్షి, హైదరాబాద్: ప్రైవేటు కాలేజీల్లో ఇంజనీరింగ్ యాజమాన్య కోటా సీట్లకు గిరాకీ పెరిగింది. బీ కేటగిరీలో తొలి విడత సీట్ల కేటాయింపు తర్వాత విద్యార్థులు మంచి కాలేజీ, డిమాండ్ ఉన్న బ్రాంచి కోసం ప్రయత్నిస్తుండటంతో టాప్ కాలేజీల్లో సీట్లు వేగంగా భర్తీ అవుతున్నాయి. సాధారణ కాలేజీల్లో మాత్రం కొంత మందకొడిగా సాగుతోంది. అయితే ఈ యాజమాన్య కోటా సీట్ల భర్తీలో ఎక్కడా నిబంధనలు పాటించడం లేదనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. డబ్బులు ఎక్కువ ఇచ్చిన వారికే సీట్లు దక్కుతు న్నాయని తల్లిదండ్రులు చెబుతుండగా.. ఆధారా లతో ఫిర్యాదు చేయనిదే తామేమీ చేయలేమని అధికారులు అంటున్నారు.

రూ.12 లక్షల పైమాటే...

కంప్యూటర్ కోర్సులకు కాలేజీలు ఎక్కువ మొత్తంలో వసూలు చేస్తున్నాయి. ఒక మోస్తరు కాలేజీలే సీటుకు రూ.12 లక్షలు (డొనేషన్ కింద) వసూలు చేస్తున్నాయి. ఇక టాప్ కాలేజీలైతే రూ.19 లక్షల వరకూ తీసుకుంటున్నాయని తెలుస్తోంది. ఇది కాకుండా కాలేజీని బట్టి వార్షిక ఫీజూ ఉంటుంది. రాష్ట్రంలో 1.06 లక్షల ఇంజనీరింగ్ సీట్లున్నాయి. వీటిల్లో దాదాపు 23 వేల సీట్లు యాజమాన్య కోటా కింద ఉండగా.. 21 వేల సీట్లు కంప్యూటర్ సంబంధిత బ్రాంచీల్లోనే ఉన్నాయి. మిగతావి ఇతర కోర్ గ్రూపుల సీట్లన్నమాట. యాజమాన్య కోటా సీట్ల భర్తీకి ఉన్నత విద్యామండలి ఈ నెల 17న నోటిఫికేషన్ ఇచ్చింది. ఆగస్టు 10 నాటికి సీట్ల భర్తీ పూర్తి చేయాలని పేర్కొంది. భర్తీ విధానానికి మార్గదర్శకాలూ ఇచ్చింది. ఒక పక్క కన్వీనర్ కోటాకు కౌన్సెలింగ్ జరుగుతుండగా, మరోపక్క యాజమాన్య కోటా సీట్ల భర్తీని చేపడుతున్నారు.

పేరుకే నిబంధనలు!

మేనేజ్‌మెంట్ కోటా సీట్లు రెండు కేటగిరీలుగా ఉంటాయి. ఇందులో 'బీ' కేటగిరీ సీట్లను జేఈఈ, ఎప్‌సెట్‌లో ర్యాంకు ఆధారంగా ఇవ్వాలి. ఫీజుల నియంత్రణ కమిటీ నిర్ధారించిన ఫీజు తీసుకోవాలి. ఫీజు రీ ఎంబర్స్‌మెంట్ వీరికి వర్తించదు. అయితే ర్యాంకర్లు రాలేదని చెబుతూ ఈ సీట్లను యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా ఇచ్చేస్తున్నాయి. ఇక 'సీ' కేటగిరీ సీట్లను ప్రవాస భారతీయుల పిల్లలకు ఇవ్వాలి. ఏటా 5 వేల డాలర్ల ఫీజు వసూలు చేయాలి. కానీ 'సీ' కేటగిరీకి పెద్దగా దరఖాస్తులు రావు. వీటిని కూడా యాజమాన్యాలు డబ్బులు ఇచ్చిన వారికే కేటాయిస్తున్నాయి. ర్యాంకర్లు తాము పలానా కాలేజీకి దరఖాస్తు చేసినట్టు తెలిపేందుకు ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో కాలేజీలపై చర్యలు తీసుకోవడం అధికారులకు కష్టంగా ఉంది. దీంతో యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా సీట్లు అమ్ముకుంటున్నాయని, దీనిపై ప్రభుత్వ దృష్టి సారించాల్సిన అవసరం ఉందని విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

20 వేల ర్యాంకు దాటితే 'బీ' కేటగిరీకే..

సాధారణంగా 20 వేల లోపు ర్యాంకు ఉన్న విద్యార్థులు కన్వీనర్ కోటాపైనే ఆశలు పెట్టుకుంటున్నారు. వీళ్ళు కోరుకున్న బ్రాంచీల్లో సీట్లు వస్తాయనే అంచనాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో 20 వేల పైన ర్యాంకు ఉన్న వాళ్ళే యాజమాన్య కోటా వైపు వెళ్తున్నారు. ఎప్‌సెట్‌లో 20 వేల వరకూ ర్యాంకు సాధించిన వాళ్ళు 13,680 మంది ఉన్నారు. వీళ్ళకు టాప్ కాలేజీల్లో కన్వీనర్ కోటా కింద సీట్లు పక్కాగా దొరుకుతాయి. 20 నుంచి 50 వేల ర్యాంకు ఉన్న వాళ్ళు 20,293 మంది ఉన్నారు. వీళ్ళకు ఏదో ఒక కాలేజీలో ఏదో ఒక బ్రాంచీలో సీటు దొరికే వీలుంది. కానీ ఇందులో 6 వేల మంది వరకూ కంప్యూటర్ సైన్స్ బ్రాంచీలనే కోరుకుంటున్నారు. దీంతో యాజమాన్య కోటా కోసం ప్రయత్నిస్తున్నారు. 50 నుంచి లక్ష ర్యాంకు ఉన్న వాళ్ళు 25,096 మంది ఉన్నారు. వీళ్ళు నేరుగా యాజమాన్య కోటాకే వెళ్తున్నారు. ఇందులోనూ చాల మంది సీఎస్‌ఈ కోరుకుంటున్నారు. ఇక లక్షపైన ర్యాంకు ఉన్న వాళ్ళు 18 వేల మంది వరకూ ఉండగా.. వీళ్ళు బ్రాంచీతో సంబంధం లేకుండా యాజమాన్య కోటాకు ప్రయత్నిస్తున్నారు. మెరుగైన ర్యాంకు ఉన్నవాళ్లు టాప్ కాలేజీలకు వెళుతుండగా.. సాధారణ కాలేజీలు 50 వేల పైన ర్యాంకు ఉన్న విద్యార్థులకు వల వేస్తున్నాయి. ఏజెంట్లు, కన్సల్టెన్సీల ద్వారా డబ్బులు తీసుకుని సీట్లు ఇస్తున్నాయని విద్యార్థి సంఘాలు చెబుతున్నాయి.

ఆర్టీసీ బస్సులో జడ్జి దంపతులు



ఆర్టీసీ బస్సులో హైకోర్టు జడ్జి దంపతులు ప్రయాణించారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ డిపో నుంచి గుగ్గిల్ల మీదుగా వేములవాడ, హైదరాబాద్‌కు రెండు మార్గాల్లో ఇటీవల కొత్తగా బస్సులను ప్రారంభించారు. స్వగ్రామమైన గుగ్గిల్ల నుంచి వెళ్తున్న వేములవాడ బస్సులో సోమవారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నచ్చరాజు శ్రవణ్‌కుమార్ (పీవీ నర్సింహారావు మనవడు), సతీమణి కవిత, తల్లి నచ్చరాజు శారదా దేవితో కలిసి ప్రయాణించారు.అంతకుముందు గ్రామంలో జరిగిన ఉచిత వైద్య శిబిరాన్ని జడ్జి దంపతులు సందర్శించారు. -బెజ్జంకి(సిద్దిపేట)

ఆర్టీసీ 'మహాలక్ష్మి' ఉచిత ప్రయాణాలు 200 కోట్లు

రేపు రాష్ట్రవ్యాప్తంగా సంబరాలు



సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీ బస్సుల్లో ప్రారంభించిన మహాలక్ష్మి పథకం '200కోట్ల ఉచిత ప్రయాణాల' మైలురాయిని చేరుకున్న నేపథ్యంలో 23న రాష్ట్రవ్యాప్తంగా సంబరాలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ పథకం 2023 డిసెంబరు 9న ప్రారంభమైనప్పటి నుంచి మహిళల నుంచి మంచి స్పందన వస్తుండటం తెలిసిందే. ఈ నెల 23 నాటికి ఆ సంఖ్య 200 కోట్లను చేరుకోనుంది. దీంతో ఆ రోజు అన్ని డిపోలతోపాటు, హైదరాబాద్‌లోని ఎంజీబీఎస్‌లో సంబరాలు నిర్వహించాలని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. మహిళా ప్రయాణికుల ఉచిత ప్రయాణ అనుభవాలను వివరింపజేయాలని, ఐదుగురికి రూ.500 విలువైన బహుమతులు అందజేసి సన్మానించాలని, విద్యార్థులకు వ్యాసరచన, రంగోలి, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి ఐదుగురు చొప్పున విజేతకు రూ.వంద విలువైన బహుమతులు అందజేసి సన్మానించాలని నిర్ణయించారు. ఎంజీబీఎస్‌లో రాష్ట్రస్థాయి సంబరాలు జరపాలని నిర్ణయించారు.

ఇలా బతికిస్తున్నారు..




బాల్కొండ: నిజామాబాద్ జిల్లా మెండోరా మండలం బుస్సాపూర్‌లో రైతు లింగన్న తన వరి నారును బతికించుకోవడానికి అనేక తిప్పలు పడుతున్నాడు. దోబీ ఘాట్ నుంచి అర కిలోమీటర్ దూరం సైకిల్‌పై డబ్బాల్లో నీరు తీసుకొచ్చి వరి నారుకు పోస్తున్నాడు. ఇలా రెండ్రోజులుగా నీరు పోస్తున్నా.. వరి నారుకు సరిపోవడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేశాడు.

మహాజాదూ చంద్రబాబు తోలుబొమ్మలాటే..

ఇదేం దర్యాప్తు? ఏవీ ఆధారాలు?

అసలు డబ్బులు ఎక్కడ...? దాచింది ఎక్కడ...?

సిట్ చార్జ్‌షీట్ సాక్షిగా వెల్లడైన బాగోతం.. లేని కుంభకోణం ఉన్నట్టు నమ్మించే కుతంత్రం



సాక్షి, అమరావతి: చంద్రబాబు ప్రభుత్వానికి మతి లేదు... టీడీపీ వీర విధేయ పోలీసు అధికారులతో కూడిన సిట్‌కు గతి లేదు...! ఇదీ రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితి. వైఎస్సార్‌సీపీ హయాంలోని మద్యం విధానంపై నమోదు చేసిన అక్రమ కేసులో కొండను తవ్వినంత హడావుడి చేసిన సిట్ అసలు ఎలుకను కాదు కదా..? వీసమెత్తు ఆధారాన్ని కూడా కనిపెట్టలేకపోయింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో లేని కుంభకోణం ఉన్నట్టుగా చూపేందుకు చంద్రబాబు ప్రభుత్వం నానా కుతంత్రాలు పన్నుతోంది. అసలు కుంభకోణం ఎక్కడ జరిగిందో...? నిధులు ఎక్కడ దారి మళ్లాయో...? ఎక్కడ ఉన్నాయో..? అన్న వివరాలేవీ లేకుండా చంద్రబాబు కల్పిత కథనే సిట్ వల్లిస్తోంది. ఇదిగో పెళ్లిలో వీరిద్దరూ కలిశారు కాబట్టి కుంభకోణానికి పాల్పడ్డారు... అప్పుడెప్పుడో ఫోన్లో మాట్లాడుకున్నారు కాబట్టి అవినీతికి పాల్పడ్డారు... వారిద్దరు ఒకరికి ఒకరు కనిపించగానే నవ్వుతూ పలకరించుకున్నారు కాబట్టి ఏదో గూడుపుఠాణి చేసి ఉంటారు... ఇదీ సిట్ తన చార్జ్‌షీట్ సాక్షిగా వెల్లడించిన నివేదిక.. కూటమి పెద్దల కుట్రకు తలాడించడం తప్ప ఏమీ చేయలేని రూ.3,500 కోట్లు చేతులు మారాయని ఓ తాడు బొంగరం లేని కట్టు కథతో దుష్ప్రచారం చేయాలన్న కుతంత్రమే చంద్రబాబు పన్నాగమని స్పష్టమవుతోంది. మోకాలికి బోడిగుండుకు ముడిపెడుతూ రాజ్ కేసిరెడ్డి ద్వారా మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి కె.ధనుంజయ్‌రెడ్డి, ఓఎస్డీ కృష్ణమోహన్‌రెడ్డి నుంచి మాజీ సీఎం వైఎస్ జగన్‌కు డబ్బులు చేరాయని నమ్మించేందుకు సృష్టించిన కల్పిత కథ బెడిసికొట్టింది.

- సాక్షాత్తు సీఎం చంద్రబాబు కుమారుడు, మంత్రి నారా లోకేశ్ బినామీ విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని వ్యాపార భాగస్వామే రాజ్ కేసిరెడ్డి అన్న వాస్తవం మరోసారి చర్చనీయాంశమైంది. డిస్టిలరీల ముసుగులో మద్యం దోపిడీ చంద్రబాబు బాగోతమనని సీఐడీ నిగ్గు తేల్చిన సంగతిని అందరికీ గుర్తు చేసింది. ఆ కేసులో బెయిల్‌పై ఉన్న చంద్రబాబు ప్రస్తుతం దెయ్యాలు వేదాలు వల్లిస్తున్నట్టుగా నీతి కథలు చెబుతుండటం విస్మయపరుస్తోంది. బాబు కనికట్టు కథను ముందుగానే ఎల్లో మీడియా చిలక జోస్యం చెప్పడంతో రెడ్‌బుక్ కుతంత్రం బట్టబయలవుతోంది.

రాజ్ కేసిరెడ్డి, విజయ సాయిరెడ్డి, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ధనుంజయ్‌రెడ్డి, ఓఎస్డీ కృష్ణ మోహన్‌రెడ్డి, వికాట్ సంస్థ డైరెక్టర్ బాలాజీ గోవిందప్ప... ఇలా ఒకరినుంచి ఒకరికి రూ.3,500 కోట్లు చేతులు మారి... చివరికి మాజీ సీఎం వైఎస్ జగన్‌కు చేరాయని ఓ పకడ్బందీ కుట్రకథను అల్లడం బాబు మార్కు కుతంత్రానికి తార్కాణం. రూ.3,500 కోట్లు ఎక్కడ ఉన్నాయంటే సిట్ చెప్పదు... చెప్పలేదు. ఎందుకంటే రూ.3,500 కోట్ల అవినీతి అన్నది చంద్రబాబు సృష్టించిన కల్పిత కథ.

- ఓవైపు రూ.3,500 కోట్లు అక్రమంగా తరలించి వైఎస్ జగన్‌కు చేర్చారని సిట్ అవాస్తవ ఆరోపణలు చేస్తోంది. మరోవైపు ఆ నిధులతో నిందితులు దుబాయ్ తదితర విదేశాల్లో జల్సాలు చేశారని అంటోంది. అంటే రెడ్‌బుక్ కుట్రను అమలు చేసే ఆత్రుతలో సిట్ పరస్పర విరుద్ధంగా అవాస్తవ అభియోగాలు ప్రచారంలోకి తెస్తోంది.

కాల్ డేటా, వాట్సాప్ చాటింగ్ అంటూ బురిడీ కుట్ర

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో లేని కుంభకోణం ఉన్నట్టు చూపించేందుకు టీడీపీ వీర విధేయ సిట్ నానా తంటాలు పడుతోంది. నెలల తరబడి దర్యాప్తు పేరుతో వేధించినా, బెదిరించినా ఒక్క ఆధారం కూడా చూపించలేకపోయింది. చివరికి చార్జ్‌షీట్‌లో ఏం చెప్పిందంటే... 13 వేల ఫోన్ కాల్స్, వందలాది వాట్సాప్ చాటింగ్‌ల డేటా అంటూ వక్రీకరణలతో కనికట్టుకు యత్నించింది. అంటే దర్యాప్తు పేరుతో తాము సాధించిందీ ఏమీ లేదని ఒప్పుకొంది. ఓ ఇరవై ముప్పై మంది ఫోన్లతో పాటు వారి పీఏలు, సిబ్బంది ఫోన్ల నుంచి రెండేళ్ల సుదీర్ఘ కాలంలో 13 వేలకుపైగా ఫోన్ కాల్స్ వెళ్లాయి అన్నది ఏదో అసహజ విషయం అన్నట్టు నమ్మించేందుకు సిట్ యత్నించింది. పోనీ ఆ కాల్ డేటా, వాట్సాప్ చాటింగ్‌లో మద్యం కొనుగోళ్లు, సరఫరా, డబ్బుల చెల్లింపు వంటి వ్యవహారాల గురించి ఏమైనా ఉన్నట్టు సిట్ నిరూపించిందా? అంటే అదీ లేదు. కేవలం మీటింగులు, ప్రయాణాలు, సాధారణ విషయాలే ఉన్నట్టు సిట్ చార్జ్‌షీట్‌లోనే పేర్కొంది. ఆ సాధారణ ఫోన్‌కాల్స్, చాటింగ్‌లకు వక్రభాష్యం చెబుతూ తమ రెడ్‌కుట్ర కథను ఆపాదిస్తూ అటు న్యాయస్థానాన్ని ఇటు ప్రజలను తప్పుదారి పట్టించడమే చంద్రబాబు ప్రభుత్వ కుతంత్రం అన్నది స్పష్టమవుతోంది.

బాబు కుతంత్రం... ఎల్లో మీడియా చిలక జోస్యం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో జరగని కుంభకోణాన్ని జరిగినట్టుగా చూపించే రెడ్‌బుక్ కుట్ర కోసం చంద్రబాబు తన భజన ఎల్లో మీడియానే నమ్ముకున్నారు. అసలు సిట్ ఏమేం చేయాలో కూడా తన రాజగురువు రామోజీ కుటుంబానికి చెందిన ఈనాడు పత్రిక ద్వారా చెప్పిస్తున్నారు. ఎవరెవరి మీద అక్రమ కేసు పెట్టాలి... ఎవరెవర్ని విచారణకు పిలవాలి... వారిని ఏఏ ప్రశ్నలు అడగాలి... ఎప్పుడెప్పుడు అరెస్టు చేయాలి అన్నవి ముందుగా ఈనాడు పత్రికలో ప్రచురితమవుతాయి. సిట్ అదే పనిని తు.చ. తప్పకుండా చేస్తోంది. న్యాయస్థానంలో దాఖలు చేసిన చార్జ్‌షీట్‌పై సిట్‌కు ఎలాంటి నియంత్రణ ఉండకూడదు. అది న్యాయస్థానం పరిధిలోని అంశం. ఆ చార్జ్‌షీట్‌ను స్వీకరించినట్టు ప్రకటించిన తరువాతే ఎవరైనా న్యాయస్థానం ద్వారా అధికారికంగా కాపీని తీసుకోవచ్చు. కానీ, న్యాయస్థానం స్వీకరించినట్టు ప్రకటించకముందే చార్జ్‌షీట్ ఎల్లో మీడియాకు చేరిపోతోంది. అంటే కోర్టు కంటే ఎల్లో మీడియాకే తమ ప్రాధాన్యం అని చంద్రబాబు ప్రభుత్వం, సిట్ బరితెగించి ప్రకటిస్తున్నాయి.

రాజ్ కేసిరెడ్డి.. లోకేశ్ బినామీ కేశినేని చిన్ని భాగస్వామి

ఈ మొత్తం భేతాళ కుట్ర కథకు చంద్రబాబు ప్రధాన ఆధారంగా చేసుకున్నది రాజ్ కేసిరెడ్డినే. ఇంతకీ ఈ రాజ్ కేసిరెడ్డి ఎవరో తెలుసా...? నారా లోకేశ్ బినామీగా ఉన్న విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)కు వ్యాపార భాగస్వామి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉండగానే అంటే 2021లోనే రాజ్ కేసిరెడ్డి కేశినేని చిన్నితో భాగస్వామిగా వ్యాపారాలు నిర్వహించారు. చిన్ని లోకేశ్ బినామీ అన్నది బహిరంగ రహస్యమే. రాజ్ కేసిరెడ్డికి చెందిన 'ప్రైడే ఇన్‌ఫ్రాకాన్ ఎల్‌ఎల్‌పీ'లో కేశినేని చిన్ని దంపతులు వాటాదారులుగా ఉన్నారు. అక్రమంగా నిధులు తరలించారని సిట్ అధికారులు చెబుతున్న ఇషన్వీ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్, ప్రైడే ఇన్‌ఫ్రా ఎల్‌ఎల్‌పీ హైదరాబాద్‌లోని ఒకే చిరునామాతో (జూబ్లీహిల్స్, సర్వే నంబర్ 403, ప్లాట్ నంబర్ 9)తో రిజిస్టర్ అయ్యాయి. అంతేకాదు ఆ రెండు కంపెనీలు ఒకే మెయిల్ ఐడీ (accounts@wshanviinfraprojects.com)నే ఉపయోగిస్తుండడం గమనార్హం. కేశినేని చిన్ని ఏకంగా 12 రియల్ ఎస్టేట్, విదేశీ కంపెనీల ద్వారా భారీగా నల్లధనాన్ని అమెరికా, దుబాయ్ తరలించి పెట్టుబడులు పెట్టారు.

- కేశినేని చిన్ని మంత్రి లోకేశ్‌కు అత్యంత సన్నిహితుడే కాక బినామీ కావడంతో పట్టుబట్టి మరీ ఆయనకు విజయవాడ ఎంపీ టికెట్ ఇప్పించారు. అనంతరం ఆంధ్రా క్రికెట్ అసోషియేషన్ అధ్యక్షుడిని చేశారు. ఇక కేశినేని చిన్ని బినామీ కంపెనీ ఉర్సా ఐటీ సొల్యూషన్స్‌కు విశాఖపట్నంలో అత్యంత విలువైన 60 ఎకరాలను కారుచౌకగా కట్టబెట్టారు. కేశినేని చిన్ని ముసుగులో లోకేశ్ ఇలా దోపిడీకి పాల్పడుతున్నారు. అటువంటి కేశినేని చిన్నితో రాజ్ కేసిరెడ్డి వ్యాపార భాగస్వామి. అంటే బినామీ దందా ముసుగు తొలగిస్తే లోకేశ్, రాజ్ కేసిరెడ్డి వ్యాపార భాగస్వాములు అన్నది స్పష్టమవుతోంది. అలాంటి రాజ్ కేసిరెడ్డి మాజీ సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వంలో మద్యం కుంభకోణానికి పాల్పడ్డారని సిట్ నమోదు చేసిన అభియోగం పూర్తిగా అవాస్తవమే అన్నది నిగ్గు తేలుతోంది. దీనిపై అటు చంద్రబాబుగానీ ఇటు సిట్‌గానీ స్పందించకుండా మౌనం వహించడం అంటే ఆ వాస్తవాన్ని పరోక్షంగా అంగీకరిస్తున్నట్టే.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

సినీ తారలకు ఈడీ పిలుపు

బెట్టింగ్ యాప్‌ల ప్రమోషన్‌లో పాల్గొన్న రానా దగ్గుబాటి, విజయ్ దేవరకొండ, ప్రకాశ్‌రాజ్, మంచు లక్ష్మికి నోటీసులు

సాక్షి, హైదరాబాద్: ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేసిన కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దర్యాప్తు ముమ్మరం చేసింది. ఈ యాప్‌లను ప్రమోట్ చేసిన సెలబ్రిటీలను విచారించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. తేదీల వారీగా సినీతారలకు విచారణకు షెడ్యూల్ ఖరారు చేసింది. ఈ మేరకు రానా దగ్గుబాటి, ప్రకాశ్‌రాజ్, విజయ్ దేవరకొండ, మంచులక్ష్మిలకు వేర్వేరుగా సోమవారం సమన్లు జారీ చేసింది. బుధవారం రానా దగ్గుబాటి, ఈ నెల 30న ప్రకాశ్‌రాజ్, ఆగస్టు 6న విజయ్ దేవరకొండ, 13న మంచు లక్ష్మిలను విచారణకు హాజరుకావాలని సమన్లలో పేర్కొంది. బెట్టింగ్ యాప్‌లకు ప్రమోషన్ చేయడంలో వారి పాత్ర..ఇందుకు సంబంధించి ఆయా సంస్థలతో కుదుర్చుకున్న ఒప్పందాలు..తీసుకున్న పారితోషికాల వివరాలు, అందుకు సంబంధించి బ్యాంకు లావాదేవీలు, ఇతర డాక్యుమెంట్లను వెంట తీసుకురావాలని సమన్లలో ఈడీ అధికారులు సూచించారు. బషీర్‌బాగ్‌లోని ఈడీ జోనల్ ఆఫీసులో హాజరుకావాలన్నారు.

- సైబరాబాద్, సూర్యాపేట, పంజగుట్ట, మియాపూర్, విశాఖపట్నంలో లోన్ యాప్‌లపై నమోదైన వేర్వేరు ఎఫ్‌ఐఆర్‌ల ఆధారంగా ఈడీ ఎన్‌ఫోర్స్‌మెంట్ కేస్ ఇన్ఫర్మేషన్ రిపోర్ట్ (ఈసీఐఆర్) రిజిస్టర్ చేసిన విషయం తెలిసిందే. లోన్ యాప్‌లకు ప్రచారకర్తలుగా వ్యవహరించిన నటులు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లు, సినీహీరోలు విజయ్ దేవరకొండ, రానా దగ్గుబాటి సహా మొత్తం 29 మందిని ఈసీఐఆర్‌లో చేర్చింది. ఈ క్రమంలోనే విచారించేందుకు ఈడీ అధికారులు సిద్ధమవుతున్నారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

శ్రీవారి దర్శనానికి 14 గంటలు

తిరుమల: తిరుమలలో సోమవారం భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లోని అన్ని కంపార్ట్‌మెంట్లు నిండాయి. క్యూలైన్ నారాయణగిరి చెట్ల వద్దకు చేరుకుంది. ఆదివారం అర్ధరాత్రి వరకు 87,138 మంది స్వామిని దర్శించుకున్నారు. 30,099 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.33 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని వారికి 14 గంటలు పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉండగా సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. ముందుగా వెళ్లిన వారిని లోనికి అనుమతించరని స్పష్టం చేసింది.

ఎస్వీయూ సైన్స్ కళాశాలకు ఎన్‌పీటీఈఎల్ ప్రశంసలు

తిరుపతి సిటీ: జాతీయ విద్యా విధానం -2020లో భాగంగా వర్సిటీలో విద్యార్థులు స్వయంగా ఆన్‌లైన్ ద్వారా శిక్షణ పొందే కోర్సులను ‘స్వయం’ రూపొందించిన విషయం తెలిసిందే. ఈ కోర్సుల రూపకల్పన, బోధనలో ఐఐటీ, ఎన్ఐటీ, కేంద్రీయ విశ్వవిద్యాలయాలు కీలక భూమిక పోషిస్తున్నాయి. ఇందులో భాగంగా ఎస్వీయూ పీజీ కోర్సుల్లో స్వయం కోర్సులను ప్రవేశపెట్టింది. 2025 జనవరి – ఏప్రిల్ సెమిస్టర్లలో వర్సిటీ సైన్స్ కళాశాల గణిత విభాగానికి చెందిన ఆచార్య భారతి కీలక భూమిక పోషించారు. ఈ సందర్భంగా ఆమెను ప్రశ్నిస్తూ ఎన్‌పీటీఈఎల్ సంస్థ ప్రశంసా పత్రాలు పంపింది. ఈ సందర్భంగా వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పద్మావతి ఆమెను అభినందించారు.

ఆకట్టుకున్న అభినయ ఆర్ట్స్ నాటకోత్సవాలు

తిరుపతి కల్చరల్: అభినయ ఆర్ట్స్ జాతీయ నాటక పోటీల్లో భాగంగా తిరుపతిలోని మహతి కళాక్షేత్రంలో సోమవారం ప్రదర్శించిన శాస్త్రీయ, జానపద నృత్యాలు, పౌరాణిక, సాంఘిక నాటికలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఇందులో భాగంగా ఉదయం 10 నుంచి 12 గంటల వరకు జరిగిన శాస్త్రీయ, జానపద బృంద నృత్య పోటీల్లో వివిధ ప్రాంతాలకు చెందిన కళాకారులు పాల్గొని, తమదైన శైలిలో చక్కటి హావభావాలు, అభినయంతో నృత్య ప్రదర్శనలతో సభికులను అలరింపజేశారు. అనంతరం ఖమ్మం నగరానికి చెందిన శ్రీభక్తరామదాసు కళామండలి వారు ప్రదర్శించిన ‘విష్ణు వర్ధనుడు’ పౌరాణిక పద్యనాటకం ప్రేక్షకుల హృదయాలను రంజింపజేసింది. రాత్రి ఏలూరు హేలాపురి కల్చరల్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో ప్రదర్శించిన ‘సారీ రాంగ్ నంబర్’ సాంఘిక నాటిక ఆద్యంతం అబ్బురపరిచింది. ఈ సందర్భంగా కళాకారులను అభినయ ఆర్ట్ కార్యదర్శి బీఎస్.రెడ్డి, సంస్థ ప్రతినిధులతో కలిసి జ్ఞాపికలతో ఘనంగా సత్కరించి అభినందించారు.

ఉద్యానానికి నైరుతి ఊతం

కూరగాయల సాగుకు రైతులు సమాయత్తం

- రాయితీపై విత్తనాల కోసం ఎదురుచూపు
- విత్తన శుద్ధితో మేలైన దిగుబడులు
- సూచనలు పాటించాలంటున్న అధికారులు



విరగకాసిన టమోటా



బడుగువానిలంకలో వంకాయలు కోస్తున్న రైతులు



ఏపుగా పెరిగిన పచ్చి మిరప

అలమూరు: వాతావరణ పరిస్థితులతో ఇప్పటి వరకూ వేసవి తీవ్రతను మించి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో ఉద్యాన రైతులు కూరగాయల సాగుకు ధైర్యం చేయలేదు. నైరుతి రుతు పవనాల ప్రభావం, బంగాళఖాతంలో అల్పపీడన ద్రోణి కారణాలతో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించడంతో రైతుల్లో ఆశలు చిగురించి ఉద్యాన పంటల సాగుకు సమాయత్తమవుతున్నారు. ఉష్ణ వాతావరణాన్ని తట్టుకోవడంతో పాటు నీటిని నిల్వ చేసుకునే సామర్థ్యం ఉన్న లంక మట్టి నేలలు కూరగాయల సాగుకు అనుకూలం. ఉద్యాన శాఖ సూచనలకు అనుగుణంగా యాజమాన్య పద్ధతులు, మెళకువలు పాటిస్తే తక్కువ పెట్టుబడితో అధిగ దిగుబడులు సాధించవచ్చు. ఈ సమయంలో ఏయే పంటలు సాగు చేయవచ్చు, విత్తనాల కొనుగోలు, తెగుళ్ల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలను వ్యవసాయ శాస్త్రవేత్తలు వివరిస్తున్నారు.

హెక్టారుకు రూ. 3 వేల రాయితీ

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో సుమారు 3.75 లక్షల హెక్టార్లలో ఉద్యాన పంటలు సాగుచేస్తుండగా కేవలం 38 వేల ఎకరాల్లో మాత్రమే కూరగాయలు సాగు చేస్తున్నట్లు ఉద్యానశాఖ గణాంకాలు చెబుతున్నాయి. కూరగాయల సాగును ప్రోత్సహించేందుకు ఉద్యానశాఖ మేలైన విత్తనాల కొనుగోలుకు హెక్టారుకు రూ.మూడు వేల వరకు రాయితీపై అందజేస్తోంది. కూరగాయల రైతు విత్తనాలు కొనుగోలు చేసిన రశీదుతో పాటు కూరగాయల సాగు చేస్తున్న భూమి వివరాలతో కూడిన దరఖాస్తులను గ్రామ ఉద్యాన శాఖ అసిస్టెంట్ల ద్వారా జిల్లా కార్యాలయాలకు పంపించాలి. దీంతో సంబంధిత జిల్లా కార్యాలయాలైన కాకినాడ, రాజమహేంద్రవరం, అమలాపురం కేంద్రాల్లో డీహెచ్ఓలు పరిశీలిస్తారు. అనంతరం విత్తనాల రాయితీ సొమ్ము నేరుగా రైతు ఖాతాలోకే జమవుతుంది. వంగ, క్యాబేజీ, కాలీఫ్లవర్ నారును ఉద్యానశాఖ సూచనల మేరకు రైతులే తయారు చేసుకుంటే పెట్టుబడి ఆదా అవుతుంది.

విత్తే ముందు జాగ్రత్తలు ఇలా..

కూరగాయల సాగుకు తొలుత విత్తన శుద్ధి తప్పనిసరి. కిలో విత్తనానికి మూడు గ్రాముల థైరమ్, ఐదు గ్రాముల ఇమిడా క్రోఫిన్ మందును ఒక దాని తరువాత మరొకటి కలిపి విత్తన శుద్ధి చేస్తే కూరగాయ మొక్కలకు తెగుళ్లను తట్టుకునే శక్తి ఉంటుంది. విత్తే ముందు ఎకరానికి ఆరు టన్నుల పశువుల ఎరువు, 35 కిలోల భాస్వరం, 18 కిలోల పొటాష్ మిశ్రమాన్ని విత్తన గుంటల్లో వేయాలి. విత్తిన 25 నుంచి 30 రోజుల్లో లేదా పిందె దశలో సుమారు 30 కిలోల నత్రజనిని రెండు సమపాళ్లుగా చేసి మొక్కలకు అందించాలి. కూరగాయల సాగు వేయాలని నిర్ణయం తీసుకుంటే ముందుగా వేసవిలోనే దుక్కి దున్ని ఉంచుకుంటే మంచి ఫలితం ఉంటుంది. కలుపు మొక్కలు లేకుండా ఉద్యాన రైతులు ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలి.

ఈ రకాలైతే మేలైన ఉత్పత్తి

జూలై నుంచి సెప్టెంబర్ వరకూ పందిరి కూరగాయలైన సొర, బీర, ఆనప, కాకర, పొట్ల, దోస, గుమ్మడి, బూడిద గుమ్మడితో పాటు వంగ, బెండ, టమోటా తదితర రకాలను సాగు చేసి అధిక దిగుబడులను సాధించవచ్చు. అన్ని సీజన్లలో వివిధ వాతావరణ పరిస్థితులను తట్టుకునే దొండ సాగును ఏడాది పొడవునా సాగు చేసుకునే అవకాశం ఉంది. ఆనప, బీర, పొట్ల, కాకర పంటను పందిరిపై పెంచితే మంచి నాణ్యత కలిగిన దిగుబడి వచ్చి అధిక లాభాలు పొందే అవకాశం ఉంటుంది. మెట్ట ప్రాంతంలో మొక్కజొన్న, కర్ర పెండలం, డెల్టా ప్రాంతంలో వాణిజ్య పంటలకు అనుకూలంగా ఉంటుంది.


సాగులో సంభవించే తెగుళ్లు ఇవీ

కూరగాయల సాగులో సాధారణంగా ఏటా గుమ్మడి పండు పురుగు, పొట్లాకు పురుగు, పండు ఈగ, బూజు తెగులు, బూడిద తెగులు, రసం పీల్చే పురుగు, పాముపొడ పురుగు, ఆకుపచ్చ తెగులు సంభవిస్తుంటాయి. ఉద్యాన శాఖ పర్యవేక్షణలో అధికారుల సలహా మేరకు సరైన సస్యరక్షణ చర్యలు తీసుకుని కూరగాయల పంటను సాగుచేస్తే సత్ఫలితాలు వచ్చే అవకాశం ఉందని అధికారులు చెప్తున్నారు. పరిమితంగా పురుగు మందులను వినియోగిస్తూ సంప్రదాయబద్ధంగా తయారు చేసుకునే ఎరువులను వినియోగిస్తే తెగుళ్ల బెడద చాలా వరకూ తగ్గుతుంది. తీగజాతి కూరగాయల సాగుపై రైతులు దృష్టి సారిస్తే తెగుళ్ల బెడద తక్కువగా ఉంటుంది.

మన్యంలో సీతాఫలాలు వచ్చేశాయ్..!

- రెండు వేల ఎకరాల్లో సాగు
- కావిడ ధర రూ.800ల పైనే..
- మైదాన ప్రాంతాల్లో డిమాండ్

మన్యంలో గిరిజన ఉత్పత్తుల్లో ముఖ్యమైన ఫలాలు ఒకదాని తరువాత ఒకటి మార్కెట్‌లోకి అందుబాటులోకి వస్తున్నాయి. నిన్నటి వరకు పైనాపిల్ దిగుబడులు వచ్చి ముంచెత్తగా... తాజాగా మధుర ఫలాలుగా చెప్పుకునే సీతాఫలాలు మార్కెట్‌లోకి వచ్చాయి. ఈ ఏడాది దిగుబడులు బాగానే ఉన్నా.. ధరలు ఎలా ఉంటాయోనని గిరిజనులు ఆందోళన చెందుతున్నారు. దిగుబడులకు సరిపడేటట్టు ధరలు కూడా బాగుంటే తమ వ్యవసాయ పెట్టుబడులకు ఇవి చేదోడుగా ఉంటాయని గిరిజన రైతులు పేర్కొంటున్నారు. ఇక వీటి ధరలు దళారీలపైనే ఆధారపడి ఉంటాయని మరో వైపు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.





వ్యాపారులు కొనుగోలు చేసి ట్రేలలో సర్దుతున్న సీతాఫలాలు

సీతంపేట: మధుర ఫలాలుగా పిలవబడే సీతాఫలాల సీజన్ పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట ఏజెన్సీలో ఆరంభమైంది. ఈ ఏడాది దిగుబడులు కూడా అధికంగా ఉంటాయని గిరిజనులు ఆశతో ఉన్నారు. అదే సమయంలో మద్దతు ధరలు ఎలా ఉంటాయోనని ఆందోళన చెందుతున్నారు. ఆదివారం సీతంపేట మార్కెట్లోకి సీతాఫలాలు గిరిజన రైతులు తీసుకువచ్చారు. కావిడ సీతాఫలాలు రూ.800ల నుంచి రూ.1000ల వరకు విక్రయించారు. గతేడాది సీజన్ ఆరంభంలో ఇవే ధరలకు అమ్మకాలు జరిపామని గిరిజనులు చెబుతున్నారు. ఇప్పుడు ప్రారంభమైన సీజన్ అక్టోబరు మొదటి వారంతో ముగుస్తుంది. గిరిజనులకు పైనాపిల్ తర్వాత అత్యధిక ఆదాయాన్ని తెచ్చే పంట సీతాఫలాలు. ఈ ఏడాది పైనాపిల్ పండ్లతో నష్టాలు చవిచూసిన మన్యంలోని గిరిజనులు సీతాఫలంలోనైనా ఆదాయాలు వస్తాయేమోనని ఆశతో ఉన్నారు. ఒడిశా, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం తదితర ప్రాంతాల నుంచి వచ్చిన వ్యాపారులు ఇక్కడ సీతాఫలాలను కావిళ్ల రూపంలో కొనుగోలు చేస్తారు. ఆయా ప్రాంతాల్లో వారు కిలోల వంతున విక్రయించి లాభాలను ఆర్జిస్తారు. ఇక్కడ కిలో సరాసరి రూ.20 వరకు కొనుగోలు చేసిన వ్యాపారులు మైదాన ప్రాంతాల్లో రూ.60 నుంచి 80 వరకు విక్రయిస్తారు. కొంత మంది సీజన్ ఆరంభంలోనే గ్రామాల్లోకి వెళ్లి అడ్వాన్సులు ఇచ్చి కొనుగోలు చేస్తారు.

2 వేల ఎకరాల్లో సాగు

సీతంపేట ఏజెన్సీలో కొండపోడు వ్యవసాయంలో భాగంగా దాదాపు 2 వేల ఎకరాల్లో సీతాఫలం పంట సాగవుతుంది. సుమారు 500ల టన్నుల వరకు దిగుబడి వస్తుంది. ఖరీఫ్ సీజన్లో వరిలో పెట్టుబడులు పెట్టడానికి ఈ పంట ఎంతో దోహద పడుతుందని గిరిజనులు చెబుతున్నారు. గతేడాది మొదట్లో ఇదే ధరలు ఉన్నప్పటికీ మధ్యలో ధరలు తగ్గిపోయాయి. గిరిజనులు నిల్వ చేసుకోవడానికి వీలుకాని పండ్ల జాతిలో సీతాఫలం ఒకటి. చెట్టు నుంచి రెండు, మూడు రోజుల్లో విక్రయించకపోతే పండు కుళ్లిపోతుంది. ఆది, సోమవారాల్లో సీతంపేట, బుధవారం మర్రిపాడు, శనివారం పొల్ల, కుశిమి, గురువారం దోనుబాయిలలో జరిగే వారపు సంతల్లో వీటిని విక్రయిస్తారు. దళారుల తీరుపైనే వీటి ధర ఆధారపడి ఉంటుందని గిరిజనులు వాపోతున్నారు. దళారులు సిండికేట్‌గా మారితే తమకు నష్టాలు తప్పవని లేకుంటే ఆశించిన ఆదాయం సమకూరుతుందని పేర్కొంటున్నారు.

దిగుబడి ఉన్నా ధరలు ఏవి..?



సీతాఫలాల దిగుబడి ఉన్నా ధరలు ఎంత వరకు నిలబడతాయో తెలీదు. గతంలో సీతాఫలం పండించే కుటుంబాల్లో ఒక్కొక్కరు రూ.10 వేల వరకు ఆదాయం సంపాదించే వారు. ఇప్పుడు ఎలా ఉంటుందో తెలియడం లేదు. వ్యవసాయ పెట్టుబడులకు డబ్బులు లేని పరిస్థితి ఉంది. వీటి ద్వారా మంచిగా ఆదాయం సమకూరితే పెట్టుబడులకు ఇబ్బందులు ఉండవు.
– ఎస్.సురేష్, బుడగరాయి

ఏటా నష్టాలు..



సీతాఫలాల దిగుబడులు బాగున్నా.. ధర లేక ప్రతీ ఏటా నష్టాలు తప్పడం లేదు. సీజన్ ఆరంభంలో సరైన ధరలు పలుకుతాయి. మధ్యలో ధరలు పడిపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ప్రభుత్వ పరంగా మద్దతు ధరలు కల్పిస్తే బాగుంటుంది.
– ఎస్.లక్ష్మి, అక్కన్నగూడ



చోరీలు.. దోపిడీలు.. హత్యలు.. లైంగిక దాడులు.. గంజాయి బ్యాచ్‌ల గ్యాంగ్ వార్‌లు.. మాదక ద్రవ్యాల మత్తులో యువకుల ఘర్షణలు.. ఇలా వరుస ఘటనలతో విశాఖ వణికిపోతోంది. ప్రశాంత నగరంలో రోజూ ఎక్కడో చోట హింసాత్మక సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. కూటమి ప్రభుత్వంలో రౌడీషీటర్లు, నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. నడిరోడ్డు మీదే కత్తులతో తెగబడుతున్నారు. హత్యలకు పూనుకుంటున్నారు. గంజాయి బ్యాచ్ గ్యాంగ్ వార్‌లతో అలజడి సృష్టిస్తున్నారు. ఫలితంగా సిటీ ఆఫ్ డెస్టినీగా గుర్తింపు పొందిన విశాఖ.. ఇప్పుడు సిటీ ఆఫ్ క్రైమ్‌గా మారిపోతోంది. ఇందుకు ఇటీవల జరిగిన హత్యలు, దాడులు, చోరీ ఘటనలే నిదర్శనం. – విశాఖ సిటీ



ఎటుపోతోంది విశాఖ?

వరుస హత్యలతో వణికిపోతున్న నగరం

- కూటమి పాలనలో క్రైమ్ రాజధానిగా వైజాగ్?
- పెట్రేగిపోతున్న నేరగాళ్లు
- హత్యలు, గ్యాంగ్ వార్‌లతో అలజడులు
- విచ్చలవిడిగా గంజాయి, డ్రగ్స్ దందాలు



హత్యకు గురైన రౌడీషీటర్ లోహిత్(ఫైల్)

ప్రకృతి అందాలతో అలరారే ప్రశాంత విశాఖలో నేడు రక్తపుటేర్లు పారుతున్నాయి. వరుస హత్యలతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. గత రెండు వారాల్లో మూడు హత్యలు జరగడం కలకలం రేపుతోంది. ఈ ఆరు నెలల కాలంలో నగరంలో 12 హత్యలు చోటు చేసుకున్నాయి. వీరిలో ఏడుగురు మహిళలే బలవడం గమనార్హం.

- ఈ నెల 13న అర్ధరాత్రి వెంకటేశ్వరమెట్టకు చెందిన రౌడీషీటర్ చెట్టి ఎల్లాజీ అలియాస్ వట్టి (22) హత్యకు గురయ్యాడు. గొడవలు వద్దు.. సర్దుకుపోండి అన్నందుకు స్నేహితుడే అతడిని కత్తితో పొడిచి హతమార్చాడు.
- ఈ నెల 8న అర్ధరాత్రి పాత కక్షలతో పెందుర్తి పరిధి పులగానిపాలానికి చెందిన రౌడీషీటర్ మాసపు లోహిత్ (20) అలియాస్ నానిని అతడి స్నేహితులే పక్కా ప్లాన్ వేసి చంపేశారు. మాధవధార కుంచుమాంబ అమ్మవారి పండగలో నడిరోడ్డుపై అందరూ చూస్తుండగానే కత్తులతో దాడి చేసి హత్య చేశారు.
- ఈ నెల 6న కొబ్బరితోటకు చెందిన కనకరాజు(32) అనుమానాస్పద మృతి స్థానికంగా కలకలం రేపింది. మద్యం సేవించి కింద పడటంతో తల వెనుక బలమైన గాయం తగలడంతో మరణించినట్లు ప్రాథమికంగా గుర్తించామని పోలీసులు చెబుతుండగా.. ఇది హత్యేనని బంధువులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.
- ఈ నెల 1న జ్ఞానాపురం శ్మశానవాటికలో అల్లిపురం ప్రాంతానికి చెందిన రౌడీషీటర్ నాగమణి ఎల్లాజీ(35) హత్యకు గురయ్యాడు. శ్మశాన వాటిక సిబ్బందిని బెదిరించిన ఘటనలో ఒకరు చేతిలో ఉన్న గెడ్డపారతో ఎల్లాజీ తలపై బలంగా కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.

మహిళలకు రక్షణ కరువు

ఒక్క రోజులో డెలివరీ కాబోయే భార్యను అత్యంత పాశవికంగా గొంతు నులిమి చంపేసిన భర్త.. డబ్బు కోసం వృద్ధ దంపతులపై కత్తితో దాడి చేసి వివాహిత మెడ కోసి మంగళసూత్రాన్ని ఎత్తుకుపోయిన ఆగంతకుడు.. పెళ్లికి అంగీకరించలేదని ప్రియురాలు, ఆమె తల్లి గొంతు కోసిన ప్రియుడు.. దాకమర్రి ఫార్చ్యూన్ లేఅవుట్‌లో మహిళను హత్య చేసి పెట్రోల్ పోసి తగలబెట్టిన ప్రియుడు.. ఆన్‌లైన్ గేమ్స్ ఆడొద్దని వారించిన తల్లిని కొట్టి చంపిన కొడుకు.. ఇలా విశాఖలో వరుసగా మహిళలు హత్యకు గురవుతూనే ఉన్నారు. మహిళల రక్షణే తమ ప్రధాన లక్ష్యమని చెప్పుకొచ్చిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, హోంమంత్రి అనితలు విశాఖలో పరిస్థితులపై కనీసం దృష్టి పెట్టిన దాఖలాలు లేవు. మహిళలపై జరుగుతున్న అకృత్యాలపై నోరు మెదపడం లేదు. పట్టపగలే మహిళలపై దాడులకు తెగబడుతున్నా.. కూటమి ప్రభుత్వానికి పట్టడం లేదు. ఈ ఘటనలు విశాఖ ఆర్థిక రాజధానిగా కాకుండా నేర రాజధానిగా మారుతోందన్న వార్తలకు బలాన్నిస్తున్నాయి.

డ్రగ్స్ కలకలం



కూటమి ప్రభుత్వంలో విశాఖ గంజాయికే కాకుండా డ్రగ్స్ కూడా అడ్డాగా మారిపోయింది. అందుకు ఇటీవల జరిగిన కొకైన్ వ్యవహారమే నిదర్శనం. ఢిల్లీ నుంచి కొకైన్‌ను విశాఖకు తీసుకొచ్చిన గ్యాంగ్‌ను పోలీసులు అరెస్టు చేయడం సంచలనం రేపింది. అయితే ఈ డ్రగ్స్ వ్యవహారంలో పలువురి కూటమి నేతల పాత్ర ఉందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రధాన నిందితుడు అక్షయ్ కుమార్‌తో పాటు నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కానీ వీరిలో కేవలం ఇద్దరిని మాత్రమే అరెస్టు చూపించారు. మిగిలిన ఇద్దరిని వదిలేయడం ఇపుడు అనేక అనుమానాలకు తావిస్తోంది. వీరిని అరెస్టు చేయకుండా కూటమి ప్రజాప్రతినిధులపై పోలీసులపై తీవ్ర ఒత్తిళ్లు తీసుకువచ్చినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం డ్రగ్స్ సరఫరాదారుడు ఢిల్లీలో ఉంటే ప్రిన్స్ అనే కింగ్‌పిన్ కోసం పోలీసుల ప్రత్యేక బృందాలు అక్కడకు వెళ్లాయి. కానీ ఇప్పటి వరకు అతడి ఆచూకీ లభించిలేనట్లు తెలుస్తోంది.

గంజాయి బ్యాచ్‌ల గ్యాంగ్‌వార్



గంజాయి బ్యాచ్ దాడిలో గాయపడ్డ జీవన్(ఫైల్)

కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత గంజాయి బ్యాచ్‌లు ప్రజలను భయ భ్రాంతులకు గురి చేస్తున్నాయి. గంజాయి నిర్మూలనకు వంద రోజుల ప్రణాళిక పేరుతో రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత హడావుడి చేశారు. కానీ నగరంలో గంజాయి నిర్మూలన జరగకపోగా.. వినియోగం పెరిగిపోయింది. ఏజెన్సీలో జరిగే గంజాయి సాగుపై గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. పంటలను పూర్తిగా ధ్వంసం చేసింది. కానీ కూటమి ప్రభుత్వంలో నగరం నడిబొడ్డులోనే గంజాయి మొక్కలు దర్శనమివ్వడం సంచలనం రేపింది. కొద్ది నెలల కిందట ఆంధ్రా మెడికల్ కాలేజీ వెనుక గంజాయి మొక్కలను గుర్తించగా.. తాజాగా వారం కిందట జ్ఞానాపురంలో ఒక పాడుబడిన ఇంట్లో గంజాయిని సాగు చేస్తున్న విషయం బయటపడింది. ఇలా కూటమి ప్రభుత్వంలో గంజాయి సాగు నగరానికి పాకింది. గంజాయి వినియోగం సైతం విపరీతంగా పెరిగింది. గంజాయి మత్తులో యువకులు నిత్యం దాడులు, దోపిడీలతో అమాయకులపై తెగబడుతూనే ఉన్నారు. ఇటీవల కాలంలో గ్యాంగ్ వార్‌లు విపరీతంగా పెరిగిపోయాయి.

- ఈ నెల 6న అర్ధరాత్రి తమను అవమానకరంగా మాట్లాడి వేధిస్తున్నారన్న కక్షతో ఓ వర్గం.. కొత్తపాలెం ప్రధాన రహదారి గవర రామాలయం వద్ద నలుగురిపై దాడి చేసి గాయపరిచింది.
- ఈ నెల 14వ తేదీ అర్ధరాత్రి రైల్వే గ్రౌండ్ వద్ద రెండు గ్యాంగ్‌లు కొట్లాటకు దిగాయి. రాళ్లతో దాడులు చేసుకున్నాయి. ఇందులో ఇద్దరు గాయపడగా వారికి కేజీహెచ్‌లో చికిత్స అందించారు.
- ఈ నెల 15వ తేదీ అర్ధరాత్రి గాజువాకలో జీవన్ అనే వ్యక్తిపై 11 మంది యువకులు బీరు బాటిళ్లతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు.

పక్కదారి పడుతున్న రసాయనిక ఎరువులపై నిఘా

వ్యవసాయశాఖ డైరెక్టర్ డిల్లీరావు

సాక్షి, అమరావతి: రైతుల పంట ఉత్పత్తుల కోసం రాయితీపై అందిస్తున్న యూరియా దేశం మొత్తం మీద పక్క దారి పడుతున్నట్లు కేంద్ర ఇంటెలిజెన్స్ సంస్థ తెలిపిందని వ్యవసాయ శాఖ డైరెక్టర్ సేనాపతి డిల్లీరావు వెల్లడించారు. యూరియాను ఆక్వా చేపల రైతులకు, పశు దాణా పరిశ్రమలకు, నాటు సారా తయారీకి, ప్లాస్టిక్, ప్లేవుడ్, రసాయనిక పరిశ్రమలకు, పాల కల్తీకి, అమ్మోనియం నైట్రేట్ వంటి పేలుడు పదార్థాల తయారీకి, ఇతర వ్యవసాయేతర అవసరాలకు వినియోగిస్తున్నట్లు నిఘా సంస్థలు గుర్తించినట్లు పేర్కొన్నారు. దీంతో రైతులకు యూరియా సరఫరాలో కొరత ఏర్పడుతుందన్నారు. సాగుకు ఉపయోగించే ఎరువులను వ్యవసాయేతర పారిశ్రామిక అవసరాలకు దారి మళ్లకుండా ప్రత్యేక నిఘా పెట్టాలని సూచించారు. ఏటా యూరియా వినియోగం 20 శాతం పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోందన్నారు. భూసారాన్ని పెంచే జీవన, నానో ఎరువుల వినియోగాన్ని పెంచేలా రైతులకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. అందుకు సంబంధించిన పోస్టర్లను సోమవారం ఆయన ఆవిష్కరించారు.

ఆరు కేజీల గంజాయి అక్రమరవాణా

ఇద్దరు నిందితుల అరెస్ట్

నెల్లూరు (క్రైమ్): గంజాయిని అక్రమంగా తరలిస్తున్న ఇద్దరు నిందితులను ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సోమవారం అరెస్ట్ చేశారు. వారి నుంచి ఆరు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సోమవారం నెల్లూరు ఆర్టీసీ ప్రధాన బస్టాండ్‌లో తనిఖీలు నిర్వహించారు. ఓ బస్సులో అనుమానాస్పదంగా ఉన్న తమిళనాడు రాష్ట్రం దుండిగల్ జిల్లాకు చెందిన కన్నదాసన్, రాజేశ్వరన్‌లను అదుపులోకి తీసుకుని, వారి బ్యాగ్‌లను తనిఖీ చేశారు. అందులో ఉన్న ఆరు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను విచారించగా కాకినాడ జిల్లా తునికి చెందిన సతీష్ వద్ద గంజాయి కొనుగోలు చేసి తమ ప్రాంతంలో విక్రయించేందుకు తీసుకెళుతున్నట్లు వెల్లడించడంతో కేసు నమోదు చేశారు. కన్నదాసన్, రాజేశ్వరన్‌లను అరెస్ట్ చేయగా, సతీష్‌ను అరెస్ట్ చేయాల్సి ఉంది.

హెల్త్
సాక్షి ప్లస్
మంగళవారం ॥ 22-7-2025

● మనపై వాతావ‘రణం’

జుట్టు రాలిపోయే... స్కిన్ పాలిపోయే!



మన దేహంలోని అంతర్గత అవయవాలను కాపాడేది చర్మం. మళ్లీ ఈ చర్మం తాలూకు రోమాంకురాల నుంచి పెరిగి... ఆ చర్మాన్నీ, దాంతోపాటు చాలావరకు దేహాన్ని కాపాడేవి వెంట్రుకలు. అయితే ఇటీవల వాహనాల కాలుష్యం, కర్మాగారాల నుంచి వెలువడే వ్యర్థాలు... ఇవన్నీ వాతావరణంలో కలిసిపోవడంతో ఇటు చర్మం మీదా, ఆపై కురుల మీదా దుష్ప్రభావాలు చూడటంతో వాటి తొలి ప్రభావం పడేది చర్మం మీదనే. తర్వాతి ప్రభావం జుట్టు మీద! కాలుష్యంతో పాటు నేరుగా పడే సూర్యకాంతి తీక్షణతకూ ఈ రెండూ ప్రభావితమవుతాయి. మన చుట్టూ ఉండే వాతావరణంలో దుమ్ము, ధూళి, సస్పెండెండ్ పార్టికిల్స్ కాలుష్యాల వంటి వాటితో చర్మంపైనా, దాంతో పాటు వెంట్రుకలు జుట్టు పడే దుష్ప్రభావాల నుంచి కాపాడుకోడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలుసుకుందాం.

చర్మం మన దేహాన్ని ఆవరించి ఉండే అతి పెద్ద అవయవం. ఇది శరీరంపై ఉండాల్సిన తేమను ఎప్పుడూ నియంత్రిస్తూ ఉంటుంది. కాలుష్య పదార్థాలు ఈ ప్రక్రియపై తీవ్రమైన ప్రభావం చూపిస్తూ ఉండటంతో క్రమంగా మేనిపై నుండే తేమ ఏ మేరకు ఉండాలో నియంత్రించే శక్తిని చర్మం క్రమంగా కోల్పోతుంది. ఫలితంగా చర్మం పొడి పొడిగా మారి, పొలుసులు (స్కేలీ)గా విచ్చుకుపోయే అవకాశముంది. ఎగ్జిమా వంటి అలర్జీ సంబంధమైన చర్మవ్యాధులున్న వారిలో ఆ ప్రభావం తీవ్రంగా ఉంటుంది. ఫలితంగా వాతావరణ కాలుష్యాల వల్ల చర్మం మరింతగా దురదలు పుడుతూ, ఎర్రబారే అవకాశం ఉంది. ట్రాఫిక్ కాలుష్యాల వల్ల ప్రధానంగా చర్మంపై అలర్జీలు వచ్చే అవకాశాలు ఎక్కువ అని ల్యాబరేటరీ పరిశోధనల్లో తేలింది. చిన్న పిల్లల చర్మంపై వీటి ప్రభావం మరింత ఎక్కువ.

ఎందుకిలా జరుగుతుందంటే...

● **మొదటి కారణం సీబమ్ స్రావం...**

వాతావరణంలో వేడి ఎక్కువ ఉన్న కారణంగా తేమ (హ్యూమిడ్) బాగా పెరిగినప్పుడు మన చర్మంపై ఉండే సబేషియస్ (ఒక రకమైన నూనెను స్రవించే) గ్రంథులు ఎక్కువగా పనిచేస్తాయి. దాంతో చర్మంపై మరింత చెమట, సీబమ్ (సబేషియస్ గ్రంథుల నుంచి స్రవించే నూనె) ఎక్కువగా ఉత్పత్తి అవుతాయి. అటు వాతావరణంలోనూ, ఇటు అత్యధిక ట్రాఫిక్ కారణంగా ఆటోమొబైల్ కాలుష్యంలో ఉండే అత్యంత సూక్ష్మమైన కాలుష్య పదార్థాలు చర్మంపై పడి సబేషియస్ గ్లాండ్ నుంచి మరింతగా సీబమ్ ఉత్పత్తి అయ్యేలా చేస్తాయి. దాంతో ఉష్ణోగ్రత ఎక్కువగా ఉండే నగరాల్లోని వాతావరణం కారణంగా చర్మం మరింతగా దుష్ప్రభావాలకు లోనయ్యే అవకాశం ఉంది.

● **వయసు పెరగడంతో వచ్చే మార్పులు త్వరితం కావడం...**

కాలుష్యం దుష్ప్రభావం కారణంగా ఏజింగ్ మరింత చురుగ్గా జరుగుతుంది. అంటే వయసు పెరగడం వల్ల చర్మంపైన కనిపించే వృద్ధాప్య లక్షణాలైన చర్మం ముడుతలు పడటం, చర్మంపై ఏజింగ్ మార్క్స్, రింకిల్స్, మచ్చలు రావడం వంటివి... రావాల్సిన టైమ్ కంటే ముందుగానే వస్తాయంటూ కొన్ని అధ్యయనాల్లో తేలింది. ఇందుకు కారణం... కాలుష్యం... చర్మం కణ సముదాయాల్లో (మాలెక్యూల్స్‌లో) వయసు పరంగా తెచ్చే మార్పులను చాలా త్వరగా వచ్చేలా చేయడమే.

● **వాతావరణంలోని కర్బన కాలుష్యాలతోనూ...**

ఇంధనం మండటంతో గాల్లోకి వెలువడే కర్బన కాలుష్య కణాలు (పొల్యూషన్ పార్టికిల్స్), పాలీ అరోమాటిక్ హైడ్రోకార్బన్స్ వంటివి కూడా వయసు మీద పడటం వల్ల చర్మంపై కనిపించే మార్పులను చాలా వేగవంతం చేస్తాయి. వాతావరణంలో, గాలిలో కార్బన్ కాలుష్యాలు ఎంత ఎక్కువగా ఉంటే వయసు మీదపడటంతో వచ్చే మార్పులు అంత ఎక్కువంటూ ఒక పరిశోధన తాలూకు ఫలితాలు ‘జర్నల్ ఆఫ్ ఇన్వెస్టిగేటివ్ డెర్మటాలజీ’ అనే సైన్స్ మ్యాగజైన్ / జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. చర్మంలో ఒక కణం మరొక కణంతో కలిసి ఉండేందుకు కొలాజెన్ తోడ్పడుతుంది. కాలుష్యాల వల్ల కొలాజెన్‌తో సమకూరే బంధం బలహీనమవుతుంది. అందుకే వృద్ధాప్యంలో వచ్చే ముడుతలు కాలుష్యం వల్ల చాలా త్వరగా / వేగంగా వస్తాయి.

● **అల్ట్రా వయొలెట్ కిరణాల ప్రభావంతో...**

చర్మంపై అల్ట్రా వయొలెట్ కిరణాల ప్రభావం చాలా ప్రతికూలంగా పడుతుందన్న విషయం తెలిసిందే. ట్రాఫిక్ కారణంగా గాలిలో కలుస్తున్న కాలుష్యాల ప్రభావంతో భూమి ఉపరితల వాతావరణంపై ఉండే ఓజోన్ పొర దెబ్బతింటోంది. ఫలితంగా ఓజోన్ పొరలో... చర్మానికి హానికరమైన అల్ట్రా వయొలెట్ కిరణాల వడపోత కూడా దెబ్బతింటోంది. దాంతో మునుపటి కంటే ఇప్పుడు అల్ట్రా వయొలెట్ కిరణాల తీవ్రత పెరగడం... దాని ఫలితంగా చర్మక్యాన్సర్, చర్మం నల్లబారడం (పిగ్మెంటేషన్) వంటి పరిణామాలూ ఎక్కువ కావడం వంటి పరిణామాలు చోటు చేసుకుంటున్నట్లుగా మరికొన్ని అధ్యయనాలూ, పరిశోధనల్లో తేలింది.


● **చర్మంపైనే కాకుండా... వెంట్రుకలూ, జుట్టుపైన కూడా...**

ట్రాఫిక్ కాలుష్య దుష్ప్రభావం కేవలం చర్మంపైనే గాక వెంట్రుకలూ, జుట్టుపైన కూడా పడుతోంది. కాలుష్యం కారణంగా వెంట్రుకలు రాలిపోవడమన్నది చాలా సాధారణంగా కనిపించే పరిణామం. ఇలా వెంట్రుకలు రాలిపోవడం అన్నది నగరీకరణ, పారిశ్రామికీకరణ ఎక్కువగా ఉన్నచోట్ల చాలా ఎక్కువగా కనిపిస్తుంది. పల్లెలు, ఓ మోస్తరు పట్టణాలతో పోలిస్తే పెద్ద పట్టణాలూ, నగరాల్లో కాలుష్యాలు మరింత ఎక్కువగా ఉండటమే ఇందుకు కారణం.

కాలుష్య ప్రభావం వెంట్రుకలూ / జుట్టుపై ఎలా పడుతుందంటే...

కాలుష్యం తాలూకు దుష్ప్రభావంతో వెంట్రుక బలహీనమవుతుంది. దాంతో అది తేలిగ్గా తెగిపోవడం, జుట్టుకు సహజంగా ఉండే మెరుపు తగ్గిపోవడం జరుగుతుంది. దీనికి తోడు వాతావరణ ఉష్ణోగ్రత కూడా పెరగడంతో... దేహానికి అవసరమైన అన్ని రకాల పోషకాలు అందడం తగ్గుతుంది. దాంతో ఆ ప్రభావం వెంట్రుక మీద కూడా పడుతుంది. వాతావరణంలోని వేడిమితో విపరీతంగా చెమటలు పట్టడం వంటి కారణాలతో... శరీరంలోని లవణాలు, పోషకాలు వెంట్రుకలకు అందడం తగ్గి అది జుట్టు మీదా ప్రభావం చూపుతుంది. ఫలితంగా జుట్టు చింపిరిగా మారడం, తేలిగ్గా విరిగిపోయేలా (అంటే తెగడం-ఫ్రాజైల్‌గా మారిపోయేలా) వెంట్రుకలో కొన్ని మార్పులు వస్తాయి. దుమ్మూధూళి వల్ల జుట్టు తేలిగ్గా చింపిరిగా మారడంతో పాటు మాడుపైన దుష్పరిణామాలు కనిపించవచ్చు. దాంతో మాడుపైనుంచి చుండ్రు, పొట్టు రాలుతుండటం వంటివి పెరిగేందుకు అవకాశాలెక్కువ. వీటన్నింటి మొత్తం ప్రభావాల వల్ల వెంట్రుకలు తేలిగ్గా రాలడం వంటి పరిణామాలు చోటు చేసుకుంటాయి.





కాలుష్యం నుంచి చర్మాన్ని, వెంట్రుకలను కాపాడుకోవడం ఎలా?

● కాలుష్యాలైన పొగ, దుమ్ము, ధూళి, రేడియేషన్ వంటివి నేరుగా మేనిని తాకకుండా వీలైనంతమేరకు చర్మం మొత్తాన్ని కప్పి ఉంచే దుస్తులు ధరించాలి. ముఖం, చేతులను రక్షించుకోడానికి స్కార్ఫ్, గ్లవ్జ్ వంటివి తొడుక్కోవాలి.

● చర్మానికి, వెంట్రుకలకు మంచి పోషకాలు అందేలా యాంటీ ఆక్సిడెంట్స్ పుష్కలంగా ఉండేవైన ఆకుపచ్చని కూరలు (గ్రీన్ లీఫీ వెజిటబుల్స్), తాజా పండ్లు, విటమిన్ ఏ, సీ, ఈ ఉండే ఆహార పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి.

● బయటకు వెళ్లడానికి కనీసం 15–20 నిమిషాల ముందు సన్‌స్క్రీన్ లోషన్ రాసుకోవాలి. దీనికి తోడు బయటకు వెళ్లాక కూడా ప్రతి రెండు, మూడు గంటలకోమారు మళ్లీ సన్‌స్క్రీన్ లోషన్ రాసుకుంటూ ఉండాలి.

● ప్రతి రోజూ చర్మం, వెంట్రుకలు శుభ్రం అయ్యేలా స్నానం చేయాలి.

వెంట్రుకలు రాలకుండా ఉండాలంటే...

● వెంట్రుకలను షాంపూతో క్రమం తప్పకుండా శుభ్రం చేసుకోవాలి. అయితే వెంట్రుకలను మరీ ఎక్కువగా కడగటం మంచిదికాదని గుర్తుంచుకోవాలి. ఇలా అవసరమైన దానికంటే వెంట్రుకలను ఎక్కువగా కడుగుతూ ఉంటే అవి పాడిబార వచ్చు.

● అలర్జెన్స్, కాలుష్యాలు నేరుగా వెంట్రుకలు తాకకుండా స్కార్ఫ్ కట్టుకోవడం, ట్రిమ్ హ్యాట్ పెట్టుకోవడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలి.

● ఒకవేళ చుండ్రు వంటి సమస్య ఉంటే కీటోకొనజాల్ లేదా సైక్లోపిరోగ్సాలమైన్ ఉండే షాంపూలతో వారానికి రెండుసార్లు తలస్నానం చేయాలి.

● వెంట్రుక చివర్లు చిట్లిపోకుండా ఉండేలా ప్రతి ఆరువారాలకు ఓమారు జుట్టును ట్రిమ్ చేసుకోవాలి.

● రంగు వేసుకునేవారైతే అది సరిపడుతోందా లేదా అన్నది పరిశీలించుకున్న తర్వాతే దాన్ని వాడటం మొదలు పెట్టాలి.

జుట్టు ఊడిపోతుంటే ఈ జాగ్రత్తలు పాటించండి...

తమ జుట్టు బాగా రాలిపోతోందంటూ చాలామంది ప్రతిరోజూ ఆందోళన పడుతుంటారు. అయితే ప్రతి రోజూ ప్రతి ఒక్కరూ దాదాపు నూరు వెంట్రుకల (స్ట్రాండ్స్) వరకు కోల్పోతుంటారు. ఇది చాలా సాధారణం. అయితే అదే పనిగా జుట్టు ఊడిపోవడం వల్ల తమకు బట్టతల వచ్చేస్తుందేమోనని చాలామంది ఆందోళన పడుతుంటారు. వాళ్ల ఆందోళన తీరాలంటే చేయాల్సిందేమిటంటే...

జుట్టుకు అవసరమైన మూడు పోషకాలు జింక్, ఐరన్, విటమిన్–సీ. ఈ మూడూ జుట్టును సంరక్షిస్తూ, దాని మెరుపును కాపాడుతుండే ముఖ్యమైన మూడు అంశాలుగా చెప్పవచ్చు. అందుకే మనం తీసుకునే ఆహారంలో ఈ మూడూ సమృద్ధిగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. అందుకు ఆహారంలో తీసుకోవాల్సినవి...

జింక్ కోసం : జుట్టుకు అవసరమైన జింక్ కోసం మీ ఆహారంలో గుమ్మడి గింజలు ఎక్కువగా తీసుకునేలా జాగ్రత్తపడాలి. జుట్టు విపరీతంగా ఊడిపోయేవారి ఆహారంలో జింక్‌తో పాటు, ఐరన్ పుష్కలంగా ఉండాలని బ్రిటిష్ న్యూట్రిషన్ ఫౌండేషన్ సిఫార్సు చేస్తోంది. ఆహార పదార్థాలన్నింటిలోనూ జింక్ గుమ్మడి గింజల్లో చాలా ఎక్కువగా లభిస్తుంటుంది. అలాగే సీఫుడ్స్, డార్క్ చాక్లెట్, వేరుసెనగలు, వేటమాంసంలో కూడా జింక్ మోతాదులు ఎక్కువ. దాంతోపాటు పుచ్చకాయ తినేటప్పుడు వాటి గింజలనూ ఊసేయకుండా తినడం మంచిది. ఎందుకంటే పుచ్చకాయ గింజల్లోనూ జింక్ ఎక్కువే.

ఐరన్ కోసం : ఆహారంలో ఐరన్ సమృద్ధిగా దొరకడం కోసం గుడ్డు, డ్రైఫ్రూట్స్, జీడిపప్పు లాంటి నట్స్, సీఫుడ్స్ వంటివి తీసుకోవచ్చు. ఇక మాంసాహారంలోనైతే కాలేయం, కిడ్నీల్లో ఐరన్ చాలా ఎక్కువ. శాకాహారులైతే ముదురు ఆకుపచ్చ రంగులో ఉండే పాలకూర వంటి ఆకు కూరల్లో ఐరన్ ఎక్కువని తెలుసుకుని మీరు తీసుకునే ఆహారంలో అలాంటి ఆకుకూరలు ఎక్కువగా ఉండేలా జాగ్రత్తపడాలి.

విటమిన్-సీ కోసం : మనకు అందుబాటులో ఉన్న అన్ని ఆహార పదార్థాలతో పోలిస్తే ఉసిరిలో నాణ్యమైన విటమిన్–సి పుష్కలంగా దొరుకుతుంది. దాంతోపాటు ఇక నిమ్మ జాతి పండ్లన్నింటిలోనూ విటమిన్–సి ఎక్కువగా ఉంటుందన్న విషయం తెలిసిందే. మిగతావాటితో పోలిస్తే... బత్తాయి, నారింజ వంటి నిమ్మజాతి పండ్లు ఎక్కువగా తినేవారిలో జుట్టు రాలడం కాస్త తక్కువేనని చెప్పవచ్చు.

అప్పటికీ జుట్టు రాలుతుంటే...

ఇక్కడ చెప్పినవన్నీ తీసుకుంటూ, వారంలో కనీసం రెండు సార్లు తలస్నానం చేయడం వంటి జుట్టు హైజీన్ పాటిస్తున్నప్పటికీ జుట్టు రాలిపోతుంటే ఒకసారి థైరాయిడ్ పరీక్ష చేయించుకుని డాక్టర్‌ను కలవాల్సి ఉంటుంది. ఎందుకంటే థైరాక్సిన్ హార్మోన్ అసమతౌల్యత జుట్టు రాలే ముప్పును తెచ్చిపెడుతుంది. దేహంలో అలాంటి సమస్య / అనారోగ్యం ఏదైనా ఉంటే దాన్ని డాక్టర్లు పరిష్కరిస్తారు. ఒకవేళ ఇలాంటి సమస్యను స్వాభావికంగానే నివారించుకోవాలంటే... చేపలు ఎక్కువగా తినేవారిలో థైరాక్సిన్ అసమతౌల్యత సమస్య చాలా తక్కువని తెలుసుకోండి.

ఇన్ని జాగ్రత్తల తర్వాత కూడా జుట్టు రాలడం ఆగకపోతే అప్పుడు మీరు డర్మటాలజిస్టులు లేదా ట్రైకాలజిస్టుల వంటి నిపుణులను కలవాల్సి ఉంటుంది.



డా. స్వప్నప్రియ,
సీనియర్ డర్మటాలజిస్ట్

వెంట్రుకలు తెల్లబడటం ఎందుకు...

కొందరిలో జుట్టు ఉండి కూడా నెరిసిపోతుంటే అది కూడా ఓ సమస్యే. అయితే ఈ పరిస్థితి కాస్త ఉపశమనం కలిగించే సమస్య. ఎందుకంటే... అసలు జుట్టు లేకపోవడం కంటే... తలపై వెంట్రుకలు ఉండి అవి తెల్లబడుతుంటే కనీసం రంగైనా వేసుకోవచ్చునన్నది పలువురి అభిప్రాయం. ఒక వయసు రాకముందే జుట్టు తెల్లబడటాన్ని బాలనెరుపుగా (ప్రీ–మెచ్యూర్ గ్రేయింగ్ ఆఫ్ హెయిర్‌గా) చెబుతుంటారు. వెంట్రుకలు ఎందుకు నెరుస్తాయో చూద్దాం.

సాధారణంగా మన వెంట్రుకల మూలాన్ని హెయిర్ ఫాలికిల్ అంటారు. ఇక్కడ మెలనోసైట్స్ అనే కణాలు ఉంటాయి. ఇవి మెలనిన్ అనే రంగునిచ్చే పిగ్మెంట్‌ను ఉత్పత్తి చేస్తాయి. ఈ పిగ్మెంట్ వల్లనే వెంట్రుకకు నల్లటి రంగు వస్తుంది. కొన్ని వెంట్రుకల్లో మెలనిన్ ఉత్పత్తి ఆగిపోతుంది. ఫలితంగా ఆ వెంట్రుక నల్లరంగును కోల్పోయి తెల్లగా మారుతుంది. నిజానికి వాడుక భాషలో దాన్ని తెల్ల వెంట్రుకగా చెబుతుంటాం గానీ... వాస్తవానికి వెంట్రుక తెల్లగా మారదు. మెలనిన్ ఇచ్చే నలుపు రంగును కోల్పోవడం వల్ల అది ఒక మేరకు పాక్షికంగా పారదర్శకం (ట్రాన్స్‌లుసియెంట్)గా మారుతుంది. దాంతో అది తెల్లవెంట్రుకలా కనిపిస్తుంది.



జుట్టు తెల్లబడటానికి కారణాలు...

వెంట్రుకలు తెల్లబడటానికి అనేక కారణాలు ఉన్నాయి. అందులో అన్నిటి కంటే ప్రధానమైనవి జన్యుపరమైన కారణాలు. తల్లిదండ్రుల్లో ఎవరికైనా వెంట్రుకలు త్వరగా నెరిస్తే పిల్లల్లోనూ అవి త్వరగా తెల్లబడటానికి అవకాశాలెక్కువ. వయసు పెరుగుతున్న కొద్దీ వెంట్రుకలు తెల్లబడటం జరగాలి. కానీ కొందరిలో చాలా త్వరగా వెంట్రుకలు తెల్లగా కావచ్చు. ఇందుకు సహాయపడే మరికొన్ని కారణాలు :

రక్తహీనత (అనీమియా) పొగతాగే అలవాటు మితిమీరిన ఒత్తిడి థైరాయిడ్ లోపాలు / థైరాయిడ్ అసమతౌల్యత విటమిన్ బి–12 లోపం

వీటికి తోడు కాలుష్యం, పోషకాహార లోపం కూడా కొంతమేరకు తెల్లవెంట్రుకలకు కారణమవుతాయి.

వెంట్రుకలు నల్లబడాలంటే...

విటమిన్ బి–12 మాంసాహారంలో ఎక్కువగా లభ్యమతుంటుంది కాబట్టి అది సమృద్ధిగా అందేలా మాంసాహారం తీసుకోవడం.

ఒకవేళ శాకాహారులైతే రోజూ గ్లాసెడు పాలు తాగడంతో పాటు, వైటమిన్ బి12 ఎక్కువగా లభించే తృణధాన్యాలు తినడం, అప్పటికీ సరైన మోతాదులో విటమిన్ బి12 అందకపోతే డాక్టర్ సలహా మేరకు వైటమిన్ బి12 అందేలా టాబ్లెట్లు వాడటం అవసరం.

బట్టతల ఎందుకు వస్తుంది...?

పురుషుల్లో బట్టతలకు జన్యుపరమైన కారణాలే ప్రధానమైనవి. దానికి తోడు మగపిల్లల్లో వారు యుక్త వయసు వచ్చేనాటికి అతడిలో స్రవించే పురుష హార్మోన్లు వెంట్రుకలను పలచబార్చడం మొదలుపెడతాయి. ఇలా పురుష హార్మోన్ల కారణంగా వెంట్రుకలు పలచబడుతూ పోవడాన్ని ‘యాండ్రోజెనిక్ అలోపేషియా’ అంటారు. పురుషుల్లో ఒక యుక్తవయసు వచ్చిన నాటి నుంచి తలవెంట్రుకలు మొదలయ్యే హెయిర్ లైన్ క్రమంగదా వెనక్కు జరుగుతుంటుంది. అందుకే పురుషుల్లో దాదాపు 25 శాతం మందిలో యుక్త వయసు నుంచి 30 ఏళ్లు వచ్చే వరకు ఎంతోకొంత జుట్టు పలచబారుతుంది.

కారణాలు: పురుషుల్లో కండరాలు బలపడటానికి, ఎముకల సాంద్రత పెరగడానికి వీలుగా టెస్టోస్టిరాన్ అనే హార్మోన్ ఉత్పత్తి పెరుగుతుంది. అది రోమాంకురమైన హెయిర్ ఫాలికిల్‌ను ఎంతో కొంత బలహీనపరుస్తుంది. దాంతో వెంట్రుకలు రాలడం పెరిగి జుట్టు పలచబారుతూ పోతుంది. దీనికి తోడు ఒత్తిడి వంటి మరికొన్ని అంశాలు దీనికి తోడైతే జుట్టు రాలడం మరింత పెరుగుతుంది.

మందులు : వెంట్రుకలు రాలడాన్ని పూర్తిగా నివారించలేకపోయినప్పటికీ... జుట్టు రాలడాన్ని ఆపేందుకూ, రాలిన వెంట్రుకలు తిరిగి మొలవడానికి సహాయపడే కొన్ని పూత మందులు, నోటి ద్వారా తీసుకునే మందుల వంటివి కొన్ని అందుబాటులో ఉన్నాయి. అయితే వాటివల్ల దుష్ప్రభావాలు ఎక్కువ. ఉదాహరణకు ఇవి వాడేవారిలో తలనొప్పి, చుండ్రు, మాడు చర్మం మందంగా మారడం, రక్తపోటు తగ్గిపోవడం వంటి అనేక సమస్యలు రావచ్చు. నోటి ద్వారా మందులు వాడే వారిలో రొమ్ములు పెరగడం, అంగస్తంభన లోపాలు వంటివీ రావచ్చు. పైగా వీటి ఉపయోగం తాత్కాలికమే. ఆ మందులు ఆపేసిన మరుక్షణం జుట్టు రాలడమనేది మళ్లీ మొదలుకావచ్చు. అందుకే మరీ అవసరమని భావిస్తేనే వీటిని తప్పనిసరిగా నిపుణులైన డాక్టర్ల పర్యవేక్షణలోనే వాడాలని గుర్తుంచుకోండి.



బిజినెస్ రీల్

ఆర్‌కామ్, అనిల్ అంబానీపై 'ఫ్రాడ్' ముద్ర

- సీబీఐకి ఫిర్యాదు చేయనున్న ఎస్‌బీఐ
- లోక్‌సభకు తెలిపిన కేంద్రం



న్యూఢిల్లీ: రిలయన్స్ కమ్యూనికేషన్స్, ఆసంస్థ ప్రమోటర్ అనిల్ అంబానీని మోసపూరితమని (ఫ్రాడ్) ఎస్‌బీఐ జూన్ 13న గుర్తించినట్లు లోక్‌సభకు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పకంజ్ చౌదరి తెలిపారు. జూన్ 24న ఆర్‌బీఐకి ఫ్రాడ్ వర్గీకరణ గురించి ఎస్‌బీఐ నివేదించిందని.. దీనిపై సీబీఐ వద్ద కేసు దాఖలు చేసే ప్రక్రియలో ఉన్నట్లు ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ఫ్రాడ్‌గా గుర్తించిన విషయాన్ని ఆర్‌కామ్ బీఎస్‌ఈకి జూలై 1న వెల్లడించడం గమనార్హం. ఆర్‌కామ్ ప్రస్తుతం దివాలా పరిష్కార చట్టం కింద చర్యలను ఎదుర్కొంటోంది. ఆర్‌కామ్, దాని అనుబంధ సంస్థలు వివిధ బ్యాంకుల నుంచి రూ. 31వేల కోట్లకు పైగా రుణం తీసుకోగా.. ఈ నిధులను వివిధ గ్రూప్ సంస్థలకు మళ్లించినట్లు గుర్తించామని ఎస్‌బీఐ ఆర్‌కామ్‌కు తెలియజేయడం గమనార్హం.

నెమ్మదించిన మౌలికం

జూన్‌లో 1.7 శాతం డౌన్



న్యూఢిల్లీ: ఎనిమిది కీలక పరిశ్రమల మౌలిక రంగ వృద్ధి ఈ ఏడాది జూన్‌లో నెమ్మదించింది. గతేడాది జూన్‌లో నమోదైన 5 శాతంతో పోలిస్తే ఈసారి 1.7 శాతానికి పరిమితమైంది. అయితే, మే నెలతో (1.2 శాతం) పోలిస్తే మాత్రం కాస్త మెరుగ్గానే ఉంది. బొగ్గు, ముడి చమురు, సహజ వాయువు, ఎరువులు, విద్యుత్ రంగాలు నెగటివ్ వృద్ధిని నమోదు చేశాయి. అయితే, రిఫైనరీ ఉత్పత్తులు (3.4 శాతం), ఉక్కు (9.3 శాతం), సిమెంట్ (9.2 శాతం) సానుకూల పనితీరు కనపర్చాయి. గతేడాది ఏప్రిల్–జూన్ త్రైమాసికంలో నమోదైన 6.8 శాతంతో పోలిస్తే ఈసారి అదే వ్యవధిలో ఎనిమిది పరిశ్రమల వృద్ధి 1.3 శాతానికే పరిమితమైంది.

రెనో గ్రూప్ భారత సారథిగా స్టీఫెన్ డెబ్లయిజ్



న్యూఢిల్లీ: రెనో గ్రూప్ భారత కార్యకలాపాల సీఈవోగా స్టీఫెన్ డెబ్లయిజ్ నియమితులయ్యారు. ఈ నియామకం సెప్టెంబర్ 1 నుంచి అమల్లోకి వస్తుందని గ్రూప్ ప్రకటించింది. భారత్‌లో గ్రూప్ వ్యూహాలను రూపొందించి, అమలు చేస్తారని ప్రకటించింది. భారత్‌లోని అన్ని రెనో గ్రూప్ సంస్థలు ఆయనకు రిపోర్ట్ చేయాల్సి ఉంటుందని పేర్కొంది. డెబ్లయిజ్ 2022 నుంచి రెనో కొరియా సీఈవోగా పనిచేస్తున్నారు. అక్కడ కంపెనీ కార్యకలాపాలను ముందుకు తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషించినట్టు గ్రూప్ తెలిపింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

22-7-2025

విశాఖ	540–00
చిత్తూరు	543–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	505–00
విజయవాడ	510–00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	480–00
వరంగల్	482–00
రిటైల్ ధర	5.40

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
ETERNAL	276.5	7.5
ICICIBANK	1,464.50	2.71
HDFCBANK	2,001.50	2.25
M&M	3,246.30	1.69
HDFCLIFE	751.9	1.68

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
RELIANCE	1,428.20	-3.24
WIPRO	260.9	-2.27
INDUSINDBK	851	-2.19
EICHERMOT	5,561.50	-1.17
HCLTECH	1,530.80	-1.16

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్‌ఈ	6,594
ఎన్‌ఎస్‌ఈ	91,473
ఎన్‌ఎస్‌ఈ(డెరివేటివ్స్)	1,53,511
ఎఫ్ఐఐ	- 1,681
డీఐఐ	+ 3,578

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	67.28 (రాత్రి 11.30కు)	$ 66.05 (క్రితం ముగింపు)
బ్రెంట్	69.03 (రాత్రి 11.30కు)	$ 69.28 (క్రితం ముగింపు)

టైర్.. రయ్ రయ్!



ఆదాయం 7-8 శాతం పెరగొచ్చు
- క్రిసిల్ రేటింగ్స్ అంచనా

న్యూఢిల్లీ: దేశీ టైర్ల తయారీ పరిశ్రమ ఆదాయం ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (2025–26) 7–8 శాతం వరకు పెరగొచ్చని క్రిసిల్ రేటింగ్స్ అంచనా వేసింది. ముఖ్యంగా పాత టైర్లను మార్చడం రూపంలోనే సగం విక్రయాలు ఉంటాయని తెలిపింది. అసలు తయారీదారుల (ఓఈఎం) వాటా తగ్గే అవకాశం ఉన్నప్పటికీ.. మొత్తం మీద ఈ విభాగంలో వృద్ధి నమోదవుతుందని పేర్కొంది. ప్రీమియమైజేషన్ పెరుగుతుండడం అమ్మకాలకు ఊతమిస్తుందని అంచనా వేసింది. అయితే వాణిజ్య ఉద్రిక్తతలు పెరిగిపోయిన తరుణంలో చైనా తయారీదారులు చౌక రేట్లపై టైర్లను భారత్ మార్కెట్లోకి కుమ్మరించే సవాళ్లు పొంచి ఉన్నట్టు ఈ నివేదిక తెలిపింది. స్థిరమైన ముడి సరుకుల ధరలు, సామర్థ్యాన్ని మెరుగ్గా వినియోగించుకోవడం ఫలితంగా టైర్ల పరిశ్రమ నిర్వహణ లాభం 13–13.5 శాతం స్థాయిలో ఉంటుందని అంచనా వేసింది. లీన్ బ్యాలన్స్ షీట్లు (నిల్వలు తగ్గించుకోవడం), మూలధన వ్యయాలను క్రమంగా చేయడం వంటివి ఈ రంగం రుణ పరపతిని స్థిరంగా ఉంచుతాయని తెలిపింది. దేశంలో అన్ని రకాల వాహన టైర్ల అమ్మకాల్లో 85 శాతం వాటా కలిగిన టాప్–6 కంపెనీలను పరిశీలించినప్పుడు ఇదే తెలుస్తున్నట్టు పేర్కొంది. మొత్తం డిమాండ్‌లో 75 శాతం దేశీ మార్కెట్ నుంచి, మిగిలినది ఎగుమతుల రూపంలో ఉంటుందని అంచనా వేసింది.

టారిఫ్ సవాళ్లు..

ఎగుమతుల విషయంలో రిస్క్‌లను క్రిసిల్ రేటింగ్స్ ప్రస్తావించింది. గత ఆర్థిక సంవత్సరంలో (2024–25) భారత్ నుంచి టైర్ల ఎగుమతుల్లో 17 శాతం అమెరికాకే వెళ్లాయని.. పరిశ్రమ మొత్తం పరిమాణంలో ఇది 4–5 శాతంగా ఉన్నట్టు తెలిపింది. ప్రతీకార సుంకాలను ఎదుర్కోవాల్సి వస్తే అప్పుడు పోటీపరమైన సానుకూలతలు కనుమరుగవుతాయని పేర్కొంది. చైనాపై అమెరికా భారీ టారిఫ్‌లు విధించిన నేపథ్యంలో.. అదనపు సరఫరాలు ధరల పరంగా సున్నిత మార్కెట్ అయిన భారత్‌లోకి మళ్లే అవకాశం లేకపోలేదని అభిప్రాయపడింది. చౌక దిగుమతులకు కళ్లెం వేసేందుకు వీలుగా.. చైనా నుంచి వచ్చే భారీ ట్రక్, బస్ రేడియల్ టైర్లపై యాంటీ డంపింగ్, కౌంటర్ వేయిలింగ్ డ్యూటీలను కేంద్రం విధించడాన్ని గుర్తు చేసింది. కానీ, ఇతర విభాగాల్లో చౌక దిగుతులు ఒత్తిళ్లకు దారితీయొచ్చని పేర్కొంది.

జేన్ స్ట్రీట్‌కు సెబీ గ్రీన్‌సిగ్నల్

లావాదేవీలపై నిషేధం ఎత్తివేత



న్యూఢిల్లీ: క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ తాజాగా యూఎస్ ప్రాప్రయిటరీ ట్రేడింగ్ సంస్థ జేన్ స్ట్రీట్‌పై నిషేధాన్ని ఎత్తివేసింది. తద్వారా సెక్యూరిటీస్ మార్కెట్లో తిరిగి లావాదేవీలు నిర్వహించేందుకు అనుమతించింది. ఎఫ్అండ్‌వో లావాదేవీల్లో మార్కెట్ మ్యానిప్యులేషన్‌కు పాల్పడిందంటూ ఈ నెల 3న జారీ చేసిన మధ్యంతర ఆదేశాలలో జేన్ స్ట్రీట్‌పై సెబీ నిషేధాన్ని విధించిన సంగతి తెలిసిందే. ఇందుకు దాదాపు రూ. 4,843 కోట్ల జరిమానా సైతం విధించింది. అయితే సెబీ సూచించిన విధంగా ఎస్క్రో ఖాతాలో గత వారమే జేన్ స్ట్రీట్ రూ. 4,843 కోట్లకుపైగా జమ చేయడంతో తాజాగా సెబీ నిషేధాన్ని ఎత్తివేసింది. కాగా.. ఇకపై అక్రమంగా లేదా మ్యానిప్యులేటివ్‌గా లేదా మోసపూరితంగా లావాదేవీలు చేపడితే ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా చర్యలు తీసుకోనున్నట్లు సెబీ హెచ్చరించింది.

ఎలక్ట్రానిక్స్ ఎగుమతులు జూమ్

- జూన్ త్రైమాసికంలో 47 శాతం జంప్
- రూ.1.05 లక్షల కోట్లుగా నమోదు
- యూఎస్, యూఏఈ, చైనాకు అధికం



న్యూఢిల్లీ: ఎలక్ట్రానిక్స్ ఎగుమతులు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో (ఏప్రిల్–జూన్/క్యూ1) బలమైన పనితీరు చూపించాయి. క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూస్తే ఏకంగా 47 శాతం పెరిగి 12.41 బిలియన్ డాలర్లకు (రూ.1.05 లక్షల కోట్లు సుమారు) చేరాయి. కేంద్ర వాణిజ్య శాఖ విడుదల చేసిన డేటా ప్రకారం.. ముఖ్యంగా అమెరికా, యూఏఈ, చైనా టాప్–3 ఎగుమతి గమ్యస్థానాలుగా ఉన్నాయి. నెదర్లాండ్స్, జర్మనీ తర్వాతి రెండు స్థానాల్లో నిలిచాయి. "భౌగోళికంగా వివిధ దేశాల మధ్య ఎగుమతుల్లో వైవిధ్యం, అంతర్జాతీయ ఎలక్ట్రానిక్స్ సరఫరా వ్యవస్థతో పెరుగుతున్న భారత్ అనుసంధానతను ఈ గణాంకాలు సూచిస్తున్నాయి. ఆసియాలో విశ్వసనీయ ప్రత్యామ్నాయ తయారీ కేంద్రంగా భారత్ అవతరిస్తున్నదానికి నిదర్శనం" అని వాణిజ్య శాఖ అధికారి ఒకరు పేర్కొన్నారు.

అమెరికాకే 60 శాతం

భారత ఎలక్ట్రానిక్స్ ఎగుమతుల్లో 60 శాతం మేర అమెరికాకే వెళ్లాయి. ఆ తర్వాత యూఏఈకి 8 శాతం, చైనాకి 3.88 శాతం, నెదర్లాండ్స్‌కు 2.68 శాతం, జర్మనీకి 2.09 శాతం చొప్పున జూన్ త్రైమాసికంలో ఎగుమతులు నమోదయ్యాయి. భారత రెడీమేడ్ వస్త్రాల ఎగుమతుల్లోనూ (ఆర్‌ఎంజీ) అమెరికాయే అగ్రస్థానంలో ఉంది. 34 శాతం రెడీమేడ్ వస్త్ర ఎగుమతులు అమెరికాకు వెళ్లాయి. ఆ తర్వాత యూకేకి 8.81 శాతం, యూఏఈకి 7.85 శాతం, జర్మనీకి 5.51 శాతం, స్పెయిన్‌కు 5.29 శాతం చొప్పున ఆర్‌ఎంజీ ఎగుమతులు నమోదయ్యాయి. జూన్ త్రైమాసికంలో మొత్తం రెడీమెడ్ వస్త్ర ఎగుమతులు 4.19 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో ఇవి 3.85 బిలియన్ డాలర్లుగా ఉండడం గమనార్హం. సముద్ర ఉత్పత్తుల ఎగుమతులు జూన్ క్వార్టర్‌లో క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూస్తే 19 శాతానికి పైగా పెరిగి 1.95 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. 37.63 శాతం మేర అమెరికాయే దిగుమతి చేసుకుంది. ఆ తర్వాత 17 శాతం చైనాకి, 6.63 శాతం వియత్నాంకి, 4.47 శాతం జపాన్‌కు వెళ్లాయి.

ఎస్‌బీఐ క్విప్ సక్సెస్



రూ. 25,000 కోట్ల సమీకరణ

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్(ఎస్‌బీఐ) చేపట్టిన అర్హతగల సంస్థాగత ఇన్వెస్టర్లకు షేర్ల జారీ(క్విప్) విజయవంతమైంది. బిజినెస్ వృద్ధికి చేపట్టిన క్విప్ ద్వారా రూ. 25,000 కోట్లు సమీకరించింది. దీంతో క్విప్‌ను ముగించేందుకు తాజాగా సమావేశమైన డైరెక్టర్ల కమిటీ నిర్ణయించినట్లు ఎస్‌బీఐ వెల్లడించింది. అర్హతగల సంస్థాగత కొనుగోలుదారుల(క్విబ్) నుంచి లభించిన దరఖాస్తులు, ఎస్క్రో ఖాతాలో జమ అయిన నిధుల నేపథ్యంలో క్విప్‌నకు ముగింపు పలకనున్నట్లు పేర్కొంది. షేరుకి రూ. 817 ధరలో 30,59,97,552 ఈక్విటీ షేర్ల జారీకి కమిటీ ఆమోదముద్ర వేసినట్లు తెలియజేసింది.

కాగా.. ఎస్‌బీఐలో వాటా 9.21 శాతం నుంచి 9.49 శాతానికి పెరిగినట్లు ప్రభుత్వ రంగ బీమా దిగ్గజం లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్(ఎల్ఐసీ) తాజాగా వెల్లడించింది. క్విప్‌లో భాగంగా ఎల్ఐసీ ఈ వాటాను సొంతం చేసుకుంది. ఇంత క్రితం ఎస్‌బీఐ 2017–18లో క్విప్ ద్వారానే రూ. 15,000 కోట్లు సమకూర్చుకున్న విషయం విదితమే. మరోవైపు ఈ ఏడాది బాండ్ల జారీ ద్వారా మరో రూ. 20,000 కోట్ల సమీకరణకు ఎస్‌బీఐ బోర్డు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో మార్చిలోగా బాండ్ల జారీని సైతం చేపట్టనుంది.

ఐవోసీ పానిపట్ రిఫైనరీలో గ్రీన్ హైడ్రోజన్ ప్లాంటు

ఏర్పాటు చేయనున్న ఎల్అండ్‌టీ



న్యూఢిల్లీ: ఇన్‌ఫ్రా దిగ్గజం లార్సన్ అండ్ టూబ్రో (ఎల్అండ్‌టీ) దేశీయంగా అతి పెద్ద హరిత హైడ్రోజన్ ప్లాంటు నిర్మించనుంది. ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ దిగ్గజం ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐవోసీ)కి చెందిన పానిపట్ (హర్యానా) రిఫైనరీలో దీన్ని ఏర్పాటు చేయనున్నట్లు సంస్థ తెలిపింది. భారత్‌ను గ్రీన్ హైడ్రోజన్ టెక్నాలజీ, ఉత్పత్తిలో అంతర్జాతీయ హబ్‌గా తీర్చిదిద్దాలన్న జాతీయ హైడ్రోజన్ మిషన్‌కి అనుగుణంగా దీన్ని నెలకొల్పనున్నట్లు వివరించింది. ఇది 25 ఏళ్ల పాటు ఐవోసీకి ఏటా 10,000 టన్నుల గ్రీన్ హైడ్రోజన్ సరఫరా చేసే సామర్థ్యంతో ఏర్పాటు కానుంది. బిల్డ్–ఓన్–ఆపరేట్ మోడల్ కింద నిర్మించబోయే ఈ ప్లాంటు పర్యావరణహిత శక్తితో పని చేస్తుంది. ఐవోసీతో తమ భాగస్వామ్యాన్ని పటిష్టం చేసుకునేందుకు ఈ ప్రాజెక్టు తోడ్పడుతుందని ఎల్అండ్‌టీ డిప్యూటీ ఎండీ సుబ్రమణియన్ శర్మ తెలిపారు.

500 సర్వీస్ సెంటర్ల ఏర్పాటులో మారుతీ సుజుకీ



న్యూఢిల్లీ: ఆటోమొబైల్ దిగ్గజం మారుతీ సుజుకీ ఇండియా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కొత్తగా సుమారు 500 సర్వీస్ టచ్‌పాయింట్లను ప్రారంభించాలని భావిస్తోంది. గత ఆర్థిక సంవత్సరం 460 కొత్త సర్వీస్ సెంటర్‌ను ఏర్పాటు చేశామని కంపెనీ ఎండీ హిసాషి తకెయుచి తెలిపారు. రాజస్థాన్‌లోని జైపూర్‌లో కొత్త సెంటర్ ఏర్పాటుతో మొత్తం టచ్‌పాయింట్ల సంఖ్య 5,500కి చేరినట్లు వివరించారు. చాలా మటుకు కస్టమర్లు, కార్లను కొనే ముందు, సర్వీస్ సెంటర్లు ఎంత దగ్గర్లో ఉన్నాయి, ఎంత సులభతరంగా, చౌకగా, నమ్మకమైన సర్వీస్ లభిస్తుంది అనే అంశాలను పరిశీలిస్తుంటారని ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే తమ డీలర్ పార్ట్‌నర్లకు సహాయకరంగా ఉండేలా 2,764 పట్టణాలవ్యాప్తంగా 5,500 సర్వీస్ టచ్‌పాయింట్లను ఏర్పాటు చేశామని తకెయుచి వివరించారు. ఏటా 3 కోట్ల వాహనాలను సర్వీస్ చేసే సామర్థ్యాలు మారుతీ సుజుకీ ఇండియా నెట్‌వర్క్‌కి ఉన్నాయి. 2024–25లో ఏకంగా 2.7 కోట్ల వాహనాలను సర్వీస్ చేసినట్లు కంపెనీ తెలిపింది.

రూ.99,020కు చేరిన బంగారం ధర

10 గ్రాములకు రూ.250 పెరుగుదల



న్యూఢిల్లీ: స్టాకిస్టుల నుంచి కొనుగోళ్ల మద్దతుతో బంగారం ధరలు సానుకూలంగా ట్రేడయ్యాయి. ఢిల్లీ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత బంగారం 10 గ్రాములకు రూ.250 పెరిగి రూ.99,020 స్థాయిని చేరింది. 99.5 శాతం స్వచ్ఛత పసిడి సైతం ఇంతే మేర లాభపడి రూ.98,550 స్థాయిని తాకింది. మరోవైపు వెండి ధర కిలోకి రూ.500 పుంజుకోవడంతో రూ.1,11,000 స్థాయిని నమోదు చేసింది. అంతర్జాతీయ మార్కెట్లో స్పాట్ గోల్డ్ ధర ఔన్స్‌కు 16 డాలర్ల వరకు పెరిగి 3,365 డాలర్ల స్థాయి వద్ద ట్రేడయ్యింది. "యూఎస్ టారిఫ్‌లకు సంబంధించి అనిశ్చితులు కొనసాగడంతో బంగారం ధరలు గరిష్టాల వద్ద ట్రేడయ్యాయి. డాలర్ బలపడడం విలువైన లోహాల ధరలకు మద్దతుగా నిలిచింది" అని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ కమోడిటీస్ సీనియర్ అనలిస్ట్ సామిల్ గాంధీ తెలిపారు.

స్కోడా ఆటో టచ్ పాయింట్లు @ 300



ముంబై: దేశవ్యాప్తంగా టచ్ పాయింట్ల (విక్రయ సర్వీసు కేంద్రాలు) సంఖ్య 300కు చేరినట్లు స్కోడా ఆటో ఇండియా తెలిపింది. నెట్‌వర్క్ విస్తరణతో ఏటా 5.50 లక్షల స్కోడా కార్లను అన్ని కేంద్రాలలో సర్వీస్ చేయడానికి వీలుంటుందని పేర్కొంది. ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాల్లో మరింత బలోపేతం అవుతున్నామని... మొత్తం టచ్ పాయింట్లలో 75% ఈ పట్టణాల్లోనే ఉన్నాయని వెల్లడించింది. "ప్రతి ఏటా విక్రయ సర్వీసు కేంద్రాల సంఖ్య పెంచుతూ కస్టమర్లకు నూతన ఉత్పత్తులను మరింత చేరువ చేస్తున్నాము. సుస్థిర నాణ్యత, వేగవంతమైన సేవలు అందిస్తున్నాము" అని స్కోడా ఆటో ఇండియా బ్రాండ్ డైరెక్టర్ అశిష్ గుప్తా తెలిపారు.

దక్షిణాదిలో జీసీసీల జోరు

- బెంగళూరు, హైదరాబాద్, చెన్నైలో అత్యధికం
- వెస్టియన్ నివేదికలో వెల్లడి



న్యూఢిల్లీ: దేశీయంగా గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లలో (జీసీసీ) అత్యధిక వాటా దక్షిణాది నగరాలదే ఉంటోంది. మొత్తం జీసీసీల్లో 55 శాతం సెంటర్లు (992) బెంగళూరు, హైదరాబాద్, చెన్నైలోనే ఉన్నాయి. అమెరికాకు చెందిన రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ వెస్టియన్ నివేదిక ప్రకారం భారత్‌లో సుమారు 1,700 జీసీసీలు ప్రథమ, ద్వితీయ శ్రేణి నగరాల్లో ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఉన్న 3,200 పైగా జీసీసీల్లో ఇవి దాదాపు 53 శాతం. ఇతర దేశాలతో పోలిస్తే వ్యయాలు తక్కువగా ఉండటం, సుశిక్షితులైన నిపుణుల లభ్యత, పటిష్టమైన మౌలిక సదుపాయాలు, పురోగామి పాలసీలు, వ్యాపారాల నిర్వహణకు అనువైన పరిస్థితులు మొదలైనవి జీసీసీల ఏర్పాటు సానుకూలాంశాలుగా ఉంటున్నాయని వెస్టియన్ సీఈవో శ్రీనివాస్ రావు తెలిపారు. ఏ జీసీసీ అయినా దీర్ఘకాలికంగా రాణించాలంటే సరైన ప్రాంతాన్ని ఎంచుకోవడం చాలా కీలకమని ఆయన పేర్కొన్నారు.

నివేదిక ప్రకారం..

- దేశీయంగా ఉన్న మొత్తం జీసీసీల్లో 94 శాతం సెంటర్లు టాప్ నగరాలైన బెంగళూరు, హైదరాబాద్, చెన్నై, ఢిల్లీ–ఎన్‌సీఆర్, ముంబై, పుణెలోనే ఉన్నాయి.
- మొత్తం జీసీసీల్లో 50 శాతం వాటా ఐటీ–ఐటీఈఎస్ రంగానిది ఉండగా, 17 శాతం వాటాతో బీఎఫ్ఎస్ఐ (బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, బీమా) తర్వాత స్థానంలో ఉంది.
- నగరాలవారీగా చూస్తే బెంగళూరులో 487 జీసీసీలు ఉన్నాయి. ఇది మొత్తం సెంటర్స్‌లో 29 శాతం.
- హైదరాబాద్‌లో 273, ఢిల్లీ–ఎన్‌సీఆర్‌లో 272, ముంబైలో 207, పుణెలో 178, చెన్నైలో 162 గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు ఉన్నాయి.

క్యూ1 ఫలితాలు

ఐడీబీఐ బ్యాంక్ లాభం హైజంప్

క్యూ1లో రూ. 2,007 కోట్లు



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ బీమా దిగ్గజం ఎల్ఐసీ నియంత్రణలోని ఐడీబీఐ బ్యాంక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) తొలి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. ఏప్రిల్–జూన్(క్యూ1)లో నికర లాభం 17 శాతం వృద్ధితో రూ. 2,007 కోట్లను తాకింది. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 1,719 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 7,471 కోట్ల నుంచి రూ. 8,458 కోట్లకు బలపడింది. వడ్డీ ఆదాయం రూ. 6,666 కోట్ల నుంచి రూ. 7,021 కోట్లకు ఎగసింది. అయితే నికర వడ్డీ ఆదాయం రూ. 3,233 కోట్ల నుంచి రూ. 3,166 కోట్లకు క్షీణించింది. కాగా.. నిర్వహణ లాభం రూ. 2,076 కోట్ల నుంచి రూ. 2,354 కోట్లకు పుంజుకుంది. స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 3.87 శాతం నుంచి 2.93 శాతానికి, నికర ఎన్‌పీఏలు 0.23 శాతం నుంచి 0.21 శాతానికి వెనకడుగు వేశాయి. కనీస మూలధన నిష్పత్తి 22.42 శాతం నుంచి 25.39 శాతానికి మెరుగుపడింది.

ఫలితాల నేపథ్యంలో ఐడీబీఐ బ్యాంక్ షేరు బీఎస్‌ఈలో 1.4% క్షీణించి రూ. 97 వద్ద ముగిసింది.

హావెల్స్.. నేలచూపు



క్యూ1లో రూ. 352 కోట్లు

న్యూఢిల్లీ: కన్జూమర్ ఎలక్ట్రికల్ గూడ్స్ దిగ్గజం హావెల్స్ ఇండియా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025–26) తొలి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్–జూన్(క్యూ1)లో రూ. 352 కోట్ల నికర లాభం ఆర్జించింది. గతేడాది(2024–25) ఇదే కాలంలో సాధించిన రూ. 411 కోట్లతో పోలిస్తే 14 శాతం క్షీణించింది. వేసవితోపాటు కన్జూమర్ డిమాండ్ మందగించడం ప్రభావం చూపింది. మొత్తం ఆదాయం సైతం 6 శాతంపైగా నీరసించి రూ. 5,438 కోట్లకు పరిమితమైంది. గత క్యూ1లో రూ. 5,798 కోట్లకుపైగా అమ్మకాలు అందుకుంది. అయితే మొత్తం వ్యయాలు 5 శాతంపైగా తగ్గి రూ. 5,032 కోట్లకు చేరాయి. కాగా.. ఇతర ఆదాయంతో కలసి మొత్తం టర్నోవర్ 6 శాతంపైగా బలపడి రూ. 5,507 కోట్లను తాకింది.

ఫలితాల నేపథ్యంలో హావెల్స్ షేరు బీఎస్‌ఈలో 1 శాతం లాభపడి రూ. 1,532 వద్ద ముగిసింది.

యుకో బ్యాంక్.. అప్

క్యూ1లో రూ. 607 కోట్లు



కోల్‌కతా: ప్రభుత్వ రంగ సంస్థ యుకో బ్యాంక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025–26) తొలి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. ఏప్రిల్–జూన్(క్యూ1)లో నికర లాభం 10 శాతం వృద్ధితో రూ. 607 కోట్లను తాకింది. రుణాల విడుదలతోపాటు.. నాణ్యత మెరుగుపడటం ఇందుకు సహకరించింది. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 551 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 6,859 కోట్ల నుంచి రూ. 7,433 కోట్లకు బలపడింది. నికర వడ్డీ ఆదాయం 7 శాతం పుంజుకుని రూ. 2,403 కోట్లను తాకింది. నిర్వహణ లాభం రూ. 1,321 కోట్ల నుంచి రూ. 1,562 కోట్లకు ఎగసింది. నికర వడ్డీ మార్జిన్లు 2.96 శాతంగా నమోదయ్యాయి. స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 3.32 శాతం నుంచి 2.63 శాతానికి, నికర ఎన్‌పీఏలు 0.78% నుంచి 0.45 శాతానికి క్షీణించాయి. అయితే మొండి రుణాలకు ప్రొవిజన్లు రూ. 397 కోట్ల నుంచి రూ. 463 కోట్లకు పెరిగాయి. కనీస మూలధన నిష్పత్తి 17.09 శాతం నుంచి 18.39 శాతానికి మెరుగుపడింది. 2025 జూన్30కల్లా 3,305 బ్రాంచీలను కలిగి ఉంది.

ఫలితాల నేపథ్యంలో యుకో బ్యాంక్ షేరు 1.1 శాతం క్షీణించి రూ. 31.76 వద్ద ముగిసింది.

ఒబెరాయ్ రియల్టీ.. వీక్

క్యూ1లో రూ. 421 కోట్లు ● షేరుకి రూ. 2 డివిడెండ్



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025–26) తొలి త్రైమాసికంలో రియల్టీ రంగ కంపెనీ ఒబెరాయ్ రియల్టీ నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్–జూన్(క్యూ1)లో నికర లాభం 28 శాతం క్షీణించి రూ. 421 కోట్లకు పరిమితమైంది. గతేడాది(2024–25) ఇదే కాలంలో దాదాపు రూ. 585 కోట్లు ఆర్జించింది. అమ్మకాలు నీరసించడం ప్రభావం చూపింది. వాటాదారులకు కంపెనీ బోర్డు షేరుకి రూ. 2 చొప్పున మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది. కాగా.. మొత్తం ఆదాయం సైతం రూ. 1,442 కోట్ల నుంచి రూ. 1,074 కోట్లకు వెనకడుగు వేసింది. ఈ కాలంలో రూ. 1,639 కోట్ల విలువైన ఆస్తులను విక్రయించినట్లు వెల్లడించింది.

ఫలితాల నేపథ్యంలో ఒబెరాయ్ రియల్టీ షేరు యథాతథంగా రూ. 1,836 వద్ద ముగిసింది.

పీఎన్‌బీ హౌసింగ్.. ప్లస్

క్యూ1లో రూ. 534 కోట్లు



న్యూఢిల్లీ: గృహ రుణ రంగ సంస్థ పీఎన్‌బీ హౌసింగ్ ఫైనాన్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) తొలి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. ఏప్రిల్–జూన్(క్యూ1)లో నికర లాభం 23 శాతం జంప్‌చేసి రూ. 534 కోట్లను తాకింది. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 433 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 1,832 కోట్ల నుంచి రూ. 2,082 కోట్లకు బలపడింది. వడ్డీ ఆదాయం రూ. 1,739 కోట్ల నుంచి రూ. 1,980 కోట్లకు ఎగసింది. నికర వడ్డీ ఆదాయం 17 శాతం వృద్ధితో రూ. 760 కోట్లకు చేరింది. గత క్యూ1లో రూ. 651 కోట్లుగా నమోదైంది. నికర వడ్డీ మార్జిన్లు 3.65 శాతం నుంచి 3.75 శాతానికి బలపడ్డాయి. స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 1.3% నుంచి 1.06 శాతానికి క్షీణించాయి. కనీస మూలధన నిష్పత్తి 28.96 శాతం నుంచి 29.68 శాతానికి మెరుగుపడింది.

ఫలితాల నేపథ్యంలో పీఎన్‌బీ హౌసింగ్ షేరు 0.3 % లాభంతో రూ. 1,085 వద్ద ముగిసింది.

దొడ్ల డెయిరీ.. డౌన్

క్యూ1లో రూ. 63 కోట్లు



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025–26) తొలి త్రైమాసికంలో ప్రయివేట్ రంగ కంపెనీ దొడ్ల డెయిరీ ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్–జూన్(క్యూ1)లో నికర లాభం 3 శాతం క్షీణించి రూ. 63 కోట్లకు పరిమితమైంది. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 65 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం మాత్రం రూ. 919 కోట్ల నుంచి రూ. 1,024 కోట్లకు ఎగసింది. అయితే మొత్తం వ్యయాలు సైతం రూ. 826 కోట్ల నుంచి రూ. 943 కోట్లకు పెరిగాయి.

ఫలితాల నేపథ్యంలో దొడ్ల డెయిరీ షేరు 7.6% పతనమై రూ. 1,337 వద్ద ముగిసింది.



సెల్వమ్ కార్తీ

నెదర్లాండ్స్ చేతిలో ఓడిన భారత్ 'ఎ'

పరాజయంతో యూరోప్ పర్యటనకు ముగింపు

ఐండోవెన్ (నెదర్లాండ్స్): భారత్ 'ఎ' పురుషుల హాకీ జట్టు యూరోప్ పర్యటనను పరాజయంతో ముగించింది. ఆఖరి మ్యాచ్‌లో భారత జట్టు 2–8 గోల్స్ తేడాతో నెదర్లాండ్స్ చేతిలో ఓడింది. యువ మిడ్‌ఫీల్డర్ రాజిందర్ సింగ్, ఫార్వర్డ్ ఆటగాడు సెల్వమ్ కార్తీ చెరో గోల్ చేశారు. అయితే ప్రపంచ నంబర్‌వన్ జట్టయిన డచ్ ఆటగాళ్ల ముందు టీమిండియా ప్లేయర్లు నిలవలేకపోయారు. గత వారం తలపడిన మ్యాచ్‌లో భారత్ ఒక్క గోల్ చేయకుండానే 0–3తో నెదర్లాండ్స్ చేతిలో కంగుతింది. ఈ నెల 8న మొదలైన ఈ ఐరోపా పర్యటనలో నెదర్లాండ్స్, బెల్జియం, ఐర్లాండ్, ఫ్రాన్స్, ఇంగ్లండ్‌లాంటి మేటి జట్లతో మొత్తం 8 మ్యాచ్‌లు ఆడింది. ఇందులో మూడే గెలుపొందిగిన భారత 'ఎ' జట్టు ఐదు మ్యాచ్‌ల్లో ఓడింది. జట్టు ప్రదర్శనపై కోచ్ శివేంద్ర సింగ్ మాట్లాడుతూ 'ఈ యూరోప్ టూర్‌లో గెలిచింది తక్కువే అయినా... ఇక్కడ ఫలితాల కంటే కూడా నేర్చుకున్న అనుభవం గురించే మాట్లాడాలి. ప్రపంచ హాకీలోనే గట్టి ప్రత్యర్థులతో తలపడటం... కొన్ని మ్యాచ్‌లో గెలుపొందడం ఆటగాళ్ల ఆత్మవిశ్వాసాన్ని పెంచింది' అని అన్నారు.



సింధు

ఈసారైనా మెరిసేనా!

నేటి నుంచి చైనా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ ● సింధు, లక్ష్య సేన్, ప్రణయ్‌లపై దృష్టి


చాంగ్జౌ: ఈ సీజన్‌లో నిరాశాజనక ప్రదర్శన కనబరుస్తున్న భారత స్టార్ షట్లర్ పీవీ సింధు మరో టోర్నమెంట్‌కు సిద్ధమైంది. నేడు మొదలయ్యే చైనా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–1000 బ్యాడ్మింటన్ టోర్నీలో సింధు తన అదృష్టాన్ని పరీక్షించుకోనుంది. బుధవారం జరిగే మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో జపాన్ ప్లేయర్, ప్రపంచ ఆరో ర్యాంకర్ టొమోకా మియజాకితో సింధు తలపడుతుంది. ముఖాముఖి రికార్డులో సింధు 0–1తో వెనుకబడి ఉంది. గత ఏడాది స్విస్ ఓపెన్ ప్రిక్వార్టర్ ఫైనల్లో మియజాకి చేతిలో సింధు ఓడిపోయింది. చైనా ఓపెన్‌లో సింధు తొలి రౌండ్ అడ్డంకిని దాటితే ప్రిక్వార్టర్ ఫైనల్లో ఉన్నతి హుడా (భారత్) లేదా క్రిస్టీ గిల్మోర్ (స్కాట్లాండ్)లలో ఒకరితో ఆడాల్సి ఉంటుంది. ప్రిక్వార్టర్ ఫైనల్లోనూ సింధు గెలిస్తే క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ మాజీ చాంపియన్ అకానె యామగుచి (జపాన్) లేదా బుసానన్ ఒంగ్‌బమ్‌రుంగ్‌ఫన్ (థాయ్‌లాండ్)లలో ఒకరితో ఆడవచ్చు. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 16వ స్థానంలో ఉన్న సింధు ఈ ఏడాది ఇండియా ఓపెన్, ఇండోనేసియా మాస్టర్స్, ఆల్ ఇంగ్లండ్ ఓపెన్, స్విస్ ఓపెన్, మలేసియా మాస్టర్స్, సింగపూర్ ఓపెన్, ఇండోనేసియా ఓపెన్, జపాన్ ఓపెన్‌లతోపాటు ఆసియా చాంపియన్‌షిప్, సుదిర్మన్ కప్ టోర్నీలలోఆడింది. ఇండియా ఓపెన్‌లో క్వార్టర్ ఫైనల్ చేరడమే ఈ సీజన్‌లో సింధు అత్యుత్తమ ప్రదర్శన కావడం గమనార్హం. చైనా ఓపెన్‌లో భారత్ నుంచి సింధు, ఉన్నతిలతోపాటు అనుపమ కూడా బరిలో ఉంది. మంగళవారం జరిగే తొలి రౌండ్‌లో చైనీస్ తైపీ ప్లేయర్ లిన్ సియాంగ్ టితో అనుపమ ఆడుతుంది.

మరోవైపు పురుషుల సింగిల్స్‌లో భారత్ నుంచి లక్ష్య సేన్, ప్రణయ్ మాత్రమే బరిలో ఉన్నారు. బుధవారం జరిగే తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో ఐదో సీడ్ లీ షి ఫెంగ్ (చైనా)తో లక్ష్య సేన్; కోకి వతనాబె (జపాన్)తో ప్రణయ్ పోటీపడతారు. ముఖాముఖి రికార్డులో లీ షి ఫెంగ్‌పై లక్ష్య సేన్ 7–5తో ఆధిక్యంలో ఉండగా... వతనాబెతో ఒకేసారి తలపడ్డ ప్రణయ్ ఓడిపోయాడు.

పురుషుల డబుల్స్‌లో భారత్ నుంచి సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి జోడీ మాత్రమే ఈ టోర్నీలో ఆడనుంది. తొలి రౌండ్‌లో కెన్యా మిత్సుహాషి–హిరోకి ఒకమురా (జపాన్)లతో సాత్విక్–చిరాగ్ తలపడతారు. మహిళల డబుల్స్‌లో భారత్ నుంచి సెల్వం కవిప్రియ–సిమ్రన్; రుతపర్ణ–శ్వేతాపర్ణ పాండా, అమృత–సోనాలీ సింగ్ జోడీలు ఆడుతున్నాయి. తొలి రౌండ్‌లో యియుంగ్ ఎన్గా టింగ్–యియుంగ్ పుయ్ లామ్‌లతో రుతపర్ణ–శ్వేతాపర్ణ; సియె పె షాన్–హుంగ్ ఎన్ జులతో అమృత–సోనాలీ; లౌరెన్ లామ్–అలీసన్ లీ (అమెరికా)లతో కవిప్రియ–సిమ్రన్ పోటీపడతారు. మిక్స్‌డ్ డబుల్స్‌లో తెలంగాణ అమ్మాయి గద్దె రుత్విక శివాని–రోహన్ కపూర్ (భారత్) జంట; అశిత్ సూర్య–అమృత జోడీలు బరిలో ఉన్నాయి. తొలి రౌండ్‌లో హోంగ్ టియెన్ సి–లిమ్ చియె సియెన్ (మలేసియా)లతో రుత్విక–రోహన్; రెహాన్–గ్లోరియా (ఇండోనేసియా)లతో అశిత్–అమృత తలపడతారు.

3 చైనా ఓపెన్ టోర్నమెంట్ చరిత్రలో భారత్ నుంచి ఇప్పటి వరకు ముగ్గురు చాంపియన్స్‌గా నిలిచారు. 2014లో కిడాంబి శ్రీకాంత్ పురుషుల సింగిల్స్ టైటిల్‌ను సాధించాడు. 2014లో సైనా నెహ్వాల్, 2016లో సింధు మహిళల సింగిల్స్‌లో టైటిల్‌ను సొంతం చేసుకున్నారు.

101 చైనా ఓపెన్ టోర్నమెంట్‌లో చైనా క్రీడాకారులు సాధించిన టైటిల్స్. 1986 నుంచి నిర్వహిస్తున్న ఈ టోర్నీలో చైనా నుంచి పురుషుల సింగిల్స్‌లో 19 మంది... మహిళల సింగిల్స్‌లో 25 మంది విజేతగా నిలిచారు. పురుషుల డబుల్స్‌లో చైనా నుంచి 9 జోడీలు... మహిళల డబుల్స్‌లో 29 జోడీలు... మిక్స్‌డ్ డబుల్స్‌లో 19 జోడీలు టైటిల్స్ గెలిచాయి.



రోహన్

రుత్విక



అర్జున్



ప్రజ్ఞానంద

అర్జున్‌కు ఆరు... ప్రజ్ఞానందకు ఏడు

లాస్ వేగస్: ఫ్రీస్టయిల్ చెస్ గ్రాండ్‌స్లామ్ టూర్ లాస్ వేగస్ టోర్నీలో భారత గ్రాండ్‌మాస్టర్లు ఇరిగేశి అర్జున్‌కు ఆరో స్థానం... ప్రజ్ఞానందకు ఏడో స్థానం లభించాయి. ఐదు–ఆరు స్థానాల కోసం జరిగిన మ్యాచ్‌లో అర్జున్ 0–2తో ఫాబియానో కరువానా (అమెరికా) చేతిలో ఓడిపోయాడు. తొలి గేమ్‌ను 39 ఎత్తుల్లో చేజార్చుకున్న అర్జున్... రెండో గేమ్‌ను 22 ఎత్తుల్లో కోల్పోయాడు. ఏడు–ఎనిమిది స్థానాల కోసం జరిగిన మ్యాచ్‌లో తమిళనాడు గ్రాండ్‌మాస్టర్ ప్రజ్ఞానంద 1.5–0.5తో వెస్లీ సో (అమెరికా)ను ఓడించాడు. తొలి గేమ్‌ను 61 ఎత్తుల్లో 'డ్రా' చేసుకున్న ప్రజ్ఞానంద... రెండో గేమ్‌లో 55 ఎత్తుల్లో గెలిచాడు. సోమవారం ముగిసిన ఈ టోర్నీలో అమెరికా గ్రాండ్‌మాస్టర్ లెవాన్ అరోనియన్ చాంపియన్‌గా అవతరించాడు. ఫైనల్లో అరోనియన్ 1.5–0.5తో అమెరికాకే చెందిన మరో గ్రాండ్‌మాస్టర్ హాన్స్ నీమన్‌పై విజయం సాధించాడు. వీరిద్దరి మధ్య తొలి గేమ్ 63 ఎత్తుల్లో 'డ్రా'కాగా... రెండో గేమ్‌లో అరోనియన్ 37 ఎత్తుల్లో గెలిచి టైటిల్‌ను ఖరారు చేసుకున్నాడు. నార్వే దిగ్గజం, ప్రపంచ నంబర్‌వన్ మాగ్నస్ కార్ల్‌సన్‌కు మూడో స్థానం దక్కింది. మూడు–నాలుగు స్థానాల కోసం జరిగిన మ్యాచ్‌లో కార్ల్‌సన్ 1.5–0.5తో హికారు నకమురా (అమెరికా)పై గెలుపొందాడు. విజేతగా నిలిచిన అరోనియన్‌కు 2 లక్షల డాలర్ల (రూ. 1 కోటీ 72 లక్షలు) ప్రైజ్‌మనీతోపాటు విన్నర్స్ ట్రోఫీ లభించింది. రన్నరప్ నీమన్‌కు 1 లక్ష 40 వేల డాలర్లు (రూ. 1 కోటీ 20 లక్షలు), మూడో స్థానం పొందిన కార్ల్‌సన్‌కు 1 లక్ష డాలర్లు (రూ. 86 లక్షలు) దక్కాయి. అర్జున్‌కు 40 వేల డాలర్లు (రూ. 34 లక్షల 49 వేలు), ప్రజ్ఞానందకు 30 వేల డాలర్లు (రూ. 25 లక్షల 87 వేలు) లభించాయి.



విజేత అరోనియన్

కొత్త అశ్వంతో మెరిసిన అనుశ్



హోఫ్గిస్మార్ (జర్మనీ): ఈక్వెస్ట్రియన్‌లో రాణిస్తోన్న భారత రైడర్ అనుశ్ అగర్‌వల్లా జర్మనీలో బోణీ కొట్టాడు. జుబిలామ్స్‌టర్నియెర్ హోఫ్గిస్మార్ ఓపెన్‌లో పోటీపడుతున్న భారత ఆటగాడు అనుశ్ కొత్త రేస్ గుర్రం 'ఫ్లారియానా'తో తొలి విజయం సాధించాడు. పారిస్ ఒలింపిక్స్‌లో పోటీపడిన ఈ ఈక్వెస్ట్రియన్ ప్లేయర్ డ్రెస్సేజ్ ఈవెంట్‌లో 69.891 పాయింట్ల శాతంతో విజేతగా నిలిచాడు. ఆరుగురు రైడర్లు పోటీపడిన ఈ వెంట్‌లో ఐదుగురు జర్మనీ ఆటగాళ్లే బరిలోకి ఉన్నప్పటికీ వారి సొంతగడ్డపై అనుశ్ ప్రత్యర్థి రైడర్లను చిత్తు చేశాడు. అతని జోరుకు పియా పియోత్రోస్కి, కథారినా హెమ్మెర్ వరుసగా రెండు, మూడు స్థానాలతో సరిపెట్టుకున్నారు. కారమెల్లో (పాత రేసుగుర్రం)తో పారిస్ ఒలింపిక్స్ సహా పలు టోర్నీల్లో పాల్గొన్న అనుశ్ ఇటీవలే తన అశ్విక నేస్తానికి రిటైర్మెంట్ ప్రకటించాడు. నిజానికి ఫ్లారియానా (కొత్త అశ్వం)తో పోటీపడిన రెండో ఈవెంట్‌లోనే విజయం సాధించడం గొప్ప విషయం. విజయానంతరం అనుశ్ మాట్లాడుతూ 'ఇక్కడ గెలుపొందడం... అది కూడా కొత్త సవారీతో ఇంత త్వరగా రెండో పోటీలోనే విజయం దక్కడం చాలా ఆనందంగా ఉంది. జోరుకు తగ్గ వేగాన్ని అందుకుంది. సమన్వయం బాగా కుదిరింది. అనా స్కాలర్మన్ కోచింగ్ కూడా గెలిచేందుకు పనికొచ్చింది. ఫ్లారియానాతో ఇది ప్రారంభం మాత్రమే. భవిష్యత్తులో మరిన్ని విజయాలు అందుకుంటాను' అని అన్నాడు.

క్వార్టర్స్‌లో భారత్ ఓటమి

సోలో (ఇండోనేసియా): ఆసియా జూనియర్ మిక్స్‌డ్ టీమ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో భారత జట్టు కథ ముగిసింది. పతకం ఖాయం చేసుకోవాలంటే కచ్చితంగా గెలవాల్సిన మ్యాచ్‌లో భారత జట్టు ఓటమి పాలైంది. ఇండోనేసియాలోని సోలో నగరంలో జరుగుతున్న ఈ టోర్నీలో సోమవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో టీమిండియా 104–110 పాయింట్ల తేడాతో జపాన్ జట్టు చేతిలో ఓడిపోయింది. గ్రూప్ దశలో ఆడిన మూడు మ్యాచ్‌ల్లో (హాంకాంగ్, యూఏఈ, శ్రీలంక) నెగ్గి 'టాపర్'గా నిలిచిన భారత్ కీలకమైన మ్యాచ్‌లో మాత్రం ఓడింది.

శ్రీకాంత్‌కు నిరాశ

మనామా (బహ్రెయిన్): ప్రపంచ అండర్–21 స్నూకర్ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన తెలంగాణ ప్లేయర్ గడ్డం శ్రీకాంత్‌కు నిరాశ ఎదురైంది. 19 ఏళ్ల శ్రీకాంత్ గ్రూప్ దశలోనే నిష్క్రమించాడు. గ్రూప్ 'హెచ్'లో శ్రీకాంత్ ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ ఓడిపోయాడు. చియు చువాన్ టుంగ్ (చైనీస్ తైపీ)తో జరిగిన మ్యాచ్‌లో శ్రీకాంత్ 5–69, 23–63, 8–60తో... అబ్దుల్లా అలాఅలీ (బహ్రెయిన్)తో జరిగిన మ్యాచ్‌లో 51–19, 6–57, 14–63, 43–66తో... మ్యాక్స్ హాండ్లీ (ఆస్ట్రేలియా)తో జరిగిన మ్యాచ్‌లో 10–68, 43–79, 18–54తో పరాజయం పాలయ్యాడు.

భారత్‌కు మా హాకీ జట్టును పంపించం: పాక్



కరాచీ: భారత్, పాకిస్తాన్ మధ్య ప్రస్తుతం నెలకొని ఉన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ఆసియా కప్‌లో ఆడేందుకు తమ జట్టుకు భారత్‌కు పంపించడం లేదని పాక్ హాకీ సమాఖ్య (పీహెచ్ఎఫ్) ప్రకటించింది. ఈ విషయాన్ని ఇప్పటికే అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్ఐహెచ్)కు దీనికి సంబంధించి సమాచారం అందించినట్లు పీహెచ్ఎఫ్ పేర్కొంది. 'ప్రస్తుత పరిస్థితుల్లో భారత్‌లో ఆడితే మా జట్టుకు భద్రతాపరమైన సమస్యలు ఎదురు కావచ్చు. అక్కడ జరిగే ఆసియా కప్‌లో పాల్గొనేందుకు మా ఆటగాళ్లు కూడా వెనుకంజ వేస్తున్నారు. మా భద్రతపై హామీ ఇస్తేనే మేం టోర్నీపై దృష్టి పెట్టగలం. ఇదే విషయాన్ని ఎఫ్ఐహెచ్‌కు వెల్లడించాం' అని పీహెచ్ఎఫ్ అధ్యక్షుడు తారిఖ్ బుగ్తీ స్పష్టం చేశారు.

ఒవెన్, గ్రీన్ మెరుపులు

తొలి టి20లో వెస్టిండీస్‌పై ఆస్ట్రేలియా విజయం

కింగ్‌స్టన్ (జమైకా): వెస్టిండీస్‌ను టెస్టు సిరీస్‌లో చిత్తు చేసిన ఆస్ట్రేలియా ఐదు మ్యాచ్‌ల టి20 సిరీస్‌లో కూడా శుభారంభం చేసింది. భారత కాలమానం ప్రకారం సోమవారం తెల్లవారుజామున జరిగిన తొలి టి20లో ఆసీస్ 3 వికెట్ల తేడాతో విండీస్‌ను ఓడించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన వెస్టిండీస్ 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 189 పరుగులు చేసింది. రోస్టన్ ఛేజ్ (32 బంతుల్లో 60; 9 ఫోర్లు, 2 సిక్స్‌లు), కెప్టెన్ షై హోప్ (39 బంతుల్లో 55; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధ సెంచరీలు చేయగా, హెట్‌మైర్ (19 బంతుల్లో 38; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) రాణించాడు. ఆసీస్ బౌలర్లలో బెన్ డ్వార్‌షుయిస్ (4/36) కీలక వికెట్లు పడగొట్టాడు. అనంతరం ఆస్ట్రేలియా 18.5 ఓవర్లలో 7 వికెట్లకు 190 పరుగులు చేసి గెలిచింది. ఈ మ్యాచ్‌తోనే అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేసిన మిచెల్ ఒవెన్ (27 బంతుల్లో 50; 6 సిక్స్‌లు), కామెరాన్ గ్రీన్ (26 బంతుల్లో 51; 2 ఫోర్లు, 5 సిక్స్‌లు) కీలక భాగస్వామ్యంతో జట్టును గెలిపించారు. ఆసీస్ స్కోరు 78/4 వద్ద ఉండగా... వీరిద్దరు ఐదో వికెట్‌కు 40 బంతుల్లో 80 పరుగులు జోడించారు. గుడకేశ్ మోతీ, హోల్డర్, అల్జారీ జోసెఫ్ తలా 2 వికెట్లు తీశారు. భారీ సిక్సర్లతో చెలరేగడంతో పాటు ఒక వికెట్ కూడా తీసిన ఒవెన్ తన తొలి మ్యాచ్‌లోనే 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు. సిరీస్‌లో ఆసీస్ 1–0తో ముందంజ వేయగా, రెండో టి20 ఇదే మైదానంలో రేపు జరుగుతుంది. ఇదే మ్యాచ్‌తో విండీస్ ఆల్‌రౌండర్ ఆండ్రీ రసెల్ రిటైర్ కానున్నాడు.



ఒవెన్, గ్రీన్




చైనాలోని గ్వాంగ్‌డాంగ్ ప్రావిన్స్‌లోని షెంజెన్‌లోని ఓ బుక్ స్టోర్ ఇది. ఆధునిక సాంకేతికతతో అబ్బురమనిపించే ఈ పుస్తకాలయంలోకి వెళ్లిన పాఠకులకు హాలీవుడ్ బ్లాక్ బస్టర్ సినిమా 'ఇన్సెప్షన్'ను గుర్తుకు రావడం ఖాయం.



విఫా తుపాను ప్రభావంతో ఫిలిప్పీన్స్‌లో కుండపోతగా వర్షాలు కురుస్తున్నాయి. క్వెజాన్ నగరంలోని ఓ వీధిలో నడుములోతు వరదలో నడిచి వెళ్తున్న ఓ వ్యక్తి

బెంగాల్ అస్తిత్వాన్ని దెబ్బతీసేందుకు కుట్ర

బీజేపీ, ఎన్నికల సంఘం కలిసి పనిచేస్తున్నాయి

బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆరోపణలు

వేధింపులు ఆపకపోతే ఢిల్లీవరకూ పోరాటం చేస్తామని హెచ్చరిక

కోల్‌కతా: బీజేపీ, ఎన్నికల సంఘం కలిసి.. బెంగాల్ అస్తిత్వాన్ని దెబ్బతీసేందుకు కుట్ర చేస్తున్నాయని పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆరోపించారు. బెంగాల్ అస్తిత్వానికే ముప్పుగా ఉన్న బీజేపీని అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిస్తామని, ఆ తరువాత కేంద్రంలో ఓడించేందుకు పోరాటం కొనసాగిస్తామని ఆమె స్పష్టం చేశారు. కోల్‌కతాలో జరిగిన తృణమూల్ కాంగ్రెస్ అమరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం జరిగిన ర్యాలీలో మమత ప్రసంగించారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఉన్న బెంగాలీలను ఆ పార్టీ వేధిస్తోందని, బెంగాలీ కమ్యూనిటీ గుర్తింపును తుడిచిపెట్టడానికి ప్రయత్నిస్తోందని ఆరోపించారు. బెంగాలీ చిహ్నాలను సైతం అవమానించే దుష్ట చర్యలకు పాల్పడుతోందని, 2019లో ఆ పార్టీ ఈశ్వర్ చంద్ర విద్యాసాగర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిందని గుర్తు చేశారు. ఇప్పుడు బెంగాలీ ఓటర్ల పేర్లను జాబితాల నుంచి తొలగించడం, నిర్బంధ శిబిరాలకు తరలించడం చేస్తోందన్నారు. ఎంత మందిని జైలులోపెడతారో చూస్తానని, ఈ వేధింపులు ఆపకపోతే తమ ప్రతిఘటన ఉద్యమం ఢిల్లీకి చేరుకుంటుందని హెచ్చరించారు. బెంగాలీ భాష, సంస్కృతిపై బీజేపీ దాడికి వ్యతిరేకంగా జూలై 27 నుంచి బెంగాల్‌లో ఒక ఉద్యమం ప్రారంభమవుతుందని మమత ప్రకటించారు.

ధర్నాలకు సిద్ధం కండి..

బెంగాలీలకు ఎన్ఆర్సీ నోటీసులు పంపే హక్కు అస్సాం ప్రభుత్వానికి ఎవరిచ్చారని మమతా బెనర్జీ ప్రశ్నించారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన దాదాపు 1.5 కోట్ల మంది వలసదారులకు బెంగాల్ నిలయంగా ఉందని ఆమె వెల్లడించారు. భారత నలుమూలల నుంచి ప్రజలను తాము స్వాగతిస్తున్నామని, కానీ బీజేపీ మాత్రం బెంగాలీలపై వేధింపులకు పాల్పడుతోందని ఆమె మండిపడ్డారు. ఎన్నికల కమిషన్‌తో కలిసి బీజేపీ కుట్రకు పాల్పడుతోందని ఆమె రోపించారు. వారు బిహార్‌లో ఓటర్ల జాబితా సవరణ ద్వారా చేసినట్లు బెంగాల్‌లో కూడా చేయాలనుకుంటున్నారని మండిపడ్డారు. 'బిహార్‌లో 40 లక్షల మంది ఓటర్ల పేర్లను తొలగించారు. ఇక్కడ కూడా ప్రయత్నిస్తే అనుమతించబోం. మేం అడ్డుకుంటాం'అని మమత హెచ్చరించారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఒక్క బెంగాలీని నిర్బంధించినా లేదా వేధించినా, ఇక్కడ వారికి సంఘీభావం ప్రకటించడానికి ధర్నాలో కూర్చోవాలని పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు.



బీజేపీది సూపర్ ఎమర్జెన్సీ..

దశాబ్దాల కిందటి కాంగ్రెస్ ఎమర్జెన్సీ గురించి మాట్లాడుతున్న బీజేపీ.. ఇప్పుడు దేశంలో సూపర్ ఎమర్జెన్సీ అమలు చేస్తోందని మండిపడ్డారు. బీజేపీ అధికారంలోకి వస్తే బెంగాల్‌లో అభివృద్ధి జరుగుతుందని అంటున్నారని, 11 ఏళ్లలో దేశంలో చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పాలని ప్రధాని నరేంద్ర మోదీని మమత ప్రశ్నించారు. 'అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నియంత్రణలో ఉన్న మీరు.. మాకు ఉపన్యాసాలు ఇస్తారా?'అని ఇటీవల బెంగాల్‌లో జరిగిన బీజేపీ ర్యాలీలో మోదీ ప్రసంగాన్ని ఉద్దేశించి ప్రశ్నించారు. సంకెళ్లతో బంధించి మరీ సైనిక విమానాల్లో భారతీయ వలసదారులను అమెరికా బహిష్కరించినప్పుడు బీజేపీ ఏం చేసిందని నిలదీశారు. టెలిప్రాంప్టర్ చూసి బెంగాలీలో మాట్లాడి బెంగాలీల హృదయాలను గెలుచుకోగలరని అనుకుంటున్నారని, పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను ఆక్రమించలేకపోయిన బీజేపీ.. బెంగాల్ గురించి కలలు కనడం మానేస్తే మంచిదని హితవు పలికారు. బెంగాల్‌లో మహిళల భద్రతపై మాట్లాడుతున్న బీజేపీ.. ఆ పార్టీ పాలిత రాష్ట్రాల్లో మహిళలపై జరుగుతున్న హింస గురించి సమాధానం చెప్పాలని సవాలు విసిరారు. బెంగాల్ హింసాత్మక కేసులలో ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని దీదీ స్పష్టం చేశారు.

హై రెజల్యూషన్ సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయాలి

- పాఠశాలల భద్రతా నిబంధనలను సవరించిన సీబీఎస్ఈ

న్యూఢిల్లీ: పాఠశాలల్లో భద్రతను మరింత కట్టుదిట్టం చేయడంపై సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) దృష్టి సారించింది. పాఠశాలల్లో సీసీటీవీ కెమెరాల ఏర్పాటుపై ఇంతకుముందున్న నిబంధనలను సవరించింది. రియల్ టైమ్ ఆడియో విజువల్ రికార్డింగ్ హై రెజల్యూషన్ సీసీటీవీ కెమెరాలను పాఠశాలల్లోని టాయిలెట్స్ మినహా ప్రవేశ, నిష్క్రమణ ద్వారాలు, లాబీలు, కారిడార్లు, మెట్లు, అన్ని తరగతి గదులు, ల్యాబ్‌లు, లైబ్రరీ, క్యాంటీన్ ప్రాంతం, స్టోర్‌రూమ్, ఆటస్థలం.. ఇలా అన్ని చోట్లా ఏర్పాటు చేయాలని ఆదేశించింది. 'విద్యార్థుల భద్రత పాఠశాలల అతి ముఖ్యమైన బాధ్యత. విద్యార్థులు పాఠశాలలో సురక్షితమైన వాతావరణంలో ఉండేలా చూసుకోవాలి. ఈ కెమెరాలన్నీ కనీసం 15 రోజుల ఫుటేజ్‌ను నిల్వ చేయగల సామర్థ్యాన్ని కలిగి ఉండాలి. అవసరమైతే అధికారులకు కనీసం 15 రోజుల బ్యాకప్ అందజేసేలా ఉండాలి'అని సీబీఎస్ఈ సెక్రటరీ హిమాన్షు గుప్తా తెలిపారు. ఇంటినుంచి పాఠశాలకు వచ్చిన పిల్లలకు.. ఇంటి తరహా భద్రమైన వాతావరణాన్ని కల్పించాల్సిన అవసరం పాఠశాలలపై ఉందన్నారు. సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయడం వల్ల పిల్లల్లో ఏ రకమైన మానసిక, సామాజిక పరమైన సమస్యలు రాకుండా, వారిపై హింస జరగకుండా, అలాగే ఏదైనా ఇతర విపత్తుల నుంచి భద్రత కలిగించే అవకాశం ఉందన్నారు. బెదిరింపులు ఎదుర్కొన్న బాధిత విద్యార్థుల్లో ఆత్మగౌరవం తగ్గిపోతుందని, రోజువారీ ఒత్తిడికి కూడా గురవుతారని... పిల్లలకు భావోద్వేగపరమైన భద్రత కల్పించడం చాలా ముఖ్యమని ఆయన పేర్కొన్నారు.

వైష్ణోదేవి ఆలయం వద్ద విరిగిపడిన కొండచరియలు

- ఒక యాత్రికుడు మృతి, 9 మందికి గాయాలు

జమ్మూ: జమ్మూకశ్మీర్‌లోని రియాసి జిల్లాలో ప్రఖ్యాత వైష్ణోదేవి ఆలయం వద్ద పాత రైల్వే ట్రాక్‌పై కొండచరియలు విరిగిపడిన ఘటనలో ఒక భక్తుడు ప్రాణాలు కోల్పోగా తొమ్మిది మందికి గాయాలయ్యాయి. సోమవారం ఉదయం 8.30 గంటల సమయంలో భారీ వర్షం కురుస్తున్న సమయంలో గుల్షన్‌కా లంగార్ వద్ద ఘటన చోటుచేసుకుంది. పెద్ద సంఖ్యలో బండరాళ్లు, మట్టిపెళ్లలు ఒక్కసారిగా పడటంతో యాత్రికులుండే కాట్రాలోని బేస్ క్యాంప్ షెడ్డు కుప్పకూలింది. దీనికింద పడి చెన్నైకు చెందిన ఉప్పన్ శ్రీవాస్తవ(70), ఆయన భార్య రాధ(66), హరియాణా వాసి రాజేందర్ భల్లా(70) తీవ్రంగా గాయపడ్డారు. మరో ఏడుగురికి స్వల్పంగా గాయాలయ్యాయి. వీరిని వెంటనే నారాయణ్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శ్రీవాస్తవ కన్నుమూశారని అధికారులు తెలిపారు. భారీ యంత్రాలతో సహాయక కార్యక్రమాలు కొనసాగుతున్నాయన్నారు. ఈ ఘటన నేపథ్యంలో ముందు జాగ్రత్తగా యాత్రను కొద్దిసేపు నిలిపివేశారు. హిమ్‌కోటి సమీపంలో ఆదివారం రాత్రి కొండచరియలు విరిగిపడటంతో కొత్త రైలు మార్గం మూసుకుపోయిందని, పునరుద్ధరణ ప్రయత్నాలు వేగంగా కొనసాగుతున్నాయని అధికారులు చెప్పారు. స్థానిక యంత్రాంగంతోపాటు ఆర్మీ సిబ్బందిని రంగంలోకి దించామన్నారు.

సిగ్గుపడాల్సిన విషయం

- ఒడిశాలో 15 ఏళ్ల బాలిక దహనం కేసుపై సుప్రీంకోర్టు ఆగ్రహం
- గ్రామీణ మహిళలు, పిల్లల భద్రతకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశం

న్యూఢిల్లీ: ఒడిశాలో 15 ఏళ్ల బాలిక దహనం దురదృష్టకరం, సిగ్గుపడాల్సిన విషయమని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలకు సాధికారత, సురక్షితమైన వాతావరణాన్ని అందించాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పింది. 'గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలల బాలికలు, గృహిణులు, పిల్లల పరిస్థితి అత్యంత దుర్బలంగా ఉంది. వారిని శక్తివంతం చేయాలి. అందుకు మా ఈ ఆదేశాలు ఉపయోగపడాలి'అని ఆదేశించింది. వారి భద్రతకోసం కొన్ని స్వల్పకాలిక, దీర్ఘకాలిక కార్యక్రమాలను రూపొందించాల్సిన అవసరం ఉందని, తద్వారా తాలూకా స్థాయిలో నివసించే మహిళలకు అవగాహన, సాధికారత కల్పించవచ్చని ధర్మాసనం పేర్కొంది. తాలూకా స్థాయిలో మహిళలకు శిక్షణ ఇచ్చి పారాలీగల్ వలంటీర్లుగా నియమించవచ్చని, మహిళలకు వారి హక్కుల గురించి అవగాహన కల్పించడానికి అంగన్‌వాడీ కార్యకర్తల సహాయం కూడా తీసుకోవచ్చని ధర్మాసనం పేర్కొంది. మహిళలు, పిల్లలు, ట్రాన్స్‌పర్సన్‌లకు సురక్షితమైన వాతావరణం కోసం పాన్-ఇండియా మార్గదర్శకాలను రూపొందించడానికి ఆదేశాలు కోరుతూ గత సంవత్సరం డిసెంబర్ 16న దాఖలైన ఈ పిటిషన్‌ను సుప్రీంకోర్టు అంగీకరించింది. దీనిపై జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్య బాగ్చిలతో కూడిన ధర్మాసనం సోమవారం విచారణ జరిపింది. ఇది ప్రభుత్వాల వ్యతిరేక వ్యాజ్యం కాదని, మహిళల భద్రతకోసం కేంద్రం, అన్ని పార్టీల నుంచి సూచనలు అవసరమని ధర్మాసనం పేర్కొంది. కేంద్రం తరఫున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి మాట్లాడుతూ, లైంగిక నేరస్థులను గుర్తించడానికి, సకాలంలో చర్యలు తీసుకోవడానికి బహిరంగ ప్రదేశాల్లో సీసీటీవీ కెమెరాలు, ఫేస్ స్కాన్ వ్యవస్థలను ఏర్పాటు చేస్తుందని చెప్పారు. బాధలో ఉన్న మహిళలకు సహాయపడేలా ప్రతి జిల్లాలో వన్-స్టాప్ సెంటర్లు పనిచేస్తున్నాయని ఆమె అన్నారు. అయితే, వన్-స్టాప్ సెంటర్ తాలూకా స్థాయికి వెళ్లాల్సిన అవసరం ఉందని ధర్మాసనం సూచించింది.

ఇజ్రాయెల్ ఆర్మీ యథేచ్ఛగా కాల్పులు

- గాజాలోని ఆహార కేంద్రాల వద్ద అమానవీయ చర్యలు
- తీవ్రంగా ఖండించిన యూకే, ఫ్రాన్స్ తదితర 23 దేశాలు
- 59 వేలు దాటిన పాలస్తీనియన్ల మరణాలు

గాజా/లండన్: గాజాలోని అన్నార్తుల పట్ల ఇజ్రాయెల్ అనుసరిస్తున్న వైఖరిని ఐరాస తీవ్రంగా ఖండించింది. ఆహార కేంద్రాల వద్దకు వచ్చే వారిపై ఇజ్రాయెల్ ఆర్మీ యథేచ్ఛగా కాల్పుల జరుపుతోందంటూ మండిపడింది. ఆదివారం ఒక్క రోజే 80 మంది ఉసురుతీయడాన్ని ప్రస్తావించిన ఐరాస ఆహార విభాగం(డబ్ల్యూఎఫ్‌పీ)..పాలస్తీనియన్ల పాలిట భయంకరమైన రోజుల్లో ఒకటని అభివర్ణించింది. ఆదివారం ఆహార పదార్థాలతో గాజానగరంలోకి ప్రవేశించిన ట్రక్కుల దిశగా వెళ్తున్న వారిపైకి ఇజ్రాయెల్ ఆర్మీ కాల్పులు జరపడంతో భారీ సంఖ్యలో జనం చనిపోవడం తెల్సిందే. కాగా, డబ్ల్యూఎఫ్‌పీ ప్రకటనపై ఇజ్రాయెల్ స్పందించలేదు. ఇలా ఉండగా, ఆదివారం రాత్రి నుంచి గాజాపై ఇజ్రాయెల్ ఆర్మీ సాగించిన వైమానిక దాడుల్లో ఇద్దరు మహిళలు, ఐదుగురు చిన్నారులు సహా 13 మంది చనిపోయారు. సెంట్రల్ గాజాలోని నెట్‌జరిమ్ కారిడార్ వద్ద గుంపుగా చేరిన పాలస్తీనియన్లపై జరిపిన కాల్పుల్లో ఇద్దరు చనిపోయారు. హమాస్ శ్రేణులు లక్ష్యంగా 21 నెలలుగా యథేచ్ఛగా ఇజ్రాయెల్ ఆర్మీ సాగిస్తున్న దాడుల్లో మరణాలు 59 వేలు దాటాయని గాజా ఆరోగ్య విభాగం సోమవారం తెలిపింది. 2023 అక్టోబర్ 7 నుంచి సాగిస్తున్న దాడుల్లో క్షతగాత్రుల సంఖ్య 1,42,135కు చేరుకుందని వివరించింది.

తక్షణమే హింస ఆగిపోవాలి

గాజాపై సాగిస్తున్న దాడులను వెంటనే నిలిపివేయాలని యూకే, ఫ్రాన్స్ తదితర 23 దేశాలు ఇజ్రాయెల్‌ను కోరాయి. అంతర్జాతీయ చట్టాలు, నిబంధనలను గౌరవించాలని హితవు పలికాయి. ఇందులో 20 యూరప్ దేశాలతోపాటు ఆస్ట్రేలియా, కెనడా, జపాన్ ఉన్నాయి. ఆయా దేశాల విదేశాంగ శాఖ మంత్రులు ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. గాజా పౌరుల అవస్థలు ఇప్పుడు తీవ్ర స్థాయికి చేరాయి. నీరు, ఆహారం వంటి కనీస అవసరాలను తీర్చాలని కోరుతున్న పాలస్తీనా పౌరులు, ముఖ్యంగా చిన్నారులను అమానవీయంగా చంపడం ఆపాలని వారు కోరారు.

రన్ వే నుంచి జారిన ఎయిరిండియా విమానం

- ప్రయాణికులు, సిబ్బంది సురక్షితం

ముంబై: ఎయిరిండియా విమానానికి భారీ ప్రమాదం తప్పింది. కోచి నుంచి టేకాఫ్ తీసుకున్న ఈ విమానం ముంబైలోని ఛత్రపతి శివాజీ మహారాజ్ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టులో సోమవారం ఉదయం 9.27 గంటల సమయంలో ల్యాండవుతూ అదుపుతప్పింది. రన్‌వే నుంచి జారి పక్కకు మళ్లింది. అయితే, అదృష్టవశాత్తూ ప్రయాణికులు, సిబ్బంది సురక్షితంగా బయటపడ్డారు. ఎవరికీ ఏమీ కాలేదు. ఆ సమయంలో భారీగా వర్షం కురుస్తుండటంతో టైర్లు జారాయని అధికారులు తెలిపారు. అనంతరం విమానాన్ని గేట్ వద్దకు సురక్షితంగా చేర్చి, ప్రయాణికులు, సిబ్బందిని కిందికి దించామన్నారు. ఘటన కారణంగా నంబర్ 09/27 రన్ వే దెబ్బతింది, విమానం మూడు టైర్లు పగిలాయి. మట్టి చేరడంతో ఇంజిన్ ఆగిపోయింది. దీంతో ప్రత్యామ్నాయంగా నంబర్ 14/32 రన్‌వేపై రాకపోకలను వెంటనే ప్రారంభించామని అధికారులు తెలిపారు. దేశంలో అత్యంత రద్దీగా ఉండే విమానాశ్రయాల్లో ఒక్కటైన ఛత్రపతి శివాజీ మహారాజ్ ఎయిర్‌పోర్టుకు రెండు రన్‌వేలున్నాయి.

ఒక పోలింగ్ కేంద్రానికి 1,200 ఓటర్లు

- జాబితాను తగ్గించిన ఎన్నికల సంఘం
- క్యూలు తగ్గించేందుకు అదనపు పోలింగ్ కేంద్రాల ఏర్పాటు

న్యూఢిల్లీ: పోలింగ్ కేంద్రానికి అత్యంత తక్కువ ఓటర్లు కలిగిన తొలి రాష్ట్రంగా బీహార్ రికార్డు సృష్టించిందని ఎన్నికల సంఘం సోమవారం తెలిపింది. ఒక్కో పోలింగ్ కేంద్రానికి సగటున 1,200 ఓటర్లు ఉండేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపింది. గతంలో 1,500 ఉన్న సంఖ్యను 1,200కు తగ్గించినట్లు పేర్కొంది. ఈ సంఖ్యను తగ్గించడానికి 12,817 కొత్త పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని వెల్లడించింది. కొత్త కేంద్రాల ఏర్పాటుతో మొత్తం సంఖ్య 90,712కు పెరిగిందని వెల్లడించింది. పోలింగ్ కేంద్రాల్లో క్యూలను తగ్గించడానికి బీహార్ తీసుకున్న చర్యలను అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు పాటిస్తే మంచిదని సూచించింది. ఓటర్లకు కేవలం రెండు కిలోమీటర్ల లోపు కేంద్రాలు ఉండేలా చర్యలు తీసుకున్నట్లు వెల్లడించింది. ఎక్కువ జనాభా ఉన్న ఎత్తైన అపార్ట్‌మెంట్లు, సొసైటీలు ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక పోలింగ్ స్టేషన్ ఏర్పాటు చేసినట్లు వెల్లడించింది.

పూర్తి నిష్పాక్షికంగా ఏఏఐబీ దర్యాప్తు

- రాజ్యసభలో మంత్రి రామ్మోహన్ నాయుడు వెల్లడి

న్యూఢిల్లీ: అహ్మదాబాద్‌లో జరిగిన ఎయిరిండియా ప్రమాద ఘటనపై ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో(ఏఏఐబీ) విభాగం పూర్తి నిష్పాక్షికతతో దర్యాప్తు జరుపుతోందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. ఘోరానికి గల కారణాలపై అంతర్జాతీయ ప్రమాణాలు, నిబంధనలకు లోబడి విచారణ కొనసాగిస్తోందన్నారు. సోమవారం రాజ్యసభలో ఆయన మాట్లాడారు. మన దేశంలో చాలా బలమైన విమానయాన భద్రతా యంత్రాంగం ఉందని ప్రకటించారు. ఏఏఐబీ దర్యాప్తు తుది నివేదికలో ప్రమాదానికి దారి తీసిన కారణాలపై వాస్తవాలు వెలుగు చూస్తాయని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. వాటి ఆధారంగా దిద్దుబాటు చర్యలుంటాయన్నారు.

ఖర్గేకు పుట్టినరోజు శుభాకాంక్షల వెల్లువ

న్యూఢిల్లీ: కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. పార్లమెంట్ ప్రాంగణంలోని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ ఎంపీలు ఖర్గే పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా వండి తెచ్చిన కేక్‌ను రాహుల్ సహా పలువురు ఎంపీల సమక్షంలో ఖర్గే కట్ చేశారు. 84వ ఏట అడుగుపెట్టిన ఆయనకు పలువురు నేతల నుంచి పుట్టినరోజు శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. 'కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గేజీకి పుట్టినరోజు శుభాకాంక్షలు! మీ నాయకత్వం, నిబద్ధత, భారత ప్రజల పట్ల అంకితభావం మాకందరికీ స్ఫూర్తినిస్తాయి. మీరు మంచి ఆరోగ్యం మరియు ఆనందాన్ని పొందాలి'అని రాహుల్‌గాంధీ ఆకాంక్షించారు. ప్రియాంక గాంధీ కూడా ఖర్గేకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. 'మీ నాయకత్వంతో పాటు మన రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం సూత్రాల పట్ల మీ నిబద్ధత మాకందరికీ స్ఫూర్తిదాయకం. మీ మంచి ఆరోగ్యం, దీర్ఘాయుష్షు కోసం నేను దేవుడిని ప్రార్థిస్తున్నాను'అని ఆమె ఎక్స్‌లో హిందీలో పోస్ట్ చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ కూడా ఖర్గేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



కేక్ కట్ చేస్తున్న ఖర్గే, పక్కన రాహుల్‌గాంధీ

స్వెయిదాలో కాల్పుల విరమణ

- బెడౌయిన్లను ఖాళీ చేయిస్తున్న సిరియా ఆర్మీ

డెమాస్కస్: సిరియాలోని స్వెయిదా ప్రావిన్స్‌లో పరిస్థితులు చక్కబడుతున్నాయి. డ్రుజ్ మిలీషియా, బెడౌయిన్ ఫైటర్ల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి వచ్చింది. దీంతో సోమవారం సిరియా ప్రభుత్వ బలగాలు స్వెయిదాలో చిక్కుకుపోయిన బెడౌయిన్ కుటుంబాలను అక్కడి నుంచి రెడ్ క్రీసెంట్ బస్సులు, అంబులెన్సుల ద్వారా ఖాళీ చేయిస్తున్నాయి. ఇందుకు బదులుగా బందీలుగా ఉంచుకున్న డ్రుజ్ మహిళల్ని బెడౌయిన్లు విడుదల చేయాల్సి ఉంటుంది. గత వారం జరిగిన ఘర్షణల్లో వందలాది మంది చనిపోవడం తెల్సిందే. ఈ కనీసం 1.30 లక్షల మంది స్వస్థలాలను వీడి వెళ్లిపోయినట్లు ఐరాస అంచనా వేసింది. స్వెయిదా ప్రావిన్స్‌లోని మెజారిటీ డ్రుజ్ వర్గానికి అనుకూలంగా ఇజ్రాయెల్ బలగాలు బెడౌన్లకు సాయపడుతున్న సిరియా ప్రభుత్వ బలగాలపై వైమానిక దాడులకు దిగాయి. ఒప్పందం ప్రకారం ఈ ప్రావిన్స్‌లోని ఇతర చోట్ల ఉన్న డ్రుజ్ వర్గం వారిని కూడా ఖాళీ చేయించాల్సి ఉంటుంది. కాల్పుల విరమణ మరింత కాలం అమలయ్యే లక్ష్యంతో జోర్డాన్ మధ్యవర్తిత్వంలో చర్చలు కొనసాగుతున్నాయి. ఇందులో సిరియాలో అమెరికా ప్రతినిధి టామ్ బర్రాక్ కూడా పాల్గొంటున్నారు.

కూరగాయల వ్యాపారికి రూ.29 లక్షల జీఎస్టీ

- నాలుగేళ్ల లావాదేవీలకు ఒకేసారి పన్ను
- యూపీఐ చెల్లింపుల ఆధారంగా జీఎస్టీ
- 11వేల మందికి నోటీసులు జారీ చేసిన జీఎస్టీ విభాగం

బెంగళూరు: యూపీఐ చెల్లింపులు చిన్న తరహా వ్యాపారులకు ముప్పుగా పరిణమించాయి. వస్తువులు, సేవల పన్ను (జీఎస్టీ) పరిధిలోకి రాని వ్యాపారులను సైతం ఇవి బెంబేలెత్తిస్తున్నాయి. కర్ణాటకలోని హావేరికి చెందిన శంకర్‌గౌడ చిన్న కూరగాయల దుకాణం నడుపుతున్నాడు. రైతుల నుంచి నేరుగా తాజా కూరగాయలను కొని తన దుకాణంలో విక్రయిస్తుంటాడు. జీఎస్టీ రూ.29 లక్షలు చెల్లించాలంటూ శంకర్‌గౌడకు ఇటీవల నోటీసులొచ్చాయి. నాలుగేళ్లుగా కూరగాయలు అమ్ముతున్న శంకర్‌గౌడ.. మొత్తం రూ.1.63 కోట్ల లావాదేవీలు చేసినందున ఇప్పుడు 29 లక్షల జీఎస్‌టీ కట్టాలన్నది సారాంశం. తాను ఆదాయపు పన్ను రిటర్న్‌లను దాఖలు చేస్తానని, రికార్డులు కూడా నిర్వహిస్తానని అయినా రూ.29 లక్షల జీఎస్టీ చెల్లించడమేంటని ప్రశ్నిస్తున్నారు. ఒక్క శంకర్‌గౌడనే కాదు.. రాష్ట్రంలో వేలాది మంది కూరగాయ విక్రేతలు ఇదే సమస్యను ఎదుర్కొంటున్నారు.

వాస్తవానికి క్లియర్ టాక్స్ ప్రకారం, తాజా పండ్లు, కూరగాయల విక్రయం జీఎస్టీ పరిధిలోకి రాదు. రైతుల నుంచి కొనుగోలు చేసి, ఎలాంటి ప్రాసెస్ చేయకుండా విక్రయించే ఈ వస్తువులకు జీఎస్టీ వర్తించదు. అయినా ఆదాయాన్ని బట్టి నోటీసులు ఇవ్వడమేంటని కూరగాయల వ్యాపారులు ప్రశ్నిస్తున్నారు. అయితే.. బ్యాంకులు లేదా డిజిటల్ మాధ్యమాల్లో చెల్లింపులు చేసినప్పుడు ఈ లావాదేవీలు పన్ను అధికారుల పరిశీలనలోకి వెళ్తున్నాయి. వ్యాపారి మొత్తం అమ్మకాలు ఒక నిర్దిష్ట పరిమితిని మించి ఉంటే, ఆధారాలు, రికార్డులను అడిగే హక్కు పన్ను శాఖకు ఉంటుంది. ఇదే వ్యాపారులకు శాపంగా మారింది. దీంతో... చాలా మంది చిన్న తరహా వ్యాపారాలు డిజిటల్ చెల్లింపులు నివారించి, నగదు మాత్రమే తీసుకుంటున్నారు. వ్యాపారులు నగదుకు మారుతున్న విషయం తమకు తెలిసిందని, యూపీఐ లేదా నగదు ఏదైనా సరే.. వచ్చిన మొత్తానికి పన్ను వర్తిస్తుందని జూలై 17న కర్ణాటక జీఎస్‌టీ విభాగం హెచ్చరించింది.

రూ.40 లక్షల టర్నోవర్ దాటితే...

రూ.40 లక్షల కంటే ఎక్కువ యూపీఐ టర్నోవర్ ఉన్న 11,000 వ్యాపారులకు నోటీసులు అందజేసింది. నోటీసులను ఉపసంహరించుకోవాలని వర్తక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. జీఎస్‌టీ నోటీసులను నిరసిస్తూ కర్ణాటక అంతటా టీ స్టాళ్లు, బేకరీలతో సహా మొత్తం చిన్న వ్యాపారాలను జూలై 25న రాష్ట్రవ్యాప్తంగా బంద్ చేస్తామని హెచ్చరించాయి. యూపీఐ డేటాను యాక్సెస్ చేయడం చట్టబద్ధతను వారు ప్రశ్నిస్తున్నారు. మొత్తం లావాదేవీల ఆధారంగా, విక్రేతలకు పన్ను నోటీసులు జారీ చేయడం అన్యాయమంటున్నారు. సరైన తనిఖీలు లేకుండా జీఎస్టీ కట్టాలంటూ శిక్షించడం తమను దోచుకోవడమేనంటున్నారు.

పరిమితిపై పునరాలోచించాలి..

ఇలాంటి జీఎస్‌టీ నోటీసులు కొనసాగితే, చాలా మంది డిజిటల్ చెల్లింపులకు దూరమవుతారు. కాబట్టి జీఎస్టీ రిజిస్ట్రేషన్ పరిమితిపై ప్రభుత్వం పునరాలోచించాల్సిన సమయం ఆసన్నమైందని నిపుణులు భావిస్తున్నారు. పన్ను చెల్లింపు దారులలో జీఎస్టీపై అవగాహనను, ముఖ్యంగా కొత్తగా ఈ లావాదేవీల్లోకి ప్రవేశిస్తున్నవారికి మరింత చైతన్యం కలిగించాల్సిన అవసరముందని చెబుతున్నారు. లేదంటే.. వ్యాపారులు డిజిటల్ చెల్లింపులను మినహాయిస్తారని, ఇది నగదు రహిత ఆర్థిక వ్యవస్థ లక్ష్యాన్ని చేరుకోలేదని చెబుతున్నారు.

అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరిన సీఎం స్టాలిన్

సాక్షి, చెన్నై: తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ స్వల్ప అనారోగ్యంతో సోమవారం చెన్నైలోని అపోలో ఆస్పత్రిలో చేరారు. మార్నింగ్ వాక్ సమయంలో తల తిరిగినట్లుగా అనిపించిందని చెప్పడంతో వెంటనే ఆస్పత్రికి తీసుకువచ్చారని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. సీఎం స్టాలిన్‌కు అవసరమైన పరీక్షలు చేశామని మెడికల్ సర్వీసెస్ డైరెక్టర్ డాక్టర్ అనిల్ బీజీ వెల్లడించారు. సీఎం కోలుకుంటున్నారని ఆయన కుమారుడు, డిప్యూటీ సీఎం ఉదయనిధి మీడియాకు ఆస్పత్రి వద్ద తెలిపారు. గత రెండు మూడు నెలలుగా బిజీ షెడ్యూల్‌తో ఉన్నందునే, ఆ ప్రభావం ఆయనపై పడిందన్నారు. రెండు రోజులపాటు ఆస్పత్రిలో ఉండాలని వైద్యులు సూచించారన్నారు.

సుప్రీంకోర్టును ఎప్పుడు ఏర్పాటు చేశారు?

మన రాజ్యాంగ నిర్మాతలు స్వయం ప్రతిపత్తి ఉన్న, ఏకీకృత న్యాయ వ్యవస్థను ఏర్పాటు చేశారు. శాసన, కార్య నిర్వాహక శాఖలకు బాధ్యత వహించకుండా న్యాయ వ్యవస్థ స్వతంత్రంగా పనిచేయడాన్ని, 'స్వయం ప్రతిపత్తి'గా పేర్కొంటారు. దేశంలోని మొత్తం న్యాయస్థానాలు ఉన్నత న్యాయస్థానం నియంత్రణలో పనిచేయడాన్ని, 'ఏకీకృత న్యాయ వ్యవస్థ' అంటారు. కేంద్రం, రాష్ట్రాల మధ్య శాసన, కార్య నిర్వాహక అధికారాల పంపిణీ జరిగిందిగానీ న్యాయ పరమైన అధికార పంపిణీ జరగలేదు.

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ పాలిటీ

భారత న్యాయ వ్యవస్థ - సుప్రీంకోర్టు

భారత రాజ్యాంగంలోని అధికరణం 124 నుంచి 147 వరకు సుప్రీంకోర్టు గురించి తెలియజేస్తాయి. వీటిని అయిదో భాగంలో చేర్చారు. 'ప్రభుత్వ అంగాల్లో అతి ముఖ్యమైంది న్యాయ వ్యవస్థ, ప్రజాస్వామ్య పరిరక్షణకు ఇది తప్పనిసరి' అని 'లార్డ్‌బ్రైస్' పేర్కొన్నాడు.

రెగ్యులేటింగ్ చట్టం ద్వారా 1774లో ప్రధాన న్యాయమూర్తి, ముగ్గురు న్యాయమూర్తులతో కోల్‌కతాలో మొదటిసారిగా సుప్రీంకోర్టును ఏర్పాటు చేశారు. దీన్ని 1935 చట్టం ద్వారా 'ఫెడరల్ కోర్టు'గా మార్చారు. భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చిన తర్వాత 1950 జనవరి 28 నుంచి సుప్రీంకోర్టు పని చేయడం ప్రారంభించింది.

నిర్మాణం

అధికరణ 124(1) ప్రకారం సుప్రీంకోర్టులో ప్రధాన న్యాయమూర్తి, న్యాయమూర్తులు ఉంటారు. అవసరాన్ని బట్టి వీరి సంఖ్యను పెంచే అధికారం పార్లమెంట్‌కు ఉంది. ప్రారంభంలో ఏడుగురు న్యాయమూర్తులు, ప్రధాన న్యాయమూర్తి (7+1)ఉండేవారు. 1956లో 10+1కి, 1960లో 13+1కి, 1977లో 17+1కి, 1986లో 25+1కి, 2009లో 30+1కి పెంచారు.

- ❖ మొదటి ప్రధాన న్యాయమూర్తి–హెచ్.జె. కానియా
- ❖ న్యాయమూర్తిగా పని చేసిన మొదటి మహిళ - ఫాతిమా బీబీ
- ❖ షెడ్యూల్డ్ కులాల నుంచి ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసిన ఏకైక వ్యక్తి - కె.జి. బాలకృష్ణన్.
- ❖ ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి - బి.ఆర్.గవాయి (52వ వ్యక్తి).

న్యాయమూర్తుల నియామకం: అధికరణ 124(2) ప్రకారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులను రాష్ట్రపతి నియమిస్తారు. ఈ విషయంలో ప్రధాన న్యాయమూర్తి, నలుగురు సీనియర్ న్యాయమూర్తులతో కూడిన 'కొలీజియం'ను రాష్ట్రపతి సంప్రదిస్తారు. 2014లో 99వ రాజ్యాంగ సవరణ ద్వారా కొలీజియం వ్యవస్థను రద్దు చేసి, దాని స్థానంలో 'జాతీయ న్యాయమూర్తుల నియామక కమిషన్' ఏర్పాటు చేశారు. ఈ కమిషన్‌లో చైర్మన్, ఐదుగురు సభ్యులు ఉంటారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి చైర్మన్‌గా కొనసాగుతారు. సభ్యుల్లో ఇద్దరు సుప్రీంకోర్టు సీనియర్ న్యాయమూర్తులు, ఇద్దరు న్యాయ నిపుణులు, కేంద్ర న్యాయశాఖ మంత్రి ఉంటారు.

ప్రధాన న్యాయమూర్తి నియామకానికి సంబంధించి ప్రత్యేక అర్హతలు పేర్కొనలేదు. సాధారణంగా సీనియర్ న్యాయమూర్తిని నియమిస్తారు. కానీ ఇది తప్పనిసరి కాదు. 1973లో సీనియారిటీ పరంగా నాలుగో వ్యక్తి అయిన జస్టిస్ ఎ.ఎస్. రే, 1977లో సీనియారిటీ పరంగా రెండో స్థానంలో ఉన్న జస్టిస్ ఎం.హెచ్. బేగ్ ప్రధాన న్యాయమూర్తులుగా నియమితులయ్యారు.

సుప్రీంకోర్టు న్యాయమూర్తి అర్హతలు: ప్రకరణ 124(3) ప్రకారం సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ఎంపికవడానికి కింద పేర్కొన్న అర్హతలు ఉండాలి.

ఎ) భారతీయ పౌరుడై ఉండాలి.

బి) ఏదైనా హైకోర్టులో అయిదేళ్లు న్యాయమూర్తిగా లేదా పదేళ్లు న్యాయవాదిగా పనిచేసి ఉండాలి.

సి) రాష్ట్రపతి దృష్టిలో మంచి న్యాయకోవిదుడై ఉండాలి.

పదవీ ప్రమాణ స్వీకారం: ప్రకరణ 124(6) ప్రకారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, ఇతర న్యాయమూర్తులతో రాష్ట్రపతి పదవీ స్వీకార ప్రమాణం చేయిస్తారు. ప్రమాణ స్వీకార నమూనా గురించి మూడో షెడ్యూల్‌లో పేర్కొన్నారు.

సుప్రీంకోర్టు న్యాయమూర్తుల పదవీ కాలం: సుప్రీంకోర్టు న్యాయమూర్తుల పదవీ కాలానికి సంబంధించిన ప్రస్తావన లేదు. పదవీ విరమణ వయసు 65 ఏళ్లు. పదవీ విమరణ తర్వాత ఏ న్యాయస్థానంలోనూ న్యాయవాద వృత్తి చేపట్టకూడదు. ప్రధాన న్యాయమూర్తిగా ఎక్కువ కాలం జస్టిస్ వై.వి.చంద్రచూడ్, తక్కువ కాలం జస్టిస్ నగేంద్రసింగ్ పనిచేశారు.

న్యాయమూర్తుల తొలగింపు: ప్రకరణ 124(4) తొలగించే విధానం గురించి తెలియజేస్తుంది. న్యాయమూర్తులకు సంబంధించి ఏదైనా అసమర్థత, అక్రమ ప్రవర్తనను గుర్తిస్తే.. పార్లమెంట్ అభిశంసన తీర్మానం సిఫారసు మేరకు రాష్ట్రపతి అలాంటివారిని తొలగిస్తారు. ఈ తీర్మానాన్ని 100 మంది సభ్యుల మద్దతుతో లోక్‌సభలో లేదా 50 మంది మద్దతుతో రాజ్యసభలో 14 రోజుల ముందు సభాధ్యక్షునికి నోటీస్ జారీ చేసి ప్రవేశ పెట్టవచ్చు. సభాధ్యక్షుడు దీన్ని ఆమోదించవచ్చు లేదా తిరస్కరించవచ్చు. తీర్మానాన్ని ఆమోదిస్తే సభాధ్యక్షుడు విచారణ కమిటీని నియమిస్తారు. విచారణలో అభియోగం రుజువైతే తీర్మానం చర్చకు వస్తుంది. అనంతరం ఉభయ సభలు విడివిడిగా 2/3 మెజార్టీతో తీర్మానాన్ని ఆమోదిస్తే రాష్ట్రపతి సంబంధిత న్యాయమూర్తిని తొలగిస్తారు. ఇంతవరకు ఈవిధంగా ఎవరినీ తొలగించలేదు. 1993లో జస్టిస్ వి. రామస్వామిపై అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టారు. కానీ ఇది నెగ్గలేదు. 2011లో జస్టిస్ సౌమిత్ర సేన్‌పై తీర్మానం ప్రవేశ పెట్టగా రాజ్యసభలో నెగ్గింది. ఈ తీర్మానం లోక్‌సభకు రాకముందే ఆయన రాజీనామా చేసి తప్పుకున్నారు.

రాజీనామా: ప్రకరణ - 124 (2ఎ) ప్రకారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు వారి రాజీనామాను రాష్ట్రపతికి సమర్పించాలి.

జీతభత్యాలు: న్యాయశాఖ ప్రతిపత్తి కాపాడేందుకు న్యాయమూర్తులకు ఉన్నతమైన జీతభత్యాలు చెల్లిస్తారు. ప్రకరణ 125 (1) ప్రకారం వీరి జీతభత్యాలను పార్లమెంట్ నిర్ణయిస్తుంది. వీటిని సంఘటిత నిధి నుంచి చెల్లిస్తారు. ప్రస్తుతం ప్రధాన న్యాయమూర్తికి రూ. 2,80,000, ఇతర న్యాయమూర్తులకు రూ.2,50,000 చెల్లిస్తున్నారు. పింఛన్‌గా జీతంలో సగ భాగాన్ని చెల్లిస్తారు. ఆర్థిక అత్యవసర సమయంలో వీరి జీతభత్యాలను తగ్గించే అధికారం ఉంది. వీటికి ఆదాయ పన్ను నుంచి మినహాయింపు ఉంది.

సుప్రీంకోర్టు - అధికారాలు, విధులు

రాజ్యాంగ నిర్మాతలు సుప్రీంకోర్టుకు విస్తృత అధికారాలు కల్పించారు. భారత సుప్రీంకోర్టు ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన న్యాయస్థానంగా అల్లాడి కృష్ణస్వామి అయ్యర్ అభివర్ణించారు. సుప్రీంకోర్టుకు ఆరు రకాల అధికారాలుంటాయి.

1. **ప్రారంభ అధికారాలు:** వీటి గురించి ప్రకరణ - 131 తెలియజేస్తుంది.
   1) కేంద్రం, రాష్ట్రం మధ్య తలెత్తే వివాదాలను పరిష్కరిస్తుంది.
   2) కేంద్రం, రాష్ట్రాల మధ్య (ఒకటి కంటే ఎక్కువ రాష్ట్రాలు) తలెత్తే వివాదాల ను పరిష్కరిస్తుంది.
   3) అంతర్‌రాష్ట్ర వివాదాలను పరిష్కరిస్తుంది.
   4) ప్రాథమిక హక్కులను పరిరక్షిస్తుంది.
   5) రాజ్యాంగ ఆధిక్యతను పరిరక్షిస్తుంది.
   6) రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ఎన్నిక వివాదాలను పరిష్కరిస్తుంది.

   ప్రారంభ అధికార పరిధి నుంచి మినహాయింపునిచ్చిన అంశాలు:
   1) అంతర్‌రాష్ట్ర నదీ జలాల వివాదంపై ట్రిబ్యునళ్లు ఇచ్చిన తీర్పులు
   2) ఆర్థిక సంఘం సిఫారసులు
   3) విదేశాలతో కుదుర్చుకున్న ఒప్పందాలు
   4) కేంద్రం రాష్ట్రాలకిచ్చే సహాయక నిధులు
   5) అంతర్‌రాష్ట్ర వాణిజ్యానికి సంబంధించిన చట్టాలు
   6) 1950 కంటే ముందు చేసుకున్న ఒప్పందాలు
2. **అప్పీళ్ల విచారణ పరిధి:** దీని గురించి ప్రకరణలు 132, 133, 134, 136 వివరిస్తాయి. సుప్రీంకోర్టు నాలుగు రకాల అప్పీళ్లను విచారిస్తుంది.
   ఎ) **రాజ్యాంగ పరమైన అప్పీళ్లు (ప్రకరణ - 132):** హైకోర్టు వెలువరించే తీర్పులో రాజ్యాంగాన్ని మరింత లోతుగా వ్యాఖ్యానించాల్సిన అవసరం ఉందని ధ్రువీకరిస్తే అలాంటి కేసులను సుప్రీంకోర్టులో అప్పీలు చేసుకోవచ్చు.
   బి) **సివిల్ అప్పీళ్లు (ప్రకరణ-133):** ఏదైనా సివిల్ వివాదంలో హైకోర్టు ఇచ్చిన తీర్పులో చట్టానికి సంబంధించిన లోతైన అంశం ఇమిడి ఉందని భావిస్తే సుప్రీంకోర్టులో అప్పీలు చేసుకోవచ్చు. కనీసం 1,00,000 రూపాయల కంటే ఎక్కువ విలువ ఉన్న ఆస్తి వివాదాలను సుప్రీంకోర్టు స్వీకరిస్తుంది.
   సి) **క్రిమినల్ అప్పీళ్లు (ప్రకరణ - 134):** హైకోర్టు కింది న్యాయస్థానాలు ప్రకటించిన తీర్పులను అప్పీళ్లకు స్వీకరించి అవి ఇచ్చిన తీర్పునకు పూర్తి విరుద్ధమైన తీర్పు చెప్పి, ముద్దాయికి మరణశిక్ష విధించినప్పుడు సుప్రీంకోర్టు విచారిస్తుంది.
   డి) **ప్రత్యేక అప్పీళ్లు (ప్రకరణ 136):** సుప్రీంకోర్టులో అప్పీలు చేసుకోవడానికి హైకోర్టులో అవకాశం కల్పించని, అనుమతి ఇవ్వని కేసుల్లో ప్రత్యేక అప్పీళ్ల కోసం ప్రయత్నిస్తారు. ఇది సుప్రీంకోర్టు విచక్షణాధికారంపై ఆధారపడి ఉంటుంది.

   పునఃసమీక్షాధికారం ప్రకరణ - 137: సుప్రీంకోర్టుకు తన తీర్పులను తానే సమీక్షించుకునే అధికారం ఉంటుంది.

   ఉదా: బెరుబారి కేసులో రాజ్యాంగ ప్రవేశిక రాజ్యాంగంలో అంతర్భాగం కాదని, కేశవానంద భారతీ కేసులో అంతర్భాగమేనని సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది.
3. **సలహాపూర్వక విచారణ పరిధి:** ప్రకరణ - 143 దీని గురించి వివరిస్తుంది. ఏదైనా శాసన లేదా రాజ్యాంగ పరమైన సమస్య తలెత్తినప్పుడు రాష్ట్రపతి సుప్రీంకోర్టు సలహా కోరవచ్చు. సుప్రీంకోర్టు సలహాను రాష్ట్రపతి పాటించడం తప్పనిసరికాదు. ఇప్పటివరకూ 14 సార్లు ఈవిధంగా సలహా కోరారు. మొదటిసారిగా 1951లో ఢిల్లీ న్యాయ చట్టాల విషయంలో బాబూ రాజేంద్రప్రసాద్, చివరగా లాభదాయక పదవుల బిల్లు విషయంలో 2006లో అబ్దుల్ కలామ్ సుప్రీంకోర్టు సలహా కోరారు.
4. **కోర్టు అఫ్ రికార్డ్:** దీని గురించి ప్రకరణ - 129 తెలియజేస్తుంది. దీని ప్రకారం సుప్రీంకోర్టు అన్ని తీర్పులు, ప్రక్రియలను దేశవ్యాప్తంగా ఉన్న అన్ని దిగువ న్యాయస్థానాలు పాటించాలి. సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పులనే ప్రామాణికంగా తీసుకొని కింది కోర్టులు సంబంధిత వివాదాల్లో తీర్పు చెప్పాలి. దేశంలోని వ్యక్తులు, సంస్థలు సుప్రీంకోర్టు తీర్పును గౌరవించాలి. లేకపోతే కోర్టు ధిక్కార నేరంగా పరిగణించి రూ.2000 జరిమానా, ఆరు నెలల వరకు జైలు శిక్ష విధించే అధికారం ఉంది.
5. **రిట్‌లు జారీ చేసే అధికారం:** ప్రాథమిక హక్కులకు నష్టం వాటిల్లినప్పుడు హక్కుల రక్షణ కోసం ప్రకరణ 32 ప్రకారం ఐదు రకాల రిట్లను జారీ చేస్తుంది.
   1) హెబీయస్ కార్పస్
   2) మాండమస్ 3) సెర్షియోరరీ
   4) ప్రొహిబిషన్ 5) కోవారెంటో

   రిట్ల జారీ అధికారం ప్రారంభ అధికార పరిధి లోకి వస్తుంది.
6. **న్యాయ సమీక్ష:** న్యాయ సమీక్ష విధానం అమెరికాలో ఆవిర్భవించింది.అక్కడి నుంచి మనం గ్రహించాం. శాసనాలు, చట్టాలు, రాజ్యాంగ బద్ధంగా ఉన్నాయా? లేవా? పరిశీలించే అధికారాన్ని 'న్యాయసమీక్ష' అంటారు. దీని ద్వారా శాసన, కార్య నిర్వాహక శాఖ కార్యకలాపాలను నియంత్రించి వ్యక్తి స్వేచ్ఛను, హక్కులను కాపాడవచ్చు. ఏదైనా శాసనాన్ని సమీక్షించి రాజ్యాంగ వ్యతిరేకమైందిగా ప్రకటిస్తే 'అల్ట్రా వైరస్' అని, రాజ్యాంగ సమ్మతమైందిగా ప్రకటిస్తే 'ఇంట్రావైరస్' అని



గతంలో ఎస్ఐ పరీక్షల్లో అడిగిన ప్రశ్నలు

1. ప్రాథమిక హక్కులను కుదించరాదని సుప్రీంకోర్టు ఏ కేసులో తీర్పునిచ్చింది?
   1) కేశవానంద భారతీ Vs స్టేట్ ఆఫ్ కేరళ
   2) గోలక్‌నాథ్ Vs స్టేట్ ఆఫ్ పంజాబ్
   3) ఇందిరాగాంధీ Vs రాజ్‌నారాయణ
   4) శంకరీప్రసాద్ Vs యూనియన్ ఆఫ్ ఇండియా
2. 'హెబీయస్ కార్పస్' అనేది?
   1) గ్రీకు పదజాలం 2) లాటిన్ పదజాలం
   3) ఇంగ్లిష్ పదజాలం 4) ఫ్రెంచ్ పదజాలం
3. కిందివాటిలో ఏ కేసులో సుప్రీంకోర్టు తీర్పు కేంద్ర - రాష్ట్ర సంబంధాలను పునర్ నిర్వచించింది?
   1) ఎస్.ఆర్. బొమ్మయ్ కేసు
   2) ఇంద్ర సహాని కేసు 3) వామనరావు కేసు
   4) ఐ.ఆర్. కొయెల్ హో కేసు

సమాధానాలు: 1) 2; 2) 2; 3) 1.

మాదిరి ప్రశ్నలు

1. న్యాయ సమీక్ష కిందకి వచ్చేవి?
   1) రాజ్యాంగ సవరణలు
   2) పార్లమెంట్ చేసే చట్టాలు
   3) రాష్ట్ర శాసనసభ చేసే చట్టాలు
   4) పైవన్నీ
2. భారత సుప్రీంకోర్టును ప్రపంచంలోకెల్లా అత్యంత శక్తివంతమైందిగా అభివర్ణించిందెవరు?
   1) బి.ఆర్. అంబేద్కర్ 2) బి.ఎన్.రావు
   3) అల్లాడి కృష్ణస్వామి అయ్యర్
   4) కె.ఎం. మున్షీ
3. కిందివాటిలో ఏది సుప్రీంకోర్టు, హైకోర్టుల అధికార పరిధిలోకి వస్తుంది?
   1) కేంద్ర,రాష్ట్రాల మధ్య వివాదాల పరిష్కారం
   2) రాష్ట్రాల మధ్య వివాదాల పరిష్కారం
   3) ప్రాథమిక హక్కుల పరిరక్షణ
   4) నిర్దేశిక నియమాల పరిరక్షణ
4. ప్రజాహిత వ్యాజ్యానికి సంబంధించి కింది వ్యాఖ్యల్లో ఏది సత్యం?
   1) ప్రాథమిక హక్కులతో సరిసమానమైంది
   2) ఆదేశ సూత్రాల స్ఫూర్తికి ప్రాతినిధ్యం వహిస్తుంది
   3) న్యాయమూర్తి చేసిన శాసనం
   4) రాజ్యాంగంలో ఒక అతి ముఖ్యమైన అంశం
5. జాతీయ న్యాయవ్యవస్థకు సంబంధించి ప్రజాప్రయోజనాల వ్యాజ్యం ప్రవేశపెట్టినప్పుడు భారత ప్రధాన న్యాయమూర్తిగా ఉన్నవారు?
   1) ఎం. హిదాయతుల్లా 2) ఎ.ఎం. అహ్మదీ
   3) ఎస్. ఆనంద్ 4) పి.ఎన్. భగవతీ

సమాధానాలు

1) 4; 2) 3; 3) 3 4) 1; 5) 4.

ప్రాచీన కాలంలో కరిక్యులం దేనికి పరిమితమైంది?



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

విజ్ఞాన శాస్త్ర పాఠ్య ప్రణాళిక

1. కరీర్ అనే లాటిన్ పదానికి అర్థం?
   1) పందెపు బాట 2) పరుగెత్తే గుర్రం
   3) నేర్చుకునే విధానం
   4) ప్రణాళిక
2. ఉపాధ్యాయుడు పాఠశాలలో నిర్వహించే కృత్యాల కార్యక్రమమే పాఠ్య ప్రణాళిక అని తెలిపినవారు?
   1) స్ప్రియర్స్ 2) కన్నింగ్ హోమ్
   3) హిరస్ట్, పీటర్స్ 4) బ్లూమ్స్
3. పాఠశాల అనే స్టూడియోలో తన అభిరుచికి అనుగుణంగా మెటీరియల్‌ను మలచడానికి కళాకారుడు ఉపయోగించే సాధనం కరిక్యులం అని తెలిపినవారు?
   1) హిరస్ట్, పీటర్స్ 2) బ్లూమ్స్
   3) స్ప్రియర్స్ 4) కన్నింగ్ హోమ్
4. ఉపాధ్యాయుడి పర్యవేక్షణలో విద్యార్థులు నిర్వహించే కృత్యాల సముదాయమే విద్యా ప్రణాళిక అని తెలిపినవారు?
   1) హెర్బర్ట్ 2) బ్లూమ్స్
   3) స్ప్రియర్స్ 4) పీటర్స్
5. ప్రాచీన కాలంలో కరిక్యులం దేనికి పరిమితమైంది?
   1) విషయ విజ్ఞానం, పాఠ్యేతర కార్యక్రమాలు
   2) విషయజ్ఞానానికి
   3) సహపాఠ్య కార్యక్రమాలకు
   4) క్షేత్ర పర్యటనలకు
6. విషయజ్ఞానంతోపాటు, సహ పాఠ్య ప్రణాళికా కార్యక్రమాలు కూడా ఇమిడి ఉండేది?
   1) సిలబస్ 2) కరిక్యులం
   3) బోధన పద్ధతి 4) మూల్యాంకనం
7. పాఠ్యప్రణాళిక రూపొందించేటప్పుడు అభ్యాసకుడి స్వభావం, విషయ స్వభావం, సమాజ స్వభావం అనే మూడు అంశాలను పరిగణించాలని సూచించినవారు?
   1) డబ్ల్యూజే జాకబ్‌సన్
   2) కన్నింగ్ హోమ్
   3) రిచర్డ్‌సన్ 4) స్ప్రియర్స్
8. పాఠ్యప్రణాళిక రచనలో కిందివాటిలో పరిగణనలోకి తీసుకోని అంశం?
   1) సమాజ అవసరాలు
   2) కోర్సు స్వభావ లక్ష్యాలు
   3) సహ సంబంధం
   4) ఏవీకావు
9. జాతీయ విద్యావిధానం(1986) పాఠ్య ప్రణాళికలో పొందుపర్చాల్సిన పది మౌలిక అంశాల్లో కిందివాటిలో ఏది జీవ శాస్త్రానికి సంబంధించింది?
   1) రాజ్యాంగంలో పొందుపర్చిన హక్కులు, బాధ్యతలు
   2) సమానత్వం, ప్రజాస్వామ్యం, సామ్యవాదం
   3) భారతీయ సంస్కృతి
   4) చిన్నకుటుంబ భావన
10. ప్రాథమిక భావాల అవగాహనకు కనీస సామర్థ్యాన్ని అభివృద్ధి చేసేందుకు తప్పనిసరిగా అభ్యసించాల్సిన విషయాలను ఏమంటారు?
    1) పాఠ్యప్రణాళిక 2) మూల పాఠ్యప్రణాళిక
    3) లోపభూయిష్ట పాఠ్యప్రణాళిక
    4) ఉత్తమ పాఠ్యప్రణాళిక
11. ప్రజాస్వామ్య సమాజంలో సమర్థంగా జీవించడానికి కొన్ని ప్రవర్తనా సామర్థ్యాలు అత్యావశ్యకం. ఈ ప్రవర్తనా సామర్థ్యాలను వృద్ధిచేసే అనుభవాల సమూహమే?
    1) సిలబస్ 2) పాఠ్యప్రణాళిక
    3) మూల పాఠ్యప్రణాళిక
    4) సహ పాఠ్యపథకం
12. కింది వాటిలో ఏది ప్రస్తుత పాఠ్య ప్రణాళికలోని లోపం?
    1) ఎక్కువ సంఖ్యలో పాఠ్యాంశాల వల్ల లోతు తగ్గుతుంది
    2) వైయక్తిక భేదాలను అనుసరించి ఉంది
    3) పాఠ్యాంశాల చుట్టూ కేంద్రితమై లేదు
    4) నిజ జీవితానికి దగ్గరగా ఉంది
13. పాఠ్య ప్రణాళికలో సాంకేతిక, వృత్తి విద్యా సంబంధ విషయాలు లేవు అనే లోపాన్ని సూచించింది?
    1) జాతీయ విద్యా కమిషన్
    2) ప్రాథమిక విద్యా కమిషన్
    3) కొఠారి కమిషన్
    4) మాధ్యమిక విద్యా కమిషన్
14. పాఠ్యప్రణాళిక జ్ఞాన విస్ఫోటానికి అనుగుణంగా సరిదిద్దకపోవడం అనేది ఎవరు సూచించిన లోపం?
    1) మాధ్యమిక విద్యా కమిషన్
    2) కొఠారి కమిషన్
    3) మొదలియార్ కమిషన్
    4) ఏదీకాదు
15. దేశమంతా ఒకే మౌలిక ప్రణాళిక ఉండాలని.. 80% ఒకేలా, 20% స్థానిక అవసరాలకు అనుగుణంగా ఉండాలని సూచించింది?
    1) మాధ్యమిక కమిషన్
    2) కొఠారి కమిషన్
    3) నూతన జాతీయ విద్యావిధానం
    4) రాధాకృష్ణన్ కమిషన్
16. 'భవిష్యత్తులో సమర్థమైన జీవనానికి, తగిన వృత్తిని ఎంచుకోవడానికి తగిన పునాది పాఠ్య ప్రణాళికలో ఇమిడి ఉండాలి' దీన్ని తెలిపే పాఠ్య ప్రణాళిక నిర్మాణ సూత్రం?
    1) సృజనాత్మక సూత్రం
    2) సమాజ కేంద్రీకృత సూత్రం
    3) సమైక్యతా సూత్రం
    4) దూరదృష్టి సూత్రం
17. 'పాఠ్యప్రణాళికలో విద్యార్థులను ఇమడ్చడం కాకుండా, విద్యార్థుల కోసం పాఠ్యప్రణాళిక అభివృద్ధి చెందాలి' అని తెలిపినవారు?
    1) బ్లూమ్స్ 2) బ్రూటేకర్
    3) మొదలియర్ 4) కొఠారి
18. ఒకే శీర్షికకు సంబంధించిన విషయాన్ని అంచెలంచెలుగా పాఠ్యప్రణాళికలో అభివృద్ధి చెందించే పద్ధతి?
    1) ఏక కేంద్రక పద్ధతి
    2) అంశాల పద్ధతి 3) ప్రక్రియ పద్ధతి
    4) శాఖాంతర పద్ధతి
19. విజ్ఞాన శాస్త్ర విషయాలను శాఖలుగా విభజించకుండా, అంశాలుగా విభజించడం వల్ల అన్ని శాఖల విజ్ఞానం పొందుపర్చే పద్ధతి?
    1) ఏకకేంద్రక పద్ధతి
    2) అంశాల పద్ధతి లేదా శీర్షిక విధానం
    3) ప్రక్రియ పద్ధతి 4) భావన పద్ధతి
20. పాఠ్యప్రణాళికలో కాంతి అధ్యయనం, వాతావరణం అనే అంశాలు ఏ కోవకు చెందినవి?
    1) పరిసర కేంద్రిత అంశాలు
    2) జీవన కేంద్రిత అంశాలు
    3) పరిసర, జీవన కేంద్రిత అంశాలు
    4) పైవేవీకావు
21. ప్రక్రియ పద్ధతిలో ఉత్పత్తి కంటే ప్రక్రియకు ప్రాధాన్యత ఉంది. దీనికి ఉదాహరణగా అమెరికాలో 1962-68లో దేన్ని అమలు చేశారు?
    1) SAPA 2) NASA
    3) COPES 4) SUPW
22. అమెరికాలో ప్రవేశపెట్టిన COPES (Conceptually Oriented Program in Science) ఆధారంగా అభివృద్ధి చెందిన పద్ధతి?
    1) ఏకకేంద్రక పద్ధతి 2) శీర్షిక విధానం
    3) ప్రక్రియ పద్ధతి 4) భావన పద్ధతి
23. వస్తువులు మండేటప్పుడు ఏం జరుగుతుంది? అనే అంశం చుట్టూ ఆక్సిడేషన్ అనే రసాయన శాస్త్ర విషయం, శ్వాసక్రియ అనే జీవశాస్త్ర విషయం, ఉష్ణం అనే భౌతిక శాస్త్ర విషయాలను చెప్పడం?
    1) శీర్షిక విధానం 2) ప్రక్రియ పద్ధతి
    3) సమైక్య, శాఖాంతర పద్ధతి
    4) భావన పద్ధతి
24. కిరణజన్య సంయోగక్రియ గురించిన విషయాల కోసం హిల్ గురించి అధ్యయనం చేయడం ఏ పద్ధతిని సూచిస్తుంది?
    1) ప్రక్రియ పద్ధతి 2) చారిత్రక పద్ధతి
    3) భావన పద్ధతి 4) సమైక్య పద్ధతి
25. పాఠ్యపుస్తకం అనేది ముద్రిత రూపంలో ఉండి తరగతి గదిలో ఉపయోగించే మౌలిక బోధనోపకరణం అని తెలిపిన వారు?
    1) జాకబ్‌సన్ 2) సింప్సన్
    3) పియర్స్ 4) బ్లూమ్స్
26. 'తరగతి స్థాయికి తగినట్లుగా అక్షరాలు ముద్రించాలి' ఇది పాఠ్యపుస్తకం ఏ లక్షణం?
    1) గ్రంథ రచయిత 2) భాషాశైలి
    3) భౌతిక లక్షణాలు 4) అంతర్గత లక్షణం
27. వోగెల్ స్పాట్‌చెక్ ఇవాల్యుయేషన్ స్కేల్ దేని మూల్యాంకనానికి ఉపయోగపడుతుంది?
    1) బోధన పద్ధతి 2) లక్ష్యాలు
    3) బోధనోపకరణాలు
    4) పాఠ్యపుస్తకం
28. పాఠ్య ప్రణాళిక నిర్మాణ సూత్రాల్లో పరిరక్షణ సూత్రం దేనికి సంబంధించింది?
    1) సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణ
    2) సిద్ధాంతాల పరిరక్షణ
    3) బోధన పద్ధతుల పరిరక్షణ
    4) బోధనాపరికరాల పరిరక్షణ
29. 'మనం తినే ఆహారం' అనే పాఠ్యాంశం ఏ విభాగానికి చెందిన అంశం?
    1) పరిసర కేంద్రిత 2) జీవన కేంద్రిత
    3) పరిసర - జీవన కేంద్రిత
    4) ఉపాధ్యాయ కేంద్రిత
30. వివిధ పాఠ్యప్రణాళికలో కృత్యాల వికాసాన్ని దృష్టిలో ఉంచుకొని విభజించిన యూనిట్‌లను ఏమంటారు?
    1) పాఠ్యవిషయ యూనిట్
    2) బోధన యూనిట్
    3) అనుభవ యూనిట్
    4) మూలాధార యూనిట్
31. లోలకం ఊగడం భూకేంద్రక ఆకర్షణకు లోబడి ఉంటుంది. ఇది జీవశాస్త్రంలోని ఏ అంశానికి సంబంధం కలిగి ఉంది?
    1) కిరణజన్య సంయోగక్రియ
    2) జంతువుల పెరుగుదల
    3) మొక్కల పెరుగుదల దశలు
    4) అయస్కాంతత్వం
32. జాతీయ విద్యావిధానం (1986) పాఠ్య ప్రణాళికలో పొందుపర్చాలని ప్రతిపాదించిన 10 మౌలిక అంశాల్లో జీవశాస్త్ర సంబంధిత అంశాల సంఖ్య?
    1) 6 2) 3 3) 4 4) 8
33. 'ప్రతి ఒక్కరికి అన్ని శాస్త్రాల్లో కనీస పరిజ్ఞానం అవసరం' అనే విషయంపై ఆధారపడి నిర్మించింది?
    1) మూల పాఠ్య ప్రణాళిక
    2) సహ పాఠ్య ప్రణాళిక
    3) పాఠ్యేతర పాఠ్య ప్రణాళిక
    4) విషయ ప్రణాళిక
34. కన్నింగ్ హోమ్ నిర్వచనంలో కళాకారుడు?
    1) విద్యార్థి 2) విద్యార్థి తండ్రి
    3) ఉపాధ్యాయుడు 4) విద్యాశాఖాధికారి
35. తరగతి గదిలో, ప్రయోగశాలలో, ఆటస్థలంలో, వర్క్‌షాప్‌లో అనేక కృత్యాల అనుభవాల సమస్తం?
    1) విషయ ప్రణాళిక 2) పాఠ్యపుస్తకం
    3) ప్రయోగాలు 4) పాఠ్యప్రణాళిక
36. గణిత పరిభాషలో చెప్పాలంటే ఏది పాఠ్య ప్రణాళికకు ఉప సమితి?
    1) టైం టేబుల్ 2) పాఠ్యపుస్తకం
    3) సిలబస్ 4) తరగతి గది
37. ఏ శాస్త్రవేత్త పాఠ్య ప్రణాళిక రూపొందించేటప్పుడు అభ్యాసకుడి స్వభావం, విషయ స్వభావం, సహజ స్వభావాన్ని పరిగణించాలి అని తెలిపారు?
    1) జాకబ్‌సన్ 2) బీఎస్ బ్లూమ్స్
    3) హిరస్ట్, పీటర్స్ 4) స్ప్రియర్స్
38. జీవశాస్త్ర పాఠ్యప్రణాళిక రచనకు కావాల్సిన అంశాల గురించి వివరిస్తూ ఎడ్వర్డ్ విక్టర్ తెలిపిన అంశాల్లో లేనిది?
    1) మూల్యాంకనం 2) సమతూకం
    3) బోధన సామగ్రి
    4) ఉపాధ్యాయుడి సామర్థ్యం
39. పాఠ్య ప్రణాళికలోని అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుంటే కింది వాటిలో సరికాని ప్రవచనం?
    1) పాఠ్యప్రణాళిక సహజ అభివృద్ధికి తోడ్పడేదిగా ఉండాలి
    2) పాఠ్యప్రణాళిక సమస్యా పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలి
    3) పాఠ్యప్రణాళిక ఇతర సబ్జెక్టుల్లో సహ సంబంధాన్ని నెలకొల్పేదిగా ఉండాలి
    4) పాఠ్యప్రణాళిక విద్యార్థుల తల్లిదండ్రుల అభిరుచులకు తగినట్లుగా ఉండాలి
40. పాఠ్యప్రణాళికకు సంబంధించిన అంశాలలో 'సహ సంబంధం' అంటే వేటి మధ్య సహ సంబంధం?
    1) విద్యార్థికి, ఉపాధ్యాయుడికి మధ్య
    2) సబ్జెక్టుల మధ్య
    3) తరగతి గది - ప్రయోగశాల మధ్య
    4) విద్యార్థి- విద్యార్థికి మధ్య
41. పాఠ్యప్రణాళికలోని కృత్యాలు ఏ విధంగా ఉండాలి?
    1) విద్యార్థులందరికీ ఒకేలా ఉండాలి
    2) విద్యార్థులకు కష్టంగా ఉండాలి
    3) ఉపాధ్యాయుడి అభిరుచులకు అనుగుణంగా ఉండాలి
    4) విద్యార్థుల అభిరుచులకు అనుగుణంగా ఉండాలి
42. విద్యా ప్రణాళికలో జాతీయ విద్యావిధానం (1986) ఎన్ని మౌలిక అంశాలను పొందుపర్చాలని సూచించింది?
    1) 12 2) 15 3) 10 4) 6
43. జాతీయ విద్యావిధానం (1986) పాఠ్య ప్రణాళికలో పొందుపర్చాలని సూచించిన 10 అంశాల్లో జీవశాస్త్రానికి సంబంధించింది?
    1) జాతీయ భావన వికాసం
    2) స్త్రీ, పురుష సమానత్వం
    3) చిన్న కుటుంబ భావన
    4) సాంఘిక సమానత్వం

సమాధానాలు

1) 1; 2) 3; 3) 4; 4) 3;
5) 2; 6) 2; 7) 1; 8) 4;
9) 4; 10) 2; 11) 3; 12) 1;
13) 4; 14) 2; 15) 3; 16) 4;
17) 2; 18) 1; 19) 2; 20) 1;
21) 3; 22) 3; 23) 3; 24) 2;
25) 2; 26) 3; 27) 4; 28) 1;
29) 2; 30) 3; 31) 3; 32) 2;
33) 1; 34) 3; 35) 4; 36) 3;
37) 1; 38) 4; 39) 4; 40) 2;
41) 3; 42) 3; 43) 3.

జయక్‌వాడీ ప్రాజెక్టు ఏ నదిపై ఉంది?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ జాగ్రఫీ

భారతదేశం - బహుళార్థ సాధక ప్రాజెక్టులు

'ఆనకట్టలే ఆధునిక దేవాలయాలు' అని భారతదేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ అన్న మాట నాటికి, నేటికీ అక్షర సత్యం. మన దేశ ప్రగతిని సరికొత్త మలుపు తిప్పినవి బహుళార్థ సాధక ప్రాజెక్టులే అనడంలో ఎలాంటి సందేహం లేదు. కాబట్టి దేశంలో మొదటి పంచవర్ష ప్రణాళిక(1951) నుంచి వివిధ ప్రాంతాల్లో పలు బహుళార్థ సాధక ప్రాజెక్టులను నిర్మించారు.

- ఒకటి కంటే ఎక్కువ సదుపాయాల కల్పనకు ఉద్దేశించి నిర్మించిన ప్రాజెక్టునే బహుళార్థ సాధక ప్రాజెక్టు అంటారు.
- భారతదేశంలో వ్యవసాయ నీటిపారుదల, గృహ, పరిశ్రమ అవసరాలకు నీటి సరఫరా, విద్యుదుత్పాదన, వరద నివారణ, స్థానిక రవాణా, భూ సంరక్షణ, మత్స్య పరిశ్రమ అభివృద్ధి, విహారయాత్ర, కృత్రిమ వనాల పెంపకం మొదలైన అనేక ప్రయోజనాల కోసం ఈ బహుళార్థ సాధక ప్రాజెక్టులను నిర్మిస్తున్నారు.
- బెంగాల్‌లో 1948లో వరదలను, వాటిఅనుబంధ సమస్యలను నివారించడానికి దామోదర్ నదీ, దాని ఉపనదులపైన ప్రాజెక్టులు కట్టడం కోసం మొట్టమొదటి నదీలోయ ప్రాజెక్టు సంస్థను ఏర్పాటు చేశారు.
- ఈ సంస్థను అమెరికాలోని టెన్నిస్ వేలీ అథారిటీ (టీవీఏ) నమూనా ఆధారంగా ఏర్పాటు చేశారు.
- 1948 ఫిబ్రవరి 18న భారత పార్లమెంట్ ఈ సంస్థను ఆమోదించడంతో ఇది దామోదర్ లోయ కార్పొరేషన్ (డీవీసీ)గా వాస్తవ రూపం దాల్చింది.
- డీవీసీ ఏర్పడక ముందు వరదలతో బెంగాల్ దుఃఖదాయినులుగా దామోదర్, దాని ఉపనదులున్నాయి. తర్వాత వాటిపై ప్రాజెక్టులు నిర్మించడంతో బెంగాల్ వరదాయినులుగా ఉన్నాయి.
- భారతదేశంలో నీటి పారుదల ప్రాజెక్టులను మూడు రకాలుగా విభజించవచ్చు.

  అవి...
  1) భారీ నీటిపారుదల పథకాలు
  2) మధ్య తరహా నీటి పారుదల పథకాలు
  3) చిన్న తరహా నీటి పారుదల పథకాలు
- ప్రాజెక్టు కల్పించే నీటి పారుదల విస్తీర్ణాన్ని బట్టి ప్రాజెక్టులను విభజించారు.

1. **భారీ నీటిపారుదల పథకాలు**
- 10,000 హెక్టార్ల కంటే ఎక్కువ ఆయకట్టు ప్రాంతం ఉన్న పథకాలను భారీ నీటిపారుదల పథకాలు అంటారు.
- వీటిని ప్రధానంగా నదులపై నిర్మిస్తారు.

2. **మధ్య తరహా నీటిపారుదల పథకాలు**
- 2,000 నుంచి 10,000 హెక్టార్ల వరకు ఆయకట్టు ప్రాంతం ఉన్న పథకాలు.
- వీటిని నదులపై, ఉపనదులపై నిర్మిస్తారు.

3. **చిన్న తరహా నీటిపారుదల పథకాలు**
- 2,000 హెక్టార్ల కంటే తక్కువ ఆయకట్టు గల పథకాలు.
- భూగర్భ జల పథకాలు, ఉపరితల జల పథకాలు ఈ తరహా పథకాల్లోకి వస్తాయి.

  భూగర్భ జల పథకాలు: సాధారణ బావులు, గొట్టపు బావులు.

  ఉపరితల జల పథకాలు: చెరువులు, జలాశయాల నుంచి నీటిని మళ్లించే పథకాలు, లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలు.

ఆయకట్టు ప్రాంత అభివృద్ధి పథకం

- నీటిపారుదల ఆవశ్యకత, ఉత్పత్తి, వినియోగాల మధ్య అంతరాన్ని పూడ్చే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం 1974-75లో ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది.
- భారతదేశంలో 1990లో జాతీయ జల మండలిని ఏర్పాటు చేశారు.
- 2008 నవంబర్ 4న గంగానదిని 'జాతీయ నది'గా ప్రకటించారు.

దేశంలో కొన్ని ప్రధాన బహుళార్థ సాధక ప్రాజెక్టులు

1. **భాక్రానంగల్ ప్రాజెక్టు**
- దేశంలో నిర్మించిన మొట్టమొదటి ప్రాజెక్టు, అన్నిటికంటే పెద్దది.
- దీన్ని భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ 1962 అక్టోబర్ 22న జాతికి అంకితం చేశారు.



- ఈ ప్రాజెక్టు పంజాబ్, హర్యానా, రాజస్థాన్‌ల ఉమ్మడి పథకం. వీటితోపాటు హిమాచల్ ప్రదేశ్ కూడా లబ్ధి పొందుతోంది.
- సట్లేజ్ నదిపై హిమాచల్‌ప్రదేశ్‌లో భాక్రా అనే ప్రాంతంలో భాక్రా ఆనకట్ట (226 మీటర్లు), పంజాబ్‌లోని నంగల్ ప్రాంతం వద్ద నంగల్ ఆనకట్ట (29 మీటర్లు)ను నిర్మించారు.
- ఈ ప్రాజెక్టు 1204 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేస్తుంది.

2. **హీరాకుడ్ ప్రాజెక్టు**
- ఈ ప్రాజెక్టును ఒడిశాలో మహానదిపై నిర్మించారు.
- ఈ ప్రాజెక్టు 4801 మీటర్ల పొడవుతో ప్రపంచంలోనే అతి పొడవైన ప్రాజెక్టుగా గుర్తింపు పొందింది.
- దీన్ని విద్యుదుత్పాదన, నీటిపారుదల ప్రయోజనాల కోసం ఏర్పాటు చేశారు.

3. **నాగార్జున సాగర్ ప్రాజెక్టు**
- తెలంగాణలోని నల్గొండ జిల్లాలో నందికొండ గ్రామ సమీపంలో కృష్ణానదిపై నిర్మించారు.
- ఇది ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఉమ్మడి రాష్ట్రాల పథకం.
- దీనికి భారత తొలి ప్రధాని నెహ్రూ 1955 డిసెంబర్ 10న శంకుస్థాపన చేశారు.
- ఈ ప్రాజెక్టు 1450 మీటర్ల పొడవుతో, రాతి కట్టడపు ఆనకట్టల్లో ప్రపంచంలోనే ప్రథమ స్థానం పొందింది.
- దీని కుడి కాలువను జవహర్ కాలువ అంటారు. ఈ కాలువ 204 కి.మీ. పొడవు ఉంది. ఇది గుంటూరు, కృష్ణా జిల్లాలకు నీరు అందిస్తుంది.
- దీని ఎడమ కాలువను లాల్ బహదూర్ కాలువ అంటారు. ఈ కాలువ 179 కి.మీ. పొడవుతో నల్గొండ, ఖమ్మం జిల్లాలకు నీటిని సరఫరా చేస్తోంది.
- ఈ ప్రాజెక్టు పూర్తిగా భారతీయ సాంకేతిక పరిజ్ఞానంతో రూపుదిద్దుకుంది.

4. **దామోదర్ నదీలోయ ప్రాజెక్టు**
- ఈ ప్రాజెక్టు పశ్చిమ బెంగాల్, బీహార్, జార్ఖండ్ రాష్ట్రాల ఉమ్మడి పథకం.
- ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశం బెంగాల్ ప్రాంతాన్ని.. దామోదర్ నది, దాని ఉపనదుల వల్ల వచ్చే వరదల నుంచి కాపాడడం.
- ఈ పథకంలో భాగంగా తిలయ్యా, మైథాన్ ఆనకట్టలు - బరాకర్ నదిపై, పంచట్‌హిల్ ఆనకట్ట - దామోదర్ నదిపై, కోనార్ ఆనకట్ట- కోనార్ నదిపై నిర్మించారు.

5. **బియాస్ పథకం**
- ఇది పంజాబ్, హర్యానా, రాజస్థాన్ రాష్ట్రాల ఉమ్మడి పథకం.
- ఇది బియాస్ జలాలను సట్లేజ్ జలాలతో కలుపుతుంది.
- బియాస్ నదిపై 'పోంగ్' వద్ద ఈ ఆనకట్టను నిర్మించారు.

6. **కోసి ప్రాజెక్టు**
- దీన్ని బీహార్ - నేపాల్ సరిహద్దులోని హనుమాన్‌నగర్ సమీపంలో 'కోసి' నదిపై నిర్మించారు.
- ఇది అంతర్జాతీయ పథకం

7. **గండక్ పథకం**
- దీన్ని బీహార్‌లోని వాల్మీకినగర్ వద్ద గండక్ నదిపై నిర్మించారు.
- ఇది బీహార్, ఉత్తరప్రదేశ్, నేపాల్‌ల ఉమ్మడి పథకం.

8. **చంబల్ పథకం**
- ఇది మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల ఉమ్మడి పథకం.
- దీన్ని చంబల్ నదిపై నిర్మించారు.
- ఈ పథకంలో మూడు ఆనకట్టలున్నాయి.

  అవి ...
  1) గాంధీసాగర్ ఆనకట్ట
  2) రాణా ప్రతాప్‌సాగర్ ఆనకట్ట
  3) జవహర్ సాగర్ ఆనకట్ట

9. **తెహ్రీడ్యామ్ ప్రాజెక్టు**
- ఈ ప్రాజెక్టు ఉత్తరప్రదేశ్, ఉత్తరాంచల్, ఢిల్లీ రాష్ట్రాల ఉమ్మడి పథకం.
- దీన్ని 'భాగీరథి' నదిపై హిమాలయ ప్రాంతం(ఉత్తరాఖండ్)లోని భూకంపాలు సంభవించే ప్రదేశంలో నిర్మించడం వల్ల ఇది వివాదాస్పదమైంది.
- తెహ్రీడ్యామ్ ప్రాజెక్టు నిర్మాణానికి వ్యతిరేకంగా ఉద్యమం చేపట్టిన వ్యక్తి - సుందర్‌లాల్ బహుగుణ.

10. **ఇందిరాసాగర్ ప్రాజెక్టు**
- ఇది నర్మద నదిపై ఉంది.
- దీన్ని గుజరాత్‌లోని పూర్ణసా ప్రాంతంలో నిమొరి జిల్లాలో నిర్మించారు.
- ఇది మధ్యప్రదేశ్, గుజరాత్‌ల ఉమ్మడి ప్రాజెక్టు

11. **సర్దార్ సరోవర్ ప్రాజెక్టు**
- దీన్ని నర్మద నదిపై, గుజరాత్‌లోని బరూచ్ జిల్లాలో బడగావ్ అనే ప్రాంతంలో నిర్మించారు.
- ఇది రాజస్థాన్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్‌ల ఉమ్మడి ప్రాజెక్టు.
- ఈ ప్రాజెక్టును వ్యతిరేకిస్తూ మేధాపాట్కర్ చేపట్టిన ఉద్యమమే- నర్మదా బచావో.

మరికొన్ని ముఖ్యమైన ప్రాజెక్టులు

ప్రాజెక్టు పేరు	నది	రాష్ట్రాలు	ఇతర అంశాలు
1. బాగ్లీహార్ ప్రాజెక్టు	చీనాబ్	జమ్మూ & కాశ్మీర్	భారత్, పాకిస్థాన్‌ల మధ్య వివాదాస్పదమైంది
2. ధూల్‌హస్తి	చీనాబ్	జమ్మూ & కాశ్మీర్	-
3. నాథ్‌పాజాక్రి	సట్లేజ్	హిమాచల్ ప్రదేశ్	-
4. రిహాండ్	రిహాండ్	ఉత్తరప్రదేశ్	-
5. రామ్‌గంగా	రామ్‌గంగా	ఉత్తరప్రదేశ్	ఢిల్లీ నగరానికి 200 క్యూసెక్కుల నీటి సరఫరా
6. సువర్ణరేఖ	సువర్ణరేఖ	బీహార్	-
7. ఫరక్కా	హుగ్లీ	పశ్చిమ బెంగాల్	-
8. మయూరాక్షి	మురళీ	పశ్చిమ బెంగాల్	-
9. జయక్‌వాడీ	గోదావరి	మహారాష్ట్ర	-
10. బాబ్లీ	గోదావరి	మహారాష్ట్ర	-
11. అల్మట్టి	కృష్ణా	కర్ణాటక	-
12. ఇడుక్కి	పెరియార్	కేరళ	-
13. శబరిగిరి	పంప	కేరళ	-
14. మెట్టూరు	పైకారా	తమిళనాడు	పైకారా నది కావేరి నదికి ఉపనది
15. ఉకాయ్	తపతి	గుజరాత్	-
16. కాక్రపార	తపతి	గుజరాత్	-
17. శ్రీరాంసాగర్	గోదావరి	తెలంగాణ	దీని కాలువ కాకతీయ కాలువ. దీన్ని నిజామాబాద్ జిల్లాలోని పోచంపాడు వద్ద నిర్మించారు.
18. సుంకేసుల	తుంగభద్ర	ఆంధ్రప్రదేశ్	కర్నూలు జిల్లాలో ఉంది
19. పులిచింతల	కృష్ణానది	ఆంధ్రప్రదేశ్	గుంటూరు జిల్లాలో ఉంది. దీని పేరు కెఎల్.రావు సాగర్
20. జంఝావతి	జంఝావతి నది	ఆంధ్రప్రదేశ్	విజయనగరం
21. ఎల్లంపల్లి(శ్రీ పాదసాగర్)	గోదావరి	తెలంగాణ	కరీంనగర్

What does Basel III is all about?

BANK EXAMS

BANKING AWARENESS

Basel III Norms

What is Basel III or What is Basel 3 Accord or Meaning and Definition of Basel III Accord?

Basel III or Basel 3 released in December, 2010 is the third in the series of Basel Accords. These accords deal with risk management aspects for the banking sector. In a nut shell we can say that Basel III is the global regulatory standard (agreed upon by the members of the Basel Committee on Banking Supervision) on bank capital adeq uacy, stress testing and market liquidity risk. (Basel I and Basel II are the earlier versions of the same, and were less stringent).

What does Basel III is all About ?

According to Basel Committee on Banking Supervision "Basel III is a comprehensive set of reform measures, developed by the Basel Committee on Banking Supervision, to strengthen the regulation, supervision and risk management of the banking sector".Thus, we can say that Basel 3 is only a continuation of effort initiated by the Basel Committee on Banking Super vision to enhance the banking regulatory framework under Basel I and Basel II. This latest Accord now seeks to improve the banking sector's ability to deal with finan cial and economic stress, improve risk management and strengthen the banks' transparency.

What are the objectives / aims of the Basel III measures?

Basel 3 measures aim to:

- improve the banking sector's ability to absorb shocks arising from financial and economic stress, whatever the source
- improve risk management and governance
- strengthen banks' transparency and disclosures.

Thus we can say that Basel III guidelines are aimed at to improve the ability of banks to withstand periods of economic and financial stress as the new guidelines are more stringent than the earlier requirements for capital and liquidity in the banking sector.

How Does Basel III Requirements Will Affect Indian Banks?

The Basel III which is to be implemented by banks in India as per the guidelines issued by RBI from time to time, will be challenging task not only for the banks but also for GOI. It is estimated that Indian banks will be required to raise Rs 6,00,000 crores in external capital in next nine years or so i.e. by 2020 (The estimates vary from organisation to organisation). Expansion of capital to this extent will affect the returns on the equity of these banks specially public sector banks. However, only consolation for Indian banks is the fact that historically they have maintained their core and overall capital well in excess of the regulatory minimum.

What are Three Pillars of Basel II Norms or What are the changes in Three Pillars of Basel III Accord?

Basel III: Three Pillars Still Standing:

Basel III has essentially been designed to address the weaknesses that become too obvious during the 2008 financial crisis world faced. The intent of the Basel Committee seems to prepare the banking industry for any future economic downturns. The framework enhances bank-specific measures and includes macro-prudential regulations to help create a more stable banking sector.

The basic structure of Basel III remains unchanged with three mutually reinforcing pillars.

Pillar 1: Minimum Regulatory Capital Requirements based on Risk Weighted Assets (RWAs): Maintaining capital calculated through credit, market and operational risk areas.

Pillar 2: Supervisory Review Process: Regulating tools and frameworks for dealing with peripheral risks that banks face.

Pillar 3: Market Discipline: Increasing the disclosures that banks must provide to increase the transparency of banks

What are the Major Features of Basel III ?

(a) **Better Capital Quality:** One of the key elements of Basel 3 is the introduction of much stricter definition of capital. Better quality capital means the higher loss-absorbing capacity. This in turn will mean that banks will be stronger, allowing them to better withstand periods of stress.

(b) **Capital Conservation Buffer:** Another key feature of Basel III is that now banks will be required to hold a capital conservation buffer of 2.5%. The aim of asking to build conservation buffer is to ensure that banks maintain a cushion of capital that can be used to absorb losses during periods of financial and economic stress.

(c) **Countercyclical Buffer:** This is also one of the key elements of Basel III. The countercyclical buffer has been introduced with the objective to increase capital requirements in good times and decrease the same in bad times. The buffer will slow banking activity when it overheats and will encourage lending when times are tough i.e. in bad times. The buffer will range from 0% to 2.5%, consisting of common equity or other fully loss-absorbing capital.

(d) **Minimum Common Equity and Tier 1 Capital Requirements:** The minimum requirement for common equity, the highest form of loss-absorbing capital, has been raised under Basel III from 2% to 4.5% of total risk-weighted assets. The overall Tier 1 capital requirement, consisting of not only common equity but also other qualifying financial instruments, will also increase from the current minimum of 4% to 6%. Although the minimum total capital requirement will remain at



the current 8% level, yet the required total capital will increase to 10.5% when combined with the conservation buffer.

(e) **Leverage Ratio:** A review of the financial crisis of 2008 has indicted that the value of many assets fell quicker than assumed from historical experience. Thus, now Basel III rules include a leverage ratio to serve as a safety net. A leverage ratio is the relative amount of capital to total assets (not risk-weighted). This aims to put a cap on swelling of leverage in the banking sector on a global basis. 3% leverage ratio of Tier 1 will be tested before a mandatory leverage ratio is introduced in January 2018.

(f) **Liquidity Ratios:** Under Basel III, a framework for liquidity risk management will be created. A new Liquidity Coverage Ratio (LCR) and Net Stable Funding Ratio (NSFR) are to be introduced in 2015 and 2018, respectively.

(g) **Systemically Important Financial Institutions (SIFI):** As part of the macro-prudential framework, systemically important banks will be expected to have loss-absorbing capability beyond the Basel III requirements. Options for implementation include capital surcharges, contingent capital and bail-in-debt.

Model Questions

1. The final guidelines on Basel - III capital regulations is effective from _____ in a phased manner:
   a) January 1, 2013
   b) January 1, 2014
   c) April 1, 2013 d) April 1, 2014
   e) None of these
2. The Basel - III capital ratios will be fully implemented as on ____:
   a) March 31, 2017
   b) December 31, 2018
   c) March 31, 2014
   d) December 31, 2019 e) None
3. Presently, a bank's capital comprises Tier 1 and Tier 2 capital with a restriction that Tier 2 capital cannot be more than ___% of Tier 1 capital. Within Tier 1 capital, Innovative instruments are limited to ___% of Tier 1 Capital.
   a) 70; 25 b) 100; 15 c) 80; 15
   d) 85; 20 e) 85; 19
4. Cumulative unrealized gains or losses due to change in own ____ on fair valued financial liabilities, if recognized, should be filtered out from Common Equity.
   a) Market Risk b) Credit Risk
   c) Liquidity Risk
   d) All the above e) None
5. The risk of interconnectedness among larger financial firms (defined as having total assets greater than or equal to $100 billion) will be better captured through a prescription of _______ adjustment to the asset value correlation (AVC) under IRB approaches to credit risk:
   a) 70% b) 100% c) 80%
   d) 25% e) 50%
6. The Capital Conservation Buffer (CCB) is designed to ensure that banks build up ______ during normal times (i.e. outside periods of stress) which can be drawn down as losses are incurred during a stressed period.
   a) Strength b) Capital buffers
   c) Conservation buffer
   d) Risk Coverage
   e) All the above
7. For any given country, the counter cycle capital buffer will only be in effect when there is excess _______ that results in a system-wide build-up of risk. The countercyclical capital buffer, when in effect, would be introdu ced as an extension of the capit al conservation buffer range.
   a) NPA b) Credit growth
   c) Inflation d) Market Volatility
   e) All the above
8. Banks are required to maintain a minimum Pillar 1 Capital to Risk weighted Assets Ratio (CRAR) of ____on an on-going basis (other than capital conservation buffer and countercyclical capital buffer).
   a) 10% b) 11% c) 9%
   d) 12% e) 13%
9. The Reserve Bank will take into account the relevant ____ and the internal capital adequacy assessments of each bank to ensure that the capital held by a bank is commensurate with the bank's overall risk profile.
   a) Risk factors b) Ratios
   c) Credit growth
   d) Capital Reserve
   e) All the above
10. The effectiveness of the bank's _____ systems in identifying, assessing / measuring, monitoring and managing various risks including interest rate risk in the __, liquidity risk, concentration risk and residual risk
    a) Asset management; Banking book
    b) Risk management; Banking book
    c) Risk management; Trading book
    d) None of these e) All the above
11. Under the existing capital adequacy guidelines based on Basel- II framework, total regulatory capital is comprised of Tier 1 capital (core capital) and Tier 2 capital (supplementary capital). Total regulatory capital should be at least ___ of risk weighted assets and within this, Tier 1 capital should be at least ___ of risk weighted assets.
    a) 9% ; 6% b) 10% ; 11%
    c) 9% ; 5% d) 12% ; 5%
    e) 13%; 6%.

KEY

1) c; 2) c; 3) b; 4) b; 5) d; 6) b; 7) b; 8) c; 9) a; 10) b; 11) a.